విజేతకాంపిటీషన్స్®
PERSONALITY DEVELOPMENT SERIES

# మీరూ “శ్రీ”లు

## సక్సెస్ సాధనకు 30 సూత్రాలు




అద్దంకి శ్రీధర్‌బాబు
I.A.S.

**Bandla Publications**

**MEERUU 'SRI'LU**

**Edition - 2013**

© Reserved by Publishers

No Part of this book may be reprinted or reproduced or utilised in any form or by any electronic, mechanical or other means, now known or hereafter invented including photocopying and recording, or in any information storage and retrieval system, without permission in writing from the publishers.

Although every care has been taken to avoid errors of omission, this publication is being sold on the condition and understanding that information given in this book is merely for reference and must not be taken as having authority of or binding in any way on the authors, editors, publishers and sellers who do not owe any responsibility for any damage or loss to any person, a purchaser of this publication or not, for the result of any action taken on the basis of this work. The publishers shall be obliged if mistakes are brought to their notice for carrying out correction in the next edition.

***Chief Editor:*** Bandla Sai Babu

***Author:*** Sridhar Babau

***Composing & Layout Design:*** Kamani Raghava Swamy

***Cover Design:*** M. Ruthvik

***Published by:*** Bandla Publications,

2-2-1130/24/1/D/1, Behind Indian Bank, Shivam Road,

New Nallakunta, Hyderabad - 500 044

Phone: 27673494, 27626336, 9963293399

# అంకితం



సర్వకాల సర్వావస్థల్లో
నాకు తోడై,
నా నీడై
వెన్నంటి నడిపించే మా నాన్నగారు శ్రీ అద్దంకి శివరామకృష్ణప్రసాద్ గారి దివ్యశ్రీ చరణాలకు నమః సుమాంజలి ఘటిస్తూ – అనుక్షణం నా ఉన్నతి కాంక్షించే మా అక్క 'శ్రీలు' (శ్రీలత)కు నా ఈ కృతం అంకితం (చేస్తున్నాను).

# మీరూ "శ్రీ"లు

"నేను గొప్పవాడిని / గొప్ప దానను (దానిని) ఎందుకు కాకూడదు?" ఈ ప్రశ్న ఎప్పుడైనా మీ మదిలో మెదిలి, మిమ్మల్ని కలవరపెట్టిందా? ఎవరైనా మిమ్మల్ని సంబోధించేటప్పుడు మీ పేరు ముందు 'శ్రీ' పెట్టి పిలిస్తే మీకు ఎంత గౌరవం? మీ పేరు ముందు 'శ్రీ' పెట్టి పిలిపించుకోవాలని ఉందా?... అయితే ఈ పుస్తకం మీ కోసమే.

మనలో చాలా మంది తమ శక్తిని గ్రహించకుండా - మేము మట్టిముద్దలం, పప్పుసుద్దలం అనుకుంటూ తమని తాము కించపరచుకుంటారు. ఇలాంటి ఆత్మన్యూనతా భావం తగదు. ఎందుకంటే - నిజానికి మనం నివురుగప్పిన నిప్పులం. మనలో 'fire' ఉంది. కాకపోతే ఆ fire ఉందని తెలుసుకోలేకపోతున్నాం. మన మెదడు చాలా శక్తిమంతమైనది. అది ఏది తలచుకున్నా, ఆ పనిని నెరవేర్చే సత్తా మనకి ఉంటుంది కాబట్టి - మన శక్తి మనం తెలుసుకుందాం, మన సత్తా చాటుదాం. మన పేరు ముందు 'శ్రీ' పెట్టి పిలిపించుకుందాం. మీరు - 'శ్రీ'లు.

మీరూ - 'శ్రీ' లే.

# ఎందుకు రాస్తున్నాను నేను?

నేను నా జీవన గమనంలో ఎంతో మంది మంచి వ్యక్తు (సాంగత్యం / స్నేహం) వల్ల ఎంతో లాభపడ్డాను. ఎంతో మంది నాకు ఎన్నో రకాలుగా సహాయం చేశారు. వారి సహాయ సహకారాల వల్లే నేను ఈ రోజున ఇలా ఉన్నాను. నాకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహాయపడిన వాళ్లు నా నుండి ఏమీ ఆశించలేదు. కానీ, నేను వారిని ఎల్లప్పుడూ తలచుకుంటూనే ఉంటాను. అది వారికి కూడా తెలియదేమో. వారి ప్రభావం నా మీద ఎంతో ఉంది. ఈ విధంగా చూసుకుంటే నేను చాలా అదృష్టవంతుణ్ణి.

వారు పెంచిన మంచిని పది మందికి పంచాలి. మంచిని పంచడం మంచిదే. నాకు ఈ సమాజం, ఈ సంఘం ఎంతో ఇచ్చింది. ఆ మంచిని కొంతైనా తిరిగి సమాజానికి, సంఘానికి ఇవ్వాలి. ఈ పుస్తకం చదువుతున్న మీకు నాకు లాగా మంచి మంచి వ్యక్తులు, వారి వల్ల మంచి మంచి అనుభవాలు తగిలి ఉండకపోవచ్చు. ఈ పుస్తకం చదవడం ద్వారా ఆ లోటు కొంతైనా మీకు తీరుతుందని నేను నమ్ముతున్నాను.

"మనిషి ఏది అనుకున్నా అది సాధించి తీరుతాడు" అని నమ్మేవాళ్లలో నేను మొదటి వ్యక్తిని. మనలో చాలా మందికి వారి శక్తియుక్తులు తెలియవు. మనలాగా మామూలుగా పుట్టిన బిల్‌గేట్స్ అయినా సరే, దీరూభాయ్ అంబానీ అయినా సరే ఆ మాటకొస్తే పది మందితో భేష్ అనిపించుకున్న ఎవరైనా సరే. గొప్పవాళ్లు అవగలిగితే, మనం కూడా అలా అవగలం. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలంటే ముందు మనలోని శక్తిని మనం తెలుసుకోవాలి.

నా అనుభవంతో ఒక విషయం చెబుతున్నాను. అదేమిటంటే మనలోని శక్తి ఇంతా, అంతా కాదు. అంతులేనంత. మనసులో ఏదైనా బలంగా అనుకుంటే దానిని నెరవేర్చే సత్తా మనకి ఉంది. ఉంటుంది. ఈ నిజాన్ని మీరు నమ్మాలి. నమ్మితీరాలి. అయితే విచారించాల్సిన విషయం ఏమిటంటే మనకి అంతులేనంత శక్తి ఉందని మనకే తెలియదు. హనుమంతునికి తన శక్తి గురించి ఎలా తెలియదో, మనకి కూడా. మన నిజమైన శక్తి గురించి తెలియదు. ఆంజనేయుడి శక్తిని తెలియజేసేందుకు జాంబవంతుడు, అంగదుడు, తార, వానరులు ఇంకా అనేక మంది ఉన్నారు. కానీ, మన శక్తిని గురించి తెలిపే వారు ఎవరుంటారు? నేనున్నాను. కనీసం నేనున్నానని నేను అనుకుంటున్నాను. నేను మీకు ఉన్నాను అని చెప్పే / తెలిపే ప్రయత్నంలోనే ఈ పుస్తకం రాస్తున్నాను.

ప్రతి శిలలో ఒక అద్భుతమైన శిల్పం ఎలా దాగి ఉంటుందో, మనందరిలో, మనకే తెలియకుండా ఒక అద్భుతమైన, అపరిమిత శక్తులున్న ఒక గొప్ప వ్యక్తి దాగి ఉన్నాడు. ఆ గొప్ప వ్యక్తి ఏ పనినైనా సాధించగలడు. 'అసంభవం' అనే పదానికి అర్థం తెలియని వాడతను. అనుకున్నది సాధించగలిగే ధీరుడు అతను మీలోని ఆ అపరిమిత శక్తులు గల ఆ వ్యక్తిని జాగృతం చేసే ఉద్దేశమే. నా ఈ చిన్ని ప్రయత్నం. అందుకు ఈ పుస్తకం రాద్దామని పూనుకున్నాను.

# ఈ పుస్తకాన్ని ఎలా చదవాలి?

కొంత మంది పుస్తకాల పురుగులు – ఆకలిగా ఉన్న పులి తన వేట మీద పడి అవురావురుమంటూ ఆత్రుతగా ఒక్క ఉదుటున అంతా లాగించేసేలా పుస్తకాలను చదువుతుంటారు. దయచేసి ఈ పుస్తకాన్ని అలా చదవవద్దు. కొంత మంది నవలా సాహిత్య ప్రియులు నవలలను రికార్డు టైమ్‌లో చదివేశామని ఊదరగొడుతుంటారు. ఇది నవల కాదు. అందుకే దీనిని ఒక్క రోజులోనో, కొన్ని గంటల వ్యవధిలోనో చదవవద్దు. ఇది మనలోని శక్తిని జాగృతం చేసే పుస్తకం. మనలోని శక్తి ఒకే రోజు జాగృతమైతే మంచిదే కానీ, ఎంత తొందరగా జాగృతం అవుతుందో, అంతే తొందరగా పడక మంచం ఎక్కేసే భయం ఉంది. అందుకే నేను ఒక కొత్త పద్ధతి ద్వారా ఈ పుస్తకాన్ని దచవమని సలహా ఇస్తున్నాను.

మనోవైజ్ఞానిక శాస్త్ర ప్రకారం ఏదైనా ఒక హాబీ కానీ, పని కానీ అలవాటు చేసుకోవాలంటే ఆ పనిని కనీసం 21 రోజులు క్రమం తప్పకుండా చేయాలంట. అలా చేస్తే, ఆ పని లేదా ఆ హాబీ (ఆ అలవాటు) మన దిన చర్యలో ఒక భాగమైపోతుందంట. ఏదైనా మోటివేషన్ కలిగించే కథని కానీ, సందర్భాన్ని కానీ, మనం చదివితే, మనలో చాలా మంది బాగా మోటివేట్ అవుతారు. పాజిటివ్‌గా ఆలోచిస్తారు. తమ లక్ష్యాన్ని మరింత శక్తితో చేధించాలని ఊగిపోతారు. అప్పుడు తాము అనుకున్నది సాధించేందుకు తమలోని అంతః శక్తిని జాగృతం చేసుకుంటారు. ఆ లక్ష్యం నెరవేర్చే దిశగా ప్రయత్నం చేస్తారు. నాకు కావలసింది సరిగ్గా ఇదే... ఇలా కనీసం 21 రోజులు మన లక్ష్యాన్ని నెరవేర్చే ప్రయత్నం ప్రతీరోజూ చేస్తూ, మనలోని మనకే తెలియని అత్యంత శక్తిమంతుడైన వ్యక్తిని జాగృతం చేయడం... మనం గనుక మనోవైజ్ఞానిక శాస్త్రజ్ఞుల లాజిక్‌ని ఒప్పుకుంటే – మనం ఈ 21 రోజులు లక్ష్యాన్ని నెరవేర్చే ప్రయత్నం చేయడం మన దిన చర్యలో భాగమైపోతుంది. 22వ రోజు నుండి మనం అనుకున్న లక్ష్యం నెరవేరే వరకూ మనం లక్ష్య సాధనకు కృషి చేస్తూనే ఉంటాం.

మరో విషయం చెబుతాను. త్రికరణశుద్ధిగా లక్ష్యసాధనకు కృషి చేస్తే, ఈ ప్రపంచంలో చేధించలేని లక్ష్యాలంటూ లేవు. ఇది నేనే కాదు. గొప్ప గొప్పవారందరూ చెప్పి ఒప్పుకున్నారు.

అయితే ఈ పుస్తకాన్ని ఎలా చదవాలి? ఈ పుస్తకంలో 30 చాప్టర్స ఉన్నాయి. చాప్టర్స్ అనేకంటే – కథలు అంటే బాగుంటుందేమో. రోజుకో కథ చొప్పున 30 రోజులలో 30 కథలు చదవండి. అంటే రోజుకి ఒక కథ చదవాలి. ఎక్కువ కథలు చదవకూడదు. చదివిన కథని పూర్తిగా అనుభవించాలి. ఆ రోజుకి ఆ కథ చదివిన తరువాత మనం ఏమి నేర్చుకున్నామో, ఏమి నిర్ణయం తీసుకోబోతున్నామో ఒక నోట్‌బుక్‌లో విధిగా నోట్ చేసుకోవాలి. ఆ నోట్ చేసుకున్న నిర్ణయాన్ని తప్పనిసరిగా పాటించాలని, ఆచరించాలని మన మీద మనం ఒట్టు వేసుకుందాం.

సైకాలజిస్టుల ప్రకారం 21 రోజులు – ఏదైనా క్రమం తప్పకుండా చేస్తే అది మనకి

అలవాటు అయిపోతుంది. కానీ, మనం ఈ పనిని 30 రోజులు చేస్తున్నాం. 30 రోజులు మనని మనం మోటివేట్ చేసుకుంటూ అనుకున్నది సాధించేందుకు అడుగులు వేస్తుంటే ఖచ్చితంగా మన అలవాటు బలంగా నాటుకుపోతుంది. మనలో ఒక గుణాత్మకమైన మార్పు వచ్చి, మనలో ఒక కొత్త వ్యక్తి ఆవిష్కృతమవుతాడు, అవతరిస్తాడు.

నేను ఈ 30 రోజులలో 30 కథలు చెబుతున్నాను. కథల ద్వారా ఎందుకు చెబుతున్నానంటే... నాకు చిన్నప్పుడు స్కూల్‌లో చెప్పిన పాఠాలు గుర్తులేవు కానీ, నేను చదివిన చందమామ, బాలమిత్ర కథలు ఇంకా గుర్తు ఉన్నాయి. కథలు మన మనస్సులకు హత్తుకుంటాయి. మన మెదడుకు అతుక్కుపోతాయి. మన సబ్-కాన్షియస్ మైండ్‌లో రిజిస్టర్ అయిపోతాయి. అంటే – కథలు మనసుకు హత్తుకెపోవడం వల్ల వాటిని మనం ఎప్పుడూ మరచిపోలేమన్న మాట.

కథల ద్వారా చెప్పాలనుకున్న విషయం సూటిగా, స్పష్టంగా, క్లుప్తంగా చెప్పవచ్చు. కథల నిడివి కూడా మరీ అంత పెద్దగా ఉండకపోవడం వల్ల ఒక రోజులో ఒక కథను పూర్తిగా చదవవచ్చు. కథలు కూడా దేనికి దానికి విడిగా ఉండటం వల్ల, ఒక సీరియల్ పద్ధతిలో చదవనవసరం లేదు. ఏ రోజుకారోజు కథ స్వతంత్రంగా ఉంటుంది. ముందు చెప్పబడిన కథల మీద ఆధారపడకపోవడం వల్ల పుస్తకంలోని ఏ చాప్టర్ నుండైనా చదవడం మొదలు పెట్టవచ్చు.

ఈ రోజు పదవ తారీఖు అనుకోండి. మీరు పదవ చాప్టర్‌ని చదవండి. ఈ రోజు ఏ తారీఖు అయితే, ఆ కథలు / చాప్టర్‌ను చదవండి. ఇలా మీరు మొదలు పెట్టిన తేదీ నుండి నెల తిరిగే లోపు మీరు పుస్తకం చదివేసి ఉంటారు. ఒకవేళ ఏ కారణం చేతనైనా, ఏ దైనా రోజున మీరు చదవాల్సిన చాప్టర్ చదవలేకపోయారనుకోండి. దానిని టిక్కు పెట్టుకుని ఆ చాప్టర్‌ని మళ్లీ వచ్చే నెలలో చదవండి. దీని వల్ల ఒక డిసిప్లేన్ ఏర్పడుతుంది.

ఇంతకీ చెప్పేదేమిటంటే – రోజుకి ఒక చాప్టర్ మాత్రమే చదవాలి. ఎక్కువ చదవకూడదు, తక్కువ చదవకూడదు. చదివిన కథ నుంచి నేర్చుకోవలసిన విషయాలు నోట్ చేసుకుని, వాటిని పక్కాగా ఆచరించాలి.

చీమల గురించి, కప్పల గురించి, జిరాఫీల గురించి, ఏనుగుల గురించి, క్రికెటర్ల గురించి, అథ్లెట్ల గురించి, వరల్డ్ రికార్డులను చేధించిన వారిని గురించి, మేధావుల గురించి, విశిష్ట వ్యక్తుల గురించి, వివిధ రంగాలలో ప్రతిభ కనబరచిన వారిని గురించి, కథలు ఇందులో ఉన్నాయి.

ఇది మిమ్మల్ని ఆకట్టుకుని, నూతన ఉత్సాహంతో ఉరకలు వేసేలా (మిమ్మల్ని) ఉత్తేజపరుస్తాయని ఆశిస్తాను. “వీటిలో ఏ ఒక్క కథ చదివినా, (లేదా) కథలోని ఏ చిన్న భాగంబ చదివినా మోటివేట్ అవవచ్చు” అనిపించేలా రాయాలని కృషి చేశాను. ఎంతవరకూ కృతకృత్యుణ్ణి అయ్యానో, చదివిన తరువాత మీరే తేల్చాలి.

Happy Reading. ఇక చదవండి.

# 1

# తండ్రి తలపు-తనయుడి గెలుపు

**హైలెట్స్**

- తనకి ఒక కారు ఉండాలి. దానికి ఒక ఎర్రలైటు (బీకన్) ఉండాలి. ఒక బిళ్ల బంట్రోతు ఉండాలి. నీ ఫైల్స్ కూడా నీవు పట్టుకోకూడదు.
- నాకు రిజల్ట్ రాలేదని తెలుసుకుని నాన్నగారు అమ్మతో మాట్లాడిన మాట ఒక్కటే 'అబ్బాయి జాగ్రత్త'.
- అయినా నేను ఎవరి మాటా వినలేదు. కేవలం నా మీద నాకున్న నమ్మకాన్ని నమ్ముకున్నాను.
- ఒక్కసారిగా గట్టిగా కేకపెట్టి, అమ్మని కౌగిలించుకున్నాను. నా కళ్లు నా మాట వినడం లేదు. నీరు ధారలా కారిపోతుంది.
- ఒక సక్సెస్‌ఫుల్ ఐఏఎస్ ఆఫీసర్‌ని అయినా, కాకపోయినా, నేను ఎప్పుడూ ఒక్క విషయానికి సంతృప్తి పడతాను, సంతోషిస్తాను. అది మా నాన్నగారికి నేనిచ్చిన మాటను నిలబెట్టుకున్నాను.

మనిషి ఏదనుకున్నా... అది ఖచ్చితంగా సాధించగలడు... అయితే అనుకునేది మనసుతో అనుకోవాలి. కేవలం మనసుతో అనుకుంటే సరిపోదు. బాగా బలంగా అనుకోవాలి. ఎంత బలంగా మన కోరికను మన మనసుతో అనుకోవాలి? అది కూడా నేనే చెప్తాను. దీనిని ఒక చిన్న ఉదాహరణ ద్వారా చెబుతాను. ఒక పెద్దమనిషి సోక్రటీస్‌ని

(సోక్రటీస్ ఒక గొప్ప తత్త్వవేత్త అని నేను అంత పెద్ద వ్యక్తిని కొత్తగా పరిచయం చేయనవసరం లేదు.) కలిసి అతనిని "మీరు ఇంత గొప్పవ్యక్తి ఎలా కాగలిగారు?" "జీవితంలో విజయం సాధించాలంటే ఏమిచేయాలి."? అని అడిగాడు. మొదటిసారి సోక్రటీస్ ఆ వ్యక్తిని తిప్పి పంపేశాడు. ఆ పెద్ద మనిషి కొన్ని రోజుల తర్వాత మళ్లీ వచ్చాడు. మళ్లీ అదే ప్రశ్న "జీవితంలో విజయం సాధించాలంటే ఏమిచేయాలి?" సోక్రటీస్ ఈ సారి తరిమేశాడు. అయినా కొన్ని రోజుల తర్వాత అదే ప్రశ్నతో ఆ వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు సోక్రటీస్ "జీవితంలో విజయం సాధించాలంటే - రేపు పొద్దున నాతోపాటు వాకింగ్ (walking) కి సముద్రం ఒడ్డుకి రా' అని చెప్పాడు. తర్వాత రోజు తెల్లవా రుజామున ఇద్దరూ సముద్రం ఒడ్డున కలుసుకున్నారు. సోక్రటీస్ ఆ వ్యక్తిని మారుమాట్లాడకుండా తనతోపాటు నడవమన్నాడు. సోక్రటీస్ సముద్రం ఒడ్డున నడుస్తూ- ఒక్కసారిగా సముద్రంలోనికి నడవడం మొదలు పెట్టాడు. అయోమయంగా ఆ వ్యక్తి కూడా సోక్రటీస్‌ని అనుసరించాడు. మోకాళ్లలోతు వరకూ నీళ్లు వచ్చేశాయి. ఆ వ్యక్తి గాబరా పడ్డాడు. ఏమీ మాట్లాడలేదు. నడుస్తూ ఉన్నారు. నీళ్లు నడుము లోతు వరకూ వచ్చేశాయి. అతనికి టెన్షన్ పెరిగింది. అయినా నడుస్తూనే ఉన్నాడు. - సోక్రటీస్ ఒక్కసారిగా ఆ వ్యక్తి తల గట్టిగా పట్టుకుని నీళ్లలో ముంచేశాడు. గడియారం ముందుకు కదులుతూ ఉంది. ఐదు సెకండ్లు దాటింది. ఆ వ్యక్తి చేతులు ఆడించడం మొదలు పెట్టాడు. సోక్రటీస్ అసలు వదలలేదు. ఆ వ్యక్తి ముఖాన్ని అంతే పట్టుకున్నాడు. పదిసెకండ్లు దాటిపోయింది. ఆ వ్యక్తి గింజుకోవడం మొదలుపెట్టాడు. అయినా సోక్రటీస్ వదలలేదు. పదిహేను సెకండ్లు అయిపోయింది. ఆ వ్యక్తి ముఖం నీలంగా తయారవుతోంది. మెల్లిగా.. ఇంకా కొన్ని సెకండ్లు నీళ్లలో ఉంచితే - ఆ వ్యక్తి ప్రాణానికే ప్రమాదం. కరెక్ట్‌గా ఆ సమయంలో సోక్రటీస్ ఆ వ్యక్తి తలని వదిలేశాడు. ఆ వ్యక్తి నీళ్ల నుండి తలని తీసి గట్టిగా రొప్పుతూ ఊపిరి పీల్చుకున్నాడు. ఐదారు సెకండ్ల వరకూ అలా రొప్పుతూ ఊపిరి పీల్చుకుంటూనే ఉన్నాడు. అప్పుడు సోక్రటీస్ ఆ వ్యక్తిని ఒక ప్రశ్న అడిగాడు- "నీళ్లలో ఉన్నప్పుడు నీవు దేనికోసం తపించిపోయావు?" దానికి ఆ వ్యక్తి ఊపిరి పీలుస్తూ "గాలి" అని అరిచాడు. అప్పుడు సోక్రటీస్ అన్నాడు "నీవు నీళ్లలో ఉన్నప్పుడు గాలి కోసం ఎంతగా తపించిపోయావో... అలాగే జీవితంలో విజయం కోసం అంతగా తపించిపోతే.... ఖచ్చితంగా జీవితంలో విజయం సాధించగలవు" అప్పుడు అర్థమైంది ఆ వ్యక్తికి - సోక్రటీస్ ఎందుకు రెండు-మూడుసార్లు తిప్పించుకున్నాడో. మనలో అందరం విజయం కోసం కలలు కంటాం. అందరం విజయం కోసం ఆరాటపడతాం. కానీ చాలా కొద్ది మందిమే - విజయం కోసం తపిస్తాం. అట్లు తపించినవారే... విజేతలవుతారు. ఖచ్చితంగా విజేతలయి తీరతారు. మీరు ఏ గొప్ప వ్యక్తి చరిత్ర అయినా తీసుకోండి. ఎవరూ కూడా అదృష్టం వరించి గొప్పవాళ్లు కాలేదు. అందరూ విజయం గురించి తపించే ఉంటారు. కాబట్టే - గొప్ప విజేతలై ఉంటారు. ఇది చదువుతున్న వారిలో ఒకరిద్దరు నా పండిత- స్నేహితులు నా వాదనతో ఒప్పుకోకపోవచ్చు. వారికి నేను చెప్పేది ఒక్కటే- అదృష్టం కూడా ఎవరిని వరిస్తుంది? - "Luck also favours only those who think big and work hard." బాగా కష్టపడేవారిని - తీవ్రంగా విజయం గురించి తపించే వారినే



అదృష్టం వరిస్తుందని నేను చెప్పదల్చుకున్నాను. మనిషి అనుకున్నది సాధించగలడు -అని నేను చెప్పాను కదా... దానికి నేనే ప్రత్యక్ష ఉదాహరణ. నా కథని కొంచెం చెబుతాను. (పూర్తిగా ముందు- ముందు చెబుతాను.) సివిల్స్ -సివిల్ సర్వీస్ పరీక్షల్లో విజయం సాధించాలని - నేను అమెరికాలో పై చదువులు చదవడానికి వచ్చిన అవకాశాన్ని కాదనుకున్నాను- కంప్యూటర్ ఇంజనీరింగ్ చేసి కూడా- మంచి మంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వద్దనుకున్నాను. పిలిచి ఉద్యోగాలు ఇస్తుంటే - అన్ని ఆఫర్‌లని వదలుకున్నాను. అయితే - దిగితేగానీ లోతు తెలియదన్నట్లు-నేను సివిల్స్ పరీక్ష రాస్తుంటే గానీ తెలియలేదు. సివిల్స్ ఎంత కష్టమో. ఇంజనీరింగ్ పూర్తయ్యీ అవ్వకముందే... అంటే.. ఇంజనీరింగ్ నాల్గో సంవత్సరంలో ఉండగానే మొదటిసారి సివిల్స్ ప్రయత్నించాను. సివిల్స్‌లో ఏమి ఉంటుందో కూడా సరిగా తెలియదు. కోచింగ్ కాదు కదా - గైడెన్స్ కూడా లేదు. ఏవో కాంపిటీటివ్ బుక్స్‌లో సివిల్స్ పరీక్ష రాసి I.A.S. అవచ్చు అని చదివి - సివిల్స్ ప్రిలిమ్స్‌కి apply చేశా. అప్పుడు Optional Subject ఒకటి తీసుకోవాలి అని తెలిసింది. ఏది తీసుకోవాలి? ఉన్న Optionals నాకు ఒక్కటి కూడా తెలియదు. Engineering subjects ఉన్నాయి కానీ- Civil engineering, Electrical engineering - Mechanical engineering ఉన్నాయి అవి ఎలా పెట్టను? ఇక నాకు మెరుపు లాంటి ఒక Idea తట్టింది. 10వ తరగతిలో Mathsలో 100కి 99 అని గుర్తొచ్చింది. ఇంటర్‌లో కూడా Mathsలో 150 కి 149 రెండుసార్లు వచ్చాయి కదా అని ఇంకోసారి గుర్తొచ్చింది. Engineeringలో కూడా Mathsలో 100 కి 100 కదా అని

సంబరపడ్డాను. నాకు ఆ Idea- వచ్చినందుకు నన్ను నేను అభినందించు కున్నాను. వెంటనే Maths Optionalకి tick పెట్టాను. అయితే ఆ Idea - నా జీవితాన్ని మార్చలేకపోయింది. నేను ప్రిలిమ్స్‌లో తప్పాను. ఇక ఇలా కాదని – నా మకాం (address) Hyderabad కి మార్చాను. Hyderabadలో అడుగుపెట్టిన మొదటి రోజే ఒక పేరు గల కోచింగ్ సెంటర్‌కి వెళ్లి నా గురించి నా Optional గురించి నేను Maths ఎందుకు ఎంచుకున్నదీ చెప్పాను. అక్కడ అతను నన్ను చూసి నవ్వాడు. "నీవు Euclid (Maths లో పండితుడు – Euclid అని నేను నా మిత్రులకు చెప్పనవసరం లేదు). అయినా సరే నీవు Maths తీసుకోవడాన్ని నేను సమర్థించను. ఎందుకంటే– Maths coaching నా దగ్గర కానీ, Hydera badలో ఎక్కడైనాగానీ లేదు" అని అన్నాడు. అప్పుడు నేను ఆలోచించాను. నేను I.A.S. అవాలి. Indian Adminis-trative service officer ని అవాలి. అంటే– పరిపాలన గురించి తెలుసుకోవాలి. ఇప్పటివరకు technical subjects చదువుతూ వచ్చాను. కానీ ప్రభుత్వ పరిపాలన – నేను రేపు చేయబోయే ఉద్యోగం గురించి ముందే theory తెలుసుకుని ఉంటే – రేపు ఉద్యోగంలో బాగా పనికొస్తుందని, రెండవ ప్రయత్నంలో– Pubilc Administration తీసుకున్నాను. Subject బాగా అర్థమవడం కోసం M.A Public administration - IGNOUకి కట్టి enrol అయ్యాను. ప్రిలిమ్స్ పాసయ్యాను. Mainsలో ఇంకో subject కి తెలుగు సాహిత్యం తీసుకున్నాను. (చిన్నప్పుడు – తెలుగులో ప్రాస వాక్యాలు రాసి, అదే కవిత్వం అనుకునేవాణ్ణి లెండి...... తెలుగు కవిత్వం రాసున్నా కాబట్టి – తెలుగు సాహిత్యంతో పరిచయం అని ఫీలయ్యేవాడిని.) Mains కూడా గట్టెక్కాను. Interview call వచ్చింది. నాకూ, నా ఇంట్లో ఉన్న వారందరి ఆనందానికి అవధుల్లేవు. అక్క చెల్లి Interview గట్టెక్కాలని ఉపవాసాలు చేశారు. అమ్మా, నాన్నలు చేయని పూజ ఉండి ఉండదు. నోయని నోము ఉండి ఉండదు. ఇంట్లో వాతావరణం వేడెక్కింది. చుట్టాలు, పక్కాలు అందరూ నన్ను పొగడటం మొదలుపెట్టారు. "మాకు తెలుసు – మనోడు ఏదో ఒక రోజు గొప్పవాడవుతాడని" అని అమ్మా, నాన్నలతో అంటుంటే వారు తెగ మురిసిపోయారు. "ఎంత మంచి కొడుకును కన్నామో" అని కొన్ని వేలసార్లు అనుకున్నామని వారు నాకు తర్వాత చెప్పారు. May-11-2005 Civils results వచ్చేరోజు. అప్పటి వరకూ నేను ఇంటా, బయట ఉన్న వాతావరణంలో మునిగిపోయి – అసలు విషయం మర్చిపోయాను. "అది సివిల్స్ తో ఆటలు కాదు. ఎప్పుడూ next attempt కి తయారుగా ఉండాలని." నాకు ఆలోచనేలేదు. Prelims ఇంకో రెండు రోజులలో ఉంది. దానికి సన్నద్ధంగా ఉండాలని. ఎప్పుడూ కూడా – నేను IAS అవుతున్నాననే ఆలోచనే. IAS కాకపోయినా, ఏదో ఒక సర్వీసు వచ్చి తీరుతుందన్న నమ్మకమే నన్ను చదవనీయకుండా చేసింది. May -11-2005 శుక్రవారం సాయంత్రం సివిల్స్ result చూసుకుందామని – Computerలో Internet ఆన్ చేసి పెట్టాను.– నాలుగు గంటల నుండే. సమయం 5 అయింది. నేను UPSC site ని పదేపదే చూస్తున్నాను. result గురించి అతా–పతా లేదు. 5:15 అయింది. Friend phone ద్వారా తెలిసింది. UPSC result declare చేసిందని. 15 నిమి షాలలో websiteలో పెడతారని. నేను ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను. Time 5:30 అయ్యింది. UPSC websiteలో కొత్త



Link వచ్చింది. దానిని Click చేశాను. ఉన్నట్లుండి కరెంటు పోయింది. రెండు నిమిషాల్లో మళ్లీ కరెంటు వచ్చింది. మళ్లీ Click చేశాను. కరెంటు పోయింది. మళ్లీ నిమిషానికి కరెంటు వచ్చింది. click చేస్తున్నాను. కరెంటు పోతోంది. అలా కనీసం 15 సార్లు జరిగింది. ఇక తట్టుకోలేక ఒక Close friendకి ఫోన్ చేసి నా result చూడమని, చూసిన తర్వాత Phone చేయమని. పది నిమిషాలు అయినా friend దగ్గర నుండి phone రాకపోవడంతో నేను మళ్లీ తనకు phone చేశాను. తను అవతలి వైపు నుండి "Sorry శ్రీధర్" అన్నాడు. అర్థమైపోయింది. నాకు Rank రాలేదని. IAS. కాదు కదా- కనీసం last rank కూడా రాలేదని నేను నమ్మడానికి చాలా సమయం పట్టింది. ఒక్కసారి కొండపై నుండి అగాధంలోకి పడిపోయినట్లుంది. ఇంట్లో ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది. నాకు ఏం చేయాలో పాలు పోలేదు. ఆ బాధ భరింపరానిది. అంతలో చుట్టాల Phone లు. అప్పుడు పొగిడినవారే “civils అంటే మాటలా? ఎంతో కష్టపడాలి. మన లాంటి వాళ్లకు రావాలంటే ఆ పెద్ద పెద్ద ఉద్యోగాలు వస్తాయా?” అని నిట్టూర్పులు. ఇక్కడ మా నాన్నగారిని గూర్చి కొంత చెప్పాలి. నాకు inspiration (ప్రేరణ) మా నాన్నగారే. చిన్నప్పటి నుండి నేను నాన్నగారిలా వ్యవహరించాలి అని కోరుకునేవాణ్ణి. ఎప్పుడూ తెలుపు చొక్కా, తెల్ల pant (white & white) లో ఉండే నాన్నగారు discipline కి చిరునామా. చిన్నప్పుడు అంటే రెండో తరగతి చదివేప్పుడే నేను collector అవాలి- అని ఆయన చెప్పారు. నాకు ఎన్నో రకాల books కొని తెచ్చేవారు. ఆ రోజుల్లోనే - పిల్లల విజ్ఞానం పెంపొందించేందుకు వచ్చిన books ఢిల్లీ నుండి తెప్పించేవారు నాకు బాగా గుర్తు

చిన్నప్పుడు ఒక car ని చూపెట్టి "మనకి ఒక తెల్ల ambassador ఉండాలి. దానికి ఎర్రలైటు ఉండాలి" "ఒక బిళ్ల బంట్రోతు నీ వెనకాల ఉండాలి. నీ files కూడా నీవు పట్టుకోకూడదు." ఈ సదుపాయాలు collector అయితేనే నీకు లభిస్తాయి" అని ప్రోత్సహించేవారు.

ఎప్పుడూ Classలో first rank తెచ్చుకోమనేవారు. పొరపాటున second rank వచ్చిందా అసలు ఊరుకునే వారు కాదు. మూడో తరగతిలో ఉన్నప్పుడు రెండవ యూనిట్ టెస్ట్‌లో నాకు ఒక్క మార్కుతో first rank మిస్సయింది. అప్పుడు నాన్నగారు నన్ను ఇంటి నుండి బయటకు పంపేశారు. మొదటి ర్యాంకు రానప్పుడు – నీవు ఇంట్లో ఉండవద్దని తరిమేశారు. ఇంక ఎప్పుడూ రెండవ ర్యాంకు తెచ్చుకోను. ఎప్పుడైనా first rank మాత్రమే తెచ్చుకుంటాను– అనే promise (ప్రతిజ్ఞ) మీద ఇంట్లో అడుగుపెట్టనిచ్చారు. ఇంక అప్పటి నుండి నేను ఎప్పుడు ఏ exam రాసినా మొదటి ర్యాంకే వచ్చేది. కేవలం ఒక్కసారి మాత్రమే – అంటే ఏడవ తరగతిలో ఉన్నప్పుడు half yearly examinations అప్పుడు మాత్రమే మళ్లీ first rank తప్పి, second rank వచ్చింది. అప్పుడు కూడా మూడో తరగతిలో ఇచ్చిన ట్రీట్‌మెంటే ఇచ్చారు. నేను అప్పుడు చెప్పాను– "నాకు తప్పితే మిగతా students అందరికీ Question paper (క్వశ్చన్ పేపరు) తెలుసు" అని జవాబిచ్చాను. అప్పుడు ఆయన – "మిగతా వారి సంగతి నాకు తెలియదు. వారు Question paper తెలుసుకుని రాసినా, నీకు first rank మాత్రం తప్పకూడదు అని అన్నారు. ఇక మనం మళ్లీ 11–May –2005 కి వెళ్తే, ఆరోజు నా result ప్రకటించే సమయానికి, నాన్నగారు నల్గొండ నుండి గుంటూరు ప్రయాణిస్తున్నారు. Office నుండి ఇంటికి వస్తున్నారు. నాకు result రాలేదని తెలుసుకుని ఆయన అమ్మతో మాట్లాడిన మాట ఒక్కటే – "అబ్బాయి జాగ్రత్త."

అందరూ జాలిపడుతున్నారు. నన్ను ఓదార్చు తున్నారు. పరవాలేదులే అని భుజం తడుతున్నారు. నేను ధైర్యాన్ని కోల్పోతున్నాను. అందరికీ జవాబు చెప్పలేకపోతున్నాను. మాట పూర్తిగా పడిపోయిన stage కి వచ్చేశాను. నన్ను నిరాశ, నిస్పృహ కమ్మేశాయి. అగాధాల్లోకి వెళ్లి పోతున్నాను. నన్ను పాతాళంలోకి ఎవరో తొక్కేస్తున్నట్లు feeling ఆ రాత్రి త్వరగా గడిచిపోవాలని ప్రార్థించాను. మళ్లీ తర్వాత రోజు నిద్దుర లేవగానే నన్ను దుఃఖం అనే దెయ్యం పట్టి పీడించింది. నేను పూర్తిగా depression లోకి వెళ్లిపోయాను.

ఆ తర్వాత రోజు నాన్నగారు నన్ను అడిగారు "ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావు – నాన్నా" అని. "నీవు అమెరికా వెళ్లి పైచదువులు చదువుకునే అవకాశం ఇంకా ఉంది కదా.. ఎందుకంటే GRE/TOEFL స్కోర్ రెండు సంవత్సరాలు valid కదా.." అన్నారు. అప్పుడు నేను అమ్మని, నాన్నగార్ని కూర్చోపెట్టి– నాకు ఇంకొక్క అవకాశం ఇవ్వండి. నన్ను నేను నిరూపించుకుంటాను అని చెప్పాను. అప్పుడు వాళ్లు " నీ ఇష్టమే – మా ఇష్టం" అని నాకు అంతగా నిలబడ్డారు బలాన్ని పెంచారు.

Correct (కరెక్ట్)గా అప్పుడు ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాల్సిన తరుణం. శుక్రవారం result వచ్చింది. ఆదివారం – civil services preliminary examination. ఆ పరీక్ష రాయాలా? వద్దా? రాయాలంటే నేమో–నేను ఆ పరీక్షకు సన్నద్ధం కాలేదు. నేను

preliminary prepare అవ్వలేదు. అందులో ఓటమితో సగం కృంగిపోయాను. రాయాలంటే-హైదరాబాద్ వెళ్లి రాయాలి. -ఆదివారం తెల్లవారుజామున కల్లా అక్కడ ఉండి రాయాలి. (అప్పుడు అది శనివారం సాయంత్రం). వద్దు అనుకుందామంటే నా inner voice (లోపలి మనిషి) ఒప్పుకోదు. అప్పుడు నేను ఇంక పరీక్ష రాద్దామనే నిర్ణయించుకుని గుంటూరులో శనివారం రాత్రి 10 గంటలకు ప్రయాణం మొదలుపెట్టాను. రాత్రి తెల్లవార్లూ ప్రయాణం చేసి, ఉదయం 7 గంటలకు హైదరాబాద్ లో దిగాను. Railway dormitory లో fresh అయ్యి, ఒక అరగంట సేపు పుస్తకాలు తిరగేసి- preliminary పరీక్ష హాల్‌కి వెళ్ళాను.

Preliminary పరీక్ష రాద్దామని కూర్చున్నానే కానీ, నా బుర్రలో ఒకటే ఆలోచన. నాకు-నిజంగా rank రావాల్సిందేనా.? అన్న ఆలోచన ఎంత control చేసుకుందామనుకున్నా- వస్తూనే ఉంది. “నాకు rank వచ్చే ఉండి ఉంటుంది. U.P.S.C. మళ్లీ సవరణలు ప్రకటిస్తుంది. అందులో నా పేరు ఉంటుంది. అన్న తలంపులే తప్ప, పరీక్ష హాల్‌లో పరీక్ష గురించి మాత్రమే ఆలోచించాలన్న వివేకాన్ని నేను పూర్తిగా కోల్పోయాను.

నా ఈ తప్పిదం వల్ల భారీ నష్టమే జరిగింది. నేను Preliminary examination తప్పాను. అప్పుడు నా పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలోకి పడ్డట్లయింది. అసలే depression లో ఉన్న నేను ఇంకా depression అనే ఊబి లోతుల్కి జారిపోయాను. నా మీద నాకే చిరాకు వేసింది. ఏమి చేయాలో పాలుపోని స్థితి మరీ ముఖ్యంగా నేను ఒక reason కోసం బాధపడ్డాను. నేను Success ని చూడాలంటే కనీసం మరో 11/2 సంవత్సరాలు పడుతుంది. (ఎందుకంటే నేను తర్వాత సంవత్సరం Prelims కోసమే కాక, తర్వాత సంవత్సరం final result కోసం వేచి ఉండాలి కదా.)

అప్పుడు U.P.S.C. మీద కోపం వచ్చింది. ఒక్కసారి interview కి వెళ్లిన Candidate ని మళ్లీ preliminary లో test చేయడం ఏమిటి? U.P.S.C final result next సంవత్సరం preliminary పరీక్షకు రెండు రోజుల ముందు వరకూ ఎందుకు ప్రకటించదు? ఇలా జరగడం వల్ల ఎంతోమంది candidates తమ మీద తమకున్న నమ్మకాన్ని కోల్పోతారు కదా... ఇలా పట్టరాని కోపంతో ఒకవైపు, పీకల్లోతు depression తో ఒకవైపు ఉన్న నాకు అప్పుడు ఊరటనిచ్చింది - నామీద నాకు ఉన్న నమ్మకాన్ని తిరిగి తీసుకువచ్చింది -APPSC పరీక్షలు. నేను Group-I, Group -II పరీక్షలకు చదవడం మొదలుపెట్టాను. అప్పటి రోజుల్లో Group-I లో mains లో రెండు optional subjects కూడా రాయాలి.

నాతో పాటు Civil services కి ప్రిపేర్ అయిన friends (స్నేహితులు) Group-I, Group-II అంటే చిన్నతనంగా ఫీలయ్యారు. వాటి కోసం prepare అవడం, exams రాయడం అనవసరం అని అన్నారు. అమెరికా వెళ్లి software ఉద్యోగం చేయమని సలహా ఇచ్చారు. చుట్టాలు, చుట్టుపక్కల వాళ్లు నేను ఎక్కువ time waste చేస్తున్నానని నిర్ధారణకి వచ్చేసి, అమ్మా, నాన్నలకు నన్ను ఈ field వదిలేయని చెప్పమని బలవంత పెట్టారు.

అయినా నేను ఎవరిమాటా వినలేదు. కేవలం నా మీద నాకున్న నమ్మకాన్ని

నమ్ముకున్నాను. నా inner-voice నాకు చెబుతుంది–"నేను ఖచ్చితంగా I.A.S అయి తీరుతానని" "ఈ field వదల వద్దని' అందుకని Group-I, Group-II exams కోసం బాగా కష్టపడ్డాను. Civil Services exams కి ఎంత సీరియస్‌గా ప్రిపేర్ అయ్యానో, Group-I,II లకు కూడా అంతే సీరియస్‌గా సిన్సియర్‌గా ప్రిపేర్ అయ్యాను. ఈ పరీక్షలు నా లక్ష్యానికి ఎంతో తక్కువ కదా– అని వాటిని చిన్నచూపు చూడలేదు. civils ఎంత జాగ్రత్తగా, శ్రద్ధగా రాసానో అంతే జాగ్రత్తగా, శ్రద్ధగా Group -I పరీక్ష రాసాను. అంతే సిన్సియర్‌గా Group-II పరీక్ష రాసాను.

Group -II ఫలితాలు వెలువడ్డాయి. నాకు Group-II ఉద్యోగం ఖాయమైంది. ఆ result ఎంత ఊరటనిచ్చిందో నేను మాటల్లో చెప్పలేను. నా మీద నాకు నమ్మకాన్ని తిరిగి రాబట్టింది– ఆ ఉద్యోగం; రెట్టించిన ఉత్సాహంతో నేను Group-I interview వెళ్ళాను. Group -I లో కూడా ఉద్యోగం ఖాయమైంది. నాకు సంతృప్తినిచ్చింది ఆ విజయం. మరీ ముఖ్యంగా మా తల్లిదండ్రులకు నా మీద తిరిగి నమ్మకాన్ని తెచ్చిందీ ఉద్యోగం. వారిని సంతృప్తి పరచగలిగాను అన్న feeling ఎంతో గొప్పగా ఉండేది.

ఈ Article చదువుతున్న నా స్నేహితులకు నేను ఇక్కడ ఒక్క విషయం చెప్పదలచుకున్నాను. ఏ ఉద్యోగం అయినా తక్కువ కాదు. మీరు civil కోసం aim పెట్టుకోండి తప్పులేదు. కానీ Group-I,II లను తక్కువగా చూడకండి. మేము Group-I,II లు రాయమని బడాయిపోకండి. నా ఉదాహరణ తీసుకోండి. ఎడారిలో ఒయాసిస్‌లా మీకు Group-III, IV ఉద్యోగాలు కూడా అక్కరకు వస్తాయేమో ఎవరు చెప్పగలరు?

Group I,II లు నాకు సంతృప్తినిచ్చాయి. కానీ, సంతోషాన్ని ఇవ్వలేకపోయాయి. ఇలా చూస్తుండగా next preliminary exam రానే వచ్చింది. బాగా రాసాను. prelims పాసయ్యాను. mains బాగా రాశాను. interview call వచ్చింది. interview కూడా బాగా చేశాను. Final result వచ్చింది. నాకు 202వ ర్యాంకు వచ్చింది. అప్పుడు నాకు వచ్చిన సర్వీసు I.P.S (Indian Police Service). ఇంట్లో అందరూ సంతోషించారు. నా ఆనందానికి అవధుల్లేవు. అయితే ఒక చిన్న బాధ. నాకు కాదు– మా నాన్నగారికి. నాకు I.A.S వస్తుందని ఆయన ఆశపడ్డారు. ఇంకొక ఎనిమిది మార్కులు వచ్చి ఉంటే నాకు ఖచ్చితంగా I.A.S వచ్చి ఉండేది. అదీ కూడా Interview లో మార్కులు తక్కువగా రావడం వల్ల నాకు I.P.S. వచ్చింది. అప్పుడు నా interview మార్కులు 114 (300లకు). Mains లో 1100 కరెక్టుగా. Mains లో ఇన్ని మార్కులు వచ్చిన వారందరూ I.A.S అయ్యారు. ఒక్క నేను తప్ప.

ఎన్నాళ్ళగానో, ఎన్నేళ్ళగానే కన్న కల నిజమవు తున్నందుకు అమ్మ, నాన్న, అక్క, చెల్లి అందరూ సంతోషించారు. T.V లో, నా పేరు చెబుతుంటే మళ్ళీ, మళ్ళీ చూశారు, మళ్ళీ, మళ్ళీ విన్నారు. paper లో నా పేరు వస్తే మళ్ళీ మళ్ళీ చదివారు. May 15 వ తారీఖు నాడు result వచ్చింది. ఆ రోజు నుండి మా ఇంట్లో ఫోన్‌లు అన్నీ ఎప్పుడూ engage అయి ఉండేవి. మే 28వ తేదీ నేను Delhiకి వెళ్లాను. Medical test కి. (civil service లో పాసైన వారిని ఢిల్లీకి medical test కి పిలుస్తారు.)

ఈ సంతోషకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒక్కసారిగా విషాదం. మే

30వ తేదీ మా నాన్నగారు Heart-attack వల్ల స్వర్గస్తులయ్యారు. అంతవరకూ అందరం చాలా ఆనందంగా గడిపాం. కానీ, వెంటనే తగిలిన ఈ షాక్‌కి మేము తట్టుకోలేకపోయాం. నాకైతే ప్రపంచం ఒక్కసారిగా తల్లకిందులైపోయింది. మా నాన్నగారి చివరిక్షణాల్లో ఆయన పక్కన లేకపోయిన దురదృష్టం నాది. నా విజయాన్ని పూర్తిగా ఆయన అనుభవించకమునుపే చేరుకోలేని దూర తీరాలకు వెళ్లిపోతారని అసలు అనుకోలేదు. అయితే ఒక్క కన్సోలేషన్‌- ఆయన నా success ని చూశారు. civil services merit list లో నా పేరు చూశారు. పట్టలేనంత ఆనందానికి గురయ్యారు. కానీ ఆయన కోరుకున్న నిజమైన success అది కాదు. నన్ను ఆయన I.A.S గా చూడాలనుకున్నారు. నేను ఆయనకు ఇచ్చింది I.P.S. మాత్రమే- I.A.S. కాదు.

ఈ సారి ఖచ్చితంగా I.A.S అయి తీరాలని నిర్ణయించుకున్నాను. I.A.S అవుతానని నాన్నగారికి మాట ఇచ్చాను. మా నాన్నగారి దహన సంస్కారాలప్పుడు నేను ఒక కోరికను బలంగా అనుకున్నాను. అది- నేను శక్తివంచన లేకుండా ప్రయత్నించి ఇప్పటి వరకూ civils పరీక్షలో ఎవరూ సాధించని మార్కులు సాధించాలని. civil సర్వీసు interview మన చేతిలో ఉండదన్న విషయం నేను వేరే చెప్పనవసరం లేదు. అందులో, నాకు interview లో అంతకుముందున్న experience వల్ల (114 మార్కులు 300లకు), interview తో సంబంధం లేకుండా నాకు I.A.S. రావాలని నిశ్చయించుకున్నాను. Interview లో సున్నా మార్కులు వచ్చినా నాకు I.A.S. వచ్చి తీరాలని ఒక ప్రణాళిక వేసుకున్నాను. నా చేతిలో ఉన్నది mains మాత్రమే కాబట్టి, Mains లో అప్పటివరకూ ఎవరూ సాధించనన్ని మార్కులు సాధించాలి. అంటే అప్పటికి ముందు సంవత్సరం మొదటి ర్యాంకర్ Mains marks 1201. అంతకన్నా కనీసం ఒక్క మార్కు అయినా నా mains total రావాలని మనసులో కోరుకున్నాను.

అయితే- మే 30 నుండి జులై 30 వరకూ నేను గుంటూరులోనే ఉన్నాను. నాన్నగారి office పనులు, టెర్మినల్ బెనిఫిట్స్, ఎల్.ఐ.సి అన్ని పనులు చూస్తూ ఉన్నాను. ఒక్క ముక్క కూడా చదవలేదు. అమ్మని అక్క దగ్గరకు U.S.A పంపేశాను. చెల్లిని హైదరాబాద్‌లో నా రూమ్ దగ్గరలో ఉన్న hostel లో, Group-I,II coaching లో join చేశాను.

August 1 నుండి నాకు ఒకటే ఒక్కపని నా లక్ష్యాన్ని చేరుకోవడం చదవడం. చదవడం. ఇంకా చదవడం. నాకు గుర్తుంది కేవలం 1201 మాత్రమే. నా మదిలో మెదిలింది నా లక్ష్యమే. నాన్నగారు లేరు అన్న దిగులు కన్నా, ఆయనకు చేసిన బాసే నన్ను కలవరపెట్టింది. ఎలాగైనా 1201 మార్కుల కన్నా ఒక్క మార్కు అయినా ఎక్కువ తెచ్చుకోవాలని పట్టుదల పెరిగింది. పట్టుదల కంటే-"కసి" అంటే బాగుంటుందేమో.

పగలు తెలియదు. రాత్రి తెలియదు. నేను Hyderabad లో ఉన్న roomలో తలుపులు బిగించి చదువుకునే వాణ్ణి. భోజనం roomకి వచ్చేది. సూర్యోదయం ఎప్పుడు అయ్యిందో తెలిసేది కాదు, ఎప్పుడు సూర్యాస్తమయిందో అసలు తెలియదు తలుపులు వేసేసి ఉండేవి. తలుపులకు కొన్ని photoలు అంటించి ఉండేవి. అవి- అంతకు ముందు civil services లో మొదటి ర్యాంకులు సాధించిన వ్యక్తుల photoలు; I.A.S.లు నల్లకోటు, నల్ల ప్యాంటు వేసుకుని పార్లమెంటుకు వెళ్తున్న photo లు; ఆ photo లతో పాటు తలుపుకు అంటించిన

అంకె ఒకటుంది. అది 1201. ఎప్పుడు బోరు కొట్టినా, ఆ తలుపుకేసి చూసేవాణ్ణి. ఆకలుండేది కాదు; నిద్ర పట్టేది కాదు. ఒకటే ఆశ, ఒకటే శ్వాస, నీళ్ల పట్టుకునే బిందెలో నీరు అయిపోతే- ఒక రోజు అయిపోయింది అని అర్థమయ్యేది. కొన్ని రోజులు స్నానం ఉండేది కాదు. గడ్డం పెరిగిపోయేది. అలా చదువుతూ కూర్చుండిపోయేవాడిని.

ఆఖరికి- నేను Mains exam రాసే రోజు రానే వచ్చింది. యుద్ధానికి వెళ్లే సైనికుడు-శత్రువుని చీల్చి చెండాడితే ఎలా ఉంటాడో, U.P.S.C. exam రాసేప్పుడు నేను అంత spirit తో ఉండేవాడిని. నాకు ఉన్న ఒకే ఒక్క అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని, నాన్నగారి కోరిక నెరవేర్చాలని ఉవ్విళ్లూరేవాడిని.

civils లో ఉన్న 9 పరీక్షలలో, ప్రతీ పరీక్షలో నాకు అందరికంటే ఎక్కువ మార్కులు రావాలని ఎక్కువ ప్రశ్నలకు జవాబులు రాసేవాడిని. ఒక బిట్టు కూడా వదలకుండా, ఒక క్షణం కూడా వృథాచేయకుండా ఉన్న మూడు గంటలూ పూర్తిగా వినియోగించుకునే వాడిని. ప్రతి exam ముందు-నాకు నేను చెప్పుకునే వాడిని.-"ఈ exam నా కంటే ఎవరూ బాగా రాయకూడదు. నేను రాసినంత matter ఎవరూ రాయకూడదు నేను రాసినన్ని additional papers ఎవరూ రాయకూడదు" అని.

అలాగే జరిగింది. పరీక్షలు బాగా రాశాను. Interview call వచ్చింది. Interview కూడా బాగానే చేశాను. అప్పుడు I.P.S. training లో ఉన్నాను. may 18వ తారీఖు నాన్నగారి మొదటి సంవత్సరీకం (చనిపోయి ఒక సంవత్సరం కావస్తుంది...అప్పుడే). May 11వ తేదీ నుండి నేను I.P.S. trainingలో సెలవు తీసుకున్నాను. ఒక పది రోజులు- నాన్నగారి సంవత్సరీకం కోసం;

May 16వ తేదీ సాయంత్రం 6:00 సివిల్స్ రిజల్ట్స్ వచ్చాయి. నాకు అప్పుడు tension. నాన్నగారికి ఇచ్చిన మాట నెరవేరిందా లేదా? నా result ఇంకా తెలియదు. First rank నాది కాదు అని నాకు తెలిసింది. కృంగిపోయాను నేను బతికి వ్యర్థం అన్న feeling నాకు వచ్చేసింది. పది నిమిషాలలో Tv9 లో flash news గుంటూరుకి చెందిన అద్దంకి శ్రీధర్‌బాబుకి జాతీయస్థాయిలో ఐదో ర్యాంకు అని దాని సారాంశం. ఒక్కసారిగా గట్టిగా కేకపెట్టి, అమ్మని కౌగిలించుకున్నాను. నా కళ్లు నా మాట వినడంలేదు. నీరు ధారలా కారిపోతోంది. అమ్మ వైపు చూస్తే, అమ్మ కూడా అంతే. కొన్ని క్షణాలు మాటలు రాలేదు. ఇద్దరికీ.

may 17వ తారీఖు U.P.S.C లో ఒక friend ద్వారా నా మార్కులు కనుక్కున్నాను. నాకు మళ్లీ interview లో తక్కువ వచ్చాయి.(165 మార్కులు-300లకు). ***కానీ mains లో అందరికంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. 1201 కాదు, 1202 కాదు, ఏకంగా 1226. General studies లో 419 మార్కులు, ఇప్పటి వరకూ General studies లో అన్ని మార్కులు ఎవరికీ రాలేదు. నా కల నెరవేరింది. కాదు మా నాన్నగారికి ఇచ్చిన మాట నెరవేరింది.***

మా నాన్నగారి సంవత్సరీకం లోపు ఆయనకి చ్చిన మాట నెరవేర్చుకున్నందుకు- కలిగిన సంతోషం మాటల్లో చెప్పరానిది. అప్పటి వరకూ నేను పడ్డ శ్రమంతా, నేను పడ్డ కష్టమంతా ఎంతో తీయగా అనిపించింది.

ఒక అనిర్వచనీయమైన అనుభూతి నన్ను కమ్మేసింది. ఏమి జరుగుతుందో తెలియదు. T.v వాళ్లు paper వాళ్ళు మా ఇంటికి క్యూ కట్టారు. నా address వెతికి మరీ, గుంటూరు ఇంటికి, హైదరాబాద్‌లో roomకి, I.P.S. లో నేను ఉంటున్న police academy కి వెళ్లి నా గురించి అడుగుతున్నారు. నాకేమీ తెలియడంలేదు. paper లో మాత్రం– "నాన్న కల నెరవేరింది" అనే heading చూశాను. ఇప్పటికీ చెబుతున్నాను నేను ఒక successful I.A.S. officer ని అయినా, కాకపోయినా, నేను ఎప్పుడూ ఒక్క విషయానికి సంతృప్తిపడతాను, సంతోషిస్తాను. అది మా నాన్నగారికి నేనిచ్చిన మాటను నిలబెట్టుకున్నాను. నేను అనుకున్నది సాధించాను. నాకు జీవితంలో ఏ విషయం ఇంత ఆనందాన్ని, సంతోషాన్ని ఇవ్వలేవు. నాకు ఆ ఆత్మసంతృప్తి చాలు. మనిషి అనుకున్నది సాధించగలడు అని నేను నిరూపించగలిగాను. నిజంగానే మనిషి తను అనుకున్నది సాధించగలడు. డౌటులేదు. ఖచ్చితంగా సాధించగలడు. అందుకే నేను నా మిత్రులకు నా కథ ద్వారా చెప్పదల్చుకున్నది ఏమిటంటే మీరు ఏదైతే అనుకుంటారో అది ఖచ్చితంగా సాధించగల సత్తా మీలో తప్పక ఉంటుంది. కానీ, ఆ అనుకోవడం బలంగా మనసుతో అనుకోవాలి. ఎదురే మీకు లేదు... మిమ్మల్ని ఎవరూ ఆపలేరు...

# 2

# కమిట్‌మెంట్ కలిగితే కష్టాలైనా, కడగండ్లయినా కమనీయమే

**హైలెట్స్**

- ✤ మనం అనుకున్నది సాధించి తీరాలి అని అనుకున్నప్పుడు ఏ కష్టమూ కష్టం కాదు. అది ఒక పరీక్షా (దశ).
- ✤ అవయవాలు పనిచేయకపోయినా, ఒకే ఒక్క చూపుడు వేలి సహాయంతో దేశం గర్వించదగ్గ బ్రిడ్జిని నిర్మించాడు.
- ✤ ఓటమిని ఒప్పేసుకుంటే విమర్శకుల నోళ్లు మూతపడేవి కావు. తన తండ్రి త్యాగానికి, తన కమిట్‌మెంట్‌కి అర్థం ఉండేది కాదు.
- ✤ మనకొచ్చే కష్టాలకంటే మన కమిట్‌మెంట్ బలమైనది అయి ఉండాలి. అప్పుడే బ్రహ్మాండమైన అఖండమైన విజయం మన సొంతమవుతుంది.

ఏదైనా సాధించి తీరాలని మనం అనుకున్నామంటే దానిని నెరవేర్చాలని పట్టుబడతాం. అది సహజమే.ఆ ప్రయత్నాలలో అనుకోని కష్టాలు వచ్చాయనుకోండి. అప్పుడు మనలో చాలా మంది వెనక్కు తగ్గవచ్చు. కానీ కొందరు కమిట్‌మెంట్ కలిగిన వ్యక్తులు ఉంటారు. తాము అనుకున్నది సాధించాలని తమని తాము ఆ లక్ష్యానికి సమర్పించకుంటారు. ప్రాణాల మీదకు వస్తున్నా వెనుదిరిగి చూడరు. కష్టాలెన్ని వచ్చినా, కన్నీటి మహాసముద్రాలను ఎన్నింటిని దాటాల్సి వచ్చినా, కడగండ్లు ఎన్ని ఎదుర్కోవాల్సి వచ్చినా సరే... లక్ష్యం నెరవేరడమే వీరికి కావలసింది. అలాంటి వారే విజేతలవుతారు.



కొన్ని లక్షల మందికి ఆదర్శమవుతారు.

తన తండ్రి గన్న స్వప్నాన్ని నిజం చేయడానికి ఒక వ్యక్తి అతని పరివారం ఏ స్థాయి వరకూ కష్టపడగలరో నిరూపించి చూపెట్టేందుకు కమిట్‌మెంట్ కలిగితే కష్టనష్టాలు లెక్కచేయకుండా ఎలా మనం ముందుకు వెళ్లాలో ప్రబోధించేందుకు ఒక వంతెనని గూర్చిన కథ ఉంది. నేను చెప్పేది అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని బ్రూక్లిన్ బ్రిడ్జిని గురించిన వాస్తవమైన సంఘటన.

దీనిని రోబ్‌లింగ్ పరివారం నిర్మించింది. జాన్ రోబ్‌లింగ్ జర్మనీలో పుట్టి పెరిగిన సీదా సాదా మనిషి. తన తండ్రికి ఒక చిన్న పొగాకు దుకాణం ఉండేది. అయినా జాన్ రోబ్‌లింగ్‌ని ఇంజనీర్‌ని చేయాలని కృషి చేశాడు. జాన్‌కి ఇంజనీరింగ్‌లో కొన్ని కొన్ని సబ్జెక్టులు మాత్రమే నచ్చేవి. వేలాడే బ్రిడ్‌జలు అతనిని ఆకర్షించాయి. వాళ్ల ఇంటి పక్కన అలాంటిదే ఒకటి నిర్మించాలని ఆరాటపడిపోయేవాడు. జర్మనీలో పరిస్థితులు అనుకూలించక జాన్ అమెరికాకి వలస వచ్చేశాడు. ఇంజనీరింగ్ చదువు మాత్రం పూర్తి కాలేదు. అమెరికాలో మొదట వ్యవసాయ వృత్తిని చేపట్టాడు. అది లాభసాటిగా ఉండకపోయే సరికి కాంట్రాక్టు పనులు చేయడం మొదలు పెట్టాడు. తను ఏదైనా గొప్ప ఇంజనీరింగ్ కాంట్రాక్టు చేయాలని తలచాడు. కొన్ని వేలాడ ఏ బ్రిడ్జిలను నిర్మించి తన తృష్ణ తీర్చుకున్నాడు. వైర్ రోప్ సస్పెన్షన్ బ్రిడ్జిలను (Wire rope suspension bridge) చేస్తే తనే చేయగలడు అన్న కీర్తిని జాన్ రోబ్‌లింగ్ సంపాదించుకున్నాడు. మెల్లిమెల్లిగా డబ్బు, హోదా, పేరు రావడం మొదలైంది. అప్పుడు తన దృష్టి న్యూయార్క్ నగరానికి అర కిలో

మీటర్ దూరంలో ఉన్న లాంగ్ దీవిపైన పడింది. న్యూయార్క్ నగరానికి లాంగ్ దీవికి మధ్యన బ్రిడ్జిని నిర్మిస్తే ఎలా ఉంటుందని తలచాడు. తన తలపుని నలుగురితో చెబితే, వాళ్లంతా నవ్వారు. బ్రిడ్జిలను నిర్మించే ఇంజనీర్‌లని కలిస్తే అసంభవమైన పనులకు పూనుకోవద్దంటూ ఉచిత సలహాలిచ్చారు. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి బ్రిడ్జిలు లేవు. కాబట్టి మనం చేయలేమంటూ చేతులెత్తేశారు.

అది 1869వ సంవత్సరం. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ ప్రాంతాన్ని, లాంగ్ దీవిలోని మాన్‌హట్టన్ ప్రాంతాన్ని కలపడానికి ప్రభుత్వం ముందుకు రాకపోతే ఏమైంది. నేనున్నానంటూ జాన్ ముందుకు దూకాడు. తనకు తెలిసిన విద్యతో వైర్ రోప్ సస్పెన్షన్ బ్రిడ్జిని కలపాలని కొంత మంది పనివాళ్లని కుదుర్చుకున్నాడు. తన కుమారుడు వాషింగ్టన్ రూబ్లింగ్ అప్పుడు ఆర్మీలో కల్నల్‌గా పనిచేస్తున్నాడు. తను బ్రిడ్జి గురించి చెబితే వాషింగ్టన్ ఇద్దన్నాడు. 1596 అడుగుల రోప్ సస్పెన్షన్ బ్రిడ్జి చేయాలంటే చాలా ఖర్చవుతుంది. అందునా అది ఈస్ట్ రివర్ లాంటి భయంకరమైన నది మీద చేయాలంటే అసంభవం అని వారించాడు. జాన్ వినలేదు. తన కల నెరవేరాలని పట్టుబట్టాడు. తను ఈ పని పూర్తి చేయాలని తలచానని కొడుకుతో చెప్పాడు. ఇలా ఉండగా ఆ బ్రిడ్జి సర్వే పనులలో భాగంగా జాన్ రోబ్‌లింగ్ నది వరకూ వెళ్లవలసి వచ్చింది. అక్కడ తనకు అనుకోకుండా యాక్సిడెంట్ అయింది. తన కాలి మీదకు ఒక పడవ దూసుకువచ్చింది. కాలు నుజ్జు నుజ్జయిపోవడంలో కాలు తీసేయవలసి వచ్చింది. ఇది వాషింగ్టన్ రోబ్‌లింగ్‌కి తెలిసి హుటాహుటిన తండ్రి దగ్గరకు వచ్చేశాడు. జాన్ నడవలేకపోతున్నాడు కాబట్టి, ఆ పనులన్నీ తనే చేయాలని పూనుకున్నాడు. ఇంజనీరింగ్ డిజైన్‌లన్నీ తెప్పించుకుని అర్థం చేసుకుని వాటిని తండ్రితో చర్చించే వాడు. వాషింగ్టన్ రోబ్లింగ్. జాన్‌కి వైద్యం చేసిన డాక్టర్లు టెటానస్ సోకిందని తెలుసుకోలేకపోయారు. వారు గుర్తించే సరికి ఆ వ్యాధి ఎంతో ముదిరిపోయి, చివరికి జాన్ ప్రాణాన్నే బలితీసుకుంది. యాక్సిడెంట్ జరిగిన 24 రోజులకు జాన్ చనిపోయాడు. చనిపోయిన తన తండ్రి కల నెరవేర్చాలని వాషింగ్టన్ పూనుకున్నాడు. తను ఇక పూర్తి స్థాయిలో ఈ పనికి అంకితమైపోయాడు. కొన్ని నెలలు గడిచాయి. వాషింగ్టన్ బ్రిడ్జి డిజైన్‌ని పూర్తిగా అర్థం చేసుకున్నాడు. ఇప్పుడు ఆ బ్రిడ్జికి కింద పిల్లర్లు వేయాలి. నది లోపలకి పిల్లర్లు ఎలా వేయాలని వాషింగ్టన్ నది అట్టడుగు భాగానికి వెళ్లాడు. ఆ విషయం గురించి పక్కన ఉన్న వారితో చర్చిద్దామనుకుంటే – నోరు కదలడం లేదు. ఏదైనా సైగ చేద్దామంటే – చేయి పనిచేయడం లేదు. మొత్తం దేహానికి పక్షవాతం వచ్చేసింది. నది అట్టడుగు భాగంలో కొంత మందికి ఇలా జరుగుతుందని వైద్యులు తరువాత చెప్పారు. 32 ఏళ్ల వాషింగ్టన్ రూబ్లింగ్ ఇప్పుడు మంచానికి అతుక్కుపోయాడు. తన శరీరంలో ఏ అవయవమూ పనిచేయడం లేదు. తను మాట్లాడలేడు, నడవలేడు, కానీ చూడగలడు, ఆలోచించగలడు... తన తండ్రి కన్న కల నెరవేర్చలేకపోతున్నందుకు, బాధపడ్డాడు. తన శక్తివంచన లేకుండా కృషి చేద్దామనుకున్నాడు కానీ, తనకిప్పుడు శక్తిలేదు. ఎలా కృషి చేయగలడు? ఇదే ప్రశ్న అతనిని చాలా వేదనకి గురిచేసింది. నిజంగా తను ఏమీ చేయలేదా? ఓటమిని ఒప్పుకోవలసిందేనా? అందరూ తండ్రిని సాహసాలు చేయవద్దన్నారు. తను కూడా వద్దన్నాడు. తను ఇప్పుడు ఏమీ చేయలేకపోతే, తను



విఫలమవడమే కాకుండా, తన తండ్రిని కూడా ఫెయిల్ చేయిస్తాడు. (చేయించిన వాడవుతాడు). శరీరం మొత్తం పరికించి చూసుకుంటే తన కుడిచేయి చూపుడు వేలు కదల గలుగుతుంది. ఆ వేలితో తన భార్యని మోచేతిని తాకి ఏదో చెప్పదలుచుకున్నాడు. మొదట తన భార్యకి అర్థం కాకపోయినా, తరువాత కాలంలో వాషింగ్టన్ ఏమి చెబుతున్నాడో ఆమెకి సులువుగా అర్థమైపోయింది. ఆమెని ఇంజనీరింగ్ కోర్సు చేయమని ఆ వేలి సందేశం యొక్క ఉద్దేశం. తను కోర్సు చేస్తే, తను చెప్పే విషయాలు మిగతా ఇంజనీర్లకి ఆమె సులువుగా చెప్పగలుగుతుంది. అందుకని, ఆమె తన భర్త కోరిక మేరకు ఇంజనీరింగ్ కోర్సు చేసింది. ఆ కోర్సు పూర్తయిన తరువాత, వాషింగ్టన్ మళ్లీ వేలి సందేశం ద్వారా ఆ బ్రిడ్జి కోసం పనిచేసే వాళ్లని రమ్మని కబురు పెట్టాడు. వారందరూ వచ్చిన తరువాత, తన తండ్రి కల ఎలాగైనా నెరవేరాలని, దానికి అందరూ కలిసి పనిచేయాలని భార్య ద్వారా చెప్పించాడు. అందరూ సరేనన్నారు. మళ్లీ పని మొదలైంది. తన భర్త అక్కడి పని వారికి ఏమి చెప్పాలనుకుంటున్నాడో భార్య (ఎమిలి రోబ్‌లింగ్) పేపర్ మీద రాసేది. భర్త ప్రోద్బలం వల్ల ఎమిలి హయ్యర్ మేథమేటిక్స్, మెటీరియల్ స్ట్రెంత్స్, కేటనరీ కర్వ్స్ యొక్క సిద్ధాంతాలు, బ్రిడ్జి స్పెసిఫికేషన్స్, కేబుల్ కన్‌స్ట్రక్షన్‌లోని లోతు పాతులని తెలుసుకుంది. ఇలా తను చేయడం వల్ల భర్త ఏమి చేయదలచుకున్నాడో మిగతా పని వారికి సులువుగా అర్థమయ్యేలా చెప్పేది. భర్త వాషింగ్టన్ ఆ బ్రిడ్జి దగ్గరకు వెళ్లాలంటే – అది సాధ్యమయ్యే పనికాదు. కానీ తను మాత్రం ప్రతీ రోజూ వెళ్లి బ్రిడ్జి ఎంతవరకు పూర్తయిందనే సంగతి మాత్రం వాషి ంగ్టన్‌కి చెప్పేది. వాళ్లిద్దరూ తరువాత ఏమి చేయాలో

చర్చించుకునే వారు. భర్త చూపుడు వేలితో, భార్య తన నోటితో, మరియు పెన్ను పేపరుతో చర్చించుకుని ఇంజనీర్లకు, పనివాళ్లకు అవసరమైన దిశానిర్దేశం చేసేవారు. మధ్యలో ఎన్నో సమస్యలు తలెత్తాయి. అయినా సరే వీరి చర్చలో వాటికి సమాధానాలు దొరికేవి. బ్రిడ్జి కట్టడం మాత్రం ఆగలేదు. నిరంతరం కొనసాగుతూనే ఉంది. 1883వ సంవత్సరం ఆ నిర్మాణం పూర్తయింది. 13 సంవత్సరాల సుదీర్ఘ కాలం తరువాత, ఎన్నో లక్షల వేల సందేశాల అనంతరం ఊహించని ఒక అద్భుతం ఆవిష్కృతమైంది. అసంభవం అని అనుకున్న అర కిలోమీటర్ బ్రిడ్జి కట్టబడింది.

ఆ బ్రిడ్జి ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. స్వయానా అమెరికా రాష్ట్రపతి బ్రూక్లిన్ బ్రిడ్జిని ప్రారంభించారు. ఆ వేడుకలు రోజు మొత్తం జరిగాయి. అయినా వాటికి వాషింగ్టన్ రోబ్లింగ్ హాజరు కాలేకపోయాడు. రాష్ట్రపతి మాత్రం తన ఇంటికి వెళ్లి వాషింగ్టన్‌కి ధన్యవాదాలు తెలిపాడు. నేడు న్యూయార్క్ నగరానికి బ్రూక్లిన్ బ్రిడ్జి ఒక లాండ్ మార్క్ అయింది. ఆ నగరానికే కాదు, పూర్తి అమెరికాకే ఆ బ్రిడ్జి శోభని తెచ్చింది. ఈ నాటికీ ఆ బ్రిడ్జి మీద నుంచి కొన్ని కోట్ల వాహనాలు వెళ్లి ఉంటాయి. వాళ్లంతా రూబ్లింగ్ పరివారానికి రుణపడి ఉంటారు. ఈ పరివారంలో రెండు తరాల వారు ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. వీరిని 'పిచ్చి పట్టి ఊహల్లో బతుకుతున్నారు" అని ఎందరో నిరుత్సాహపరిచారు. అయినా సరే కమిట్‌మెంట్ కలిగి ఉంటే కష్టాలన్నీ అవలీలగా గట్టెక్కవచ్చు అని వీరు నిరూపించారు.

మన నిజ జీవితంలో కూడా ఎంతో మంది మనకి వ్యతిరేకంగా కామెంట్ చేసి, మనల్ని మన పనిని చేసుకోనివ్వరు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు ఒక్కోసారి మనకి ప్రతికూలంగా మారిపోతాయి. మన పట్టు వీడేందుకు (మనల్ని) ప్రేరేపిస్తాయి. ఆ ప్రతికూల ప్రభావాలకు లొంగిపోవడం సులువైన పని... అలా కాకుండా మనం అనుకున్నది సాధించి తీరాలి అని తీర్మానించుకున్నప్పుడు ఏ కష్టమూ – కష్టం కాదు... అది ఒక పరీక్ష దశ లాగానే ఉంటుంది. ఆ పరీక్షలో మనం నెగ్గాలి. నెగ్గి ముందుకెళ్లాలి. అనుకున్నది సాధించాలి. అందరూ తమ వల్ల కాదు అని వదిలేసిన ఒక ప్రాజెక్టుని ఒక వ్యక్తి తన సొంత బలం మీద ఆధారపడి మొదలుపెట్టాడు. ఆ వ్యక్తి ఆ ప్రయత్నంలో తన ప్రాణాలే పోగొట్టుకున్నాడు. తన తండ్రి ఆశయం నెరవేర్చడానికి తనయుడు రంగంలోకి దిగాడు. తన తండ్రిని కోల్పోయిందీ, తనకు పక్షవాతం వచ్చి జీవచ్ఛవంలా పడుందీ – ఒక కష్టమైన ప్రాజెక్టు చేపట్టడం వల్ల అని తెలిసి కూడా అనుకున్నది నెరవేర్చాలని పంతం పట్టాడు. తన భార్యకి కష్టమైన ఇంజనీరింగ్ విషయాలను విడమర్చి చెప్పగలిగాడు. తన అవయవాలు పనిచేయకపోయినా, ఒకే ఒక చూపుడు వేలి సహాయంతో అమెరికా దేశం గర్వించదగ్గ బ్రిడ్జిని నిర్మించాడు. కష్టమైన ఈ పదమూడు సంవత్సరాల కాలంలో ఏ క్షణంలోనైనా తన ఓటమిని ఒప్పేసుకుంటే – "పిచ్చి పట్టి ఊహల్లో బతికేవాళ్లు" అని అన్న విమర్శకుల నోళ్లు మూతపడేవి కావు. తన తండ్రి త్యాగానికి, తన కమిట్‌మెంట్‌కి అర్థం ఉండేది కాదు.

అసంభవం అని అనిపించిన బ్రూక్లిన్ బ్రిడ్జి నేడు మన కళ్లముందు ఉంది. సాధించాలిఅనుకుంటే ఏదీ అసంభవం కాదు. అయితే గియితే కొంచెం ఎక్కువ కష్టపడాల్సి రావచ్చు. మన కమిట్‌మెంట్ బలమైనదైతే ఏ కష్టమూ మనకి అడ్డురాలేదు. మనల్ని మన

లక్ష్యానికి దూరం చేయలేదు. మనం కూడా బ్రూక్లిన్ బ్రిడ్జి కథ నుంచి కొంత నేర్చుకుందాం. మనం మనల్ని ముందు నమ్ముకుందాం. మన లక్ష్యాన్ని నిర్ధారించుకున్న తరువాత, దానికి పూర్తిగా మనల్ని మనం సమర్పించుకుందాం. ఎప్పుడైనా మనకి కష్టాలు వస్తే వాషింగ్టన్ రోబ్లింగ్‌ని గుర్తుకు తెచ్చుకుందాం. తను తన చేతి వేళ్లతో 13 సంవత్సరాలు తన భార్య మోచేతిని తడిమి బ్రూక్లిన్ బ్రిడ్జిని నిర్మించిన సంగతి గుర్తుకు తెచ్చుకుందాం. ఆర్మీలో ఒక కల్నల్ సంపదలన్నీ వదిలేసి తన తండ్రి స్వప్నం నెరవేర్చడానికి, (ఆ కల నిజం చేయడానికి) తన ప్రాణాన్నే పణంగా పెట్టినప్పుడు మనం మనమనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చలేమా? అని మనల్ని మనం ఉత్తేజపరుచుకుందాం.

కష్టాలు అందరికీ వస్తాయి. కష్టమొచ్చినప్పుడు పారిపోయి 'నేను చేయలేను' అంటూ చేతులెత్తేయడం చాలా సులువైన పని. కానీ, అది విజేతల లక్షణం కాదు. కష్టం వస్తే దానిని ధైర్యంగా ఎదుర్కోవాలి. పోరాడి విజయం సాధించాలి. మన మీద మనకి నమ్మకం ఉంటే మనకి వచ్చే కష్టాలు కూడా ఎక్కువ కాలం మనల్ని కృంగదీయలేవు. గుర్తుంచుకోండి. మనకి వచ్చే కష్టాల కంటే మన కమిట్‌మెంట్ బలమైనది అయి ఉండాలి. అప్పుడే బ్రహ్మాండమైన, అఖండమైన విజయం మన సొంతం అవుతుంది.

# 3

# విమర్శనెదుర్కొనే తీరు - సిద్ధూ పోరు

**హైలెట్స్**

- విమర్శలోని మంచిని చూడలేము. వెంటనే 'నువ్వెంత' అంటూ విమర్శించిన వారి లోపాలను వెదుకుతాము. వారిపైన కోపం, ద్వేషం, అసూయ, పగ, ప్రతీకారం పెరిగిపోతాయి.
- సంకల్పబలానికి పరిశ్రమ తోడైతే విమర్శను ఎంత బాగా ఎదుర్కోవచ్చునో ప్రపంచానికి సిద్ధూ చూపించాడు.
- మనని విమర్శించే వాళ్లు, బహుశా మన అభివృద్ధికి కారణం అవుతున్నారు. మీరు విమర్శని వినదల్చుకోనప్పుడు సిద్ధూని గుర్తుకు తెచ్చుకోండి. తను అల్మారాకి పేపర్ కటింగ్‌ని అతికించుకున్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకోండి.
- సూర్యుడు విశ్రమించడానికి అస్తమించినా, ఆ నాటి టార్గెట్ కనుక పూర్తి అవకపోతే సిద్ధూ విశ్రమించేవాడు కాదు.
- ప్రతీరోజూ తను తొడిగిన గ్లౌస్‌లు ముద్దయ్యేవి. చెమట వల్ల కొన్నిసార్లు రక్తం వల్ల కూడా.
- 300 సిక్స్‌లు... ప్రతిరోజూ అందులో తన చెమట, కర్తంతో పాటు ఒక కృతనిశ్చయం కూడా ఉంది.




మిమ్మల్ని ఎవరైనా ఏ సందర్భంలోనైనా విమర్శించారా? అప్పుడు మీకు ఏమనిపించింది? చాలా మందికి వెంటనే ఆవేశం వచ్చి, విమర్శకు ప్రతివిమర్శ చేసేయాలనిపిస్తుంది. సామాన్యంగా మనల్ని వెక్కిరించే వాళ్ల భరతం పట్టాలని ఊగిపోతూ వాళ్లని దుమ్మెత్తి పోసేస్తాం.

సక్సెస్ సాధించాలనుకునే వారు సరదాకి కూడా అలా చేయరు. వీరికి కించపరచాలని చూసే వారికి నోటితో కాకుండా అద్భుతాలు చేసి చూపించి, చేతలతో బుద్ధి చెబుతారు. ఇంకా చెప్పాలంటే విమర్శించిన వారి చేతనే పొగిడించుకోబడతారు కూడా.

ఎవరైనా మనల్ని విమర్శిస్తే  మనం దానిలోని మంచిని చూడలేము. మన అహం దెబ్బతింటుంది. వెంటనే “నువ్వెంత” అంటూ మనం విమర్శించిన వారి లోపాలను వెదుకుతాము. వారిపైన కోపం, ద్వేషం, అసూయ, పగ, ప్రతీకారం పెరిగిపోతాయి. అలా కాకుండా మనని ఎవరైనా విమర్శిస్తే “ ఎందుకు మనల్ని ఎవరో అనవలసి వచ్చింది. నాలో ఎదుటి వ్యక్తి ఎత్తి చూపించిన లోపాలు నిజమేనా? కాదా? నేను బాగుపడాలనే తను విమర్శించాడా? నేను ఇంకా మంచిగా ఎలా తయారవగలను?” అనుకుంటూ కొంచెం సేపు మనం ఆలోచిస్తే మన సొమ్మేం పోతుంది?

విమర్శని సద్విమర్శగా చూసి, మనకి మనం మేలు చేసుకోవడం ఎంతో ఉత్తమం (మంచిది). అలాకాకుండా దానిని ఒక ఇగో ఇష్యూగా చూసి ఎదుటివాళ్లకి కీడు చేయాలనుకోవడం అవివేకం, అమాయకత్వం. ఎందుకంటే వీరే ఎవరికో కీడు

తలపెట్టాలనుకునేప్పుడు మన విలువైన ఎంతో శక్తిని నష్టపోతాం. మనకి నెగెటివ్ ఆటిట్యూడ్ వచ్చేస్తుంది. ఒక పాత సామెత చెప్పినట్లు "చెడపకురా చెడేవు".

విమర్శించే వారు మంచివారు కాకపోవచ్చు. బహుశా వారి విమర్శ వల్ల మనకి మంచి జరగవచ్చునేమో... ఆ విమర్శని తప్పు అని నిరూపించడానికి కృషి చేసి, మనం జీవితంలో ఉన్నత శిఖరాలని అధిరోహించవచ్చునేమో వారి విమర్శను తిప్పికొట్టడానికి కష్టపడి పనిచేసి... గొప్ప గొప్ప ఎత్తులను ఎదగవచ్చునేమో...

భారత క్రికెట్ జట్టుకి నవజ్యోత్‌సింగ్ సిద్ధూ చేసిన సేవ వేనోళ్ల కొనియాడబడుతుంది. అతను తన కెరీర్‌లో ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నాడు. తను విమర్శలకు ఎప్పుడూ నోటితో జవాబు ఇవ్వలేదు. సంకల్ప బలానికి పరిశ్రమ తోడైతే విమర్శను ఎంత బాగా ఎదుర్కోవచ్చునో అతను ప్రపంచానికి చూపించాడు.

విమర్శించే వాళ్ల అవమానాలు సహించాడు. ఎంతో మంది గేలి చేస్తే భరించాడు. క్రికెట్ జట్టులో స్థానం కోల్పోతే కృంగిపోయాడు. కానీ ఎన్నడూ నోటికి పని చెప్పలేదు. విమర్శించే వాళ్ల నోళ్లకు తాళం వేయాలంటే కష్టపడి పనిచేయాలని తెలుసుకున్నాడు. మొండి పట్టు పట్టి అనుకున్నది సాధించాడు.

ఒక రాజకీయ నాయకుడిగా, ఒక క్రికెట్ కామెంటేటర్‌గా సిద్ధూ మారకముందు క్రికెట్ ఆటగాడిగా అతను అందరికీ సుపరిచితుడే. క్రికెట్ కామెంటరీలో అతిశయోక్తులతో, జోకులతో ఆటని రక్తికట్టించే సిద్ధూ, తను క్రికెట్ ఆడేటప్పుడు ఫోర్లు, సిక్సర్‌లతో ప్రేక్షకులను టీవీలకు అతుక్కుపోయేలా చేసేవాడు.

సిద్ధూ ఒక సంపన్న కుటుంబంలో పుట్టాడు. చిన్నప్పుడు వాళ్ల నాన్న సిద్ధూని పొద్దునే 5 గంటలకల్లా లేచి జాగింగ్‌కి వెళ్లమనేవాడు. సిద్ధూ అప్పుడు లేచి, వాళ్ల నాన్న కొంచెం అటు వెళ్లగానే, పనివాళ్లకి లంచం ఇచ్చి వేరే రూములో పడుకునే వాడు. అతను 7 గంటలకు లేచి, తన ముఖం మీద, షర్ట్ మీద కొంచెం నీళ్లు పోసుకొని, రొప్పుతూ వచ్చి వాళ్ల నాన్న ముందు అలసిపోయి వచ్చినట్లు కనిపించే వాడు. కొడుకు శ్రమను చూసి మురిసిపోయిన తండ్రి సిద్ధూని రెస్ట్ తీసుకోమని చెప్పేవాడు. సిద్ధూ మళ్లీ మంచం ఎక్కేసేవాడు. హాయిగా గుర్రు పెట్టేవాడు.

సిద్ధూ-1983లో క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. వెస్ట్ ఇండియాతో టెస్టు మ్యాచ్‌తో అతను శుభారంభం చేశాడు. క్రీజ్‌లో ఎంతోసేపు ఉన్నాడు కానీ, రన్స్ మాత్రం పెద్దగా ఏమీ చేయలేకపోయాడు. తర్వాత టెస్ట్ మ్యాచ్‌లో కూడా అతని వ్యవహారం ఏమీ మారలేదు. తన మూడో ఇన్నింగ్స్‌లో మొత్తం 114 నిమిషాల సేపు క్రీజ్‌లో ఉండి, ఎంత సాధించాడో ఊహించండి... 20 రన్‌లు.

ఇక విమర్శకుల నోటికి అడ్డూ అదుపూ ఏముంటుంది. పత్రికలన్నీ సిద్ధూపైన సూటి బాణాలు వేయసాగాయి. రాజన్ బాలా ఒక ప్రసిద్ధి చెందిన క్రికెట్ విమర్శకుడు. అప్పుడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో సిద్ధూ గురించి 'స్ట్రోక్‌లెస్ వండర్' అని ఘాటుగా విమర్శించాడు.

ఆ పదునైన పదజాలం రెండు చోట్ల పనిచేసింది. ఒకటి క్రికెట్ సెలక్టర్స్ పైనా, రెండు సిద్ధూ మనసుపైన.

క్రికెట్ సెలక్టర్స్ సిద్ధూని ఇంటికి పంపారు. ఆ రెండు టెస్టుల్లో మాత్రమే సిద్ధూ



ఆడింది. ఇక నువ్వు రంజీ ట్రోఫీలు, యూనివర్సిటీ లెవల్ మ్యాచ్‌లు ఆడుకో అని టాటా చెప్పారు.

అటు సిద్ధూ వాళ్ల ఇంట్లో, వాళ్ల నాన్నగారు సిద్ధూ దగ్గరకు వచ్చి, పరుపు మీద రాజన్ బాలా రాసిన ఆర్టికల్ ఉన్న పేపర్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పెట్టి, మారు మాట్లాడకుండా ఆ గదిని వదిలి వెళ్లిపోయారు.

సిద్ధూ గుండె జారిపోయింది. జీవితం మీద విరక్తి పుట్టింది. రాజన్ బాలా రాసిన ఆర్టికల్ చదివాడు. ఇంకోసారి తీక్షణంగా 'స్ట్రోక్‌లెస్ వండర్' అన్న హెడ్డింగ్‌ని చూశాడు. శూన్యంలో నుంచి ఏదో సందేశం వచ్చినట్లు ఉంది. ఊగిపోయాడు, వెంటనే కత్తెర తెప్పించి, ఆ ఆర్టికల్‌ని న్యూస్‌పేపర్ నుంచి వేరు చేశాడు. తన రూమ్‌లో అల్మారాకి ఆ పేపర్ కటింగ్‌ని అంటించుకున్నాడు. రూమ్‌లోని ఏ మూల నుంచి చూసినా అది స్పష్టంగా కనిపిస్తుంది. రూమ్‌లో నడు స్తున్నా, పడుకున్నా, కూర్చున్నా, నిలుచున్నా ఆ సందేశం సిద్ధూని కలవరపెడుతూనే ఉంది. ఏదో చేయాలని ప్రబోధిస్తూనే ఉంది.

కొన్ని కొన్నిసార్లు మనం పైకి ఎదగటానికి మన మీద వచ్చే విమర్శలు దోహదపడతాయి. సరైన విమర్శ మన ఉన్నతికి తోడ్పడుతుందని ఎప్పుడూ గ్రహించండి. విమర్శను పాజిటివ్‌గా తీసుకొని, తమలోని లోటుపాట్లు సరి చేసుకునే వాళ్లు ఖచ్చితంగా జీవితంలో అభివృద్ధి పథాన నడుస్తారు.

స్వాభావికంగా, భారతీయులు అందునా, ఆంధ్రులు సరైన విమర్శ (పాజిటివ్ ఫీడ్ బ్యాక్) ఇవ్వనూ లేరూ, (ఎవరైనా చేస్తే) తీసుకోనూలేరు. మనం ఆ పద్ధతి కొంత

మార్చుకోవాలి. విమర్శ వల్ల మన ఫుల్ పొటెన్షియల్ వరకూ ఎదగగలిగే ఛాన్స్ ఉంటుంది. మనల్ని విమర్శించే వాళ్ల మీద ఛాలెంజ్ చేసి, పందెం కట్టి ఆ విమర్శించే వాళ్ల నోళ్లు మూయించడానికి, వాళ్లు తప్పు అని నిరూపించేందుకు మనం అహర్నిశలు కృషి చేస్తాం. మన సిద్ధూ విషయంలో కూడా అదే జరిగింది. సిద్ధూ ముఖ్య ఉద్దేశం రాజన్ బాలా తప్పు అని నిరూపించాలి అని అదే తనకు శూన్యంలో నుంచి వచ్చిన సందేశం.

మరి ఎలా నిరూపించాలి? ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి పరువు నష్టం దావా వేయడం కాదు. అలా చేస్తే సిద్ధూ ego satisfy అయ్యేది, కానీ తనకు జరిగిన నిజమైన నష్టం? భారత క్రికెట్ జట్టులో శాశ్వత స్థానం మాటేమిటి?

తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మార్చేయాలనుకున్నాడు సిద్ధూ. తన తండ్రి, తన దేశం గర్వించే గొప్ప క్రికెటర్ అవ్వాలని నిశ్చయించుకున్నాడు. 'స్ట్రోక్‌లెస్ వండర్' అన్న ముద్రని చెరిపి వేయించుకోవాలనుకున్నాడు. భారతదేశంలో అందరికంటే ఎక్కువ ఫోర్లు, ఎక్కువ సిక్స్‌లు కొట్టాలని ఆ నాడే నిర్ణయించుకున్నాడు. మనసులో బలంగా ఆ కోరిక నాటుకుపోయింది సిద్ధూకి.

ఇక సిద్ధూని వాళ్ల నాన్న పొద్దున 5 గంటలకు నిద్ర లేపనవసరం లేదు. వాళ్ల నాన్న 5 గంటలకు సిద్ధూ రూమ్‌కి వచ్చే సరికే సిద్ధూ నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తూ కనపడతాడు. అప్పటికే కొంత జాగింగ్ కూడా అయిపోయి ఉంటుంది. సిద్ధూ సిక్స్‌లు కొట్టడం ప్రాక్టీస్ చేయడం మొదలుపెట్టాడు. గ్రౌండ్ చుట్టూ బంతిని కనపడనీయకుండా బంతులను చీల్చి చండాడేవాడు. ఒక అటాకింగ్ స్ట్రోక్ ఆటగాడు అవ్వాలని సిద్ధూ పడిన శ్రమ అంతా ఇంతా కాదు. తన టార్గెట్ ఏమిటో తెలుసా? రోజుకి 300 సిక్స్‌లు కొట్టాలి. 300 సిక్స్‌లు. ప్రతీ రోజూ ఎన్ని బంతులు గ్రౌండ్ చుట్టూ కనపడకుండా పోయాయో ఊహించుకోండి.

ఇప్పుడు కూడా సిద్ధూ లంచాలు ఇచ్చేవాడు. కానీ తన పనివాళ్లకు కాదు. తనకు బౌలింగ్ చేసే కుర్రాళ్లకు ముఖ్యంగా 300 సిక్స్‌లు పూర్తికాకపోతే ఆ పూట ప్రాక్టీస్ వదిలేవాడు కాదు. సూర్యుడు విశ్రమించడానికి అస్తమించినా, ఆ నాటి టార్గెట్ గనుక పూర్తి కాక పోతే మన వాడు విశ్రమించేవాడు కాదు. ఎన్నో రోజులు రాత్రి 10 గంటల వరకు కూడా ప్రాక్టీస్ కొనసాగేది. ప్రతీ రోజూ తను తొడిగిన గ్లౌజులు తడిసి ముద్దయ్యేవి. ప్రతిసారి చెమటవల్ల, కొన్నిసార్లు రక్తంవల్ల కూడా...

ఇలా కొన్ని వారాలు ప్రాక్టీస్ ఎవరైనా చేస్తారు. మనసులో బలంగా అనుకున్నారు కాబట్టి కొంత మంది పట్టు వదలని విక్రమార్కుడిలా కొన్ని నెలలు ప్రతీ రోజూ కష్టపడగలరు. కానీ కేవలం సిద్ధూ మాత్రమే తను అనుకున్నది సాధించేందుకు, ప్రతీరోజూ 300 సిక్స్‌లు, నాలుగు సంవత్సరాలు కొట్టగలడు. ఒకసారి ఊహించండి. ఎన్ని లక్షల సిక్స్‌లు కొట్టి ఉం టాడో. నెలకు 30 రోజులు. సంవత్సరానికి 12 నెలలు. అలా నాలుగు సం వత్సరాలు. రోజుకి 300 సిక్స్‌లు. ఇంత కఠోర శ్రమ చేయగలిగిన వాడిని విజయం వరించకుండా ఉంటుందా?

సిద్ధూని 1987 వరల్డ్ కప్‌లో ఆడమని ఆహ్వానం వచ్చింది. వచ్చిన అవకాశాన్ని ఇప్పుడు సిద్ధూ చేజార్చుకోదలచుకోలేదు. అప్పుడు భయంకరమైన ఫామ్‌లో ఉన్న ఆస్ట్రేలియా జట్టుతోటి మొదటి మ్యాచ్‌లో సిద్ధూ 73 పరుగులు చేశాడు. అందులో 5

సిక్స్‌లు, 4 ఫోర్లు. తన మొదటి నాలుగు మ్యాచ్‌ల్లో ప్రతి దానిలో అర్థ సెంచరీ తప్పక సాధించాడు. అది కూడా Strike Rate 90 పైనే ఉండేలా చూసుకున్నాడు.

ఇక పేపర్లలో సిద్ధూ గురించి వచ్చిన పొగడ్తలను ఊహిం చుకోవచ్చు. తను అల్మారాకి అంటించుకున్న పేపర్ కటింగ్ 'స్ట్రోక్‌లెస్ వండర్' అన్నది గడచిపోయిన చరిత్ర. తన సంకల్పబలంతో తన మీద ఉన్న నెపాన్ని చెరిపే శాడు. మళ్లీ రాజన్ బాలా – సిద్ధూ గురించి "Palm tree hitter" (తాడిచెట్లను గురి చూసి కొట్టేవాడు) అని ఇంకో వ్యాసం రాశాడు.

తరువాత సిద్ధూ వెనుతిరిగి చూడలేదు. ఇండియాకి సిద్ధూ – 137 వన్‌డే మ్యాచ్‌లు ఆడి 4,400 పైన రన్స్ సాధించాడు. అవును కరక్టే. అందులో లెక్కలేనన్ని సిక్స్‌లు ఉన్నాయి. టెస్ట్‌లు కూడా 51 మ్యాచ్‌లు ఆడి 3,200 రన్స్‌కు పైగా సాధించాడు. అందులో కూడా ఎన్నో సిక్స్‌లు, ఫోర్లు ఉన్నాయని వేరే చెప్పనవసరం లేదు కదా. అదీ సిద్ధూ సక్సెస్ స్టోరీ. ఇక నుంచి మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే మీకు రెండు ఆప్షన్స్ ఉన్నాయి. విమర్శకు కృంగిపోయి, బాధపడిపోయి, ఇక నా వల్ల కాదులే అని మన గోల్‌ని వదిలేస్తూ ఈ ప్రపంచం నాకు అన్యాయం చేసిందని నసుగుతూ మన ఫెయిల్యూర్‌కి కారణాలు వెతుక్కుంటూ, మనం బాగా పనిచేశామని మనల్ని మనం సమర్థించుకోవడం మొద టిది.

ఇక రెండవ ఆప్షన్ విమర్శని సరైన రీతిలో ఫేస్ చేయడం (ఎదుర్కోవడం) మన తప్పులు స్వీకరించి, వాటిని సరిదిద్దుకోవడం ఎలాగో నేర్చుకుని, విజయ పథాన నడవడానికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక వేసుకుని, ఆ ప్రణాళిక ప్రకారం కఠోరశ్రమ చేయడం.

మన సిద్ధూ రెండవ ఆప్షన్ ఎంచుకున్నాడు. రాజన్ బాలా ఊహించి ఉండడు. తన విమర్శ భారతదేశానికి ఒక చక్కటి స్ట్రోక్ ఆటగాడిని పుట్టిస్తుందని తన విమర్శ కొన్ని లక్షల గంటల ప్రాక్టీస్‌కి దారితీస్తుందని, ఈ రోజు సిద్ధూ అందరికీ తెలుసు. అతను ఒక కొత్త చరిత్ర సృష్టించిన మహానుభావుడు గుర్తుంచుకోండి. 300ల సిక్స్‌లు ప్రతిరోజూ, అందులో తన చెమట, రక్తంతో పాటు ఒక కృతనిశ్చయం ఉంది. మనం కూడా సిద్ధూ జీవితం నుంచి ఒక పాఠం నేడు నేర్చు కుందాం. మనని విమర్శించే వాళ్లు, బహుశా మన అభివృద్ధికి దోహ దం చేస్తు న్నారు. మీరు విమర్శను వినదల్చుకోనప్పుడు సిద్ధూని గుర్తుకు తెచ్చు కోండి. తన అల్మారాకు పేపర్ కటింగ్‌ని అంటించిన విషయం గుర్తుకు తెచ్చుకోండి. విమర్శను, పొగడ్తగా మార్చుకోవడానికి తను చేసిన కృషిని గుర్తుకు తెచ్చుకోండి. ఖచ్చితంగా మీకు కూడా మనం అనుకున్నది సాధించాలన్న తపన పుడుతుంది.

# 4

# సదా శ్రమించే సైనికులకే సక్సెస్ సాధ్యం

## హైలెట్స్

- ఏదైనా సాధించి చూపించాలనుకున్న వారు మొండి పట్టుదలతో ఉంటారు. 'మొండి వాడు రాజుకన్నా బలవంతుడు'. మొండి పట్టుదలతో అనుకున్నది సాధించి వారు విజేతలవుతారు.
- ఒక వ్యక్తి తను చేసే పనిని పూర్తిగా శ్రద్ధాశక్తులతో చేస్తే, తన శ్రమని అనుభవిస్తే ఎన్నో అద్భుతాలు జరుగుతాయి.
- దవడ పగిలినా సరే గడ్డం పైకెత్తి నమ్మిన సిద్ధాంతానికి న్యాయం చేయాలని నేర్పిన కుంబ్లే నిజమైన హీరో.
- కష్టపడే వారినే లోకం ఇష్టపతుంఉది. వారినే ప్రపంచం పదే పదే పొగుడుతుంది. మనం కూడా అలుపెరగని సైనికులవుదాం. సదా శ్రమిద్దాం... సక్సెస్ సాధిద్దాం.

సక్సెస్ సాధించాలంటే ఎల్లప్పుడూ శ్రమించడానికి సిద్ధంగా ఉండాలి. ఎప్పుడూ శ్రమిస్తూనే ఉండాలి. వైఫల్యాలు ఎదురైనప్పుడు మనల్ని మనం సమర్థించుకోవడానికి కారణాలు వెతకడం వల్ల ప్రయోజనం ఉండదు. నా బలం సరిపోవడం లేదు, నేను చిన్నవాణ్ణి, పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల నేను సరిగ్గా కష్టపడలేకపోతున్నాను అంటూ తమకి తాము సర్ది చెప్పేసుకునే వారికి 'సక్సెస్' అనేది అందని ద్రాక్ష పండులా



తయారవుతుంది.

'మని' సినిమాలోని ఒక పాటలోని కొన్ని లైన్లు మీకు గుర్తు చేయాలనుకుంటున్నాను. 'మనకన్నా చిన్నవాళ్లు మంజ్రేకర్, టెండూల్కర్‌లు, లేరా మనకు ఎగ్జాంపుల్. తూటాలా ఫాస్టు బాలు చూస్తేనే గుండె గుభేలు... మన సత్తా సో సింపులు... సో... సింపులు... మన సత్తా సింపుల్ అని తప్పించుకోవడం కూడా సింపులే. కానీ, ఏదైనా సాధించి చూపించాలనుకున్న వారు మొండి పట్టుదలతో ఉంటారు. 'మొండివాడు రాజు కన్నా బలవంతుడు' అన్న ఒక సామెత మనకుంది కదా... అలా మొండి పట్టుదలతో అనుకున్నది సాధించేవారు విజేతలవుతారు.

అనీల్ కుంబ్లే మొండి పట్టుదలతో అనుకున్నది సాధించేవాళ్లల్లో మొదటి పంక్తిలో నిలుస్తాడు. 1970 అక్టోబర్ 17న జన్మించిన కుంబ్లే భారతదేశం గర్వించదగ్గ క్రికెటర్. తను చేసిన ప్రతీ పనినీ (పని కూడా) అనుభవించిన వ్యక్తి.

ఒక వ్యక్తి తను చేసే పనిని పూర్తిగా శ్రద్ధాశక్తులతో చేస్తే, తన శ్రమని అనుభవిస్తే ఎన్నో అద్భుతాలు జరుగుతాయని అనిల్ కుంబ్లే క్రీడా జీవితాన్ని చూస్తే అర్థమవుతుంది.

ఈ మధ్య టీవీలో ఒక యాడ్ వస్తుంది. స్మార్ట్ క్లాసెస్ గురించి. చిన్న పిల్లలకు చక్కగా అర్థమయ్యేలా బోధించడం గూర్చిన విషయం, ఆ యాడ్ సారాంశం అందులో ఒక పాప అనిల్ కుంబ్లే (క్రికెటర్)ని ప్రశ్నలు అడుగుతూ తన మొదటి వికెట్ ఎవరిది? అని కుంబ్లే సమాధానం ఇస్తాడు. 294వ వికెట్ ఎవరిది? 324వ వికెట్ ఎవరిది అని ఆ పాప అడుగుతుంటే - కుంబ్లే తడుముకోకుండా జవాబు చెబుతాడు. అప్పుడు ఆ పాప

అడుతుంది “మీకు అన్నీ ఎలా గుర్తుంటాయ’ని. అప్పుడు కుంబ్లే ఇలా అంటాడు. ‘నేను తీసుకున్న ప్రతీ వికెట్‌ని నేను అనుభవించాను’ అందుకే నాకు అన్నీ గుర్తుంటాయి. అని. యాడ్‌ని పక్కకి పెటిట అనిల్ కుంబ్లే ఏమన్నాడో (మళ్లీ) ఇంకొకసారి గమనించండి. తను తీసిన ప్రతీ వికెట్ తను అనుభవించాడంట. అనీల్ కుంబ్లే క్రికెట్‌లో నిజ జీవితం కూడా ఎంతో ఆదర్శవంతంగా బతికాడు. అందుకే గొప్ప వాడయ్యాడు. అతని రైట్ ఆర్మ్ లెగ్ స్పిన్నింగ్ మాయాజాలం అతనికి ఎన్నో వికెట్లు సంపాదించిపెట్టింది. ఎన్ని వికెట్లు అంటే ప్రపంచంలో అత్యధికంగా టెస్టు వికెట్లు తీసిన బౌలర్లలో కుంబ్లే మూడవ వాడు. 600 ఆపైన టెస్టు వికెట్లు తీయడం సామాన్యమైన విషయం కాదు. ఒకే ఇన్నింగ్స్‌లో 10కి 10 వికెట్లు తీసిన ఘనత జిమ్‌లేకర్ (1956లో ఆసిస్ టెస్టులో లేకర్ 10కి 10 వికెట్లు తీశాడు) తర్వాత ఆ ఘనత మన కుంబ్లేకే దక్కుతుంది. 1999, ఫిబ్రవరిలో పాకిస్థాన్‌తో టెస్టు మ్యాచ్‌లో ఈ అద్భుతం జరిగిన సందర్భంగా, బెంగళూరులోని ఒక ట్రాఫిక్ సర్కిల్‌కి, ఒక వీధికి అనిల్ కుంబ్లే పేరు పెట్టారు. ఎంతటి ఘనతో ఊహించండి.

కుంబ్లే భారత టెస్టు జట్టుకి కెప్టెన్సీ పగ్గాలు కూడా చేపట్టి, ఒక సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా కూడా నిరూపించకున్నాడు. అతను టెస్టు క్రికెట్‌కి గుడ్‌బై చెప్పి రిటైర్ అవుతుంటే యావత్ భారతదేశం ఆయనకు నిలుచుని స్టాండింగ్ అవేషన్ ఇస్తున్నట్లు ఉందని ఎందరో క్రికెట్ కాంమెంటేటర్స్ అన్నారు. ఒక ధీమంతుడైన సైనికుడు తన కర్తవ్యాన్ని ముగించి, తిరిగి వస్తుంటే అతణ్ణి చూసి సెల్యూట్ చేయాలనిపించినట్లు, కుంబ్లే తన రిటైర్మెంట్ ప్రకటించినప్పుడు, మైదానం నుండి తిరిగి వస్తున్నప్పుడు ప్రేక్షకులకు అలాంటి భావోద్వేగం కలిగింది.

కుంబ్లే క్రికెట్‌లోకి అడుగుపెట్టినప్పుడు ఒక పప్పుసుద్దలా కనిపించేవాడు. అందరూ అతనిని చూసి ఈ సీరియస్‌గా ఉండే కళ్లజోడు పెట్టుకునే మెకానికల్ ఇంజినీర్, క్రికెట్ మైదానంలో ఏమి చేయాలని వచ్చాడబ్బా... అని ఆశ్చర్యపోయేవారంట. అప్పటి భారత జట్టులో మిగతా వారంతా చూడడానికి ఎంతో కృతనిశ్చయంతో, కలుపుగోలుతనంతో, బాగా చురుకుగా కనిపించేవారు. కానీ కుంబ్లే మాత్రం కామ్‌గా, మౌనంగా ఉండేవాడు. బయటకు కనపడటం ఎలా ఉన్నా, లోపల మాత్రం ఎంతో కాంపిటీటివ్ ఎప్పుడూ నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండేవాడు. ఆరు నూరైనా గెలిచి తీరాలి అనే స్పిరిట్‌తో ఉండేవాడు కుంబ్లే.

రిటైర్‌మెంట్ తర్వాత కుంబ్లేని టీవీ చానల్స్, పత్రికలు ఎన్నో పొగడ్తలతో ముంచెత్తాయి. 18 ఏళ్ల క్రికెట్ జీవితంలో ఎన్నో గొప్ప గొప్ప సందర్భాలు, ఎన్నో హైలైట్స్ ఉండి ఉంటాయి. వాటన్నింటినీ గుర్తుకు తెచ్చుకుని సంబరపడటానికి.

అన్నింటిలోకి కుంబ్లేకి సంతృప్తినిచ్చిన, పాత కాలం నేటి క్రికెట్ ప్రేమికులకు నచ్చిన సందర్భమేమిటో ఊహించండి?

619వ టెస్టు వికెట్ తీసినప్పటి సందర్భమా? కుంబ్లే తన కెరీర్‌లో సంతృప్తిపడేది దేనికి? అలుపెరుగక 40,000లకు పైగా బంతులు టెస్టు మ్యాచ్‌లలో వేసినందుకా? ఒకే ఇన్నింగ్స్‌లో 5 అంతకంటే ఎక్కువ వికెట్లు 35 సార్లు తీసినందుకా? పాకిస్థాన్‌తో 1999, ఫిబ్రవరిలో 10కి 10 వికెట్లు తీసినందుకా? తన కెప్టెన్సీలోనే టెస్టు సెంచరీ చేసినందుకా?




(షేర్ వార్న్‌కి కూడా ఈ ఘనత దక్కలేదు... విశ్వప్రయత్నం చేసినప్పటికీ...) బెంగళూరులో ట్రాఫిక్ సర్కిల్‌కి తన పేరు పెట్టినందుకా? ఇవేవీ కావు...

అనిల్ కుంబ్లే తన కెరీర్‌లో బాగా గుర్తుకు తెచ్చుకునే సందర్భం 2002, మేలో జరిగింది. వేదిక సర్ వివియన్ రిచర్డ్స్ స్టేడియం (అప్పటి పేరు సెయింట్ జాన్స్ స్టేడియం), ఆంటిగ్యూయా. సందర్భం: ఇండియా, వెస్టిండీస్‌ల మధ్య నాల్గవ టెస్టు మ్యాచ్.

ఆ మ్యాచ్‌లో ఐదుగురు ఆటగాళ్లు సెంచరీలు చేశారు. కానీ, ఆ మ్యాచ్‌లో ప్రత్యేకత అనిల్ కుంబ్లే బౌలింగ్. అది కూడా విరిగిన దవడకు ఎముకకు కట్టు కట్టుకొని వచ్చి బౌలింగ్ చేయడం.

ఆ మ్యాచ్‌లో ఇండియా మొదటి బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కుంబ్లే వంతు బ్యాటింగ్ వచ్చింది. అప్పుడు మార్వ్ ఢిల్లోన్ వేసిన బంతి విసురుగా వచ్చి కుంబ్లే ముఖానికి తాకింది. ఎంత బలంగా తాకిందో ఊహించడానికి, ఆ బంతి కుంబ్లేని తాకినప్పుడు వచ్చిన భయంకరమైన శబ్దం చాలు. కుంబ్లే ఉమ్మి వేయబోతే రక్తం ఉమ్మి రూపంలో వచ్చింది. కుంబ్లే తమాయించుకుని మరి నాలుగు ఓవర్లు బ్యాటింగ్ చేశాడు. కుంబ్లని హాస్పిటల్‌కి తీసుకువెళ్లి ఎక్స్-రే తీయిస్తే, తన దవడ ఎముక విరిగిందని తేలింది. కుంబ్లే ఇక ఈ మ్యాచ్‌కి, మిగతా మ్యాచ్‌లకు దూరమవాలని, వెంటనే అతనికి మంచి వైద్యం కోసం ఇండియా పంపించాలని నిర్ణయించడం జరిగింది. తర్వాత రోజు కుంబ్లేకి టికెట్ కూడా రిజర్వు చేశారు.

ఇండియా 500 పరుగులపైన చేసి, తన మొదటి ఇన్నింగ్స్‌ని డిక్లేర్ చేసింది.

వెస్టిండీస్ బ్యాటింగ్ మొదలుపెట్టి మంచి గౌరవ ప్రథమైన స్కోర్ చేసిన భారత్, తన స్టార్ స్పిన్నర్‌ని మాత్రం మిస్ అవుతుంది. 45 ఓవర్ల తరువాత వెస్టిండీస్ 2 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. బ్రయిన్ లారా ఇంకా క్రీజ్‌లోనే ఉన్నాడు. అప్పుడు ఒక వింత జరిగింది. కుంబ్లే తను బౌలింగ్ చేస్తానని పట్టుబట్టి మైదానంలోకి అడుగు పెట్టాడు. ఒక విరిగిన దవడ... దవడ నుండి గడ్డం వరకూ పూర్తిగా బాండేజీ... వీటన్నిటినీ మించి భరించలేని నొప్పి... అయినా సరే... కుంబ్లే వరుసగా 14 ఓవర్లు బౌలింగ్ చేశాడు. బ్రయిన్ లారాని అవుట్ చేశాడు.

వీవ్ రిచర్డ్స్ అంతటి మహానుభావుడు ఈ సంఘటనను గురించి క్రికెట్ ఇతిహాసంలో అత్యంత సాహసవంతమైన చర్య ఏదైనా ఉంటే అది ఆంటిగ్వాయా టెస్టులో కుంబ్లే చేసిన బౌలింగ్ అని చెప్పాడు. ఇలాంటి అభిప్రాలే సునీల్ గవాస్కర్ మొదలైన ప్రముఖులు వెల్లడించారు. కానీ కుంబ్లే ఏమన్నాడో తెలుసా.. "ఇప్పుడు నేను ఇంటికి హాయిగా వెళ్లవచ్చు... నేను నా శక్తివంచన లేకుండా ప్రయత్నించానని నా మనసుకి సర్దిచెప్పుకోవచు" అని అన్నాడు కుంబ్లే.

భారత జట్టు కోసం ఆడేవాళ్లలో, జట్టు విజయం కోసం 100 శాతం రక్తాన్ని ధారపోసే వాళ్లలో, టీమ్ స్పిరిట్ అనే అంకిత భావంతో ఆడేవాళ్లలో కుంబ్లే ఎప్పుడూ ముందుంటాడు.

కుంబ్లేని హీరో చేసింది– అతను ఎన్ని ఎక్కువ వికెట్లు పడగొట్టాడన్న విషయం కాదు. జట్టుకు ఎన్ని పరుగులు చేసి పెట్టాడన్న విషయం అంతకన్నా కాదు. జట్టు కోసం ప్రాణాలకు తెగించి, ఆడటం అన్న విషయం. తన వెసులుబాటు చూసుకోకుండా దేశంలో కోట్లాది మంది అభిమానులు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జట్టు విజయం కోసం అహర్నిశలు శ్రమించే తత్త్వం.

అందుకే నేను కుంబ్లేని ఆదర్శంగా జీవించాడు అని అన్నాను. కొన్నిసార్లు మన రియల్ వర్త్ (నిజమైన విలువ) మన విజయాలు పతాకస్థాయిలో ఉన్నప్పుడు కాక, మనం పరాజయాలలో కూరుకుపోయి ఉన్నప్పుడు తెలుస్తుంది. ఊహించండి. కుంబ్లేని ఆ టెస్టు సిరీస్‌లో మొదటి మూడు టెస్టులు ఆడనివ్వలేదు. నాల్గవ టెస్టులో మొదటి బంతి వేసే లోపే తనకు దవడ పగిలింది. తర్వాతి రోజు ఇండియా రావడానికి ప్రయాణం సిద్ధమైంది. అతను పెవిలియన్‌లో ఉండిపోవచ్చు. తనను ముందు మ్యాచ్‌లకు ఎంపిక చేయనందుకు కెప్టెన్‌ని, సెలెక్టర్‌ని తిట్టిపోయవచ్చు. భరించలేని నొప్పి ఉందని డ్రెస్సింగ్ రూమ్‌లో పడుకోవచ్చు. కానీ అలా చేయలేదు. తన 100 శాతాన్ని జట్టుకు ఇచ్చాడు. తన మాటలని మళ్లీ గుర్తుకు తెచ్చుకోండి. "నా శక్తివంచన లేకుండా ప్రయత్నించానని నా మనసుకు సర్ది చెప్పుకోవచ్చు".

కుంబ్లే కేరక్టర్‌ని అతను రిటైర్ అయినప్పుడు కూడా చూడవచ్చు. కుంబ్లే రిటైర్‌మెంట్ ప్రకటన ఊహించని ఒక సర్‌ప్రైజ్. అప్పటికే అతను ఎంత ఎత్తు ఎదిగిపోయాడంటే తనని బాగా ఆడటం లేదని ఎవరూ కామెంట్ చేయడానికి సాహసించలేదు. కుంబ్లే ఒకే ఒక్కడు. అతని లాంటి వారు ఇకలేరు. మరి రారు. అయినా తను కోట్లాది భారతీయ అభిమానులు కోరుకుంటునట్లు ఆడలేకపోతున్నానేమోనన్న ఊహతో రిటైర్‌మెంట్ ప్రకటించాడు. 2007

వరల్డ్ కప్‌లో భారతదేశానికి కప్పు సాధించి పెట్టలేకపోయానన్న బాధతో వెస్టిండీస్ నుండి తిరిగి భారత్ రాగానే (2007 వరల్డ్ కప్ మ్యాచ్‌కి వెస్టిండీస్ వేదిక) వన్డే మ్యాచ్‌కి రిటైర్‌మెంట్ ప్రకటించాడు. ఇక తను ఎంతగానో ప్రేమించిన టెస్టు క్రికెట్‌కి 2008, నవంబర్ 2న గుడ్‌బై చెప్పాడు.

ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ జరుగుతున్న సమయంలోనే మూడవ టెస్టు నాల్గవ రోజు క్రికెట్ నుండి రిటైర్ అవాలని నిర్ణయించినట్లు ప్రకటించాడు. వంద శాతం ఫిట్‌గా లేనందున జట్టుకు తగినంత న్యాయం చేకూర్చలేనని ప్రకటించి ఒకే ఇన్నింగ్స్‌లో పదికి పది వికెట్లను తీసిన ఫిరోజ్‌షా కోట్లా (ఢిల్లీ) మైదానాన్నే తన విరమణ వేదికగా చేసుకున్నాడు. ఆస్ట్రేలియా టెస్ట్ సిరీస్‌లో మొదటి రెండు టెస్టులను గూర్చిన విషయం ఇది. తను క్రికెట్ కెరీర్ మొత్తంలో మొదటిసారిగా వరుసగా నాలుగు ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్‌ను కూడా పడగొట్టలేక పోవడం కుంబ్లని ఆలోచింపజేసింది. మూడవ టెస్టులో తన ఎడమ చేతి చిటికెన వేలుకి గాయమైంది. అతను ఆ గాయంతో ఉండి నాల్గవ టెస్టుకి న్యాయం చేయలేను అనుకున్నాడు. ఇక అనుకున్నదే తడవుగా మూడవ టెస్టులో ఇంకో రోజు ఆట మిగిలి ఉండగానే రిటైర్‌మెంట్ ప్రకటించాడు. జట్టు ఉన్నతిని కోరుకున్నాడు కాబట్టి తను కఠోర నిర్ణయం తీసుకోవలసి వచ్చింది.

అనిల్ కుంబ్లే నుండి మనం ఎంతో నేర్చుకోవచ్చు. కుంబ్లే చూపిన నాయకత్వ నైపుణ్యం మహాద్భుతమైన వ్యక్తిత్వం. క్రికెట్ ఆటగాళ్లకే కాక, సామాన్య ప్రజలకు కూడా ఆదర్శప్రాయమే. కుంబ్లే కనబరచిన పోరాట పటిమ యువతను ఎంతగానో ప్రేరేపిస్తుంది. దవడ పగిలినా సరే గడ్డం పైకెత్తి నమ్మిన సిద్ధాంతానికి న్యాయం చేయాలని నేర్పిన కుంబ్లే నిజమైన హీరో.

స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశం ఈ సందర్భంలో ఒక్కసారి గుర్తు చేయాలనుకుంటున్నాను. Arise, Awake and stop not till the goal is reached. లేవండి? మేల్కొనండి లక్ష్యం సాధించే వరకూ విశ్రమించకండి.

వివేకానందుడి ప్రబోధం, అనిల్ కుంబ్లే స్ఫూర్తి మనమెప్పుడూ మరచిపోవద్దు. వారి అడుగుజాడల్లో నడిచి మనం కూడా సక్సెస్ సాధిద్దాం. అలా జరగాలంటే మనం ఎక్కువ శ్రమించాలి. ఒక్క విషయం గుర్తుంచుకోండి. సక్సెస్ సాధించి తీరాలని పట్టుబట్టేవారు శ్రమించడాన్ని అమితంగా ప్రేమిస్తారు. అయ్యో! నేను బాగా కష్టపడిపోతున్నానే అంటూ తమ మీద తాము జాలి చూపించుకోరు. చుట్టుపక్కల వారి సానుభూతి కోరుకోరు. నిరంతరం శ్రమిస్తూనే ఉంటారు. వారి శ్రమకి ఏనాటికైనా ఖచ్చితంగా గుర్తింపు లభిస్తుంది. కష్టేఫలి అన్నారు పెద్దలు. అలా కష్టపడే వారినే లోకం ఇష్టపడుతుంది. వారినే ప్రపంచం పదే పదే పొగుడుతుంది. మనము కూడా అలుపెరుగని సైనికులమవుదాం. సదా శ్రమిద్దాం... సక్సెస్ సాధిద్దాం.

# 5

# శక్తి వంచనలేకుండా శ్రమిస్తే ప్రపంచం సలాం చేస్తుంది

**హైలెట్స్**

- **మనం ఎన్నుకున్న లక్ష్యాన్ని మనం నెరవేర్చడానికి 100 శాతం కష్టపడితే చాలు... పది మంది పొగుడుతారు.**
- **'మై ఖేలుంగా' ఆ రెండు పదాలు ఉచ్ఛరించినప్పుడు భారత క్రికెట్‌కి ఒక కొత్త సైనికుడు ఉద్భవించాడు. ఒక గొప్ప సంకల్పబలం గల వీరుడు భారత క్రికెట్ జట్టుకు దొరికాడు.**
- **గాయం అయింది ముక్కుకి కానీ, తన ధైర్యానికి కాదు. తన ఆత్మ విశ్వాసానికి కాదు.**
- **గొప్ప వాళ్లు కావాలంటే కేవలం ప్రతిభ ఉంటే సరిపోదు. సరైన దృక్పథం కూడా కావాలి. మనోధైర్యం టన్నులు టన్నులుగా ఉండాలి. ప్రతికూల పరిస్థితులను ఎదిరించి పోరాడగలగాలి.**

చరిత్ర పుటల్లో మన పేరు శాశ్వతంగా నిలిచిపోవాలని ఆశించిన వారు ఎవరుంటారు చెప్పండి? సమాజం మనల్ని గుర్తించాలనుకోండి... మనం దానధర్మాలు చేయనవసరం లేదు. మనకి ఉన్నదంతా ఊడ్చిపెట్టి దవీనజన సేవ చేయనవసరం లేదు. మన పని మనం సజావుగా చేస్తే చాలు. లోకం మెచ్చుకుంటుంది. మనం ఎన్నుకున్న లక్ష్యాన్ని మనం నెరవేర్చడానికి 100 శాతం కష్టపడితే చాలు. పది మంది పొగుడుతారు.



1973, ఏప్రిల్ 24న బొంబాయిలోని చాంద్రా ప్రాంతంలోని ఒక ఇంట్లో ఓ మగ పిల్లవాడు జన్మించాడు. తల్లి రజని, తండ్రి రమేష్ టెండూల్కర్ అప్పుడు ఎంతో సంబరపడిపోయారు. అయితే ఆ పిల్లాడు ఆటలు ముగించి ఇంటికి వచ్చేలోపు మిగతా పిల్లల పెద్దవాళ్లు చేరి పేచీలు పెడుతుండేవారు. పెద్దయిన తరువాత ఇతను ఏమైపోతాడా అనుకుంటూ మదన పడిపోతుండేవాళ్లు రజని, రమేష్‌లు.

పుత్రోత్సాహం అనుభవించాలనుకున్న వారికి నిరాశే ఎదురైంది. ఆ పిల్లాడి అల్లరి మానిపించేందుకే, ఇతరులతో గొడవ పడే నైజాన్ని మార్పించేందుకు స్కూలు అయిపోయి ఇంటికి వచ్చిన తరువాత ఏదో ఒక ఆటలో చేర్పించాలని తల్లిదండ్రులు నిశ్చయించారు. 1984లో (ఏ ఏళ్ల అప్పుడే) క్రికెట్ అకాడమిలో చేర్చించారు. ఆ నిర్ణయమే వారి పుత్రోత్సాహానికి కారణం కాగలదని వారు అప్పుడు ఊహించి ఉండరు. సుమతీ శతకంలో బద్దెన చెప్పినట్లు –

పుత్రోత్సాహంబు తండ్రికి
పుత్రుడు జనియించినపుడు కలగదు జనులా
పుత్రుని కనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందర సుమతీ...

కొడుకు పుట్టినప్పుడు కాదు, ఆ కొడుకు నలుగురితో భేష్ అనిపించుకున్నప్పుడే తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందట. రమేష్ టెండూల్కర్‌కి ఆ ఆనందం సచిన్ వల్ల కలిగింది. అవును ఆ కొడుకే సచిన్.

క్రికెట్ అనే క్రీడ బతికి బట్టకట్టినంత కాలం యావత్ ప్రపంచం మొదట స్మరణకు వచ్చే ఆటగాడు సచిన్ టెండూల్కర్. ఒక వ్యక్తి తన క్రీడా జీవితంలో 34,000 పైచిలుకు పరుగులు సాధించడం నిజంగా ఆశ్చర్యమే. నూరు సెంచరీలు చేయడం ఇంక ఎవరవ వల్ల కూడా సాధ్యం కాదేమో. ఆరు వరల్డ్ కప్‌లలో పాల్గొని, అలుపెరుగక పోరాడే సచిన్ ప్రతి ఒక్కరికీ ప్రేరణ ఇస్తాడు.

సచిన్ టెండూల్కర్ గురించి వెక్కువ చెప్పవసరం లేదు. భారతదేశ ప్రధాని ఎవరో రోడ్డు మీద ఆడుకునే పిల్లలకు తెలియకపోవచ్చు కానీ, సచిన్ టెండూల్కర్ ఎవరనేది మాత్రం ప్రతీ ఒక్కరికీ తెలుసు. భారతదేశంలోనేకాక, ప్రపంచ క్రికెట్ క్రీడా చరిత్రలో తనకంటూ ఒక విశిష్ట స్థానాన్ని సచిన్ సంపాదించుకున్నారు. భారత జట్టుకు ఆపద్బాంధవుడిలా ఎన్నో విజయాలను అందజేసిన ఈయనని పొగడని వారు లేరనే చెప్పాలి. 37 ఏళ్ల వయసులో కూడా ఇప్పటికీ జట్టు విజయాలకై శాయశక్తులా ప్రయత్నిస్తూ వెన్నెముకలా నిలబడగలవాడు సచిన్, అతను అవుట్ అయితే వెంటనే టీవీలు కట్టేసిన సందర్భాలు, స్టేడియం నుంచి ప్రేక్షకులు వెళ్లిన సందర్భాలు కోకొల్లలు.

టెస్టు రికార్డులు చూసినా, వన్‌డే రికార్డులు చూసినా అతని పేరే కనిపిస్తుంది. లెక్కకు మించిన రికార్డులు అతని సొంతం. 2010, ఫిబ్రవరి 24న దక్షిణాఫ్రికాతో జరిగిన ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్‌లో సచిన్ 200 పరుగులు సాధించి కొత్త రికార్డు సృష్టించాడు. యావత్ భారతదేశం హర్షాతిరేకాలతో ఉర్రూతలూగింది. అంతకుముందు జరిగిన 2961 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఏ ఒక్కరూ కూడా 200 పరుగులు సాధించ లేకపోయారు. లెక్క పెట్టాలంటే సచిన్ పేరు మీద ఎన్ని రికార్డులు ఉన్నాయి? కొన్ని వందలు... అన్ని రికార్డుల గురించి మనం చర్చించలేం కానీ, సచిన్‌ని గురించి సిద్ధూ చెప్పిన కథను గురించి తెలుసుకుందాం. ఈ కథను సిద్ధూ ఎన్నో సందర్భాలలో చెప్పి "మీరు ఈనాడు ప్రపంచం గర్వించదగ్గ క్రికెటర్‌ను చూస్తున్నారు. కానీ, నేను తనని, తన గొప్ప వాడు అవుతాడని తను క్రికెట్‌లోకి అడుగుపెట్టిన మొదటి రోజుల్లోనే గుర్తించాను" అంటాడు.

ఈ కథ చిన్నదే కానీ సచిన్ ఎలా అంతటి గొప్ప వాడయ్యాడో, అందుకు కావలసినది ఏమిటో చెబుతుంది. భావితరాలలో క్రికెట్‌ను శాసించగల సత్తా గల ధీరునిగా సచిన్ ఎదగడానికి చిన్నతనంలోని సచిన్ నడవడిక ఎలా ఉండేదో తెలుసు కోవాలి. క్రికెట్‌లో అడుగుపెట్టిన మొదటి రోజుల్లో తన పోరాటపటిమ ఎలా ఉండేదో గమనించడానికి 1989, డిసెంబర్‌లో జరిగిన ఈ సంఘటన దోహపడుతుంది.

మనందరికీ తెలుసు. సచిన్ క్రికెట్‌కు నూనూగు మీసాల నూతన యవ్వనంలో అడుగుపెట్టాడని పట్టుమని పదహారేళ్లు దాటకుండానే, పులుల లాంటి పాకిస్థానీయులను సచిన్ ఎదుర్కొన్నాడు. అది డిసెంబర్ 1989. పాకిస్థాన్‌లోని సియాల్‌కోట్ ఇండియా–పాకిస్థాన్ టెస్టు సిరీస్‌లోని నాల్గవ టెస్టు మ్యాచ్ జరుగుతుంది. సచిన్ కెరీర్‌లో కూడా అది నాల్గవ టెస్టు.

అప్పటికే సచిన్ సంచలనాలు చేసి భారత జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. అప్పటికే ఎంతో మంది భారత జట్టులో యువకులు చేరి మెరుపులు మెరిపించి



నిలదొక్కుకోలేక, ఇంటి ముఖం పడుతున్నారు. సచిన్ మాత్రం భారత జట్టులో స్థానం పదిలం చేసుకోవాలనుకున్నాడు. వచ్చిన అవకాశమేదీ సచిన్ వదలదల్చుకోలేదు. తను ఎంతో టాలెంట్ ఉన్న వాడినని బ్యాట్ పట్టుకుని, క్రీజ్‌లోకి వచ్చిన ప్రతీసారి చూపించాడు.

అంతకుముందు జరిగిన మూడు టెస్టు సిరీస్‌లలో 0-0 దగ్గర సమమైయింది. నాల్గవ టెస్టులో రెండు జట్లు తమ తమ మొదటి ఇన్నింగ్స్ ఆడాయి. భారత్ ఎంతో కష్టపడి పాకిస్థాన్ కన్నా 65 పరుగులు ఎక్కువ చేసి, నాల్గవ టెస్టు మీద, ఆ సిరీస్ మీద ఆశలు పెట్టుకుంది. పాకిస్థాన్ మాత్రం ఊరుకుంటుందా? రెండవ ఇన్నింగ్స్‌లో బౌలింగ్‌లో భారత్‌కి చుక్కలు చూపించాలని నిర్ణయించుకుంది. అనుకున్నట్లుగానే వకార్ యూనస్, వసీం అక్రం భారత్ బ్యాట్స్‌మన్‌ల మీద విరుచుకుపడ్డారు. భయంకరమైన బౌన్సర్‌లతో భారత్ ఆటగాళ్లను ఒక్కొక్కరిగా పెవిలియన్ దారి పట్టిస్తున్నారు. 65 పరుగుల లీడ్‌తో ఉన్న భారత జట్టు, సడన్‌గా (రెండో ఇన్నింగ్స్‌లో) 38 పరుగులు చేసి నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. భారత జట్టులో ఆటగాళ్ల ఆత్మ విశ్వాసంపై దెబ్బ పడసాగింది. మెల్లిమెల్లిగా భారత జట్టు చేతి నుంచి విజయం జారిపోసాగింది. టెస్టు మ్యాచ్ మాత్రమే కాదు సిరీస్ కూడా కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అప్పుడు సిద్ధాని క్రీజ్‌లో కలుసుకోవడానికి, భారత పరువు నిలబెట్టడానికి సచిన్ మైదానంలోకి దిగాడు. అప్పటికి సంజయ్ మంజ్రేకర్, క్రిస్ శ్రీకాంత్, మహమ్మద్ అజారుద్దీన్, రవిశాస్త్రి లాంటి దిగ్గజాలు పాకిస్థాన్ అటాకింగ్ బౌలింగ్ తట్టుకోలేక చేతులెత్తేశారు. మరి ఈ పసికూన పాకిస్థాన్ ఫాస్ట్ బౌలింగ్‌ని తట్టుకోగలడా?

తట్టుకోలేదు. తట్టుకోలేక పోయాడు కూడా. వకార్ యూనస్ విసిరిన బౌన్సర్ సచిన్‌ని లాగి ఒకటి ఇచ్చినట్లు తన ముక్కుకు తగిలింది. పాపం సచిన్... ముక్కు పచ్చలారని బుడతడు. ముక్కు అదిరిపోయింది... దిమ్మతిరిగిపోయింది... తేరుకుని చూస్తే ముక్కు నుండి బడబడా రక్తం కారుతుంది. తను వేసుకున్న షర్ట్ మొత్తం రక్తం వల్ల తడిచి ఎంత రక్తం కారిందో చూపెడుతుంది. టీవీలలో చూస్తున్న వారికి సైతం జాలిని కలిగిస్తుంది ఆ దృశ్యం.

అసలు ఆ క్రూరత్వం ఏమిటి? అందరిలో అదే ప్రశ్న. జాలి... కోపం... ముందు బీసీసీఐని తప్పుపట్టాలి. అసలు 16 సంవత్సరాలు నిండిన బాలలను క్రికెట్ అంటూ, బలి చేయడం ఏమిటి? పిల్లలు క్రికెట్‌కు దూరంగా ఉండాలని ఒక శాసనం చేయాలని అంతా ఊగిపోయారు.

ఇండియన్ టీమ్ నుండి డాక్టర్ పరుగెత్తి క్రీజ్ వైపు వస్తున్నాడు... సచిన్‌కి ఫస్ట్ ఎయిడ్ చేయడానికి, పాకిస్థాన్ ఫీల్డర్స్ సచిన్‌ని చూడటానికని చుట్టుముట్టసాగారు. సిద్ధూకి ఇప్పటికీ తను సచిన్ దగ్గరకు ఎలా వెళ్లాడో గుర్తు... బాగా గుర్తు... డాక్టర్ ఫస్ట్ ఎయిడ్ చేస్తూ, ఆ రక్తం కారే ముక్కుకు ఏదో అడ్డం పెడుతున్నప్పుడు సిద్ధూ – సచిన్‌తో “నీవు రిటైర్ హర్ట్ అవ్వు. జట్టులో ఆడటానికి తర్వాత రావచ్చు” అని అన్నాడు. ఆ టైమ్‌లో తను కొంచెం కుదుటపడి, ముక్కు నుండి రక్తం కారడం ఆగిపోతుందని సిద్ధూ అలా చెప్పాడు. సచిన్ మొదట ఏమీ మాట్లాడలేదు. “వెళ్లు. బ్రేక్ తీసుకో” అని మళ్లీ సిద్ధూ అన్నాడు. ఎంతో ఉజ్వలమైన భవిష్యత్ అంధకారంలో పడిపోతుందని సిద్ధూ ఆవేదన... “రా! నాతో పాటు వచ్చేయ్... డ్రస్సింగ్ రూంలో నీకు పూర్తి మెడికల్ ట్రీట్‌మెంట్ ఇస్తాను” అని డాక్టర్ సచిన్‌తో అన్నాడు.

సచిన్ తన చేతులను వద్దు అన్నట్లు తిప్పి, డాక్టర్‌ని, సిద్ధూని వారించాడు. “మే ఖేలుంగా” ఇది సచిన్ చెప్పిన మాట. “నేను ఆడతాను” అని దాని అర్థం. అలా చెప్పి సచిన్ ముక్కు నుండి రక్తం కారుతుండగానే తన స్టంప్స్ వైపు నడవడం మొదలు పెట్టాడు. ఆ రెండు పదాలు – ఉచ్చరించినప్పుడు సిద్ధూ చెప్పినట్లు భారత క్రికెట్‌కి ఒక కొత్త సైనికుడు ఉద్భవించాడు. ఒక గొప్ప సంకల్ప బలం గల వీరుడు భారత క్రికెట్ జట్టుకు దొరికాడు. ఆ రెండు పదాల వల్ల.. సచిన్ డ్రస్సింగ్ రూమ్‌లోకి వెళ్లి హాయిగా రెస్టు తీసుకోవచ్చు. కానీ అలా తను చేయలేదు. “మే ఖేలుంగా” అన్న పోరాట పటిమ తనని అలా చేయనివ్వలేదు. ఎంతో మంది క్రికెట్ ప్రేక్షకులకు చాలా ఈజీగా అర్థమయ్యేలా ఒక విషయం (సచిన్ విశ్రాంతి తీసుకునే విషయం) సచిన్ హృదయానికి, మనసుకు అర్థమవలేదు. గాయం అయింది ముక్కుకి కానీ, తన ధైర్యానికి కాదు. తన కాన్ఫిడెన్స్‌కి కాదు... అందుకే సచిన్ బ్యాటింగ్ చేయదలచుకున్నాడు. పాకిస్థాన్ పేస్ అటాక్ కొనసాగుతుంది. ముక్కు నుండి రక్తధార కూడా కొనసాగుతుంది. రక్తం గ్లౌజుల మీద, షర్ట్ మీద, ముఖం మీద కారి కారి, ఇంక ఎక్కడ కారాలో అర్థంకాక ఆగిపోయింది. పాకిస్థాన్ బౌలింగ్ సచిన్ బ్యాటింగ్‌కి సలాం చేసినట్లయింది. బ్యాటింగ్ అనేకంటే సచిన్ కనబర్చిన మొక్కవోని ధైర్యానికంటే బాగుంటుందేమో. సచిన్ క్రీజ్‌కు పాతుకుపోయి, ఏకంగా 57 పరుగులు సాధించాడు. సిద్ధూతో కలిసి చేసిన 101 పరుగుల భాగస్వామ్యం భారత జట్టు ఆ మ్యాచ్‌లో సాధించిన

విజయానికి దోహదపడింది. ఆ మ్యాచ్‌ని గెలిపించింది. "నేను ఆడతాను" (మై ఖేలుంగా) అన్న స్పిరిట్. ఆ స్పిరిట్ కేవలం మ్యాచ్‌ని మాత్రమే గెలవలేదు. ఎన్నో కోట్ల భారతీయుల హృదయాలను గెలిచింది.

ఇప్పటికీ సిద్ధూ ఆశ్చర్యపడతాడు. జుత్తు కూడా సరిగ్గా దువ్వుకోని, అమాయకంగా కనిపించే ఒక పదహారేళ్ల బుడతడు. నువ్వు రెస్టు తీసుకోమని చెప్తే, లేదు నేను ఆడతానని ముందుకొచ్చి దేశాన్ని క్రికెట్ మత్తులో నింపేశాడు.

గొప్ప వాళ్లు అవాలంటే కేవలం టాలెంట్ ఉంటే సరిపోదు. ఆటిట్యూడ్ కూడా సరైనది అయి ఉండాలి. మనోధైర్యం టన్నులు టన్నులుగా ఉండాలి. ప్రతికూలమైన పరిస్థితులను ఎదిరించి పోరాడగలగాలి. ఒక్కమాటలో చెప్పాలంటే "మై ఖేలుంగా" స్పిరిట్ ఉండాలి. ఆ స్పిరిట్ వ్యక్తి గత కంఫర్ట్‌ని పక్కన పెట్టి, టీమ్ స్పిరిట్‌కి పెద్ద పీట వేస్తుంది. ముందు నా టీమ్, ఆ తర్వాతే నేను అన్న భావనను ఈ స్పిరిట్ చెప్పకనే చెబుతుంది.

మనకు జీవితంలో ఎన్నో సందర్భాలు ఎదురవుతాయి. కొన్నిసార్లు మన మీద ఎంతో ప్రెసర్ బుల్డ్ అయి ఉంటుంది. ఆ ఒత్తిడిలో ఇంక నేను చేయలేను. నా వల్లకాదు అని గట్టిగా అరిచి, వదిలేయాలనిపిస్తుంది. అప్పుడు సచిన్‌ని గుర్తుకు తెచ్చుకోండి. 1989, డిసెంబర్‌లో పాకిస్థాన్‌లోని సియాల్‌కోట్‌లో జరిగిన సంఘటనను స్మరణకు తెచ్చుకోంది. "మై ఖేలుంగా" (నేను ఆడతాను) అన్న స్పిరిట్‌ని తలచుకోండి.

ఈ రెండు దశాబ్దాలలో సచిన్ ఎన్నో మ్యాచ్‌లు ఆడాడు. ఎన్నో రికార్డులు స్థాపించాడు. మనని ఎంతో ఎంటర్‌టైన్ చేశాడు. మనం కూడా సచిన్ సాధిస్తుంటే సంబరపడ్డాం. ఎప్పుడైనా మనం అనుకున్నట్లు ఆడలేకపోతే తిట్టిపోశాము. వెంటనే రిటైర్ అవ్వాలనుకున్నాం. కానీ సచిన్ మన క్రికెట్‌ని నిలబెట్టాడు. భారతీయుల క్రికెట్ ఒక గౌరవ ప్రదమైన స్థాయిలో ఉండేటట్లు సచిన్ శాయశక్తులా ప్రయత్నించాడు. భారతీయులు గర్వపడేలా, మన విజయ బావుటాని ఎన్నో దేశాల్లో ఎన్నోసార్లు ఎగురవేశారు.

సచిన్ ఎన్ని అవార్డులు, రివార్డులు, రికార్డులు సాధించినా, తన అత్యంత గొప్పదైన కంట్రిబ్యూషన్ మాత్రం నిలబడి, పోరాడే తత్వం భారతీయులందరికీ నేర్పించడం.. ఎప్పుడూ కూడా 'నా పని అయిపోయింది – నేను వదిలేస్తున్నాను' ఇంతకంటే నేను చేయలేను" అని సచిన్ అనలేదు. మనల్ని కూడా అలా అనవద్దు అని చెబుతున్నాడు. నేను ఎన్నో మైలురాళ్లు దాటాను. అయినా సరే... ఇంకా ఓపిక ఉన్నంత వరకూ భారత్ తరఫున ఆడుతూనే ఉంటాను. కాదు పోరాడుతూనే ఉంటాను అంటాడు సచిన్. మనందరం కూడా సచిన్ నుండి పోరాడేతత్వం నేర్చుకుందాం.

ఏ లక్ష్యమైనా నెరవేరాలంటే దానిని గురించి శక్తివంచన లేకుండా కృషి చేయాలి. పగలనక, రాత్రనక కష్టపడాలి. లక్ష్యం సాధించాలంటే ఎటూ కష్టపడాలి కనుక, ఆ కష్టపడేది 100కి 100 శాతం కష్టపడదాం. మనశక్తినంతా ధారపోసి పోరాడదాం. అప్పుడు ఫలితాలు మనకి అనుకూలంగా వస్తాయి. ప్రపంచం మనల్ని పదే పదే పొగుడుతుంది.

# 6

# పట్టుదలకు మారు పేరు మార్వన్ ఆటపట్టు

**హైలెట్స్**

- అనుకున్నది సాధించాలంటే పట్టుదలగా ఉండటం అనివార్యం. పట్టుదల, కార్యదీక్షతో చేసిన ఏ పని కూడా నెరవేరకుండా ఉండదు.
- మనం మన శక్తిని, ఓర్పుని, మన బలహీనతలని సరిగ్గా అంచనా వేయలేక మన ఓటమిని సమర్థించుకుంటాం.
- ఒక జాతీయ జట్టుకు కెప్టెన్ అయిన ఆటగాడు, కొన్నివేల పరుగులు సాధించి అందరినీ మెప్పించిన ఆటగాడు, తన క్రీడా జీవితంలో రెండవ పరుగు సాధించడానికి ఆరేళ్లు పట్టింది.... ఆరేళ్లు.
- నవ్విన నాపచేనే పండుతుందన్న చందంగా అతనిని గేలిచేసిన వారంతా అతన్ని వేనోళ్ల పొగడక తప్పలేదు.

**"పట్టుబట్టరాదు, పట్టి విడవరాదు**
**పట్టెనేని బిగియఁ బట్టవలయు**
**పట్టు విడుట కన్న, బరగ జచ్చుట మేలు**
**విశ్వదాభిరామ వినురవేమ"**

అని మనం చిన్నప్పుడు వేమన శతకం చదువుకున్నాం. దీని అర్థమేమిటంటే - ఏ పనినైనా మొదలుపెడితే, చివరివరకు పట్టుదలతో చేయాలి. పట్టువదలడం కంటే ప్రాణం



విడవడం మేలు. ఆటపట్టు ఈ పద్య చదివాడో లేదో కానీ, (ఎలా చదువుతాడు, శ్రీలంకలో పుట్టిన ఆటపట్టుకి తెలుగు తెలిసి ఉండకపోవచ్చు), దాని అర్థం మాత్రం పూర్తిగా ఒంటబట్టిచ్చుకున్నాడు.

అనుకున్నది సాధించాలంటే పట్టుదలగా ఉండటం Compulsory పట్టుదల, నిష్ఠ ఉంటే ఎప్పుడూ మనం ఓటమి చూడము. పట్టుదల, కార్యదీక్ష, నిష్ఠ – ఎప్పుడూ మంచిదే. మన జీవితంలో, మన career లో, మన ఆటలో… పట్టుదల, కార్యదీక్షలతో చేసిన ఏ పని కూడా నెరవేరకుండా ఉండదు.

విన్స్టన్ చర్చిల్ ఒకసారి ఒక పాఠశాలను సందర్శించిన సందర్భంగా, అక్కడి పిల్లలు అతనిని మీ Success వెనకాల రహస్యం ఏమిటని అడిగారు. అప్పుడు విన్స్టన్ చర్చిల్ – కేవలం ఏడు పదాలు… (seven words) అని చెప్పి కొంత విరామం తర్వాత – "never give up. Never, never give up" అని అన్నాడు. Give up అన్న పదానికి dictionary లో అనేక అర్థాలు ఉన్నాయి. అవి – నిరాశపడు, పరిత్యజించు, పరిత్యాగం చేయు, మానుకొను, లొంగిపోవు, లొంగు, వదిలిపెట్టు… వీటిలో ఏదైనా అర్థం ప్రతిక్షేపించి, చర్చిల్ చెప్పాలనుకున్నది మళ్లీ ఇంకోసారి చదవండి. అతని విజయ రహస్యం తెలిసిపోతుంది. బహుశా మన విజయ మంత్రం కూడా అదే అవ్వాలమో… చాలాసార్లు, చాలాచాలాసార్లు – మనం ఎంతో కష్టపడి (hard work చేసి) విజయానికి అతి చేరువలో ఉన్నప్పుడు ఇంక కష్టపడలేమని వదిలిస్తుంటాము. బాధ ఏమిటంటే – కొన్ని కొన్నిసార్లు మనం విజయానికి కేవలం ఒక్క మెట్టు మాత్రమే దూరంలో ఉంటాం. ఒకే ఒక్క మెట్టు…

తెలిసినా వదిలివేయాల్సి వస్తుంది.

ఎందుకంటే – మనకు అప్పుడు మరో ప్రత్యామ్నాయం (వేరే దారి) ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఛీ! ఇప్పటి వరకూ ఎంతో శ్రమించాను. ఆ శ్రమ ఏదో ఇంకో దానిలో పెడితే, నేను ఎప్పుడో విజేతనయ్యే వాణ్ణి. అనవసరంగా ఇందులో ఇరుక్కున్నాను... అని అనిపిస్తుంది. correct గా అలాంటప్పుడే మనకు పెద్ద వాళ్లు చెప్పిన సామెత గుర్తుకు తెచ్చుకోండి. – “దూరపు కొండలు నునుపు” అని. మనం మన శక్తిని, ఓర్పుని, మన వీక్‌నెస్‌ని సరిగ్గా అంచనా వేయలేక, మన ఓటమిని సమర్థించుకుంటాం.

గృహస్థితి బాగోలేదు, వాస్తు కలిసి రాలేదు, కుజుడు నెత్తిమీద కూర్చున్నాడు, శని పట్టుకుంది, టైం బాగోలేదు మొదలైన పదాలు మన ఓటమిని సమర్థించడానికి వెంటనే పుట్టుకొస్తాయి...

అందుకే ఇప్పుడు నేను మార్వన్ ఆటపట్టు గురించి చెప్పదలుచుకున్నాను. పేరులోనే ‘పట్టు’ ఉండటం మూలానో ఏమో, మనవాడు పట్టు పట్టాడంటే సాధించే వరకూ వదిలేవాడు కాదు. అతను శ్రీలంక జట్టులో ప్రవేశించేప్పుడు అతని వయసు 20. అతి కష్టం మీద అక్కడ నిలదొక్కుకుని, తర్వాత ఆ జట్టుకే కెప్టెన్సీ పగ్గాలు చేపట్టాడు. తర్వాత Indian Cricket League లో ఆడి – Delhi gaints team కి captain కూడా అయ్యాడు. ఇప్పుడు సింగపూర్ cricket team కి కోచ్‌గా వ్యవహరిస్తూ, ఎందరో మన్ననలు పొందుతున్నాడు.

Technically correct batsmen అని అందరూ పొగిడే ఆటపట్టుని గూర్చిన ఒక కథని హర్షా బోగ్లే (అంతా ఇష్టపడే cricket commentator) ఎప్పుడూ చెప్పి యువ ఆటగాళ్ల మనోధైర్యాన్ని పెంచుతుంటాడు. ఆ కథనే ఇప్పుడు మీకు చెబుతున్నాను.

ఆటపట్టు November 1990 లో test లోకి అడుగుపెట్టాడు. తనని batting చేయమని పంపితే firstinnings లో duck out (సున్నా పరుగులు చేసి) అయ్యి pavilion (పెవిలియన్) తిరిగివచ్చాడు. సరే మొదటి ఇన్నింగ్స్‌లో అయ్యిందేదో అయిపోయింది. రెండో ఇన్నింగ్స్‌లో ఏమన్నా పరిస్థితి మెరుగుపడిందా అంటే ఏమీ లేదు. రెండో ఇన్నింగ్స్‌లో కూడా duck out అయ్యాడు ఆటపట్టు.

ఇంక శ్రీలంక క్రికెట్ జట్టు తర్వాతి మ్యాచ్‌లకు అతనిని తీసుకోలేదు. ఇంకా ప్రాక్టీస్ చేసి రమ్మని ఇంటికి పంపారు. ఎన్నో ప్రాక్టీస్ టెస్ట్‌లు, ఎన్నో రన్‌లు, ఎంతో కఠోరశ్రమ, వీటన్నింటికీ తోడు ఎంతో ఆశతో ఎన్నో రోజులు ఎదురు చూపులు.. శ్రీలంక జట్టు నుంచి పిలుపు కోసం. రోజులు, వారాలు, నెలలు గడిచిపోతున్నాయి. చివరకు 21 నెలల తరువాత శ్రీలంక జట్టు మేనేజ్‌మెంట్‌కి కనికరం కలిగి, ఆటపట్టుని ఆడమని పిలిపించారు.

ఆటపట్టుకు రెండవ అవకాశం వచ్చింది. ఈసారి ఆటపట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మరోసారి duck out అయ్యాడు. రెండవ ఇన్నింగ్స్‌లో మాత్రం తన పరుగుల ఖాతా తెరిచాడు. ఎన్ని పరుగులు సాధించాడో తెలుసా... ఒక్క పరుగు. ఒక్కటంటే ఒక్క పరుగు చేసి ఔటయ్యాడు.

శ్రీలంక జట్టులో మళ్లీ స్థానం కోల్పోయాడు. ఇంకా ఇంకా ప్రాక్టీస్ చేయాలని



సందేశం. నిరుత్సాహం పూర్తిగా నిండిన ఆటపట్టు ఇంటికి వచ్చి మిగతా first-class cricket లో ఆడటం మొదలుపెట్టాడు. ఎన్నో మ్యాచ్‌లు ఆడాడు. కొన్ని వేల పరుగులు చేశాడు. కానీ, తన ముందు శ్రీలంక జట్టుకు ఆడినప్పుడు, తను అనుకున్నది సాధించలేనప్పుడు మనసుకు తగిలిన గాయాలు మాత్రం మానడం లేదు. మళ్లీ తను శ్రీలంక జట్టులో స్థానం సంపాదించి, ఆ గాయాలకు మందు పూయాలని నిశ్చయించుకున్నాడు. ఈసారి శ్రీలంక జట్టు సెలక్టర్‌లకు ఆటపట్టు మీద కనికరం కలగడానికి పదిహేడు నెలలు పట్టింది. ఆటపట్టుకు జట్టులో స్థానం వచ్చింది.

మళ్లీ బ్యాటింగ్ అవకాశం వచ్చింది. తను ఒక పెద్ద స్కోర్ చేద్దామని క్రీజ్‌లోకి అడుగుపెట్టాడు. మొదటి ఇన్నింగ్స్‌లో కనీసం వంద పరుగులు అయినా చేద్దామని అనుకున్నాడు. మళ్లీ విధి ఆటపట్టును ఆటపట్టించింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఇంకొకసారి duck out అయ్యాడు. రెండవ ఇన్నింగ్స్‌లో కూడా అయ్యో... duck out.

కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఆటపట్టు మళ్లీ ఇంటి ముఖం పట్టాడు. ఈసారి మాత్రం ఆటపట్టు మనసులో ఎన్నో ఆలోచనలు. మళ్లీ నేను శ్రీలంక జట్టులో ఆడగలనా? మళ్లీ నన్ను సెలక్టర్స్ ఎంపిక చేస్తారా? ఇంకొక ఛాన్స్ వస్తుందా? పత్రికలు మాత్రం ఆటపట్టును దుమ్మెత్తిపోస్తున్నాయి. ఆటపట్టుకు పెద్ద పెద్ద మ్యాచ్‌లు ఆడే సత్తాలేదు. అతనికి సరైన technique (టెక్నిక్) రాదు. అతను క్రికెట్‌కు పనికిరాదు. ఇలాంటి ఎన్నో కామెంట్లు ఆటపట్టు విన్నాడు. భరించాడు.

ఆటపట్టు అలుపెరుగక ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఈసారి రోజులు, నెలలు కాదు,

సంవత్సరాల తరబడి ప్రాక్టీస్ చేస్తూనే ఉన్నాడు. ముచ్చటగా మూడేళ్ల తరువాత ఆటపట్టుకి మళ్లీ అవకాశం వచ్చింది. ఈసారి ఆటపట్టు బ్యాట్ పట్టుకుని వెళ్లి రన్స్ తోటి తిరిగివచ్చాడు. ఒక్కసారి కాదు. కొన్ని వందల సార్లు బ్యాట్ పట్టుకునే అవకాశం వచ్చింది. ఆటపట్టు కొన్ని వేల రన్‌లు శ్రీలంక జట్టు కోసం సాధించి పెట్టాడు. అందులో పదహారు సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు ఉన్నాయి.

మార్వన్ ఆటపట్టు ఆటతీరును మెచ్చుకోని వారు ఉండరు అంటే అతిశయోక్తి లేదు. అతని బ్యాటింగ్ సరళి టెక్నికల్‌గా కరెక్టయినదిగా గుర్తింపు పొందింది. నవ్విన నాపచేనే పండుతుందన్న చందంగా, అతనిని చూసి గేలిచేసిన వారంతా, అతన్ని వేనోళ్ల పొగడక తప్పలేదు. అతను క్రికెట్‌లో ఎంతగా పాతుకుపోయాదంటే – తర్వాతి రోజుల్లో శ్రీలంక జట్టు కెప్టెన్సీ పగ్గాలు ఆటపట్టు చేతిలోకి వచ్చాయి. కాదు వచ్చేంతలా ఆటపట్టు ఆట మీద పట్టు సాధించాడు. ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి... ఒక జాతీయ జట్టుకు కెప్టెన్ అయిన ఆటగాడు, కొన్ని వేల పరుగులు సాధించి అందరినీ మెప్పించిన ఆటగాడు, తన క్రీడా జీవితంలో రెండవ పరుగు సాధించడానికి ఆరేళ్లు పట్టింది. ఆరేళ్లు..

ఆరు సంవత్సరాలు తను పట్టిన పట్టు విడవకుండా తను అనుకున్నది సాధించిన ఆటపట్టు నిజంగా మహనీయుడు. మనలో ఎంత మంది ఆటపట్టులా ఓటమిని handle చేయగలం? నా దురదృష్టం... నా తలరాత ఇంతే అని ఆటపట్టు అనుకోలేదు. ఆరేళ్ల ప్రయత్నాలు, ఆరేళ్ల ఓటములు. అతను వేరే కెరీర్‌ని ఎంచుకోవచ్చు కదా... ఎన్నో అవకాశాలు అతనిని ఊరించాయి కూడా. కానీ, అతను పట్టువదలలేదు. అదే మనకి, మహనీయులకు తేడా... అలా పట్టువదలకపోవడం వల్ల మార్వన్ గొప్ప ఆటగాడయ్యాడు. మనం ఈ రోజు తన గురించి కథలు తెలుసుకుంటున్నాం.

భవిష్యత్‌లో ఎప్పుడైనా మీరు ఓటమి పాలవుతారని భయపడుతుంటే – ఒక్కసారి ఆటపట్టును గుర్తుకు తెచ్చుకోండి. అతను రెండవ పరుగు సాధించడానికి పడిన శ్రమను గుర్తుకు తెచ్చుకోండి. రెండవ పరుగు తీయడానికి ఆటపట్టుకు పట్టిన సమయాన్ని గుర్తుకు తెచ్చుకోండి. అందుకు తను వేచి ఉండటాన్ని ఊహించండి. ఎంతలా తపన పడి ఉంటాడో ఆలోచించండి...

ఇంకొకటి... విన్‌స్టన్ చర్చిల్ విజయసూత్రం కూడా గుర్తుకు తెచ్చుకోండి. ఏడు పదాలు – Never give up. Never Never give up. వదిలి పెట్టకుండా, పట్టు పట్టినట్లయితే, పరుగులు వాటంతట అవే వస్తాయి. ధైర్యం కోల్పోరాదు. పట్టు విడవరాదు.

# 7

# కష్టాల వారధి దాటిన వారికే సుఖాల సన్నిధి

**హైలెట్స్**

- మీ చిన్నప్పటి నుండి ఇప్పటి వరకూ జరిగిన మంచి సంఘటనలన్నీ మీరు గుర్తు చేసుకోండి. మనం మిగతా వారికంటే ఎంతో భాగ్యవంతులమని గుర్తించండి.
- మనం ఈదుతున్నది చెంచాడు భవసాగరాలు. దానికి చింతించడం ఎందుకు? ఒత్తిడి పెంచుకుని అనారోగ్యం కొని తెచ్చుకోవడమెందుకు?
- భయాన్ని అధిగమిస్తేనే విజయం ఉంది. వేరే రకంగా చెబితే ఒత్తిడిని జయిస్తే విజయం వరిస్తుంది.
- కష్టం తరువాత పొందే సుఖం ఒక అనిర్వచనీయమైన అనుభూతిని ఇస్తుంది.

మన నిజజీవితంలో ఎన్నో సందర్భాలలో మనం తీవ్రమైన ఒత్తిడికి గురవుతూ ఉంటాం. ఆ సమయంలో భూమి భారమంతా మనమీదే ఉన్నట్లు తెగ హడావుడి చేసేస్తాం. చికాకుపడటం, విసుక్కోవడం, బీపీ తెచ్చుకోవడం అన్నీ వెంటవెంటనే జరిగిపోతాయి. ఈ సందర్భంలోనే మీకు నేను మనకందరికి తెలిసిన 'ప్రేమికుడు' సినిమాలోని డైలాగ్ గుర్తుకు తెలవాలనుకుంటున్నాను. హీరో ప్రభుదేవాకు వాళ్ల నాన్న అన్నీ సందర్భాల్లో పనికి వచ్చే ఒక నియమం చెబుతాడు. అది మన నిజజీవితంలో కూడా ఎంతగానో పనికిస్తుంది.

అదేమిటంటే- "ఆనందమో, విచారమో, సంతోషమో, దుఃఖమో, కోపమో, శాంతమో" ఏ ఫీలింగ్ అయినా సరే, వెంటనే స్పందించవద్దు. ఐదు నిమిషాలు ఆగండి. ఆ ఐదు నిమిషాల తర్వాత కూడా మనకు అలాంటి ఫీలింగే ఉంటే మనం ఆ ఫీలింగ్‌ని వ్యక్తపరచవచ్చు. మనకు ఎదురయ్యే అనేకానేక సందర్భాల్లో మనం ఎమోషన్‌తో ఊగిపోతుంటాం. అలాంటప్పుడు ప్రేమికుడు సినిమాలోని ఈ చిన్న సందేశాన్ని గుర్తుకు తెచ్చుకోండి. విజేతలవ్వాలనుకునే వారందరం ఇంకో అడుగుముందుకేద్దాం. మన మైండ్ గురించి ఒక రహస్యం తెల్సుకుందాం.

మనం తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నప్పుడు మనకు ఏమి జరుగుతుంది? మన మైండ్ కొన్ని విషయాల మీద ఫోకస్ చేస్తుంది. అవి.. మన లోపాలు, మన అపజయాలు. అవునా? ఇంకోసారి గమనించండి... మనం ఒత్తిడిలో ఉంటే మన బుర్ర కూడా మన లోపాల గురించి, మనం ఎదుర్కొనబోయే అపజయాలను గురించి మాత్రమే ఆలోచిస్తుంది.

అందుకే ఒత్తిడికి లొంగకూడదు. ఒత్తిడిని పక్కన పెట్టేలా మన మైండ్‌కి మనం శిక్షణనివ్వాలి. దానిని గద్దించి, వేరే గాడిలో పెట్టాలి. ఒత్తిడిని ఎలా తట్టుకోవాలో మన మైండ్‌కి కూడా తెలుసు. దానిని అగడాలి. ఒత్తిడిని ఎలా అధిగమించాలో అప్పుడు మన మైండ్ మనకు ఒక పథకం చెబుతుంది.

ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. మన పల్లెల్లో కాలువలు (పంట కాల్వలు) ఉంటాయి. వాటిని దాటడానికి ఎక్కువగా తాటి మొద్దులు ఉపయోగిస్తారు. చాలామంది వాటిని చూసి ఉంటారు. తాటి మొద్దులు తెలియని వారు కనీసం సినిమాల్లో లాంచీలు ఎక్కడానికి ఉపయోగపడే చెక్క బల్లనైనా చూసుంటారు. (లేకపోతే గోదావరి సినిమా చూడండి.)

ఇప్పుడు మనం ఊహాలోకం లోకి వెళ్తాం... ఊహించండి... మనం తాటి మొద్దు మీదనో, చెక్కబల్ల మీదనో నడుస్తు న్నట్లు... అప్పటి మన మెంటల్ కండిషన్ ఎలా ఉంటుందో కూడా ఊహించండి... మనం కిందపడతామని మన మైండ్ ఎక్కువగా ఆలోచిస్తుంది. అవునా? కాదా? అలా ఎందుకు ఆలోచించాలి? మనం నేలమీద ఎలా నడుస్తామో అలాగే ఆ బల్ల మీద నడవవచ్చుకదా... ఎప్పుడైనా నేల మీద నడుస్తుంటే పక్కకు ఒరిగామా? మరి బల్ల మీద ఎందుకు ఒక పక్కకు ఒరిగిపోతాం? బల్లలో ఏమీ తేడా ఉండదు. స్థిరంగానే ఉంటుంది. ఇంతకు ముందు ఎన్నో వందల మంది ఆ బల్ల మీద నడిచారు. ఎవరూ పడలేదు. అయినా మనం మాత్రమే పడతామని ఎందుకు ఆలోచించాలి? ఎందుకంటే కింద ఉన్న నీళ్లు మన మీద ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ఆ ఒత్తిడిలో మన మైండ్ వివేకం కోల్పోయింది. మనని కలవరపెడుతుంది. మైండ్‌ని కంట్రోల్‌లో పెట్టి, ఒత్తిడిని తట్టు కునే కళని నేర్చుకోవాలి.

ఈ సందర్భంలోనే ఇర్ఫాన్ పఠాన్ నాకు గుర్తుకు వస్తు న్నాడు. కామన్వెల్త్ బ్యాంక్ సిరీస్-2008 మ్యాచ్‌లలో పఠాన్ వ్యక్తిత్వం తేటతెల్లమవు తుంది. ఆ మ్యాచ్‌లు ఆస్ట్రేలియాలో జరుగుతున్నాయి. ఇండియా, శ్రీలంక, ఆస్ట్రే లియా జట్ల మధ్యన పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా, ఆస్ట్రేలియా మధ్య పోటీ. అంతకుముందు మూడు జట్ల మధ్య జరిగ్ని గ్రూప్ మ్యాచ్‌లలో-ఆస్ట్రేలియా జరిగిన ప్రతీ మ్యాచ్‌లో నెగ్గింది.



చివరి మ్యాచ్‌లో (ఇండియా, ఆస్ట్రేలియా మధ్య ఫైనల్ మ్యాచ్‌లో) మొదటి బ్యాటింగ్ చేసిన ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 258 పరుగులు చేసి పతిష్ఠమైనస్థితిలో ఉంది. అప్పటికే ఆస్ట్రేలియా ప్రపంచకప్పు విజేత. క్రికెట్‌లో రారాజు. నెంబర్ వన్ టీమ్.

ఆస్ట్రేలియా బ్యాటింగ్ వంతు వచ్చేసరికి వాళ్లు మొద ట్లోనే చతికిలబడ్డారు. ఎనిమిది పరుగుల వద్ద రెండో వికెట్టు కోల్పోయిన ఆస్ట్రేలియా, మూడో వికెట్ కోల్పోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. 32 పరుగుల వద్ద మూడో వికెట్టు కోల్పోయిన ఆస్ట్రేలియా.. అపజయాన్ని ఎప్పుడు ఒప్పుకుంటుంది? మిడిల్ ఆర్డర్ విజృంభించి ఆడింది. ఎలా ఆడిందంటే విజయం భారత్ చేతి నుంచి లాక్కెళ్లి పోయేలా... ఒక్క ఓవర్ మిగిలింది. 13 పరుగులు కావాలి. ఆస్ట్రేలియా విజయానికి. రెండు వికెట్లు మిగిలాయి.

కెప్టెన్ ధోనీ, సీనియర్ ఆటగాళ్లందరూ–ఆలోచనలో పడ్డారు. మైదానంలో రెండునిమిషాల సేపు మాట్లాడుకున్నారు. చివరి ఓవర్ ఎవరిచేత బౌలింగ్ చేయించాలని... అంతకుముందు వరకు శ్రీకాంత్ దూకుడుగా ఆడి తొమ్మిది ఓవర్లలో రెండు వికెట్లు తీసి 43 పరుగులు ఇచ్చాడు. అతనికే చివరి ఓవర్ ఇద్దామని అందరూ డిసైడ్ చేశారు. ఒక్క కెప్టెన్ తప్ప. ధోనీ వేరేలా ఆలోచించి ఇర్ఫాన్‌కి బంతి క్యాచ్ వేశాడు.

ఇర్ఫాన్ ఒకింత ఆశ్చర్యపడ్డాడు. ఎందుకంటే ఆ కామన్వెల్త్ బ్యాంక్ సిరీస్‌లో ఇర్ఫాన్ ఆటతీరు అస్సలు బాగోలేదు. అతనిని ఎందుకు ఫైనల్ మ్యాచ్‌కి తీసుకున్నారో కూడా క్రికెట్ ప్రేక్షకులకు అర్థం కాలేదు. అసలు అతను బారత క్రికెట్ జట్టులోకే ఎలా వచ్చాడా? అన్న ప్రశ్నలు తలెత్తాయి. ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే అందరికంటే ఎక్కువ పరుగులు ఇచ్చిన బౌలర్ మనవాడే. ఆరు ఓవర్స్ మాత్రమే బౌలింగ్ చేసి 51 పరుగులు ఇచ్చాడు. ఇందులో ఒక్క వికెట్ కూడా తీసుకోలేదు.

ఇట్లాంటి బౌలర్‌కి చివరి ఓవర్ వేయమని ఏ కెప్టెన్ కూడా బంతిని ఇవ్వడు. అందునా, ఆ ఓవర్ కప్పు (ఫైనల్‌మ్యాచ్ కాబట్టి) తెస్తుందో లేదో తేలేటప్పుడు.

మీరు క్రికెట్ ఫాన్ అయితే, మీకు ఆ ఓవర్ గుర్తుండే ఉంటుంది. మొదటి బంతిని జేమ్స్ హాప్స్ ఎదుర్కొన్నాడు. అప్పటి వరకూ 60 పరుగులు చేసి ఆస్ట్రేలియాని విజయం

వైపుకు నడిపిస్తున్న జేమ్స్ మొదటి బంతిలో ఒక సింగిల్ తీశాడు. రెండవ బంతిలో ఇర్ఫాన్ తన మొదటి వికెట్ తీసుకున్నాడు. మూడవ బంతి తర్వాత ఆస్ట్రేలియా గెలుపు కోసం పదిరన్స్ చేయాలి. నాల్గవ బంతితో జేమ్స్ వికెట్ పడగొట్టాడు.

ఇర్ఫాన్... ఇలా చివరకి బారత జట్టు ఆ మ్యాచ్‌ని గెలిసింది. కప్పు కూడా గెలిసింది. కాదు ఇర్ఫాన్ గెలిపించాడు.

మ్యాచ్ అయిపోయిన తర్వాత ఇర్ఫాన్‌ని ఇంటర్వ్యూ చేసిన టీవీ రిపోర్టర్ ఇర్ఫాన్‌ని ఒత్తిడి ఎలా తట్టుకుని ఆ చివరి ఓవర్‌ని బౌల్ చేశాడని అడిగారు.

"మీరు చివరి ఓవర్ వేయాలని కెప్టెన్ మీకు బంతిని విసిరినప్పుడు మీ ఫీలింగ్ ఎలా ఉందో, అప్పుడు మీరు ఏమనుకున్నారో చెప్పండి... అప్పుడు మీ మనసు ఏమి ఆలోచించిందో చెప్పండి" అని అడిగాడు.

అప్పుడు ఇర్ఫాన్ ఠక్కున – నా బాల్య జీవితం గురించి ఆలోచించాను అని జవాబిచ్చాడు. అర్థంకాక, ఆ రిపోర్టర్ వివరించమన్నాడు. అప్పుడు ఇర్ఫాన్ తన బాల్యం గురించి చెప్పసాగాడు.

స్వాతంత్ర్యానికి కొన్ని నెలల ముందు ఇర్ఫాన్ పఠాన్ పూర్వీకులు పాకిస్థాన్ నుంచి వలస వచ్చారు. గుజరాత్‌లోని బరోడాలోని మసీదు – నాలుగువందల ఏళ్ల పూర్వం కట్టబడిన జామా మసీదులో మయిజీన్ (మ్యుయాజిన్)లా పనిచేయడానికి ఇర్ఫాన్ వాళ్ల తాతగారు కుదిరారు. మ్యుయాజిన్ అంటే – మసీదులో ఎప్పుడు నమాజు చదవాలో అందరి ముస్లిం సోదరులకు గొంతెత్తి అరచి చెప్పేవాడు. నమాజు రోజుకి ఐదుసార్లు చదువు తారుకదా.. మసీదు మీకు దగ్గరలో ఉంటే – తెల్లవారు జామున మీకు 'సోదరు లారా... తెల్లవారింది లేవండి – నమాజు చేసే టైమ్ అయింది. లెగవండి" అంటూ అరుపులు వినపడతాయి. ఆ ఉద్యోగం – ఇర్ఫాన్ తాతగారిది... అదే ఉద్యోగం ఇర్ఫాన్ తండ్రిగారిది కూడా. ఇర్ఫాన్ తండ్రి మెహబూబ్ ఖాన్ పదిహేనేళ్ల వయసు వచ్చేసరికి మసీదుని ఊడ్చి, తుడిచి దానిని శుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకున్నాడు.

జీవితం మొత్తం మసీదుని శుభ్రంగా ఉండేలా చూసుకునే మెహబూబ్ ఖాన్, వారి కుటుంబ పోషణ కోసం పక్కన ఉన్న రసాయనాల కర్మాగారంలో పనిచేసే వాడు. జీతం ఎంతో తెలుసా.. 500 రూపాయలు. 35 సంవత్సరాలు పని చేసిన తర్వాత జీతం ఎంత పెరిగిందంటే అది ఈ రోజుకి 5000 రూపాయలైంది. ఇంతటి జీతంతో కుటుంబాన్ని మొత్తాన్ని పోషిస్తున్నాడు మెహబూబ్ ఖాన్.

ఇర్ఫాన్‌కి ఒక సోదరుడు ఉన్నాడు. యూసఫ్ పఠాన్ అతను కూడా తరువాతి కాలంలో భారత జట్టు తరపున క్రికెట్ ఆడిన విషయం విదితమే.

ఇర్ఫాన్, యూసఫ్ ఇద్దరూ తమ పదేళ్ల వయస్సులో క్రికెట్ అంటే ఆసక్తి చూపెట్టడం మొదలుపెట్టారు. వారి తల్లిదండ్రులు వారి ఇష్టాన్ని ఎప్పుడూ కాదనలేదు. ఎప్పుడూ వారి మగపిల్లల్ని సమర్థించేవారు. పదేళ్ల వయసులో వీధిలో పిల్లలు క్రికెట్ ఆడటం చూసి ఇద్దరూ స్కూల్ నుంచి తిరిగి వస్తూ అక్కడే ఆగిపోయేవారు. నిరుపేద కుటుంబం అవడం మూలాన ఒక బ్యాట్, ఒక బాల్ ఇద్దరి పిల్లలకు కొనిపెట్టడానికి మెహబూబ్‌ఖాన్ కర్మాగారంలో అతని జీతం (750 రూపాయల నుంచి) 825 రూపాయలు వరకూ



పెంచేదాకా ఆగవలసి వచ్చింది.

బ్యాట్, బాల్ వచ్చిన వెంటనే ఇద్దరు పిల్లలు ఇక ఆగలేదు. పొద్దున, సాయంత్రం బ్యాట్, బాల్ పట్టుకునే పిల్లలు, బంతులు పక్కన ఇళ్లల్లో కొట్టి వారికి చికాకు తెప్పించే వారు. వారి గురించి ఈ మధ్యన ఒక అడ్వర్‌టైజ్‌మెంట్ కూడా వచ్చింది గమనిం చారా... ఆ ఇరుకు సందుల్లో క్రికెట్ ఆడుతున్న పఠాన్ సోదరులపైన ఫిర్యాదులు ఎక్కువైపోయాయి. అప్పుడు ఇద్దరికి బరోడా స్పోర్ట్స్ క్లబ్‌లో సభ్యత్వం ఇప్పించాడు మెహబూబ్‌ఖాన్. అనుమతి రుసుంగా కట్టిన 120 రూపాయలు పఠాన్ సోదరులకు, మెహబూబ్‌ఖాన్‌కు ఇప్పటికీ గుర్తు. ఉన్న ఒక్క సైకిల్‌పై మెహబూబ్ తన పనికి వెళ్లి వచ్చేవాడు, అదే సైకిల్ పిల్లలు స్పోర్ట్స్ క్లబ్‌కు వెళ్లి రావడానికి ఉపయోగించేవారు. ఇద్దరూ వంతుల వారీగా సైకిల్ తొక్కుతూ, ఎవరు సైకిల్ నడపాలనే గొడవ తీర్చుకునేవారు.

1992 నుంచి మెహబూబ్‌ఖాన్ వారి పిల్లల క్రికెట్ మీద ఎక్కువ శ్రద్ధ చూపిం చడం మొదలుపెట్టాడు. సచిన్ టెండూల్కర్‌ని చూపించి, వారు కూడా అంతటి వాళ్లు అవ్వాలని ఆశించేవాడు. తెల్లవారుజామున నమాజు జరిగిన తరువాత, మళ్లీ జరగ బోయే నమాజు వరకూ ఉన్న సమయాన్ని, పిల్లల ప్రాక్టీస్ ఎలా ఉందో స్పోర్ట్స్ క్లబ్‌లో ప్రత్యక్షంగా వీక్షించడానికి వినియోగించేవాడు-మెహబూబ్. ఆ సమయంలో పిల్లలకు అరటిపళ్లు తీసుకెళ్లి తినమని ఇచ్చి ప్రోత్సహించి వచ్చేవాడు.

అటు మసీదుని మచ్చ లేకుండా చాలా నీట్‌గా ఉంచి, భక్తి శ్రద్ధలతో అల్లాని కొలిచేవాడు మెహబూబ్. ఒకసారి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఆ మసీదులో ఉండే 300 ఏళ్ల నాటి ఖురాన్ పాడయింది. అందుకు మెహబూబ్‌ని పనిలో నుంచి

తీసేశారు. అప్పుడు వారి కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నది. తిండి కూడా సరిగ్గా పెట్టలేక పోయాడు. మళ్లీ ఎలాగోలా పనిలోకి చేరి, పఠాన్ సోదరి వివాహం చేశారు. మసీదు, ఖురాన్, అల్లా మొదలైనవి మెహబూబ్‌కి ఎంతో ప్రాణం. ఇప్పటికి మూడుసార్లు గుండె వార్నింగ్ ఇచ్చింది. (హార్ట్ అటాక్ వచ్చింది), అయినా అతను మసీదును శుభ్రంగా తుడిచి, కడగటం మానడు. అతని భార్య అన్నట్లు మెహబూబ్ చీపురు తను చనిపోయి నప్పుడు మాత్రమే వదలగలడు.. ఇప్పటికీ ఎవరైనా వస్తే తను మసీదుని ఎంత నీట్‌గా ఉంచుతున్నది చూపించి, గర్వంగా తను చేసే పని గురించి చెబుతాడు. ఎవరైనా తన పేదరికం గురించి అడిగితే.. అతను 'నాకు ఉన్న ఆస్తి కేవలం ఒక్క ఈ చీపురే.. అయినా నా ఇద్దరు కొడుకులు భారత క్రికెట్ జట్టులో ఆడుతున్నారు. ఎంతో మంది కోటీశ్వరుల పిల్లలు క్రికెట్ అయితే ఆడగలరు. కానీ భారత జాతీయ జట్టులో ఆడగలరా. అందుకని, నేను పేదవాణ్ణి కాదు... అల్లా నాకు అన్నీ ఇచ్చాడు' అని అంటాడు.

ఆ టీవీ రిపోర్టర్ ప్రశ్న అడిగినప్పుడు ఇర్ఫాన్ ఇచ్చిన సమాధానం. తను తన బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నానని. తన తండ్రిని గుర్తుకుతెచ్చుకున్నానని.. కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్న తండ్రి, అన్నీ, ప్రతికూల విషయాలు పక్కనపెట్టి, అల్లా సేవలో మునిగిపోగలిగినపపడు, చుట్టూ ఉన్న పరిస్థితులు కృంగదీస్తున్నప్పటికీ, తన కర్తవ్యంలో తండ్రి హాయిని పొందగలిగినప్పుడు, నా కర్తవ్యాన్ని కూడా నేను ఎందుకు సరిగ్గా నిర్వర్తించలేనని నన్ను నేను ప్రశ్నించుకున్నాను అన్న సమాధానం వచ్చింది. ఇర్ఫాన్ నుంచి...

ఇర్ఫాన్ తన కళ్లముందు తన తల్లిదండ్రులు కష్టపడటాన్ని గమనిం చాడు. రెండు పూటల పిల్లలకు తిండి పెట్టలేక అవస్థ పడటాన్ని గమనించాడు. వాళ్ల సోదరి పెళ్లి కుదిరినప్పుడు వారి తల్లిదండ్రులు పడిన గాభరాని గమనించాడు. అదీ ఒత్తిడి అంటే.. నిజమైన ఒత్తిడి అంటే అదీ... ఆ ఒత్తిడి ముందు నేను చేయవలసిన పని చాలా చిన్నదిగా అనిపించింది' అని చెప్పాడు ఇర్ఫాన్... 'నా పని చాలా సులువైనది. నేను ఆరు బంతుల్లో 13 పరుగులు ఇవ్వ కుండా మాత్రమే జాగ్రత్త పడాలి... అంతే... దానికి ఒత్తిడి పడటం ఎందుకు? ఇది ఒత్తిడికి గురవడానికి సరైన కారణం ఎప్పటికీ కాదు' ఇదీ ఇర్ఫాన్ సూటి సమాధానం.

ఇర్ఫాన్ తల్లిదండ్రుల గురించి చెప్పేటప్పుడు, మా తల్లిదండ్రులు మమ్మల్ని (అక్క, నేను, చెల్లి) పెంచిన తీరు గుర్తుకువస్తుంది. మా అమ్మ, నాన్నలు ప్రతిరోజూ తెల్లవారు జామున నాలుగు గంటలకల్లా నిద్రలేచేవారు. చదువుకోమని మమ్మల్ని కూడా నిద్ర లేపే వారు. నేను ఆరవ తరగతి చదువుతున్నప్పటి మేము గుంటూరులో ఉంటున్నాం. నాన్నగారికి వేరే ఊరికి బదిలీ అయినా, మా చదువులకు ఆటంకం కలగకూడదని, మమ్మల్ని గుంటూరు నుండి వేరే చోటుకి మార్చలేదు.

నాన్నగారికి ఎక్కడికైనా బదిలీ అయితే, ఆయన గుంటూరు నుండి ఆ ఊరికి ప్రతి రోజూ వెళ్లివచ్చేవారు. అంటే అప్ అండ్ డౌన్ చేసేవారన్నమాట. ఒక్కరోజు కూడా మమ్మల్ని విడిచి ఉండేవారు కాదు. ఒక రోజులో ఆఫీసులో పని కోసం 7-8 గంటలు వెచ్చిస్తే అంతకంటే ఎక్కువ సమయం ప్రయాణానికి పట్టేది. ఆఫీసుకి వెళ్లడం కోసం

నాలుగు గంటల ప్రయాణ సమయం, ఆఫీసు నుండి ఇంటికి చేరుకోవడానికి ఇంకో నాలుగు గంటల సమయం నాన్నగారు వెచ్చించేవారు. కొన్ని సంవత్సరాల పాటు ఇలా రానూ పోనూ ప్రయాణం చేస్తూనే ఉండేవారు. అందుకని, తెల్లవారు జామునే నిద్రలేచి, ఇంట్లో పనులన్నీ పూర్తి చేసుకుని స్నానం చేసి ధోవతి కట్టుకుని పూజ చేసుకుని ఆఫీసుకి బయలుదేరేవారు. అమ్మకూడా తెల్లవారు జామునే నిద్రలేచి, స్నానం చేసి దీపారాదన వంటి పూజా విధానాలన్నీ పూర్తి చేసి, నాన్నగారికి భోజనం తయారు చేసేది. ప్రయాణం చేసి (నాన్నగారు) ఆలసిపోయి ఇంటికి 11 గంటలకు చేరుకున్న రోజులను తలచుకుంటుంటే కళ్లు చెమ్మగిల్లుతాయి. మా తల్లిదండ్రులు డిసిప్లేన్‌కి మారుపేరు. ప్రతీ పనిని పద్ధతిగా నెరవేర్చేవారు. వారు ఎంతో కష్టపడి మమ్మల్ని పెద్ద చేసి విద్యా బుద్ధులు నేర్పించారు. రిక్షా ఎక్కితే ఎక్కడ మూడు రూపాయలు వృథాగా ఖర్చవుతాయని, మా నాన్నగారు రైల్వే స్టేషన్ నుండి ఇంటికి నడిచి వచ్చిన సందర్భాలు నేను ఎప్పటికీ మరచిపోలేను. ఆ డబ్బుతో పిల్లలకు ఏవైనా కొనిపెట్టవచ్చునని మమ్ములను వెన్నుతట్టి ప్రోత్సహించి, మా తల్లిదండ్రులు ఇంతటి వారిని చేశారు. మా ఇంట్లో లాగ, మా ఇంట్లో కూడా మిమ్మల్ని వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు మీకు అండగా ఎవరో ఉండే ఉంటారు. ఒకవేళ లేకపోయినా ఫరవాలేదు. మీరు ఈ పుస్తకం చదవలుగుతున్నారంటే జీవితంలో ఏదో సాధించాలని తపన పడుతున్నారంటే ఈ ప్రపంచంలో చాలా మంది కన్నా మీరు ఎంతో అదృష్టవంతులన్నట్లే లెక్క. మీ చిన్నప్పటి నుండి ఇప్పటివరకూ జరిగిన మంచి సంఘటనలన్నీ మీరు గుర్తు చేసుకోండి. మనం మిగతా వారికంటే ఎంతో భాగ్యవంతులమని గుర్తించండి. కష్టాలను అనుభవించినప్పుడు మాత్రమే సుఖాలను పొందడానికి మనం అర్హులమవుతాము. కష్టం తరువాత వచ్చే సుఖం ఒక అనిర్వచనీయమైన అనుభూతిని ఇస్తుంది. అలాంటి సుఖాలను మీరు అనుభవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. కష్టాల వారధి దాటిన తరువాత సుఖాల సన్నిధి ఖచ్చితంగా ఉంటుంది. అందుకని కష్టపడదాం. కష్టపడటాన్ని ఇష్టపడదాం.

మన మైండ్ దేనిమీద ఫోకస్ (దృష్టి పెడితే) అది ఖచ్చితంగా పెరుగుతుంది. మన సమస్యల గురించి ఆలోచిస్తే అవి పెద్దవి అవుతాయి. కనీసం పెద్దవి అయినట్లు కనిపిస్తాయి. మన మైండ్ మన స్ట్రాంగ్ పాయింట్స్ (శక్తి, బలం) మీద ఫోకస్ చేస్తే అవి కూడా పెరుగుతాయి. పెరిగినట్లు అయినా కనిపిస్తాయి. ఎప్పుడూ కూడా ఛాయిస్ మీదే మన మైండ్‌ని మన సమస్యల మీద ఫోకస్ చేయాలా లేక మన స్ట్రాంగ్ పాయింట్స్ మీద ఫోకస్ చేయాలా – అనేది నిర్ణయించి మన మైండ్‌కి కమాండ్ ఇచ్చేది మీరే...

ఇక నుంచి తాటిమొద్దుల మీద పంటకాల్వలను దాటవలసి వచ్చినా; చెక్క బల్లల మీద లాంచీలోకి ప్రయాణిస్తున్నా మన మైండ్ మనని భయపెట్టకుండా, మనం అవతలి ఒడ్డుకు సురక్షితంగా చేరుకోగలమని భరోసా ఇచ్చేలా – మన మైండ్‌కి శిక్షణ ఇవ్వండి. ఒత్తిడిని తట్టుకోవడం నేర్చుకోండి. ఒక శీతల పానీయం అడ్వర్‌టైజ్‌మెంట్‌లో చెప్పినట్లు – డర్ కే ఆగే జీత్ హై.. భయాన్ని అధిగమిస్తే – విజయం ఉంది. వేరేరకంగా చెబితే ఒత్తిడిని జయిస్తే విజయం వరిస్తుంది.

# 8

# అవరోధాల ఆనక ఆనందం పంతం పట్టిన వారి సొంతం

**హైలెట్స్**

- ఆ బాధ శారీరకమైనది తక్కువ. మానసికమైనది ఎక్కువ. ఎందుకంటే తను కన్న కల సాధించలేకపోతున్నాడు.
- తను పోగొట్టుకున్న దాని మీద దృష్టిపెట్టలేదు. తనకు ఇంకా మిగిలి ఉన్న వాటి మీద ఫోకస్ చేశాడు. మనోబలం, గెలవాలనే కాంక్ష, బంగారు పతకం తెచ్చుకోవాలనే కసి, తన పాజిటివ్ దృక్పథం.
- మన జీవితంలో కూడా అనేక సందర్భాలలో మనం విజయానికి అతి చేరువలో ఉన్నప్పుడు, అనుకోని ఏదో కీడు జరిగి ఉండవచ్చు. మనం బాధ పడతాం సహజమే. మనని ఓడించదానికి లోకం, కుట్ర పన్నుతున్నట్లు అనిపిస్తుంది.
- బొటని వేళ్లు పోయినా, చేతులు పోయినా, ఇంకేమన్నా కోల్పోయినా సరే మన మానసిక శక్తిని మాత్రం కోల్పోకపోతే, ఏమీ కోల్పోయినట్లు కాదు.
- జరిగిపోయిన దానికి బాధపడను. జరగబోయే దాన్ని నాకు అనుకూలంగా జరిగేలా ప్రయత్నిస్తాను అని అనుకుంటే ఖచ్చితంగా విజేతలవుతారు.

చిన్నప్పుడు చదువుకున్న భర్తృహరి సుభాషితాలలో ఒక పద్యం నాకు ఎప్పుడూ



గుర్తుకు వస్తుంది. అది –

"ఆరంభించరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై
యారంభించి పరిత్యజింతురు విఘ్నాయత్తులై మధ్యముల్,
ధీరుల్ విఘ్ననిహన్యమాను లగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్"

దీని అర్థం ఏమిటంటే – మనుషులలో మూడు రకాల మనుషులు ఉంటారు. (ఏ పని అయినా సాధించడానికి) అధములు, మధ్యములు మరియు ఉత్తములు. ఏవో అవాంతరాలు వస్తాయి, చాలా శ్రమతో కూడుకున్న పని అని అధములు అసలు పని మొదలుపెట్టరు. ఎందుకు మనకి రిస్క్? ఏదైనా అనుకోనిది జరుగుతుందేమో అని భయపడుతూ, కడుపులో చల్లకదలకుండా వ్యవహరించే తీరు వీరిది. అందుకే వీరు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా ఎదుగు బొదుగు లేకుండా ఉండిపోతారు. ఇక మధ్యములు ఆరంభ శూరులు. ఏదో సాదిద్దామని సడెన్‌గా నిద్రలో నుండి లేస్తారు. ఎంత హడావుడిగా పని మొదలు పెడతారో, ఏదైనా అవాంతరం వస్తే అంతే కంగారుగా వెనక్కుతగ్గుతారు. ఇక ఆ పనిని మధ్యలో వదిలిపెడతారు.

కానీ ఉత్తములు మొదలు పెట్టిన పని ఎంత అడ్డంకి వచ్చినా సాధించే వరకు వదిలిపెట్టరు. అనుకుంటే ఇసుక నుండి తైలాన్ని అయినా తీయగల సమర్థులు వీరు "Come what may" అనుకునే తత్వం వీరిది. "ఏది ఏమైనా సరే" అనుకుంటూ సాధించే వరకూ పట్టువదలని విక్రమార్కులు వీరు.

అలాంటి వారి కోవలోకి చెందే మొట్టమొదటి వ్యక్తులలో కారోలె టకాక్స్ ఒకరు. 1910 జనవరి 21న బుడాపెస్ట్ (హంగేరీ)లో జన్మించిన కారోలె, హంగేరీ ఆర్మీలో సార్జెంట్‌గా చేరాడు. 1936 కల్లా అతను పేరు మోసిన పిస్టల్ షూటర్‌గా ఖ్యాతి గడించాడు. మన పురాణాల్లో ఏక లవ్యునిలా గురి చూసి కొట్టడం నేర్చుకున్నాడు. ఏకలవ్యునికి, మన కరోలెకి ఎంతో పోలిక ఉంది. ఏకలవ్యునిలా ఇతనికీ అవమానం ఎదురైంది. 1936లో హంగేరీ షూటింగ్ జట్టులో ఇతనిని తీసుకోలేదు. కారణం అతను కేవలం సార్జెంట్, కేవలం కమిషన్డ్ ఆఫీసర్‌లు మాత్రమే. పోటీలలో పాల్గొనడానికి అర్హులు.

అయినా మనవాడు ప్రాక్టీస్ వదిలిపెట్టలేదు. అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉండగా, బెర్లిన్ క్రీడల్లో ఎవరైనా పాల్గొనవచ్చని తెలియవచ్చింది. 1938లో తన సత్తా చాటుకున్న కారోలె, హంగేరీ దేశంలో ఫిస్టల్ షూటింగ్‌లో మొదటివాడిగా ఖ్యాతి గడించాడు. 28 ఏళ్లకే అందరి మన్ననలు పొందుతున్న మనవాడు 1940లో జరగబోయే టోక్యో ఒలింపిక్ క్రీడల మీద ఎన్నో ఆశలు పెట్టుకుని, కఠోర శ్రమ మొదలు పెట్టాడు. 1940లో ఒలింపిక్ క్రీడల్లో హంగేరీకి బంగారు పతకం ఖాయమని అంతా అనుకున్నారు.

అంతలోనే అనుకోని ప్రమాదం... ఒక ప్రఖ్యాత సినీ గేయ రచయిత అన్నట్లు అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని.. ఆర్మీ ట్రైనింగ్‌లో భాగంగా గ్రెనేడ్లను గూర్చిన శిక్షణ జరుగుతుంది. కారోలె ఆ శిక్షణలో పాల్గొన్నాడు. గ్రెనేడ్లని ఎలా విసరాలో శిక్షణలో నేర్పుతున్నారు. చేతితో పట్టుకుని గ్రెనేడ్‌కి ఉన్న పిన్ను తీసి దూరంగా విసరాలి. కెరోలె ఒక గ్రెనేడ్‌ని చేతిలోకి తీసుకున్నాడు. అది మంచిది కాకపోవడం వల్ల పిన్ను తీయకముందే పేలింది. మనవాడి చేతిలో పేలింది. అది కుడి చెయ్యి మనవాడు ఫిస్టల్ షూటింగ్‌కి ఉపయోగించే యెయ్యి అది.

వెంటనే కారోలెని హాస్పటల్‌కి తీసుకువెళ్లారు. ప్రాణాన్ని ఎలాగోలా కాపాడగలిగారు. కానీ కారోలె కుడి చేతిని మాత్రం కాపాడలేకపోయారు. కుడి చేతిని తీసేయవలసి వచ్చింది.

హాస్పటల్‌లో కారోలె నెలరోజులు బాధతో గడిపాడు. ఆ బాధ శాశీరకమైనది తక్కువ, మానసికమైనది ఎక్కువ. ఎందుకంటే తను కన్న కల సాధించలేకపోతున్నాడు ఒలింపిక్ క్రీడల్లో బంగారు పతకాన్ని సాధించలేకపోతున్నందుకు కుంగిపోయాడు. ఈ స్టేజిలో మనమే ఉంటే "నా వల్ల కాదు" అంటూ మన కల కల్లే (అబద్ధమే) అని సర్దిచెప్పుకుంటాం. మనకు లక్కు లేదులే అనుకుంటూ విధిని తిట్టుకుంటాం. నాకే ఎందుకు ఇలా జరగాలి?' ' అంటూ దేవుణ్ణి నిందిస్తాం. జీవితం మొత్తం మన మీద మనం జాలి చూపించుకుంటుంటాం.

కానీ కారోలె అందరిలాగ కాదు. నిజమైన హీరో సినిమాల్లో హీరో కాదు. నిజజీవితంలో హీరో... ఇప్పటికీ హంగేరీలో అతణ్ణి హీరో అని ముద్దుగా పిలుచుకుంటారు. హీరోలకు ఒక ప్రత్యేకత ఉంటుంది. వారిని ఏ ప్రతికూల పరిస్థితులు వెనక్కి నెట్టలేవు. కారోలె తను పోగొట్టుకున్న దాని మీద దృష్టి పెట్టలేదు. తనకు ఇంకా మిగిలి ఉన్న దాని మీద ఫోకస్ చేశాడు. తనకు ఉన్నది ఏమిటి? మనోబలం, గెలవాలనే



కాంక్ష, బంగారు పతకం తెచ్చుకోవాలనే కసి, తన పాజిటివ్ ఆటిట్యూడ్, ఫిస్టల్‌తో షూటింగ్ చేయాలంటే ఒక చేయి ఉండాలి. ఎడమ చేయి ఉందిగా ఏం? ఎడమ చేతితో షూటింగ్ ఎందుకు ప్రాక్టీస్ చేయకూడదు? అని ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. అది కూడా రహస్యంగా ఎందుకంటే రెండు చేతులు ఉన్న వారు మాత్రమే షూటింగ్ / ఫైరింగ్ రేంజ్‌లోకి అనుమతించబడతారు. హంగేరీ ఆర్మీ రూల్స్‌ని చాలా స్ట్రిక్ట్‌గా ఫాలో అవుతుంది.

పట్టుదల, కసి, వీటన్నిటినీ మించి తను కన్న కల కారోలెని ఎన్నో వ్యయ ప్రయాసలను సునాయాసంగా ఆకట్టుకునేలా చేసింది. అదే పట్టుదల, కసి, గెలవాలనే కాంక్ష కారోలె ఎడమ చేతిని ప్రపంచంలోకెల్లా బెస్ట్ షూటింగ్ హేండ్‌గా చేసింది.

నెల తరువాత హాస్పిటల్ నుండి డిస్‌చార్జి అయిన కారోలెకు కుడి జబ్బ నొప్పి చేయడం మొదలు పెట్టింది. ఎడమ చేతికి శ్రమ పెరిగింది. కుడి చేతితో చేసే పనులన్నీ ఎడమ చేతితో చేయవలసి రావడమే కారణం కాదు. ఎన్నో గంటల షూటింగ్ ప్రాక్టీస్ వల్ల కూడా... ఎన్ని నొప్పులైనా కారోలె తట్టుకున్నాడు. ఎంతో కష్టపడి తన కుడి చేతికి ఎన్నో గంటల ప్రాక్టీస్ నేర్పించి, బెస్ట్ షూటింగ్ హేండ్ చేశ్శాడు. అది ప్రమాదవశాత్తూ కోల్పోవలసి వచ్చింది. అదే ప్రాసెస్ ఎడమ చేతికి కూడా నేర్పాలి. సున్నా నుండి మొదలుపెట్టాలి. బెస్ట్ షూటింగ్ హేండ్ చేయాలి. చేసి తీరుతానని తీర్మానించుకున్నాడు. చివరికి తన పంతాన్ని నెగ్గించుకున్నాడు.

ఒక సంవత్సరం కఠోరమైన తపస్సు లాంటి ప్రాక్టీస్ తరువాత బయటి ప్రపంచాన్ని పలకరించాడు.

అది 1939వ పంవత్సరం. హంగేరీలో జాతీయ ఫిస్టల్ షూటింగ్ పోటీలు జరుగుతున్నాయి. అక్కడకు కారోలె వెళ్లాడు. ఇంతకు ముందు తనతో పరిచయమున్న మిగతా షూటర్స్ అందరూ కారోలెని చూడడానికి వచ్చారు. జరిగిన దాని పట్ల సానుభూతిని వ్యక్తపరచడానికి వచ్చారంతా. వారు కారోలె ఆ జాతీయ పోటీలు వీక్షించడానికి వచ్చాడని అనుకున్నారు. అప్పుడు కారోలె చెప్పిన విషయం విని అందరూ విస్తుపోయారు. కారోలె తను పోటీలు ఎలా జరగుతున్నాయో చూడటానికి కాదు, వాటిలో పాల్గొనడానికి అని చెప్పినప్పుడు అందరూ నోరెళ్లబెట్టారు. ఆ పోటీలలో అతను విజేత అయినప్పుడు ముక్కుమీద వేలేసుకున్నారు.

ఇంతకుముందు ఏకలవ్యుడికి, మనవాడికి పోలిక చెప్పుకున్నాం. ఏకలవ్యుణ్ణి వాళ్ల గురువు బొటనవేలు గురుదక్షిణగా ఇవ్వమన్నాడు. హంగేరీ ఆర్మీ కారోలె కుడి చేతిని బలితీసుకుంది. అయినా పట్టుదలలో ఏకాగ్రతలో మనవాడు ఏకలవ్యుణ్ణి మించిపోయాడు. కుడిచేతిని పోగొట్టుకున్న సంవత్సరం లోపే ఎడమ చేతితో అనుకున్నది సాధించాడు కారోలె. కారోలె రహస్యంగా ప్రాక్టీస్ చేయడం ఒకందుకు మంచిదే అయింది. “అవిటివాడివి నీకు ఫిస్టల్ షూటింగ్ ఎందుకు?” అని గేలి చేసేవాళ్లు లేరు. “రెండు చేతులు ఉన్నవారికే షూటింగ్‌లో పథకాలు రావడం లేదు – నీవు ఎందుకు పతకాల కోసం ఆశపడుతున్నా”వని నిరుత్సాహపరిచే వాళ్లు లేరు. జరిగిన ఘోరం చాలు, ఒక చేయి పోయింది – ఇక రెండవ చేతితో ఆ మందుగుండు సామాను పట్టుకోవద్దు” అని ప్రేమ ఒలకబోసే వాళ్లు లేరు.

మొత్తానికి కారొలె విన్నింగ్ స్పిరిట్‌కి ఎదురులేదు, ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధిస్తాడు అని అనుకునేంతలో మళ్లీ ఇంకో అవరోధం. ఒలింపిక్ క్రీడలు జరగడం లేదని ప్రకట. రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా 1940 మరియు1944 ఒలింపిక్ క్రీడలు జరగలేదు. కానీ కారొలె నిరుత్సాహపడలేదు. 1948 ఒలింపిక్స్‌లో తన సత్తా చాటాలని ప్రయత్నిస్తూనే ఉన్నాడు. 38 ఏళ్ల వయసు అప్పుడు 1948లో లండన్‌లో జరిగే ఒలింపిక్ క్రీడలకు ఎంపికయ్యాడు కారొలె. ఫిస్టల్ షూటింగ్‌లో ప్రపంచ రికార్డు సాధించిన కార్లోస్ వేలియంటిని అప్పుడు కలుసుకున్నాడు కారొలె. వేలియంటి లండన్ ఎందుకు వచ్చావని కారొలెని అడిగినప్పుడు “నేను నేర్చుకోవడానికి వచ్చాను” అని జవాబిచ్చాడు.

పోటీ జరిగింది. కారొలె, వేలియంటి పోటాపోటీగా తలపడ్డారు. చివరకు వేలియంటి కన్నా పది పాయింట్లు అధికంగా సాధించి, కారొలె బంగారు పతకాన్ని చేజిక్కించుకున్నాడు. తన కల నెరవేర్చుకున్నాడు. అప్పుడు వేలియంటి “నువ్వు నేర్చుకోవడానికి వచ్చావేమో కానీ, నిన్ను చూసి నేను ఎంతో నేర్చుకున్నాను. నీవు నాకు నేర్పివెళుతున్నావు” అని పొగిడాడు. కారొలె ఒక కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు అని వేరే చెప్పనవసరం లేదు కదా.

కారొలె ఒక విజేత, ఒక హీరోలా హంగేరీకి తిరిగివచ్చాడు. తనని పొగడని వారు లేరంటే అది అతిశయోక్తి కాదు.

నాలుగు సంవత్సరాలు గడిచాయి. మళ్లీ ఒలింపిక్స్ వచ్చాయి. ఈ సారి కూడా పోస్టల్ షూటింగ్ పోటీలో కారొలె బంగారు పతకాన్ని సాధించాడు. వరుసగా రెండుసార్లు

బంగారు పతకం ఒక్కరికే రావడం అప్పటి వరకూ ఒలింపిక్స్‌లో జరగలేదు.

అతని ఈ కథ అతనికి ఒలింపిక్ హీరో అని బిరుదు తెచ్చిపెట్టింది. ఇంటర్‌నేషనల్ ఒలింపిక్ కమిటీ ఒలింపిక్ హీరోగా కారొలెని ఎన్నుకుంది. కారొలె కథ అంతటితో ఆగిపోలేదు. అతను తన దేశంలో మొత్తం 35 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, అన్నింటిలో... (గమనిస్తున్నారా... అన్నింటిలో...) మొదటి స్థానం సంపాదించాడు.

ఛాంపియన్ అంటే నిజంగా కారొలెనే.

మన జీవితంలో కూడా అనేక సందర్భాలలో మనం విజయానికి అతి చేరువలో ఉన్నప్పుడు, మనకి అనుకోనిది ఏదో కీడు జరిగి ఉండవచ్చు. అప్పుడు మనం బాధపడతాం సహజమే. మనని ఓడించడానికి లోకం కుట్ర పన్నుతున్నట్లు అనిపిస్తుంది. నేను నవ్వాను... లోకం ఏడ్చింది... నేను ఏడ్చాను... లోకం నవ్వింది. నాకింక లోకంతో పని ఏముంది? డోన్ట్ కేర్ అని సినిమా పాట గుర్తు చేసుకోవాలనిపిస్తుంది. నాకే ఎందుకిలా జరిగింది అని బిగ్గరగా అరవాలనిపిస్తుంది.

ఎప్పుడైనా మీకు భవిష్యత్తులో అలా జరిగితే కారొలెని గుర్తుకు తెచ్చుకోండి. అతను హాస్పటల్ బెడ్డు మీద పడుకున్నప్పుడు నేను పోయిన దానిని గురించి ఆలోచించను. ఉన్న దాని మీద concentrate చేస్తాను. అన్న స్పిరిట్ గుర్తుకు తెచ్చుకోండి. మీలో ఉన్న inner strength ని మేల్కొలపండి. "you have enoromous amount of energy" మీకు అంతులేనంత శక్తి ఉంది. దానిని తెలుసుకోండి.

బొటని వేళ్లు పోయినా, చేతులు పోయినా, ఇంకేమన్నా కోల్పోయినా సరే మన మానసిక శక్తిని మాత్రం కోల్పోకపోతే, ఏమీ కోల్పోతున్నట్లు కాదు.

పిస్టల్ షూటింగ్‌లో బంగారు పతకం సాధించడం అనేది చేతికన్నా mental strength మీద ఎక్కువ ఆధారపడినందని మనకి కారొలె నిరూపించి చూపాడు. ఏ చేతితో పిస్టల్ పట్టుకున్నామన్నది చర్చించవలసిన విషయం కాదు. bullet - bulls eye ని కొట్టిందా, లేదా అనేదే గమనించాల్సిన సంగతి. నైపుణ్యంతో సంబంధం లేదు. attitude ఉంటే చాలు... నైపుణ్యత నేర్చుకోదగినది... కుడి చేతితో చేవలసిన షూటింగ్ ఎడమ చేయి ద్వారా సాధ్యమైనది. కానీ గెలవాలన్న కాంక్ష మనసులో నుండి రావాలి. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, మధ్యలో వదలక, చివర కరకూ winning spirit తో కొనసాగే వాడే ఉత్తముడు.

అదే భర్తృహరి కూడా చెప్పింది... ధీరుల్ విఘ్నాని హన్యమాను లగుచున్ ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థం లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్. ఈ సత్యం కారొలె విషయంలో అక్షరాల నిజమైంది. ఏదైనా సమస్య ఎదురైతే, విజేతలు ఆ సమస్యకి సరైన జవాబు వెదుకుతారు. మామూలు వాళ్లు మాత్రం సమస్య వస్తే తప్పించుకోవడానికి దారులు వెదుకుతారు.

ఎప్పుడైనా విజేతలా ఆలోచించండి. సమస్యను ఎదుర్కొనండి. కారొలె వలె జరిగి పోయిన దానికి బాధపడను, జరగబోయే దాన్ని నాకు అనుకూలంగా జరిగేలా ప్రయత్నిస్తాను అని అనుకోండి. ఖచ్చితంగా మీరు విజేతలవుతారు.

# 9

# సాధన చేస్తూ సాగిపోతే సాధించలేనిదేముంది?

**హైలెట్స్**

- సకెస్ అనేది ఒక్క రోజులోరాదు. ఒక్క రోజులో అద్భుతాలు జరిగిపోవు. రోమ్ నగరం ఒక్క రోజులోనే కట్టబడలేదు.
- ప్రతీ గొప్ప విషయానికీ పరిశ్రమ కావాలి. కాదు... కఠోర శ్రమ కావాలి.
- ఎలాగైతే మైఖెలాంజిలో చెప్పినట్లు ప్రతి శిలలో ఒక అద్భుతమైన శిల్పం నిబిడీకృతమై ఉందో అలాగే గెలవాలన్న కాంక్ష ఉన్న ప్రతి వారిలో ఒక 'విజేత' ఆల్‌రడీ దాగి ఉన్నాడు.
- విజేతలైన వారు ఏదో అదృష్టం పట్టడం వల్ల విజేతలు కాలేదని గుర్తుకు తెచ్చుకోండి. వారిని అదృష్టం వరించేంతగా వారు కృషి చేశారని మరచిపోకండి.
- సక్సెస్ కావాలంటే అదృష్టాన్ని నమ్ముకోవడం కాకుండా కష్టాన్ని నమ్ముకోవాలి.

*అనగ నగగ రాగ మతిశయిల్లుచునుండు*
*తినగ తినగ వేము తియ్యనుండు*
*సాధనమున పనులు సమకూరు ధరలోన*
*విశ్వదాభిరామ వినురవేమ.*



***"విశ్వదాభిరామ వినురవేమ"*** అను మకుటంలోనే వేమన తన విశ్వదృష్టిని చూపించాడు. తాను విశ్వమంతా వ్యాపించినవాడట. అంటే తాను చెప్పిన నీతులు వర్తించని వారు ఎవరూ లేరని, మూర్ఖులను, సుబుద్ధులను, హీనులను, గుణ గరిష్టులను, రాజులను, పేదలను, స్థానబలిమి గలవారిని, లేనివారిని అందరినీ, అన్ని విధాల తట్టి లేపి హితబోధ చేసే వేమన చెప్పిన పద్యాలలో ఆణిముత్యం లాంటి పద్యమిది. ఎందుకంటే ఈ పద్యం యొక్క భావం మనకి అందరికీ, అన్నివేళలా పనికివస్తుంది. దీని భావమేమిటంటే పాడగాపాడగా గొంతు సాగినట్లే. తినగాతినగా చేదు తియ్యనైనట్లే కష్టపడితే సాధించలేని పనులు లేవు. దృఢసంకల్పం ఉన్నప్పుడే, ఏ పనైనా చేసి తీరాలన్న పూనిక ఉన్నప్పుడే, అది సమకూరుతుంది. అయితే సక్సెస్ అన్నది ఒక్క రోజులో రాదు. ఒక్క రోజులో అద్భుతాలు జరిగిపోవు. Rome was not built in a day. ఎంతో కఠోర శ్రమ కావాలి. ఎన్నో గంటల ప్రాక్టీస్ కావాలి. Practice makes man perfect. సంగీత ప్రపంచంలో వయోలిన్‌తో విశ్వవిఖ్యాతి గడించిన Fritz Kreisler ని ఒక ఇంటర్వ్యూలో ఒక పాత్రికేయుడు 'మీరు వయోలిన్‌ని ఇంత బాగా ఎలా వాయించలుగుతున్నారు? మీ చేతుల్లో ఏదో మాయ ఉందనుకుంటా. మీరు నిజంగా అదృష్టవంతులు... లేకపోతే ఆ వేళ్లు అలా ఎవరికీ కదలలేవు...' అని ప్రశ్నించాడు. అప్పుడు తను జవాబిస్తూ... 'నేను నిజంగా అదృష్టవంతుణ్ణే ఎందుకంటే ఆ అదృష్టమే లేకపోతే నాకు ప్రతిరోజూ సాధన చేయాలనే సంకల్పం ఉండేది కాదు. నేను ఎందుకు అదృష్టవంతుణ్ణి అయ్యానంటే నేను వయోలిన్ మీద సాధన చేయని రోజున నాకు నిద్రపట్టదు. నేను ఎందుకు అదృష్టవంతుణ్ణి అయ్యా

నంటే నేను కొన్ని వందల గంటలు వయోలిన్ మీద సాధన చేశాను కాబట్టి, ఇప్పటికీ కూడా సాధన చేస్తాను కాబట్టి... నేను ఒక్క నెలరోజులు ప్రాక్టీస్ చేయకపోతే తేడాని ప్రేక్షకులు / శ్రోతలు ఫీల్ కాగలరు. నేను ఒక్క పక్షం రోజులు ప్రాక్టీస్ చేయకపోతే నా ట్రూప్‌లో ఉన్న వారు తేడాని గమనించగలరు. ఒక్క వారం నేను ప్రాక్టీస్ చేయకపోతే, నా భార్య నా సంగీతంలో తేడా ఇట్టే పసిగట్టగలదు. నేను ఒక్కరోజు ప్రాక్టీస్ చేయకపోతే, నా సంగీతంలో తేడా నేను స్వయంగా గమనించగలను. కాబట్టి నా సక్సెస్‌కి రహస్యం నేను అదృష్టవంతుణ్ణి కావడం వల్ల కాదు. నేను ప్రతిరోజూ ప్రాక్టీస్ చేయడం వల్ల అని అన్నాడు.

ఇంకో సందర్భంలో Fritz Kreisler ని తన ప్రోగ్రాం అయిపోయిన తరువాత ఒక అభిమాని కలిశాడు. అతడు ప్రోగ్రామ్ ముగిసిన వెంటనే స్టేజీ మీదకు దూకి, kreisler దగ్గరకు వెళ్లి సార్! మీరు వయోలిన్ మీటుతున్న పద్ధతి పరమాద్భుతం... మీరు వయోలిన్ మీటే పద్ధతికి నేనైతే నా జీవితాన్నంతా ధారపోస్తాను.. అని అన్నాడు. దానికి kreisler 'నేను నా జీవితాన్నంతా ధారపోశాను' అని సమాధానమిచ్చాడు.

ప్రతి గొప్ప విషయానికీ పరిశ్రమ కావాలి. కాదు... కఠోర శ్రమ కావాలి. మీరెప్పుడైనా సరస్సులో విహారం చేస్తున్న బాతును చూశారా? బాతు చాలా ప్రశాంతంగా ఉన్నట్లు, తన చుట్టూ ఉన్న పరిసరాలనూ చాలా ఆనందంగా అనుభవిస్తున్నట్లు మనకి కనబడుతుంది కదా... కానీ మీరెప్పుడైనా గమనించారా? బాతు, తను ఉన్నచోట నిశ్చలంగా ఉండేందుకు ఎన్నిసార్లు తన కాళ్ల కండరాలని కదలించాల్సి వస్తుందో?

ఒక కళలో పండిపోవడమంటే, పరిపక్వత సాధించగలగడమంటే అది అదృష్టంతో ముడిపడిన విషయంకాదు. అది ఎన్నో గంటల కఠోర శ్రమ ఫలితం. ఎన్నో కోట్ల ప్రయత్నాల ఫలం. మైఖేలాంజెలో గురించి అందరికీ తెలిసే ఉంటుంది. ఇటలీకి చెందిన ఈ ప్రఖ్యాత చిత్రకారుడు, శిల్పి, కవి, మరియు ఇంజనీరు చేపట్టిన అన్ని రంగాలలోను అద్భుతమైన ప్రతిభ కనబరచాడు. 16వ శతాబ్దంలో ఇతనికి లభించిన ప్రాచుర్యం మరే ఇతర కళాకారునికి లభించలేదు. ఇతని కృతులలో సుప్రసిద్ధమైనవి రెండింటిని పేటా మరియు డేవిడ్ అనే శిల్పాలను తన 30 ఏళ్ల వయసులోపే సృజించాడు. పశ్చిమ దేశాలలో అత్యంత ప్రసిద్ధమైన రెండు ఫ్రెస్కో చిత్రాలు – ఒకటి: రోమ్ నగరంలో సిస్టీన్ చాపెల్ పైకప్పు సృష్టి చిత్రాలు. రెండు: తుది తీర్పు.

తరువాత అదే నగరంలో సెయింట్ పీటర్స్ బసిలికాకు రూపకల్పన చేసి భవన నిర్మాణ విధానంలో కొత్త మార్గాలకు ఆద్యుడయ్యాడు.

అతడు ఒక సభలో అందరి ముందు ఒక విషయాన్ని ఒప్పుకున్నాడు. ఆ సభలో అతనిని వక్తలందరూ ఇంద్రుడు, చంద్రుడు, బ్రహ్మ లాంటి సృష్టికర్త అని వేనోళ్ల పొగిడారు. ఎన్నో కళాఖండాలను సృష్టించాడు కాబట్టి బ్రహ్మదేవునికంటే గొప్పవాడని భజన చేశారు. మైఖెలాంజెలో తన వంతు మాట్లాడటానికి అవకాశం వచ్చిన తర్వాత ఇలా అన్నాడు. 'మీరందరూ నేను గొప్పవాడినని అంటున్నారు. నేను అద్భుత కళాఖండాలను సృష్టించానని చెబుతున్నారు. నా చేతిలో, బుర్రలో ఏవేవో శక్తియుక్తులు దాగి ఉన్నాయని ఊహిస్తున్నారు. నా పూర్వజన్మ సుకృతమని నొక్కి వక్కాణిస్తున్నారు. ఇవన్నీ నిజమో, కాదో నేను చెప్పలేను. కానీ, నేను ఒక పెయింటింగ్ వేయడానికి ఎంత కష్టపడతానో మీరు



ఊహించలేరు. ఒక శిల్పాన్ని అద్భుతమైనదిగా తీర్చి దిద్దడానికి నేను పడే శ్రమని మీరు గనక చూస్తే మీకు ఆ శిల్పం అంత అద్భుతంగా అగుపించదు. నేను శిల్పాన్ని అద్భుతంగా చెక్కాలని, ఆ శిల్పం ఒక మాస్టర్ పీస్ కావాలని ఎంతో కఠోర శ్రమని ధార పోస్తాను. అంత కఠోర శ్రమని ఎవరైనా చేయగలిగితే బహుశా నా శిల్పాలకంటే, నా పెయింటింగ్స్ కంటే, ఎంతో గొప్ప కళాఖండాలు ఆవిష్కృతమవుతాయి. నా చేతిలో, బుర్రలో ఏవేవో శక్తులు ఉన్నాయ న్నారు కదా. అవునేమో... ఉన్నాయేమో... ఎంత వరకూ ఉన్నాయో.. అది కూడా చెప్పనీయండి... నా చేతులు అలుపెరుగకుండా ఉలిని కాని, కుంచెను కానీ పట్టుకో గలవు.. ఉలిని, కుంచెను పట్టుకున్నప్పుడు నా చేతులు పూర్తిగా నా బుర్ర ఆధీనంలో ఉంటాయి. నా బుర్ర నీ ఈ పనికి నూటికి నూరు మార్కులు అని చెప్పేంత వరకూ నా చేతులు నొప్పులు పుట్టవు. నా బుర్ర కూడా చాలా మొండిది. అది నా మనసు మాట మాత్రమే వింటుంది. నా మనసులో కల్పన చేసిన కళాఖండానికి కించిత్ తేడా వచ్చినా, నా బుర్ర ఒప్పుకోదు. అవసరమైతే మొత్తం కళాఖండాన్నే కాదం టుంది కానీ, అనుకున్నట్లు రాకపోతే ఎప్పుడూ సంతృప్తి చెందదు' అని చెప్పాడు. ఇలా ఉంటాయి గొప్పవారి వ్యవహారాలు. ఎప్పుడో 600 సంవత్సరాల క్రితం జీవించిన వ్యక్తిని గురించిన విశేషాలు మనమిప్పటికీ చర్చిస్తున్నామంటే అతను ఈ 600 సంవత్సరాల కాలంలో ఎంత మందికి ప్రేరణనిచ్చాడో ఊహించండి... ఇప్పటికీ అతను ఎంతో మందిని ఉత్సాహపరుస్తూనే ఉన్నాడు.

ఉదాహరణకు కొత్తగా ఎంపికైన ప్రతి ఐపీఎస్ ఆఫీసర్‌ని మెఖెలాంజ్‌లో ప్రభావితం

చేస్తున్నాడు. ఎలాగంటారా? మీకందరికీ తెలుసు... ఐపీఎస్ ఆఫీసర్‌లకు శిక్షణనిచ్చే Sardar Vallabh Bhai Patel National Police Academy (SVPNPA), మన హైదరాబాద్‌లో ఉందని అందులోకి ప్రవేశించే ప్రతివారిని, ఆహ్వానిస్తూ, నల్లగా తళతళ మెరుస్తూ ఒక నల్లటి మార్బుల్ శిల రోడ్డుకి మధ్యలో ఉండి, ఎస్‌వీపీఎన్‌పీఏ లో మెయిన్ రోడ్డుని రెండుగా చీలుస్తుంది. ఒక నిర్దిష్టమైన ఆకృతి లేని ఆ శిల, ఒక జాతీయ స్థాయి అకాడమీలో ఎందుకు ఉందని, మొదటిసారి అకాడమీ ప్రవేశించే వారందరూ విస్తుపోతారు. సుమారు ఐదు అడుగుల పొడవు, రెండడుగుల వెడల్పు గల ఆ శిల, నల్లగా నిగనిగలాడిపోతూ, ఏమి సందేశమివ్వాలనుకుంటుందబ్బా అని అందరూ ఆలోచిస్తూ ఉంటారు.

ఐపీఎస్ అకాడమీలో ప్రవేశించిన నేను కూడా, నా సహ ఐపీఎస్ ఆఫీసర్‌ల లాగ, ఆ శిల దగ్గర కొంత సేపు గడిపాను. దగ్గరకు వెళ్లి చూశాను. అక్కడ ఆ శిల కింద ఏదో రాసి ఉంది. ఏమి రాసి ఉందో మీకు తెలుగులో అనువదించి రాస్తున్నాను. ఏమి రాసుందంటే... "మైఖెలాంజ్‌లోని ఒకసారి ఎవరో అడిగారు..." మీరు అంత అద్భుతమైన శిల్పాలను ఎలా చెక్కగలుగుతున్నారు? మీరు చెక్కిన ప్రతి శిలలో జీవం ఉట్టిపడుతుంది కదా... ఇది కేవలం మీకు మాత్రమే ఎలా సాధ్యమైనది? అన్నారంట. దానికి మైఖెలాంజ్‌లో ప్రతి శిలలో already ఒక గొప్ప శిల్పం ఉంది. శిల్పంలో జీవం ఉట్టిపడేలా చెక్కడమే నా పని అని జవాబిచ్చారంట.. ఇలా రాసుంది అక్కడ. చివరగా ఇంకొక లైను కూడా ఉంటుంది. అది ఐపీఎస్ అకాడమీ వారు చేర్చింది. అదేమిటంటే... మీలో కూడా ఒక మంచి ఐపీఎస్ ఆఫీసర్ ఉన్నాడు. ఆ మంచి ఆఫీసర్‌ని వెలికి తీయడానికి మాకు అవకాశం ఇవ్వండి అని ఉంటుంది.

ఇది చూసిన ఐపీఎస్ ఆఫీసర్లు అతనిని తాను అకాడమీ వారికి సమర్పించుకోవడానికి సన్నద్ధమవుతాడు. నాకైతే ఐపీఎస్ అకాడమీలోకి అడుగు పెట్టిన క్షణమే ఎంతో ప్రేరణ ఇచ్చింది. ఆ శిల. నాకే కాదు ఐపీఎస్ ఆఫీసర్లు అయిన ప్రతి వ్యక్తికి గుర్తుండే ప్రేరణనిచ్చే సాధనం ఆ శిల. ఐపీఎస్ శిక్షణ చాలా కఠినమైనది. ప్రొద్దున్నే నాలుగు గంటలకు లేవాలి. రోజుకి కనీసం ఆరు కిలోమీటర్లు పరుగెత్తాలి. రెండు గంటలు వ్యాయామం చేయాలి, గుర్రపు స్వారీ చేయాలి. స్విమ్మింగ్ నేర్చుకోవాలి, పెద్ద పెద్ద గోడలు దూకాలి, సాయంత్రం గంటసేపు బాగా అలసిపోయేలా ఆటలు ఆడాలి. ప్రతి రోజూ మూడు గంటల డ్రిల్ ఉంటుంది. చెప్పుకుంటూ పోతే ఈ లిస్టు చాంతాడంత ఉంటుంది. మేము అకాడమీలో అడుగుపెట్టినప్పుడు చూసిన ఆ శిలను, ఆ శిల కింద రాసి ఉన్న అక్షర సత్యాలని గుర్తు చేసుకుంటూ కఠినమైన పోలీసు శిక్షణను పూర్తి చేశాము.

మెఖెలాంజిలో డేవిడ్ శిల్పాన్ని చెక్కేటప్పుడు ఒక కు-రాడు వచ్చి ఈ రాయిని ఎందుకు కొడుతున్నావని అడిగాడట. అప్పుడు మెఖెలాంజిలో ఈ రాయిలోపల ఒక దేవదూత బంధింపబడి ఉన్నాడు. నేను తనని విడుదల చేస్తున్నాని చెప్పాడట.

ఇంతకీ ఇక్కడ తెలుసుకోవలసినది ఏమిటంటే – ఎలాగైతే మైఖెలాంజ్‌లో చెప్పినట్లు ప్రతి శిలలో ఒక అద్భుతమైన శిల్పం నిబిఢీకృతమై ఉందో ఎలాగైతే పోలీసు అకాడమీ వారనట్లు, ఐపీఎస్ పరీక్ష పాసైన ప్రతీ అభ్యర్థిలో ఒక మంచి ఐపీఎస్ ఆఫీసర్ ఉన్నాడో,

అలాగే గెలవాలన్న కాంక్ష ఉన్న ప్రతి వారిలో ఒక 'విజేత' దాగి ఉన్నాడు. తన శక్తి తాను తెలుసుకోలేని హనుమంతునిలా మీరు కూడా ఉన్నారేమో చూసుకోండి. మీలో కూడా నిద్రావస్థలో ఉన్న 'విజేత' ఉన్నాడనిపిస్తే, ఆ విజేతని మేల్కొల్పండి. పాత సినిమాలో ఎన్‌టీఆర్ అన్నట్లు మత్తు వదలరా... నిద్దుర... మత్తువదలరా అని మేల్కొలుపు గీతాలు పాడండి... మీలోని విజేత కుంభకర్ణుడి వేషం వేయదలిస్తే గర్జించండి... గాండ్రించండి... మెత్తగా చెప్పినప్పుడు వినకపోతే ఏమి చేస్తాం.. సుత్తితో గట్టిగా మొత్తుతాము. మన శరీరాన్ని అలవనీయండి. దానికి ఎక్కువ పని చెప్పండి. బద్ధకాన్ని వదిలివేయమని వార్నింగ్ ఇవ్వండి. మనం విజేతలమవ్వాలంటే అందరికంటే ఎక్కువ కష్టపడాలి అని మన బుర్ర మనకి సంకేతాలు ఇస్తూ ఉంటుంది. బుర్ర చెప్పినవి వినండి. ఇంత ఎక్కువ కాంపిటీషన్ ఉంటే నీవు ఇన్ని ఎక్కువ గంటలు కష్టపడాలి అని మన బుర్ర లెక్కలు కడుతుంది. దాని మాట మీరు వినండి. అలాగే మన శరీరం కూడా మనకి కొన్నిసార్లు సంకేతాలు ఇస్తుంది. ఈ రోజు కొంచెం బడలికగా ఉంది. ఈ రోజుకి చదవకుండా ఆపేద్దాం అని అనవచ్చు. థియేటర్‌లో కొత్త సినిమా విడుదలైంది. భలే ఉంటుంది. ఈ ఒక్కపూట రెస్ట్ తీసుకుని రేపటి నుంచి చదువుదాము. ఈ పూట మాత్రం సినిమాకి వెళదాము అని అనవచ్చు. మన స్నేహితులందరూ షికారుకెళుతున్నారు. మనం మాత్రం ఈ పుస్తకాలకి ఎందుకు అంకితమవ్వాలి అని వింత ప్రశ్నలు వేయవచ్చు... మన మనస్సు.

కొన్ని కొన్నిసార్లు మన బుర్ర మన మనస్సు ఒకేసారి మనకు ఏవేవో ప్రబోధిస్తాయి. చాలా సార్లు వీటి ప్రభోదాలు విరుద్ధంగా ఉంటాయి. ఒకటి చదవమని చెప్తే, రెండవది రెస్ట్ తీసుకోమంటుంది. ఒకటి మన బాగు కోసం చెబితే, రెండవది మన తాత్కాలిక ఆనందం కోసం చెబుతుంది. రెండింటి మధ్య వైరం ఏర్పడినప్పుడు మనం దేని మాట వింటామా? అనే దాని మీదే ఆ రోజు మన 'చదువు' ఆధారపడి ఉంటుంది.

ఇక్కడే మీకు ముఖ్యమైన మరో విషయం చెబుతాను. మనం గనుక మన మైండ్ చెప్పే విషయాలు పెడచెవిన పెట్టామంటే మన మైండ్ హెచ్చరికలు జారీ చేయడం తగ్గించివేస్తుంది. అంటే మెల్లిమెల్లిగా మైండ్ తన బాధ్యత నుంచి తప్పుకుంటుంది. మన మనస్సుది అప్పుడు ఇష్టారాజ్యమైపోతుంది. అదేదో సామెత అన్నట్లు... మనసు ఒక కోతి... ఇలా మన చేతితో మనమే కోతికి కొబ్బరికాయ ఇచ్చినట్లు అవుతుంది. 'విజేత' లవ్వాల్సిన మనం పరాజితులమవుతాము.

అలా కాకుండా ఉండాలంటే మన మైండ్ చెప్పిన విషయాలు చక్కగా శ్రద్ధగా వినండి. మనలోని విజేతను తట్టిలేపండి. అలుపెరుగకుండా కష్టపడటం నేర్చుకోండి. మనం మిగతా వారిని ఓడించాలంటే ఎంతో ఓర్పు, నేర్పు కావాలని గుర్తుకు తెచ్చుకోండి. మైఖెలాంజ్‌ని ఆదర్శంగా తీసుకోండి. 'డేవిడ్' శిల్పం కాకముందు ఆ 18 అడుగుల రాయి కొన్ని వందల సంవత్సరాలుగా ఆ రాయి అక్కడే ఉంది. అందరూ ఆ రాయిని రాయిగానే చూశారు కానీ మెఖెలాంజిలో మాత్రం ఆ రాయిలో ప్రపంచాన్ని మైమరపించే 'డేవిడ్' అనే దేవదూతను చూశాడు. అతను సభలో అన్న మాటలు గుర్తుకు తెచ్చుకోండి. విజేతలైన వారు ఏదో అదృష్టం పట్టడం వల్ల విజేతలు కాలేదని గుర్తుకు తెచ్చుకోండి. వారిని అదృష్టం వరించేంతగా వారు కృషి చేశారని మరచిపోకండి. ఏ విజేత కథ అయినా తీసుకోండి.

బయట నుంచి చూస్తే వారు ఎంతో అదృష్టవంతులు అని మన మనస్సు చెప్పవచ్చు. కానీ, వారి జీవితంలోకి తొంగి చూస్తే, విజయం కోసం వారు ఎంత తపించారో అర్థం చేసుకోండి. ఒక్క చిన్న మాట గ్రహించండి. "Luck also favours those, who work hard" ఎవరైతే కష్టపడి పనిచేస్తారో వారినే అదృష్టం వరిస్తుంది. మైఖెలాంజెలో Fritz kreisler లాంటి వారే మనకి ఈ అక్షర సత్యానికి నిదర్శనం.

చివరకు చెప్పేదేమిటంటే – సక్సెస్ కావాలంటే అదృష్టాన్ని నమ్ముకోవడం కాకుండా కష్టాన్ని నమ్ముకోవాలి. అయితే ఇంకొకటి సక్సెస్ కావాలంటే ఏదో క్లబ్బులో మెంబర్‌షిప్ తీసుకున్నంత సులభం కాదు. సక్సెస్ అన్నది అంత సులువుగా, సునాయాసంగా రాదు. ఖనిజ సంపదని వెలికితీయాలంటే గనుల లోపలకి వెళ్లి ప్రాణాలకు తెగించి కష్టపడాలి. ఉలి దెబ్బలు పడకపోతే శిల శిల్పం కాలేదు. ఎంతో సాధన చేయాలి. అప్పుడే జీవం ఉట్టిపడే శిల్పం తయారవుతుంది. వేమన అన్నట్లు 'సాధనమున పనులు సమకూరు ధరలోన' పాడగా, పాడగా గొంతు సాగినట్లే, తినగా తినగా చేదు తియ్యనయినట్లే, కష్టపడితే సాధించలేని పనులు లేవు. దృఢసంకల్పం ఉన్నప్పుడే ఏ పని అయినా చేసి తీరాలన్న పూనిక ఉన్నప్పుడే అది సమకూరుతుంది. విజయోస్తు.

# 10

# జయమ్ము నిశ్చయంబురా... జంక బోకురా...

**హైలెట్స్**

- ✤ **మనిషి ఏదైనా సాధించాలనుకుంటే నిజంగా మనసునిండుగా తన లక్ష్యం గురించి కలలు కంటుంటే ఆ లక్ష్యాన్ని ఖచ్చితంగా సాధించగలడు.**
- ✤ **కలల్ని సాకారం చేసుకోవడంలో ఎన్నోసార్లు మనిక మనమే బ్రేకులు వేసుకుంటుంటాం. కొన్నికొన్ని సార్లు తెలియకుండా బ్రేకులు వేసుకుంటాం. చాలాసార్లు తెలిసి తెలిసి బ్రేకులు వేసుకుంటాం.**
- ✤ **మన బండికి బ్రేకులు వేస్తూ నడుపుతుంటే అది దాని నూటి శాతం పనితనం చూపలేదు. కదా... బ్రేకులు వేస్తుంటే బండి పూర్తి వేగంతో ఎలా వెళ్లగలుగుతుంది?**
- ✤ **బంగారం కావాలంటే గనులలో తవ్వుతున్న కొద్దీ వచ్చే మట్టిని పట్టించుకోకుండా, 'బంగారపు మట్టి' ఇక్కడ ఉందేమోనన్న ఆశతోనే తవ్వకం జరిపితేనే బంగారం లభించే అవకాశం ఉంటుంది.**

మనం ఏదైనా పని తలపెట్టామనుకోండి... ఆ పని జరుగుతున్నప్పుడు మధ్యలో మనకు అనేకమైన అనుమానాలు వస్తుంటాయి. "నా వల్ల ఈ పని అవుతుందా? అమ్మో! కొందరు ఈ పనిని అసాధ్యం అని వదిలేశారే. నేను ఎలా సాధించగలను?" అని

ఒక్కోసారి డౌటు పడుతుంటాం. మనం సక్సెస్ కోసం పయనించే దారిలో అనేకమైన బ్రేకులు పడుతుంటాయి.

మనం మన లక్ష్యసాధనకు బాగా కష్టపడి పనిచేస్తున్నప్పుడు ఎప్పుడైనా మన శక్తి సామర్థ్యాల మీద అనుమానం వస్తే -

జయమ్ము నిశ్చయమ్మురా... భయమ్ములేదురా...

జంకు బొంకు లేక ముందు సాగిపొమ్మురా... సాగిపొమ్మురా...

అంటూ సినీ కవి రాసిన పాటని ఆదర్శంగా తీసుకుందాం.

మనిషి ఏదైనా సాధించాలనుకుంటే నిజంగా మనసునిండుగా తన లక్ష్యం గురించి కలలు కంటుంటే, ఆ లక్ష్యాన్ని ఖచ్చితంగా సాధించగలడు. ఇది కేవలం కొంత మంది జీవితాల్లోనే జరిగిన అద్భుతం కాదు. నిజంగా సాధించాలనుకున్న వారు, మనసు నిండుగా లక్ష్యాన్ని నింపుకుని, అహర్నిశలు శ్రమించిన వారి పట్ల ఈ statement నూటికి నూరుపాళ్లు correct అయింది. అంటే నిజంగా సాధించాలని పట్టుబట్టిన వారిని విజయం వరించింది. నెపోలియన్ హిల్ తన లా ఆఫ్ సక్సెస్ అనే పుస్తకంలో ఇలా రాశాడు. 'మనిషి మెదడు ఏమి సాధించాలని ఊహిస్తుందో, ఏమి సాధించాలని ఆరాటపడుతుందో, ఆ మనిషి ఖచ్చితంగా ఆ పని సాధించగలిగే సమర్థుడై ఉంటాడు'.

అంటే మనం ఏమి కావాలని కలలు కంటామో, ఆ కలలు నిజం అయ్యేలా మన శక్తియుక్తులను ధారపోసి అనుకున్నది సాధించగలమన్నమాట. మరి అలా అయితే అందరి కల ఐఏఎస్ ఆఫీసర్లు అవ్వాలని ఉంటుంది కదా. President of India అవ్వాలని ఉంటుంది కదా. ఎమ్మెల్యే అవ్వాలని ఉంటుంది కదా. ప్రధాన మంత్రి కావాలని ఉంటుంది కదా.

ఉంటుంది. నిజమే. కానీ, ఆ కలని సాకారం చేసుకోవడానికి మనం ఎంత వరకూ కృషి చేశామనే దాని మీదే ఆధారపడి ఉంటుంది. అసలు విషయం.

కలల్ని సాకారం చేసుకోవడంలో ఎన్నోసార్లు మనకి మనమే బ్రేకులు వేసుకుంటుంటాం. కొన్ని కొన్నిసార్లు తెలియకుండా బ్రేకులు వేసుకుంటాం. చాలాసార్లు తెలిసి తెలిసి బ్రేకులు వేసుకుంటాం.

'ఐఏఎస్ అవ్వాలంటే అమ్మో రోజుకు 15-20 గంటలు చదవాలి. అది కూడా రెండు మూడు సంవత్సరాలు చదవాలి. నేను డిగ్రీనే అత్తెసరు మార్కులతో పాసయ్యాను. నిజంగా అన్ని వేల గంటలు కష్టపడగలనా?' మనకి తెలియకుండా మనలో మనమే ఈ లెక్కలు వేసేసుకుంటాం. మనకి మన మీదే అంత కష్టపడలేమని అనుమానం వస్తుంది. ఆ వచ్చిన Negative feedback తో మన కల కాస్తా నీరుగారిపోతుంది.

అసలు విషయం ఏమిటంటే ఐఏఎస్ అవ్వాలంటే రోజుకు 15-20 గంటలు కష్టపడనవసరం లేదు. అయితే శ్రద్ధగా మాత్రం చదవాలి. ఒక మనిషి ఇన్ని గంటలు చదవాలి, ఇన్ని సంవత్సరాలు కష్టపడాలి అని నిర్ధారించే ఒక కొలమానం ఏమీ లేదు. ఎవరి శక్తియుక్తులు బట్టి ఐఏఎస్‌లో విజయం సాధించడానికి సమయం పడుతుంది. అలాగే ఐఏఎస్ అవ్వాలంటే లక్షలు ఖర్చవుతాయి. ఎంతో ఖరీదైన పుస్తకాలు కొని చదవాలి. ఖరీదైన కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకోవాలి. ఐఏఎస్ ఇంటర్వ్యూలలో



ఎవరెవరివో రికమండేషన్‌లు కావాలి. ఇలాంటి అపోహలతో మనకి మనమే బ్రేకులు వేసుకుంటుంటాం.

మన మేదైనా బండి నడుపుతున్నామనుకోండి. దానికి బ్రేకులు వేస్తూ నడుపుతుంటే, అది దాని నూరు శాతం పనితనం చూపలేదు కదా. మనం బ్రేకులు వేస్తుంటే మన బండి తన పూర్తి వేగంతో ఎలా వెళ్లగలుగుతుంది? బ్రేకులు వేస్తూ ఒక పక్క ఎక్సెలరేటర్‌ని పెంచుతుంటే ఏమవుతుంది. ఇంజను పాడవుతుంది. బండి పనికిరాకుండాపోతుంది. బండి యొక్క పూర్తిసామర్థ్యాన్ని మనం వినియోగించలేకపోతాము. మన జీవితంలో బండి అంటే మన మైండు. అది ఎంతో శక్తిమంతమైన ఇంజను లాంటిది. దానికి బ్రేకులు వేయకండి. బ్రేకులు వేస్తే మన మైండు కూడా తన పూర్తి సామర్థ్యంతో పనిచేయలేదు. దానిని పూర్తిగా ఫ్రీగా వదిలేయండి. జీవితంలో ఎంతో సాధించాలని అనుకోండి. అదే మన మైండ్ అనే ఇంజనుకు ఏక్సిలరేటర్ లాంటిది. మైండ్‌ని ఊహా లోకాల్లోకి వెళ్లనీయండి. కలలు కనండి. గుర్తుంచుకోండి. నెపోలియన్ హిల్ చెప్పిన విషయం 'మన మైండ్ ఏ కలనైతే కంటుందో, అది ఖచ్చితంగా మనం సాధించగలం.' అయితే ఇలా సాధించేందుకు కృషి చేయాలి.

ఒక్కోసారి బాగా కష్టపడాల్సి వస్తుంది. కృషి చేసేటప్పుడు మాత్రం బ్రేకులు వేయకండి. వీలైతే ఏక్సిలరేటర్‌ని పెంచండి. ఒక్కోసారి ఎంతో బాగా కష్టపడాల్సి వస్తుంది అనుకున్నాము కదా. ఒక్క గ్రాము బంగారం కోసం బంగారపు గనులలో ఎన్ని టన్నులు మట్టిని తీయాలో మీరు ఊహించగలరా? అయితే మీకు బంగారం కావాలంటే, గనులలో

తవ్వుతున్న కొద్దీ ఎదురయ్యే మట్టిని పట్టించుకోకుండా, 'బంగారపు మట్టి' ఇక్కడ ఉంటుందేమోనన్న ఆశతో తవ్వకం జరిపితేనే, బంగారం లభించే అవకాశం ఉంటుంది. అంతేకానీ, 'ఆ! ఇదంతా మట్టే... బంగారం ఇక్కడ ఉండకపోవచ్చు' అని మనం బ్రేకులు వేసుకుంటే ఎలా? మనం వేసుకునే బ్రేకులు లేకపోతే, అసంభవం అనేది ఏమి లేదు. మనకి ఎన్నో mental-barriers ఉంటాయి. (మైండ్ నిర్మించుకునే అడ్డుగోడలు) అంటే ఈ పనులు మనం చేయలేము. ఇది మానవ మాత్రులకు వీలు కాదు. అనే అపోహలు మనం ఛేధిస్తే, సక్సెస్ ఖచ్చితంగా మనని వరిస్తుంది.

అసంభవం అనేది ఏమీ లేదు. మనిషి ఏమి అనుకున్నా అది సాధించి తీరగలడు. కేవలం 'ఇది అసంభవం' అని మనకి మనం వేసుకున్న బ్రేకులు తీసివేయాలి. టెలిఫోన్ ద్వారా మనం కొన్ని వేల మైళ్ల దూరంలో ఉన్న వారితో మాట్లాడగలం. కానీ, టెలిఫోన్ని కని పెట్టనప్పుడు 'ఇది అసంభవం' అని అన్నారు. రైట్ సోదరులు విమానం కనిపెట్టకముందు మనిషి గాలిలో ప్రయాణించడం అన్న విషయం 'అసంభవం' కానీ, అది సంభవమైనది కదా...

ఫోర్డ్ కార్లు మీకు తెలిసే ఉంటాయి. వాటికి ఆ పేరు హెన్రీ ఫోర్డ్ (ఫోర్డ్ కంపెనీ వ్యవస్థాపకుడు) పేరు మీద వచ్చింది. హెన్రీ ఫోర్డ్‌కి సరైన చదువు లేదు. అతను 14వ ఏటనే స్కూల్‌కి వెళ్లడం మానేశాడు. అతనికి తన కార్లు బాగా పరిగెత్తాలంటే వి-8 ఇంజన్ కావాలనే జ్ఞానం ఉంది. కానీ దానిని ఎలా తయారుచేయాలో తెలియదు. అందుకని, తన దగ్గర పని చేసే మంచి మంచి మెకానికల్ ఇంజనీర్లని పిలిచి వి-8 ఇంజన్‌ని తయారు చేయమని పురమా యించాడు. వాళ్లు హెన్రీ ఫోర్డ్‌కి వి-8 ఇంజన్‌ని తయారు చేయడం అసం భవమని చెప్పారు. కానీ హెన్రీ మాత్రం తనకి ఆ ఇంజను కావాలని చెప్పాడు. ఇంజనీర్లు 'మెకానికల్ ఇంజనీరింగ్ ప్రకారం, ఇంజను వేడెక్కే సిద్ధాం తం ప్రకారం, ఏది సాధ్యమో, ఏది అసాధ్యమో మీకు తెలియజేస్తున్నాం. మీరు అనుకున్నట్లు వి-8 ఇంజన్ రావాలంటే మెకానికల్ ఇంజనీరింగ్ సూత్రాలు అన్నీ మారాలి... కాబట్టి మీ ఇంజను అసాధ్యం అని చేతులెత్తేశారు. కానీ హెన్రీ మాత్రం ఎందుకు ఊరుకుంటాడు? అసాధ్యమనేది ఏమీ లేదు. అన్నీ సాధ్యమని నమ్మే మనిషైతేను? కొన్ని నెలల తరువాత మళ్లీ ఇంజనీర్లని పిలిపించి, 'నాకు మీరు ఏమి చేస్తారో తెలియదు. నాకు మాత్రం వి-8 ఇంజన్ కావాల్సిందే'నని పట్టుపట్టాడు. ఆశ్చర్యం... రెండు నెలల్లో వి-8 ఇంజన్ తయారైంది. అసాధ్య మని చెప్పిన ఇంజనీర్లే ఆ వి-8 ఇంజన్‌ని తయారు చేశారు. ఇందులో హెన్రీ గొప్పతనమేమి టంటే 'అసాధ్యమనేది నాకు తెలియదు. అన్నీ సాధ్యమనే' మంకు పట్టుపట్టడమే. ఎంతగా ఆ ఇంజనీర్లని ప్రభావితం చేసి ఉంటాడో ఊహించండి.

ఈ సందర్భంలోనే మీకు రోజర్ చేనిస్టర్ గురించి చెప్తాను. ఇతని గురించి తెలుసుకోవాలంటే మనం 1950 దశకంలోకి వెళ్లాలి. క్రీడా ప్రపంచంలో, అప్పటి వరకూ ఒక నమ్మకం ఉండేది. అదేమిటంటే 'మనిషి మైలు దూరం పరిగెత్తాలంటే కనీసం నాలుగు నిమిషాలు కావాలి' అని అంటే మానవ మాత్రు నికి మైలు దూరం నాలుగు నిమిషాల్లోపల ప్రయాణించడం అసంభవం అనే ప్రగాఢ నమ్మకం ఏర్పడిపోయింది.

1945లో స్వీడన్‌కి చెందిన గండర్ హేగ్గ్ ఒక మైలు రేసుని నాలుగు నిమిషాల 1.4



సెకండ్లలో పూర్తి చేసిన రికార్డు ఎన్నో సంవత్సరాలు నిలిచి ఉంది. అదే అత్యంత తక్కువ టైం అని అందరూ నమ్మారు. అంతకంటే తక్కువ సమయంలో మైలు దూరం పరిగెత్తడం అసాధ్యమని అందరూ అనుకు న్నారు. డాక్టర్లు, ఆటగాళ్లు, క్రీడాకారులు, క్రీడా పండితులు అందరూ... మూకు మ్మడిగా ఒన నమ్మకాన్ని బలపరిచారు. అదేమిటంటే నాలు గు నిమిషాల లోపల మైలు దూరం పరిగెత్తాలంటే అతడు రక్తమాంసాలతో పుట్టిన మనిషి అయి ఉండ కూడదు. కాళ్లు, చేతులతో పాటు అతనికి రెక్కలు కూడా పుట్టుకతోనే రావాలి... అలాంటప్పుడే నాలుగు నిమిషాల లోపు పరిగెత్తడం సాధ్యం.

ఇలాంటి ఈ భ్రమ కేవలం 1954 మే 6వ తేదీ వరకూ ఉండేది. అది పటాపంచలైంది. అసంభవమని అనుకున్నది సంభవమైంది. లండ న్‌లో రోజర్ బెన్నిస్టర్ మైలు దూరాన్ని నాలుగు నిమిషాలలోపు పరిగెత్తి, క్రీడా ప్రపంచాన్ని అబ్బురపరచాడు. మూడు నిమిషాల 59.4 సెకండ్ల సమయంలో మైలు దూరం పరిగెత్తి క్రీడాపండితుల నమ్మకాన్ని సవాలు చేశాడు. మానవాకృతి ప్రకారం మైలు దూరాన్ని నాలుగు నిమిషాల్లోపు ఎవరూ సాధించలేరన్న డాక్టర్ల సిద్ధాంతాన్ని తోసిపుచ్చాడు.

నాలుగు నిమిషాలు అన్న అడ్డుగోడ కట్టుకుంది మనం. ఆ అడ్డుగోడ ఛేదించలేమని మనం వదిలేశాము. ఎందుకు సాధ్యం కాదు? అని మనని మనం ప్రశ్నించుకోలేదు. సాధ్యం కాదు. అది అంతే అని మనని మనం సర్దిపుచ్చుకున్నాము. అలా సర్దిపుచ్చుకున్నంత కాలం మనం సాధించలేని లక్ష్యం అయి కూర్చుంది. ఎప్పుడైతే రోజర్ మైండు ఆ అడ్డుగోడని తొలగించాలని అనుకుందో, అప్పుడు ఆ అడ్డుగోడ దానంతట అదే

కూలి పోయింది. అయితే రోజర్ మైండు బాగా శ్రమించింది. ఎంతో శక్తిని కూడ గట్టుకుని, అడ్డుగోడని కూలదోసింది.

ఈ నాలుగు నిమిషాల కథ ఇంతటితో ముగిసిపోలేదు. జాన్ లాండె అనే క్రీడాకారుడు రోజర్ యొక్క ప్రత్యర్థి. అతను అప్పటి వరకూ మైలు దూరాన్ని 4 నిమిషాల 1.5 సెకండ్లలో పరిగెత్తాడు. నిజా నికి జాన్ లాండె అప్పటి వరకూ 4 నిమిషాల రెండు సెకండ్ల సమయంలోపు మైలు దూరాన్ని మూడుసార్లు పరితెగ్గాడు. అతను అంతకు ముందు వరకూ మైలు దూరాన్ని నాలుగు నిమిషాలలోపు ఛేదించలేరనే అభిప్రాయంతో ఉన్నాడు. ఎప్పుడేతై తన ప్రత్యర్థి కొత్త రికార్డు సాధించాడని విన్నాడో, తన మైండులో కట్టుకున్న అడ్డుగోడని పగలగొట్టేశాడు. రోజర్ రికార్డు సాధించిన 56 రోజుల్లో జాన్ ఇంకో కొత్త రికార్డు నెలకొల్పాడు. మైలు దూరాన్ని మూడు నిమిషాల 57.9 సెకండ్ల లోపల పరిగెత్తాడు.

కథ ఇంతటితో ముగిసిపోలేదు. 1958వ సంవ త్సరం లోపు మైలు దూరాన్ని నాలుగు నిమిషాల లోపు పదహారు క్రీడాకారులు ఛేదించారు. మైండు నిర్మించుకున్న అడ్డుగోడ నిజంగా ఛేదించబడింది.

అసలేమి జరిగింది? మన క్రీడాకారుల శరీరాలు అనూహ్యంగా, బలంగా అయ్యాయా? కొత్త టెక్నా లజీ వచ్చి, ఆటగాళ్ల షూ అభివృద్ధి చేయబడ్డాయా? ట్రైనింగ్‌లో కొత్త కోచ్‌లు వచ్చారా? మైలు దూరం కొలిచే కొలబద్ద చిన్నదైపోయిందా? ఇవేవీ కారణాలు కావు. మైండు నిర్మించుకున్న అడ్డుగోడ కూలగొట్టబడింది. అంతే...

తన విజయ రహస్యం చెప్పమని రోజర్ బెన్నిస్టర్‌ని తరువాత కొందరు క్రీడా పండితులు అడిగారు. అసలు విషయం రోజర్ అప్పుడు చెప్పాడు. అతను ఒక డాక్టర్. మిగతా డాక్టర్లు, క్రీడా పండితులు నాలుగు నిమిషాల లోపు మైలు దూరాన్ని మనిషి పరిగెత్తలేడన్న విషయాన్ని నొక్కి వక్కాణిస్తుంటే దానిని రోజర్‌కి ఒప్పుకోబుద్ధి కాలేదు. "నా మైండు వీరి థియరీని ఒప్పుకోలేదు. ఎందుకు అసాధ్యం?" అని నా మైండు నన్ను ప్రశ్నించింది. మిగతా వారి మైండ్లు కట్టిన అడ్డుగోడని నా మైండు బద్దలు కొట్టాలని నిశ్చయించుకుంది... అంటూ ముగిం చాడు రోజర్. అసాధ్యం అని వదిలేస్తే ఏ పనీ జరగదు. కనీసం మన జననం కూడా జరగదు. సైన్స్ ప్రకారం నొప్పిని భరించే శక్తిని కొలవవచ్చు. అదే సైన్స్ ప్రకారం ఒక మనిషి కేవలం 45 డెల్‌లు (డెల్ అనేది నొప్పిని కొలిచే కొలమానం) నొప్పిని మాత్రమే భరించగలడు. ఆ తరువాత నొప్పిని భరించలేడు. నొప్పి ఎక్కువైతే చావు కూడా సంభవించవచ్చు. కానీ, బిడ్డను కనేటప్పుడు పురిటి నొప్పులు ఎంత వరకూ వస్తాయో తెలుసా? 57 డెల్‌లు, ఇది ఒకేసారి ఇరవై ఎముకలు విరిగితే పుట్టే నొప్పి లాంటిది. అయినా 99 శాతం తల్లి క్షేమంగానే ఉంటుంది. మరి దీనికి సైన్స్ సెలెంటుగా ఉంటుంది. పురిటి నొప్పులు భరించ లేనివే, రక్తస్రావమూ జరుగుతుంది. అయితేనేమి? బిడ్డ జననం జరుగుతుంది. కష్టం కూడా అలాంటిదే. నొప్పులు పెట్టిస్తుంది. కంటతడి పెట్టిస్తుంది. భయ పడుతుంది. బాధ పెడుతుంది. వీటన్నింటినీ లెక్క చేయక, అనుకున్నది సాధిం చాలనే తపనతో ఉంటే – తప్పక సక్సెస్ వచ్చి తీరుతుంది.

పై ఉదాహరణల ద్వారా నేను చెప్పదలచుకున్న దేమిటంటే "మనం చెయ్యలేము"

అని మనకి మనం అనుకుంటే మనం ఎప్పటికీ ముందడుగు వేయలేము. 'ఇది నా వల్ల కాదు', 'ఈ పని అసాధ్యం' అని వెన్ను చూపితే విజేతలు కాబోయే మనకి, మామూలు వారికి తేడా ఎక్కడుంటుంది చెప్పండి?

మానవ మాత్రుడు రోజుకి కేవలం ఆరు గంటలు మాత్రమే శ్రద్ధగా చదవగలడు. ఆ తరువాత చదివితే బుర్రకి ఎక్కదు అన్న పిచ్చి సిద్ధాంతాలను ఛాలెంజ్ చేయండి. విజేత కావాలంటే మిగతా వారందరికి కంటే ఎక్కువ కష్టపడతామని అనుకోవాలి. ఒక్కసారి మనకి మనం నిర్మించుకున్న అడ్డుగోడల్ని కూలదోసి కష్టపడటానికి ప్రయత్నించండి. లోకం మిమ్మల్ని పూజిస్తుంది.

మనకి కనపడకుండా మనం అల్లుకున్న కంచెల్ని దాటి రండి. హెన్రీ ఫోర్డు అలా దాటి వచ్చినవాడే. రోజర్ బెన్నిస్టర్ అలా దాటి వచ్చినవాడే. మనం ఎందుకు అలా దాటి రాలేము? అలా చేస్తే విజయలక్ష్మి మనల్ని తప్పక వరిస్తుంది.

మీ మైండు మీకు ఏదైనా కలని చూపిస్తే, దానిని సాకారం చేసుకోవడానికి కృషి చేయండి. మధ్యలో వచ్చిన అడ్డుగోడల్ని ఛేదించండి. అడ్డుగోడలు వస్తున్నాయి కదా అని బ్రేకులు వేయకండి. వీలైతే ఏక్సెలరేటర్‌ని పెంచి, ఆ గోడల్ని, కంచెల్ని దూకండి.

మన మైండుని సాహసంతో నింపండి. ధైర్యంగా ఉండమని మైండుని గద్దిం చండి. అప్పుడే మన భయాలు, అవరోధాలు తొలగిపోతాయి. మన మైండుకు మనమే మాష్టరు. అది కేవలం మన మాట మాత్రమే వినాలి. దానికి మనం దాని అవధులు చెప్పకూడదు. దాని శక్తియుక్తులను గుర్తు చేయాలి.

దురదృష్టవశాత్తూ మనం శక్తియుక్తులను గుర్తు చేయకపోగా, అవధులను గుర్తిస్తున్నాం. మన మైండు కూడా మనని ప్రశ్నించదు. 'ఎందుకు సాధ్యం కాదు? అని ఎదిరించదు. ఫలితంగా మన ఓటమిని మనం ప్రయత్నం చేయకుండానే ఒప్పేసుకుంటాము. 'ఇది కాదులే'. 'ఎందరో మహానుభావులు నా కంటే ముందు ప్రయత్నించి ఓడిపోయారు? నేనేపాటి వాడిని?' అని మనకు మనం సర్ది చెప్పుకున్నామా? మన గోతిని మనమే తవ్వుకుంటున్నట్లు.

ఆలోచించండి. అసాధ్యాలని వదిలి వేయబడ్డ ఎన్నో లక్ష్యాలు ఛేదించబడ్డాయి. మనం 'అసాధ్యాన్ని' ఛేదిం చాలని, పంతం పట్టి, కృషి చేస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చు. చరిత్రలో నిలిచిపోవచ్చు.

# 11

# సక్సెస్ అవాలంటే 'లక్కు' ఉండవలసిందేనా?

**హైలెట్స్**

- ❖ అదృష్టం వరించేంతగా కష్టపడగలిగితే ఎవరైనా సక్సెస్ సాధించగలరు.
- ❖ జాతకలకన్నా, తలరాతలకన్నా అదృష్టం కోసం ఉంగరాలలో ధరించే రాళ్లను నమ్మేకన్నా ముందు మనల్ని మనం నమ్ముకోవాలి. మనని మనం నమ్మితే తలరాతను సహితం మార్చేయవచ్చు.
- ❖ సక్సెస్ అవాలంటే కావలసినది సరైన సదుపాయాలు కావు. సరైన దృక్పథం.
- ❖ బాగా కష్టపడితే మన భవిష్యత్ మనమే నిర్ధారించుకోవచ్చు.
- ❖ ఎవరైతే బాగా కష్టపడతారో, వారినే అదృష్టం కూడా వరిస్తుంది.

విజేతలవాలంటే అదృష్టవంతులు అయి తీరాల్సిందానా? మనలో కొందరు సక్సెస్ అయిన వారిని గురించి ఏమనుకుంటారంటే... "సక్సెస్ సాధించిన వారి జీవితాలు వడ్డించిన విస్తర్లు... వారు పట్టిందల్లా బంగారం అయిపోతుంది. అయిపోయింది... వారి బాట పూల బాట..." ఇక తమని గురించి తాము ఈ విధంగా అనుకుంటుంటారు. "మరి నా బతుకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది... ఎదుగూ బొదుగూ లేకుండా ఉన్న చోటే ఉన్నాం. అదృష్టం కలసిరాక ఇలా ఉండిపోవలసివస్తుంది. ఇలా సక్సెస్‌కి అదృష్టానికి లింకు పెట్టేస్తారు. అదృష్టం ఉంటేనే ఎవరైనా సక్సెస్ సాధించగలరని



వీరి నిర్ణయం.

అదృష్టం వరించేంతగా కష్టపడగలిగితే ఎవరైనా సక్సెస్ సాధించగలరని నేను నమ్ముతాను. జాతకాలను, తలరాతలను నమ్మేవాళ్లు మనలో కొందరు ఉన్నారు. వాళ్లకి నేను చెప్పేది ఒక్కటే. జాతకాలకన్నా, తలరాతలకన్నా, అదృష్టం కోసం ఉంగరాలలో ధరించే రాళ్లను నమ్మేకన్నా, ముందు మిమ్మల్ని మీరు నమ్ముకోండి. మిమ్మల్ని మీరు నమ్మితే తలరాతలను సహితం మార్చేయవచ్చు.

సంకల్ప బలంలో అద్భుతాలను సాధించవచ్చునని, తలరాతలను నిజంగా మార్చుకోవాలని నిర్ణయించుకుంటే అలా జరగడం సంభవమేనని, మీకు ఒక (మనకందరికీ తెలిసిన) ఒక ఉదాహరణ ద్వారా చెప్పదలచుకున్నాను.

బ్రిటిష్ వారు మన దేశాన్ని పరిపాలిస్తున్న రోజులవి. మధ్యప్రదేశ్ (నాటి సెంట్రల్ ప్రావిన్స్)లోని మవ్‌లో ఒక పిల్లాడు పురుడుపోసుకున్నాడు. అతను తన కుటుంబంలో 14వ సంతానంగా జన్మించాడు. ఊరికి చివర్లో దూరంగా బతకాలని తరతరాలుగా నిర్ణయించబడిన కట్టుబాట్లు ఏమీ తెలియకుండా బాల్యంలో మొదటి ఐదారేళ్లు ఆడుకోవడంలో గడిపేశాడు. తన తల్లిదండ్రులు తనని పాఠశాలకి గోనె సంచి ఇచ్చి పంపితే ఎందుకో తెలియక మోసుకెళ్లాడు. ఆ తరగతి గదిలో ఒక మూలన తను తెచ్చుకున్న గోనెసంచి పరచుకొని దాని మీద కూర్చోమన్న శాసనాన్ని పూర్తిగా శిరసావహించాడు. ఆ మూలన చెత్తాచెదారం ఉందని నోరు కూడా విప్పేవాడు కాదు. ఆటల సమయంలో మిగతా ఉన్నత కులాల పిల్లలతో ఆడుకోకూడదని చెప్పబడితే

ఆశ్చర్యపడ్డాడు. దాహం వేసినప్పుడు నీళ్ల బిందె ఎదురుగా కనపడుతున్నా వెళ్లి దానిలో నుండి నీరు తీసుకుని తాగే అదృష్టం లేదని తెలుసుకుని కుంగిపోయాడు. ఎవరైనా నీళ్లు పైనుండి పోస్తే ఆ నీళ్లని దోసిట్లో మాత్రమే పట్టుకుని తాగాలన్న రూల్‌ని త్వరలో నేర్చుకున్నాడు. నీళ్లు పోసేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కారు. ఆ పాఠశాలలో పనిచేస్తున్న ప్యూన్ చివరకి నీళ్లు పోసేందుకు కుదర్చబడ్డాడు. ఎప్పుడైనా ఆ ప్యూన్ సెలవు తీసుకుంటే ఆ రోజు ఒక ఆ పిల్లాడికి నీళ్లు ఉండేవికావు. దప్పికతో రోజు మొత్తం గడపవలసిందే. ఎదురుగా నీటి కుండ కనపడుతున్నా ఆ నీరు తన గొంతులోకి వెళ్లే మార్గం లేక ఎందుకిలా జరుగుతందన్న ప్రశ్న ఆ చిన్నారి బుర్రలో కొన్ని వందల సార్లు ఉద్భవించింది.

స్కూల్‌లో మిగతా పిల్లల వల్ల, తనకు చదువు చెప్పే గురువుల వల్ల తనకు నీళ్లు అందించే ప్యూన్ వల్ల తను తెలుసుకున్నదేమిటంటే తను అంటరాని వాడట. బ్రహ్మదేవుడు రాసిన తన తలరాత ప్రకారం తను ఎవరినీ అంటుకోకూడదట. తను ఎవరినైనా ముట్టుకుంటే వాళ్లు మైలపడిపోతారట.

తన వయసుతో పాటు ప్రశ్నించే తత్వం కూడా పెరిగింది. తను అనుభవించే అవమానాలకు, అవహేళనలకు అసలు అర్థం ఉందా అని ఎన్నో ఏళ్లు తనలో తాను మదన పడిపోయేవాడు. బ్రహ్మ రాసిన తలరాతను మార్చడం ఒక్కటే మార్గమని నిశ్చయానికి వచ్చేశాడు. తన తలరాతనే కాదు తన లాంటి ఎన్నో లక్షల మంది అస్పృశ్యుల తలరాతలను మార్చివేయాలని సంకల్పించాడు. అనుకున్నదే తడవుగా తన సంకల్ప బలంతో అహర్నిశలు కృషి చేశాడు. బాగా చదువుకున్నాడు. ప్రపంచంలో ఎన్నో దేశాలను చుట్టి వచ్చాడు. బ్రిటిష్ పాలనను ఎదిరించాడు. భారతదేశ రాజ్యాంగ నిర్మాణం చేశాడు. స్వతంత్ర భారతదేశానికి మొదటి న్యాయశాఖ మంత్రి అయ్యాడు. అతనెవరో మీకందరికీ తెలుసు. అతడే భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్.

నాకు అదృష్టం లేదులే, నా తలరాత ఇంతేలే అంటూ నిరాశా, నిస్పృహలకు అంబేద్కర్ కుంగిపోతే, మన రాజ్యాంగ నిర్మాణం ఇంత అద్భుతంగా జరిగేదేనా? ఒక రకంగా తను ఎన్నో కోట్ల భారతీయుల తలరాతను రాశాడు. తన రాజ్యాంగం ద్వారా మనం అంబేద్కర్ జీవితం ద్వారా నేర్చుకోవలసినదేమిటంటే కష్టపడితే ఏదైనా సాధించవచ్చు. ఎంత ఉన్నత స్థానానికైనా వెళ్లవచ్చు. తలరాతలను మార్చుకోవచ్చు. అదృష్ట దేవతలను సహితం శాసించవచ్చు.

మన గెలుపోటములకు పూర్తిగా మనమే బాధ్యత వహించాలి. మనలో కొందరు తాము ఓడిపోవడానికి కారణం పరిస్థితుల ప్రభావం అని చెబుతుంటారు. వీరికి ఎప్పుడైనా సమస్యలు ఎదురైతే సరిగ్గా ఎదుర్కొనలేరు. అవలీలగా పక్కకి తప్పుకుంటారు. పారిపోతారు. కుంటిసాకులు వెతుకుతూ తమ ఓటమిని సమర్థించుకుంటారు. దీనినే పలాయనవాదం అంటాం. తన ఓటమికి తాను బాధ్యత తీసుకోకుండా ఎదుటి వారి మీదనో, తనకు ఎదురైన పరిస్థితుల మీదనో తన ఓటమి బాధ్యతనంతా వేసేయడమే ఈ పలాయనవాద లక్షణం.

ఇది పలాయనవాదంలో రెండవ రకం. ఇలాంటి పరిస్థితుల్లో, మనిషికి కనీసం తన



మీద తనకు నమ్మకం లేనప్పుడు సక్సెస్ గురించి కలలు కనే అర్హత ఉందంటారా చెప్పండి? మనం గనక ఈ రుగ్మతలతో ఉంటుంటే మనకి సక్సెస్ రాదు అని వేరే చెప్పనవసరం లేదనుకుంటా.

అసలు విషయం ఏమిటంటే సక్సెస్ సాధించిన వారందరికీ నిజంగా జీవితం వడ్డించిన విస్తరి కాదు. వారికి కూడా సమస్యలు ఉన్నాయి. కాకపోతే వారు ఆ సమస్యలను అధిగమించారు. తాము నిజంగా జీవితంలో పైకి రావాలంటే తమని తాము నమ్ముకోవాలి కానీ, వేరే ఎవరినీ నమ్మకూడదని భీష్మించుకుని కూర్చుని మరీ సక్సెస్ సాధించారు.

మనకి అదృష్టం లేదని, మనం మంచి ధనవంతుల కుటుంబంలో పుట్టలేదని, మనకి లక్కు చిక్కడం లేదని బాధపడే వాళ్లను నేను సూటిగా ఒక ప్రశ్న వేయాలనుకుంటున్నాను. మనకి అన్నీ అవయవాలు సరిగ్గా ఉన్నాయి. అవి లేని వారు కూడా జీవితంలో ఎంతో ఉన్నత స్థానాలను అధిరోహించి ఆదర్శంగా నిలుస్తున్నారు కదా? కళ్లులేని వారు, కాళ్లు లేని వారు, చెవిటి వారు, మూగవారు పట్టుబట్టి మరీ ఐఏఎస్‌లు అవుతున్నారు. పట్టుబట్టి మరీ అని ఎందుకంటున్నానంటే వారు ఐఏఎస్ పరీక్షలలో విజయం సాధించడం మాత్రమే కాకుండా, కోర్టుల్లో కూడా విజయం సాధించి మరీ కలెక్టరు గిరీ చేస్తున్నారు. నాకు ఇలాంటి వారు ఎంతో మంది తెలుసు. ముందు అందరిలాగ ఐఏఎస్ పరీక్షకు బాగా కష్టపడి చదివి ర్యాంకు తెచ్చుకున్న తరువాత, వారు ఉద్యోగంలో చేరడానికి ప్రభుత్వం వారు ఆటంకాలు కల్పిస్తుంటారు. “కళ్లు లేని వారు కలెక్టర్ కుర్చీల్లో ఎలా కూర్చోగలరు?’ ’ “కలెక్టర్ అంటే ప్రజల సమస్యలని వినాలి. అప్పుడు బధిరులకు ఎలా ఐఏఎస్ శిక్షణని

ఇస్తాం” అని ప్రభుత్వం చెప్పడంతో వారు కోర్టులని ఆశ్రయించి, అక్కడ లక్షలు ఖర్చు పెట్టి, ఎంతో టైం వేస్టు చేసుకుని, మరీ కోర్టుల చుట్టూ తిరిగి కలెక్టర్ గిరీ చేస్తున్నారు. ఇటీవల ఒక బధిరుడు పోరాడగా పోరాడగా రెండు సంవత్సరాల అనంతరం తనకి ఐఏఎస్ ఇచ్చారని మనం పత్రికల్లో చదివాము.

మా బ్యాచ్‌లో కృష్ణ గోపాల తివారీ అనే అంధుడు ఐఏఎస్‌కి సెలెక్ట్ అయ్యాడు. అతడు మాతో పాటు కలిసి ట్రైనింగ్ చేశాడు. అయితే నాలుగు నెలలు మా ట్రైనింగ్ అయిపోయిన తర్వాత మమ్మల్ని కలిశాడు. ఒక్కసారి ఊహించండి కృష్ణగోపాల తివారి గురించి. ఐఏఎస్‌కి ప్రిపేర్ అవాలంటే ఎన్ని పుస్తకాలు చదవాలి? ఎన్ని గంటలు కష్టపడాలి? ఒక సర్వే ప్రకారం ఐఏఎస్ పరీక్షలో అన్నీ ప్రశ్నలకు జవాబు రాయాలంటే సుమారుగా 150 వివిధ పుస్తకాలు చదవాలి. ఎలా చదివాడు తివారి? ఎలా ఐఏఎస్‌కి ప్రిపేర్ అయ్యాడు?

నేను కృష్ణగోపాల తివారిని చాలా దగ్గరగా చూశాను. తన కథని ఎక్కువగా బైటకు చెప్పడం ఇష్టముండదు తివారికి. తను అంధుడు అంటే ఒప్పుకోడు తివారి. నాకు, మీకు ఏమిటి తేడా అని అంటాడు. అతని గురించి, తన సమ్మతితో, ఏవైతే చెప్పవచ్చో ఆ విషయాలు చెబుతాను. అతను సాధారణ రైతు కుటుంబంలో పుట్టాడు. తన చదువు బాగానే సాగేది. గుర్తుంచుకోండి. తివారి ఒక మారుమూల కుగ్రామంలో, ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండేవాడు. తన ఎనిమిదవ తరగతిలో చూపు మందగించడం మొదలైంది. డాక్టర్లకు చూపించడం లేటు అయ్యింది. ఒక సంవత్సరం ఇలా జరిగింది. తరువాత చూపెడితే డాక్టర్లు చేతులెత్తేశారు.

కొన్నాళ్లకు అందరి పిల్లల్లాగ తివారి ఆడుకోలేకపోయే వాడు. స్కూల్ కూడా మానివేయాల్సి వచ్చింది. తరువాత కొంత మంది స్నేహితుల సహాయంతో అతను కాలేజీకి వెళ్లి వచ్చేవాడు. అప్పుడు తనకి ఐఏఎస్ గురించి తెలిసింది. తెలుసుకున్నదే తడువుగా తనూ ఐఏఎస్ అవుతానని ఇంట్లో వారికి చెప్పాడు. వారు కూడా అప్పుడు అంత సీరియస్‌గా తీసుకోలేదు. డిగ్రీ రెండవ సంవత్సరం వరకూ కొంత మసకగా కనపడే వస్తువులు పూర్తిగా కనపడడం మానేశాయి. డిగ్రీ తరువాత తన తోటి స్నేహితులు రైల్వే క్లర్కులకు ప్రిపేర్ అవుతుంటే తను మాత్రం ఐఏఎస్ అంటుండేవాడు.

మరొక్కసారి ఆలోచించండి. ఐఏఎస్ పరీక్ష గురించి ఊహించాలంటే ఎన్ని పుస్తకాలు మన మైండ్‌లో తిరుగుతాయి? వాటిని ఎవరైనా ఎలా చదువుతారు? చదివిన విషయాలను గుర్తు ఎలా పెట్టుకుంటారు?

తివారి వాళ్ల స్నేహితులు చిన్నచిన్న ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతుంటే వారిని తివారి తన దగ్గరకు వచ్చి చదువుకోమని ఆహ్వానించే వాడు. వారిని వారు చదివేదేదో బిగ్గరగా చదవమని వేడుకునే వాడు. వారు చదివేది మొదట్లో చాలా శ్రద్ధగా చెవులు రిక్కించి వినేవాడు. తరువాత ఒక వాక్‌మాన్ కొనుక్కున్నాడు. వాళ్లు చదివినదంతా దాని ద్వారా రికార్డు చేసి కాసెట్‌లు తయారుచేసుకున్నాడు. ఎన్ని వేల గంటలు కష్టపడి ఉంటాడు తివారి? ఎన్ని రోజులు తనకి తాను ధైర్యం చెప్పుకుని ఉంటాడు? అన్నీ అవయవాలు సరిగ్గా ఉంటేనే మనం సరిగ్గా చదవలేము. మనకి ఏకాగ్రత కుదరాలంటే

ఎన్ని సదుపాయాలు కావాలి?

ఉక్కపోస్తుందని, లైటు సరిగ్గా లేదని, పెన్ను సరిగ్గా పనిచేయడం లేదని, ఈ రోజు తిండి సరిగ్గా లేదని, కూర్చునే కుర్చీ ఎత్తు తక్కువగా ఉందని, టీ వేడిగా లేదని మనం అనునిత్యం ఏదో ఒక కుంటిసాకు వెతుక్కుంటాం. సరిగా చదవలేకపోవడానికి. నిజంగా అనుకున్నది సాధించాలంటే ఇవన్నీ అవసరం లేదని మనం తెలుసుకున్ననాడే సక్సెస్ మనకి చేరువలోకి వస్తుంది. అన్నీ సదుపాయాలు ఉంటేనే సక్సెస్ సాధ్యమనుకునే వారందరూ తెలుసుకోవాల్సిన విషయం ఒకటుంది. అదేమిటంటే సక్సెస్‌కి కావలసినది సరైన సదుపాయాలు కావు. సరైన దృక్పథం. సరైన ఆటిట్యూడ్.

రైల్వే కూలీలుగా పనిచేసి సివిల్స్ సాధించిన వారి గురించి నాకు తెలుసు. పదవ తరగతి రెండుసార్లు తప్పి, ఇంటి నుండి తరిమివేయబడి, లారీ క్లీనర్‌గా పనిచేసి, సివిల్స్ సాధించిన వారు నాకు తెలుసు. తండ్రి చనిపోతే తల్లి కూలీ చేసుకుని కుటుంబ భారాన్ని మోస్తుంటే ఆ తల్లి వేదన, కాయకష్టం చూడలేక పరిస్థితులను మార్చాలంటే సివిల్స్‌లో ర్యాంకు సాధించి కలెక్టర్ అవాలని కష్టపడి, కసితీరా చదివి, మెప్పు పొందిన వారు నాకు తెలుసు. తండ్రి రిక్ష తొక్కి కుటుంబాన్ని పోషిస్తుంటే, టీ తాగితే ఒక్క రూపాయిన్నర డబ్బులు అయిపోతున్నాయి. ఈ రోజు టీ బదులు మంచినీళ్లతో సరిపెట్టుకుందాం అని తనకు తాను చెప్పుకుని యావత్ భారతదేశం అబ్బురపడేలా సివిల్స్‌లో 7వ ర్యాంకు సాధించిన వారు నాకు తెలుసు. సివిల్ సర్వీస్ పరీక్షకు ప్రిపేర్ అవాలంటే ఎన్నో పుస్తకాలు కొని చదవాలి. అవి మరీ ఎక్కువ ఖర్చుతో కూడుకున్నవి కాదు. అయినా చేతిలో వంద రూపాయలు కూడా లేని పేదరికంలో, సివిల్స్ పుస్తకాల కోసం మెడికల్ షాపులో పనిచేసి, గంటకు 5 రూపాయలు సంపాదించి తన సివిల్స్ పుస్తకాలన్నీ తనే కొనుక్కుని చదువుకుని అఖిల భారత స్థాయిలో 9వ ర్యాంకు సాధించిన వారిని గురించి నాకు తెలుసు.

ఇప్పుడు చెప్పండి. మనకు ఉండే సదుపాయాలు, మనకి ఉన్న అవకాశాలు, పైన పేర్కొన్న వారి (దగ్గర ఉన్న వసతుల)కన్నా మెరుగా కాదా? నిజం ఒప్పుకోండి. వారికున్న పరిస్థితులతో మనకున్న పరిస్థితులను పోల్చుకుంటే ఎవరు అదృష్టవంతులు? మరి వారు అదృష్టవంతులు కాకపోతే వారిని సక్సెస్ ఎలా వరించింది? నేను ఎప్పుడూ చెబుతూ ఉంటాను. ఇంతకు ముందు కూడా మీకు మనవి చేశాను. Luck also favours those who work hard. ఎవరైతే బాగా కష్టపడతారో, వారినే అదృష్టం వరిస్తుంది. సోమరిపోతుల్లాగా జాతకాలని నమ్ముకుని, గ్రహాలకు శాంతి చేయించి, కర్మ సిద్ధాంతాన్ని వల్లిస్తూ కాలం వెళ్లదీస్తే, మనం సక్సెస్ సాధించలేము. వేరే వారు సక్సెస్ సాధిస్తూ ఉంటే నోరెళ్లబెడతాము. ప్రకృతిలో పక్షులకు కావలసినంత ఆహారం దొరుకుతుంది. కానీ ప్రకృతి పక్షుల గూళ్లలోకి ఆహారాన్ని అందివ్వదు. దాని కోసం పక్షులు కష్టపడాలి. కష్టపడితే పక్షి బతుకుతుంది. కష్టపడకుండా బద్ధకిస్తే వేరే పక్షికి ఆహారమైపోతుంది, లేదా నీరసించి చనిపోతుంది. ఇక్కడ పక్షి చనిపోవడానికి ఏదైనా కారణం ఉంది అంటే – దాని బద్ధకమే. "నన్ను దేవుడు పుట్టించాడు. నారు పోసిన వాడు నీరు పోయడా" అనుకుంటూ మెట్ట సిద్ధాంతం పక్షి వల్లించదనుకోండి... ఎవరికి నష్టం? పక్షికే.

ఇలా ఎందుకు చెబుతున్నానంటే – ఎలాగైతే ప్రకృతిలో పక్షులకు కావలసినంత

ఆహారం దొరుకుతుందో, అలాగే ఏదైనా సాధించి చూపించాలనుకునే వారికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. పొట్ట కూటి కోసం ఎలాగైతే పక్షులు కష్టపడాలో, సక్సెస్ సాధించాలనుకునే వారు కూడా కష్ట పడాలి. నన్ను అదృష్టం వరిస్తుంది, సరస్వతీ దేవి కటాక్షిస్తుంది. కాళీమాత కరుణిస్తుంది అంటూ మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చుంటే జీవితంలో ఎప్పుడూ పైకి ఎదగలేము.

అదృష్టం లేదు అని ఖాళీగా తిరుగుతుంటే – ప్రయోజనం ఏమీ ఉండదు. నా జాతకం ఇంతే అని మనల్ని మనం సమర్థించుకుంటూ కూర్చుంటే ఫలితం లేదు. ప్రతి వ్యక్తిలోనూ ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి మనిషిలోనూ ప్రతిభ ఉంటుం ది. దానిని వెలికి తీసి, ప్రతిభకు పదును పెట్టడమే మనం చేయవలసిన పని. ఆ పనిని ఎంత బాగా చేయగలమో మనం అంత ఎక్కువ సక్సెస్ అవుతాము.

చివరగా మనం తెలుసుకోవలసినది ఏమిటంటే మనకిప్పుడు కావలసినది కర్మ సిద్ధాంతంపై చర్చ కాదు. పూనుకుని ఏదో ఒక పని చేసేయాలి. అనుకున్నది సాధించాలని అహోరాత్రాలు శ్రమించాలి. అదృష్టదేవతలను కాదు మనం తిట్టుకోవలసినది. మనం తిట్టుకోవలసినది మన అసమర్థతలను. అసమర్థతని ఒప్పుకుని, ఎలా దానిని అధిగమించాలో ఆలోచించాలి.

ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి. బ్రహ్మ మన తలరాతను రాశాడంటారు. అది నేనూ, మీరూ చూడలేదు. కానీ మనకి తెలిసినదేమిటంటే బాగా కష్టపడితే మాత్రం మన భవిష్యత్ మనమే నిర్ధారించుకోవచ్చు. బాగా శ్రమిస్తే, అనుకున్నది సాధించగలిగితే ఆటోమేటిక్‌గా మన జాతకం మారిపోతుంది. అప్పుడు ఏ గ్రహశాస్త్రాల మీద ఆధారపడవలసిన అవసరం ఉండదు. ఏ జాతక చక్రాల దోషాలను సరిచేసుకోవాల్సిన అగత్యాలు ఉండవు.

మన జాతకం మనమే రాసుకుందాం. మన జీవితం మనమే తీర్చి దిద్దుకుందాం. ఏ అదృష్టాలనూ నమ్ముకోవద్దు. చివరగా మరొక్కసారి ముందు చెప్పిందే చెబుతున్నాను. Luck also favours those who work hard. ఎవరైతే బాగా కష్టపడతారో, వారినే అదృష్టం కూడా వరిస్తుంది.

# 12

# ఓటమిని ఎదుర్కొనే సత్తా ఉంటేనే సక్సెస్ సాధ్యం

**హైలెట్స్**

- కుంగిపోయి కూలిపోవాల్సిన సందర్భాలు ఎదురైనా వెనుదిరగలేదు. సక్సెస్ బాటని వదలకుండా పట్టుకున్నారు. వీరికి ఓటమిని ఎదుర్కొనే సత్తా ఉంది. అందుకే వీరిని సక్సెస్ వరించింది.
- మనకెన్నో అడ్డంకులు వచ్చి మన సంకల్పబలానికి అగ్నిపరీక్షలు పెడతాయి. వాటిని ఎదుర్కొని, వాటితో పోరాడి, మన లక్ష్యం వైపు దృష్టి పెట్టాలి.
- సక్సెస్ సాధించిన వారందరూ జీవితంలో ఎప్పుడూ ఫెయిల్ కాలేదనుకుంటే పొరపాటే అవుతుంది. వారు కూడా మామూలు మనషులే వారికీ ఓటమి ఎదురైంది.
- ఏ మార్గం ఎంచుకున్నామన్నది పాయింటు కాదు. ఎంచుకున్న మార్గంలో సక్సెస్ సాధించామా లేదా అనేదే పాయింటు

మనకు ఎంతో మంది సక్సెస్ సాధించిన వారిని గురించి తెలుసు. ఎందరో మహానుభావులు. మనకి ప్రేరణ ఇచ్చినందుకు వారికందరికీ వందనాలు. వీరి కథలు, అనుభవాల వల్ల మనం ఎంతో నేర్చుకుంటున్నాం. నేను విజేతల కథలు అనేకం చదివాను. నేను గమనించినది ఏమిటంటే... వీరికి దేశాలు వేరు, ప్రదేశాలు వేరు, పరిస్థితులు వేరు,

సందర్భాలు వేరు, సమస్యలు వేరు, సవాళ్లు వేరు, అయినా కానీ, ఒక్క విషయం మాత్రం అందరికీ సమానమే. ఒక్క ముక్కలో చెప్పాలంటే వీరు సమస్యలకు స్పందించిన తీరు మాత్రం ఒక్కటే.

ఒక ఆంగ్ల సామెత చెప్పినట్లు - వీరందరూ పుడుతూనే తమ నోట్లో వెండి చెంచాలతో పుట్టలేదు. కర్ణుడు పుడుతూనే కవచ కుండలాలతో పుట్టినట్లు, వీరు పుట్టినప్పుడే తమతో పాటు సక్సెస్‌ని తోడు తెచ్చుకోలేదు. వీరికి కూడా సమస్యలు ఎదురయ్యాయి. సక్సెస్ సాధించాలని పరుగు పెట్టినప్పుడు వీరి బాట పూల బాట కాలేదు. ఎన్నో అడ్డంకులు, అవరోధాలు ఏర్పడ్డాయి. వీరిని కుంగదీశాయి. అయినా కానీ, వీరు అనుకున్నది సాధించేంతవరకూ వెన్ను చూపలేదు. ఎన్నో ప్రయత్నాలు విఫలమైనా, నిరుత్సాహపడలేదు. రెట్టించిన ఆత్మ విశ్వాసంతో మళ్లీ ప్రయత్నించారు. కుంగిపోయి కూలిపోవాల్సిన సందర్భాలు వచ్చినా, తాము మాత్రం వెనుదిరగలేదు. సక్సెస్ బాటని వదలకుండా పట్టుకున్నారు. వీరికి ఓటమిని ఎదుర్కొనే సత్తా ఉంది. అందుకే వీరిని సక్సెస్ వరించింది.

సక్సెస్‌ని గురించి మనం ఎన్నో కలలు కంటుంటాం. కలలు కనగానే సక్సెస్ రాదు. కలల్ని సాకారం చేసుకోవడానికి మనం ఎంతో కృషి చేయాలి. మనం అలా కృషి చేస్తున్నప్పుడు మనకెన్నో అడ్డంకులు ఎదురవుతాయి. మన సంకల్ప బలానికి అగ్ని పరీక్షలు పెడతాయి. మనం వాటిని ఎదుర్కొని, వాటితో పోరాడి, మళ్లీ మన లక్ష్యం వైపు దృష్టి పెట్టాలి. సమస్యలు వచ్చినప్పుడు భయపడకూడదు. వెనకడుగు వేయరాదు. "నాకే ఎందుకు ఇన్ని సమస్యలు" అంటూ వేదాంతిలా మారకూడదు. అనుకున్నది సాధించాలనుకున్నప్పుడు లక్ష్యం గురించి తప్పించి వేరే ఏ విషయం గురించి ఆలోచించకూడదు. సక్సెస్ సాధించిన వారందరూ జీవితంలో ఎప్పుడూ ఫెయిల్ కాలేదనుకుంటే పొరపాటే అవుతుంది. వారు కూడా మామూలు మనుషులే. వారికీ ఓటమి ఎదురైంది. మనం కూడా ఓటమిని ఎలా ఎదుర్కోవాలో తెలుసుకుందాం. మీకు ఒక ఉదాహరణ చెబుతాను.

మీరెప్పుడైనా జులియో ఇగ్లేసియాస్ పేరు విన్నారా? జులియో, 1943, సెప్టెంబర్ 23లో స్పెయిన్ దేశంలో పుట్టాడు. అతను బాగా సరదాగా ఉండేవాడు. స్పెయిన్‌లో ఫుట్‌బాల్ క్రీడ అంటే యువత చెవి కొసేసుకుంటుంది. పది సంవత్సరాల నాడు జులియో నిర్ణయించుకున్నాడు. ఏమని అంటే ఫుట్‌బాల్ క్రీడలో అందరికంటే ఎక్కువ పేరు తెచ్చుకుందామని. మరి దానికి కొలమానం? "అందరికంటే ఎక్కువ" అనే దాన్ని ఎలా కొలవడం? స్పెయిన్ దేశంలో ఫుట్‌బాల్ క్లబ్బులు ఉంటాయి. ఆ ఫుట్‌బాల్ క్లబ్బులు ఎప్పుడూ ఒకదానితో ఒకటి పోటీ పడుతుంటాయి. ఆ పోటీల్లో ఎక్కువ శాతం రియల్ మాడ్రిడ్ అనే క్లబ్బు కప్పులు కొట్టుకుపోతుంది. ఆ క్లబ్బుకి మనవాడు ఆడాలని నిర్ణయించుకున్నాడు.

అతను అనుకున్నదే తడవుగా పగలనక, రాత్రనక ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తూ ఉండేవాడు. ఆడగా ఆడగా తనకు గోల్ కీపింగ్ బాగా సరదాగా అనిపించేది. ఇక గోల్‌కీపర్ అవుదామని నిశ్చయించుకున్నాడు. రియల్ మాడ్రిడ్ జట్టుకి గోల్ కీపింగ్



బాధ్యతలు అంటే – తన పేరు స్పెయిన్ మొత్తం మార్మోగి పోతుంది. ఈ కలను ఎలాగైనా సాకారం చేసుకోవాలని జులియో పట్టుదల. ఆ పట్టుదలకు తగ్గట్లే ప్రాక్టీస్ చేయడం మొదలుపెట్టాడు.

అతనికి 20 సంవత్సరాలు వచ్చే సరికి తన కలకు చేరువ అవుతున్నాడు. అతను రియల్ మాడ్రిడ్ క్లబ్బుకి గోల్ కీపర్‌గా బాధ్యతలు స్వీకరిస్తూ కాంట్రాక్టు కూడా సంతకం చేశాడు. అతను అనుకున్నది సాధించాడు. ఇక మైదానంలో రియల్ మాడ్రిడ్ జట్టు తరపున ఆడాలి. కొన్ని రోజులలో తను రియల్ మాడ్రిడ్ లోగో ఉన్న బట్టలు ధరించి అందరి ముందుకు రాబోతున్నాడు. అబ్బో! ఆ ఊహే పరమాద్భుతం. రియల్ మాడ్రిడ్ క్లబ్బు కోసం ఆడబోతున్న తను ఎంతో అదృష్టవంతుడినని సంబరపడుతున్నాడు జులియో. అతని ఆట తీరు తెలిసిన ఫుట్‌బాల్ పండితులు, విశ్లేషకులు – అసలు అదృష్టం రియల్ మాడ్రిడ్ క్లబ్బుది అని నమ్ముతున్నారు. ఎందుకంటే జులియో అందరి గోల్ కీపర్లలా కాదు. ఎంతో కసి ఉన్నవాడు. అనుకున్నది సాధించేవరకూ వదిలిపెట్టడు. త్వరలో యావత్ ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు పొందే గోల్ కీపర్‌లా అవతరించబోతున్నాడు.

ఇంతలో విధి వక్రించింది. 1963, సెప్టెంబర్ 22వ తేదీ సాయంత్రం జులియో తన స్నేహితులతో కలిసి సరదాగా గడుపుదామని కారులో విహార యాత్రకి బయలుదేరాడు. వాళ్ల ప్రయాణిస్తున్న కారు ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. జులియో కారుని కంట్రోల్ చేయలేకపోయాడు. కారు ఎన్నో పల్టీలు కొట్టింది. కట్ చేస్తే, రెండవ రోజు స్పృహలోకి వచ్చిన జులియో తనని తాను హాస్పిటల్ బెడ్ మీద చూసుకున్నాడు. తనకి పూర్తిగా తెలివి

తెలిసే లోపల డాక్టర్ల రిపోర్టు గురించి తెలిసిపోయింది. తను 'పారాపరెక్సియా' అంట. సామాన్యుల పరిభాషలో వెన్నెముక చిన్నదైపోతుం దట. వెన్నెముకకు సంబంధించి అన్నీ అవయవాలు ప్రభావితమవుతాయంట. ఇక కాళ్ల సంగతి చెప్పనవసరమే లేదు. నడుం ప్రాంతం నుంచి కింది వరకూ అన్నీ చచ్చుబడిపోయి ఉంటాయట. తను ఎప్పుడూ లేచి నడవలేడు అని డాక్టర్లు తేల్చి చెప్పేశారు. జులియో కన్న కల – రియల్ మాడ్రిడ్ టీమ్‌కి గోల్ కీపర్‌గా వ్యవహరించాలని. అది నెరవేరబోతున్నంతలో కల అంతా కల్లేనని విధి తేల్చింది. పట్టరాని దుఃఖంతో జులియో కుంగిపోయాడు. అతడూ మామూలు మనిషే. తనకి కూడా ఫీలింగ్స్ ఉంటాయి. తను నడవలేని స్థితిలో పూర్తిగా వీల్ చైర్‌కి అంకితమవ్వాలి. తన ఈ తలపులే మళ్లీ మళ్లీ జూలియోని కుంగదీస్తున్నాయి.

తన జబ్బు 'పారాపరెక్సియా'కి ఎల్లప్పుడూ ట్రీట్‌మెంట్ తీసుకోవలసినదే. జూలియో కూడా 2010 అక్టోబర్ వరకూ ట్రీట్‌మెంట్ తీసుకుంటూనే ఉన్నాడు. అయితే జులియో విధి కుంగదీస్తే కొంత కుంగిపోయాడు కానీ కుప్పకూలి పోలేదు. నీ బతుకింతేలే అంటూ బతుకు వెళ్లదీస్తూ వీల్ చైర్‌కి అంకితమై పోలేదు. బతుకును ఒక సవాలుగా తీసుకున్నాడు. మళ్లీ ఫుట్‌బాల్ జోలికి వెళ్లడం అవివేకం అని తనకి తాను సర్దిచెప్పుకున్నాడు. ఫుట్‌బాల్‌ని ఆడలేను. కనీసం నుంచోలేనా? నడవలేనా? అని తనని తాను కొన్ని లక్షలసార్లు ప్రశ్నించుకు న్నాడు. వెన్నెముక జబ్బు అన్ని అవయవాలను ప్రభావితం చేస్తుందట. అయినా నేను మాత్రం ఆ జబ్బుని నా మీద గెలవనీయను అని ప్రతిజ్ఞ పూనాడు.

ఇదే ఊపుతో మంచం మీద నుంచి లేచి నిలబడాలని అనుకున్నాడు. లేచి నిలబడ్డాడు. కానీ సరిగ్గా నడవడానికి పట్టిన సమయం ఎంతో తెలుసా... మూడు సంవత్సరాలు. మూడు సంవత్సరాలు అతను హాస్పిటల్ బెడ్డుకు అతుక్కుపోవలసి వచ్చింది. అయినా తను ఖాళీగా కూర్చోలేదు. "నాకే ఎందుకిలా జరిగిందని" దేవుడిని తిట్టుకుంటూ, గోళ్లు గిల్లుకుంటూ కాలం వెళ్లదీయలేదు. ఏదో ఒకటి సాధిద్దాం అని సంకల్పించాడు. తన చదువు గుర్తుకు వచ్చింది. ఫుట్‌బాల్ ఆట కోసం దానిని ఆపేశాడు. అతడు అంతకుముందు న్యాయశాస్త్రం చదివే విద్యార్థి. న్యాయశాస్త్రాన్ని పూర్తి చేశాడు. ఎప్పుడైనా తన గురించి బాధ వేస్తే, రాత్రిళ్లు ఒంటరిగా ఉన్నప్పుడు, తన భవిష్యత్ గురించి తలచుకుంటుంటే అసంకల్పితంగా కవితలు వచ్చేవి. అవి తను పేపరు మీద పెట్టేవాడు.

తను హాస్పిటల్‌లో ఉన్న మూడేళ్లు చాలా విచిత్రంగా గడచాయి. గుండెల్లో బాధ, చేతిలో కలం, కళ్లల్లో నీళ్లు ఎప్పుడూ ఉండేవి. అలా తాను ఎన్నో కవితలు రాశాడు. వెన్నెముక జబ్బు చేతలకు సోకకుండా ఉండాలని, చేతికి నైపుణ్యం పెరగాలని, హాస్పిటల్‌లో ఒక నర్సు జులియోకి గిటారు ఇచ్చింది. గిటారుని జులియో అంతకుముందు ఎప్పుడూ పట్టుకోలేదు. అయినా ఆ మూడు సంవత్సరాల కాలంలో తను ఎంతో నైపుణ్యంగా వాయించడం నేర్చుకున్నాడు. మెల్లి మెల్లిగా తను రాసిన పాటలని గిటారు మీద వాయిస్తూ పాడటం మొదలు పెట్టాడు. యాక్సిడెంట్ జరిగిన మూడేళ్లకి తను అనుకున్నది సాధించాడు. అందరూ తను హాస్పిటల్ నుంచి బైటకు వీల్ చెయిర్ మీద వస్తాడనుకుంటే తను మాత్రం హాస్పిటల్ నుంచి బైటకు నడిచివెళ్లాడు. ఠీవిగా, దర్జాగా... అసలు 'పారాపరెక్సియా' లేనివాడిలా... ఇది సంకల్ప బలం వల్లే సాధ్యమైనది.



1968లో స్పెయిన్‌లో బెనిడోమ్ ఇంటర్నేషనల్ సాంగ్ ఫెస్టివల్ జరుగుతుంది. తనకి యాక్సిడెంట్ జరిగి అప్పటికి ఐదేళ్లు కూడా కాలేదు. తను ఆ పాటల పోటీలో పాల్గొన్నాడు. తను రాసిన పాట "La vida sigue igual". (దాని అర్థం "జీవితం అలాగే నడుస్తూ ఉంటుంది"). గిటారు పుచ్చుకుని పాడాడు. ఆ పాటకి ప్రథమ బహుమతి వచ్చింది. ఆ పాట ఎంత ప్రాచుర్యం పొందిందంటే అదే పాట పేరుతో, జులియో కథతో సినిమా కూడా తీశారు.

పట్టుబట్టి మరీ ఇంగ్లిష్ నేర్చుకున్నాడు జులియో. ఆంగ్లంలో కూడా అవలీలగా పాడటం అలవాటైంది. ఇంకేముంది అప్పటి నుంచి జులియో వెనుతిరిగి చూడలేదు. తన గానం, సంగీతం, సాహిత్యమంటే కళాపిపాసులకు పిచ్చి అని తెలుసుకున్నాడు. ఎన్నో వేల పాటలు పాడాడు. ఎన్నో లక్షల మంది అభిమానుల్ని సంపాదించుకున్నాడు. కొన్ని కోట్ల రూపాయలు ఆర్జించాడు. ఇప్పటి వరకూ జులియోకి సంబంధించిన 77 ఆల్బమ్‌లు విడుదలయ్యాయి.

అతని పాటలు, ఆల్బమ్‌లు ఎన్నోసార్లు గ్రామీ అవార్డులకు, ఇతర అవార్డులకు నామినేట్ అయ్యాయి, బహుమతులు పొందాయి. నేడు జులియో పాటలు పద్నాలుగు భాషల్లో విడుదలయ్యాయి. ఇతని పాటలు సుమారు 300 మిలియన్ రికార్డులు అమ్ముడయ్యాయని అంచనా... 'సోనీ మ్యూజిక్ ఎంటర్‌టైన్‌మెంట్' సంస్థ ప్రకారం ప్రపంచంలోని ప్రతిభావంతులైన మొదటి 15 మంది గాయకుల్లో జులియో మొదటి స్థానం సంపాదించాడు. జులియో చిన్ననాటి కల అయిన 'రియల్ మాడ్రిడ్ గోల్ కీపింగ్'

నెరవేరలేదు. విధి వక్రించింది. అయినా సరే జులియో విధికి తలవంచలేదు. తనంటే ఏమిటో నిరూపించాడు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో అద్భుతాలు చూపించలేకపోయానా, ఆడిటోరియాలలో, మ్యూజిక్ హాళ్లలో జనాలని తన పాటలతో, సంగీతంతో ఉర్రూతలూగించాడు. విధి అడ్డంకి కల్పించాలని చూస్తే తను ఇంకొక ఫీల్డ్‌లో రాణించాడు. తన కాళ్లకు ఇప్పటికీ సరైన శక్తి లేదు. సరిగ్గా నడవలేడు, సరిగ్గా నిల్చోలేడు. కానీ, తన సంకల్ప బలం వల్ల సంగీత ప్రేమికుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని పాతుకుపోయాడు.

మనలో ఎంత మంది జులియోలా ఓటమిని handle చేయగలం? (ఓటమిని ఎదుర్కొని – ఓటమిని నిర్వహించగలం) మనం అనుకున్నట్లు జరగడం లేదని మనం ఎంతగా చికాకు పడిపోతామో కదా! జులియోకి 1963లో జరిగినట్లు మనకి ఎవరికైనా జరగవచ్చు. ఒక అడ్డంకి, అడ్డుపుల్ల మన జీవితాల్లోకి ఎప్పుడైనా రావొచ్చు... అది మన సక్సెస్ వైపు పయనంలో చివరి మజిలీ కాకూడదు. మనం వెళ్లే దారిలో అడ్డంకులు ఉంటే వాటిని తొలగించుకోవలసిన బాధ్యత కూడా మనదే. వాటిని ఒక్కొక్కటిగా తొలగించుకుని ముందుకు సాగితేనే సక్సెస్ వస్తుంది. ఒకవేళ ఆ మార్గమే మూసుకుపోయిందనుకోండి, డీలాపడిపోకండి. వేరే మార్గాన్ని అనుసరించండి. కొత్త మార్గంలో నూతన ఉత్సాహంతో ఉరకలు వేయండి. ఆ మార్గాన్ని పట్టుకుని సక్సెస్ సాధించండి. ఇక్కడ ఏ మార్గం ఎంచుకున్నామన్నది పాయింటు కాదు. ఎంచుకున్న మార్గంలో సక్సెస్ సాధించామా, లేదా అనేదే పాయింటు.

మనం ఎంచుకున్న మార్గంలో మనకి అడ్డంకులు ఎక్కువ అవుతుంటే డీలా పడిపోయి, కుంగి, కృషించి ఇప్పటివరకూ మనం చేసిన శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరులా వృథా అవుతుందని, ఆవేశమొచ్చి దేవుడిని పిచ్చి తిట్లు తిట్టడం కాదు చేయవలసింది. మనం సక్సెస్ అవాలంటే ఓటమిని ఎదుర్కోవడం కూడా నేర్చుకోవాలి. ఓటమి వచ్చినప్పుడు మనం ఎంత శక్తి మంతులమో తెలుస్తుంది. రుద్రవీణ సినిమాలో అన్నట్లు "కష్టం వస్తేనే కదా! గుండెబలం తెలిసేది. దుఃఖానికి తలవంచితే, తెలివికింక విలువేది?".

అందుకే మనకి వచ్చే కష్టాలు మనని కుంగదీయకుండా చూసుకోవాలి. అవి మన మనస్సులో, మైండ్లలల్లో పాతుకుపోయాయంటే మనం కుప్పకూలిపోయి, మళ్లీ పైకి లేవలేనంత దెబ్బతీయవచ్చు. కష్టం వస్తే కొన్ని కన్నీటి బొట్లు కార్చండి... తప్పులేదు. కానీ, దుఃఖసాగరాల్లో మాత్రం దయచేసి మునిగిపోవద్దు. కష్టాలు మనలోని ఆత్మవిశ్వాసాన్ని మాత్రం దెబ్బతీయకుండా చూసుకోండి. పాత సామెత చెప్పినట్లు "కష్టాలు మనుషులకు కాకుండా మానులకు వస్తాయా?".

మనకి వచ్చిన కష్టానికే కష్టం వచ్చేలా మన వైఖరి ఉండాలి. మనందరిలో ఎంతో అపారమైన నైపుణ్యం ఉంది. దానిని వృథా చేయవద్దు. మీరు ఒక పరీక్ష పాసవలేదనుకోండి. దాని అర్థం మీరు సత్తా లేనివారని కాదు. మీ సత్తా వేరే ఫీల్డ్‌కి ఎక్కువ ఉపయోగపడుతుందని మీరు ఎంసెట్ పాస్ కాకపోతే పూర్తిగా పనికిరారని ఎవరు చెప్పారు? ఇంజనీరింగ్ పరీక్ష పాస్ కాకపోతే, మీరు మంచి ఇంజనీరు కాలేరు అని మాత్రమే



అర్థం. మీరు భవిష్యత్‌లో ఎంతో మంది ఇంజనీర్లకు పని కల్పించే బిజినెస్ మాన్ అవవచ్చు కదా! మన శక్తిని తెలుసుకుంటే ఈ రకమైన ఎన్నో పనులు సాధ్యమే.

అందుకే నేను చేప్పేదేమిటంటే సక్సెస్ అవాలంటే ఓటమిని ఎదుర్కొనే సత్తా ఉండాలి. ఓటమిని ఎదుర్కొవడం అంటే ఓటమి వచ్చినప్పుడు ఓటమికి దాసోహం అని చేతులు ముడుచుకుని, దిగాలుగా కూర్చుని, శూన్యంలోకి చూస్తూ, అదృష్ట దేవతలను తిట్టుకోవడం కాదు చేయవలసింది. ఓటమిని ఛాలెంజ్ చేయండి. "దమ్ము ఉంటే నేను ఇప్పుడు చేసే తరువాతి ప్రయత్నంలో నాకు మళ్లీ ఎదురు పడాలని చూడు... నీ చెంప ఛెళ్లుమనిపిస్తాను' ' అని అనుకునే తత్వం రావాలి. జీవితంలో అవరోధాలను ధైర్యంగా ఎదుర్కొన్నవాడే రాటుదేలతాడు. విజేత అవుతాడు. ఎందుకంటే 'అవరోధాల దీవుల్లో ఆనంద నిధి ఉన్నది. కష్టాలు వారధి దాటిన వారికి సొంతమవుతుంది. తెలుసుకుంటే సత్యమిది. తలచుకుంటే సాధ్యమిది".

# 13

# ఆశే అస్త్రంగా సంకల్పిస్తే ఏ అవరోధమూ సక్సెస్‌కి అడ్డు రా(లే)దు

**హైలెట్స్**

- ❖ జీవితంలో ఏదీ మనకు అవరోధం కాదు. ఏదైనా అవరోధం అనేది ఉంటే (బహుశా) అది మనకు 'అవరోధం' అని చెప్పే మన మనస్తత్వమే.
- ❖ ఏదైనా సాధించాలనుకున్నప్పుడు మీరు మీ బలం మీద, మీ శక్తియుక్తుల మీద దృష్టి పెట్టండి. మీ బలహీనతల మీద కాదు.
- ❖ మన బలహీనతలను బూతద్దంలో చూడవద్దు. మన హద్దులు ఇవీ అని నిర్ణయించుకోవద్దు. మనిషి తలచుకుంటే ఏమైనా సాధించగలడు.
- ❖ "నేను నన్ను మాత్రమే నమ్ముతాను. నాకు మాత్రంఏ ప్రత్యేకమైన లక్షణాల మీద దృష్టి పెట్టి లక్ష్యాన్ని సాధిస్తాను" అనుకుంటే సక్సెస్ మనకి చేరువైపోతుంది.
- ❖ నిరుత్సాహాన్ని దరిచేరనీయకూడదు. ఉత్సాహాన్ని ఉరకలు వేయించాలి. పాజిటివ్‌గా ఆలోచించాలి.

"నేను చిన్నప్పటి నుండి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. కాన్వెంట్ చదువులు, స్టేట్ ర్యాంకులు, ఐఐటీ చదువులు నేను ఎరుగను. తెలుగు మీడి యంలో ఇప్పటి వరకూ చదివాను. డిగ్రీ కూడా సెకెండ్ క్లాస్‌లో పాసయ్యాను. మరి నాకు ఐఏఎస్



వస్తుందంటారా?" మీ మనసుల్లో కూడా ఇలాంటి ప్రశ్నలు వస్తుంటే ఈ వ్యాసం మీ కోసమే. ఐఏఎస్, గ్రూప్-1, గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులు కనీసం కాన్వెంట్‌లో చదువుకోవాలి, ఎప్పుడూ ఫస్ట్‌క్లాస్‌లోనే పాస్ అయి ఉండాలి అని ఎవరు చెప్పారు? ఇవేవీ లేకపోయినా, ఒక్క సంకల్పబలం ఉంటే చాలు. అనుకున్నదేమైనా సరే సాధించేయవచ్చు.

గుర్తుపెట్టుకోండి. జీవితంలో ఏదీ మనకు అవరోధంకాదు. ఏదైనా అవరోధం అనేది ఉంటే (బహుశా) అది మనకు 'అవరోధం' అని చెప్పే మన మనస్తత్వమే. మన మనసే మనని వెనక్కు లాగుతుంది. 'అమ్మో! ఈ పని ఎంత కఠినమో!' అని మన దూకుడుకి కళ్లెం వేస్తుంది. మనం అప్పుడు గానీ భయపడ్డామా? మన మనసు మరీ భయపెట్టేస్తుంది. ముందుకు దూకనీయదు. అలాంటప్పుడు మనం అను కున్నది ఎలా సాధించగలము చెప్పండి?

అందుకే ఏదైనా సాధించాలనుకున్నప్పుడు – **మీరు మీ బలం మీద, మీ శక్తియుక్తుల మీద దృష్టిపెట్టండి. మీ బలహీనతల మీద కాదు.** ఏదైనా సాధించి లోకానికి నేనేమిటో చూపించాలని మీకు కసిగా ఉంటే – మీరు చేయవలసినదేమిటంటే మీ సంకల్ప బలాన్ని మొత్తం మీ శక్తియుక్తుల మీద కేంద్రీకరించండి. అంతేగానీ, నా పరిమితి ఇంతే. నా ఓపిక ఇంతవరకే, నా పటిమ సరిపోదు – అనుకుంటూ మీకు మీరే హద్దులు నిర్ణయిం చుకోవద్దు. నేను చేయగలనా? లేదా? అనుకుంటూ – మన హద్దులు మనం నిర్ణయించుకోవడంవల్ల కాలం వృధా అవుతుంది, మన లక్ష్యానికి మనం దూరమైపోతాము. సిరివెన్నెల సీతారామశాస్త్రి బాగా ప్రాచుర్యం పొందిన పాటలో రెండులైన్లు మీకు గుర్తు

చేస్తాను. **"నింగి ఎంత పెద్దదైనా రివ్వుమన్న గువ్వ పిల్ల రెక్కముందు తక్కువేనురా.. సంద్రమెంత గొప్పదైనా ఈదుతున్న చేప పిల్ల మొప్ప ముందు చిన్నదేనురా!"**

మన లక్ష్యం ఎంత పెద్దదైనా కావచ్చు. మన గోల్ ఎంత గొప్పదైనా కావచ్చు... కానీ మన సంకల్ప బలం ముందు అది చిన్నదే అవుతుంది, తక్కువదే అవుతుంది. అలా అవ్వాలి. అలా అయ్యేలా మనమే మన సంకల్ప బలాన్ని పెంచుకోవాలి.

మన బలాలను, బలహీనతలను బేరీజు వేసుకో వద్దు అని నేను అనడం లేదు. మనకి ఉన్న అపారమైన ప్రతిభా పాటవాలను తక్కువ అంచనా వేయవద్దు అంటున్నాను. బలహీనతలను బూతద్దంలో చూడ వద్దు అని అంటున్నాను. మన హద్దులు ఇవీ అని నిర్ణయించుకోవద్దు అని వేడు కుంటున్నాను. మనిషి తలచుకుంటే ఏమైనా సాధించగలడు అని నొక్కి వక్కాణిస్తున్నాను. మనకే తెలియకుండా మన మైండ్‌లో ఎన్నో హద్దులను మనం ఏర్పరచుకుంటుంటాము. ఐఏఎస్ అధికారి అవ్వాలనుకోండి, గ్రూప్-1 ఆఫీసర్ కావాలనుకోండి, ఆ మాటకొస్తే ఏ ప్రభుత్వ ఉద్యోగమైనా సంపాదించాలను కోండి, చిన్నప్పటి నుండి ఇప్పటి వరకూ అన్నీ ఫస్ట్‌గ్రేడ్‌లే రావాలని లేదు. కేజీ నుండి పీజీ వరకూ మనం ఏవరేజి స్టూడెంట్ అయినా సరిపోతుంది. ఇంకా చెప్పాలంటే బిలో ఏవరేజి అయినా ఫరవాలేదు. కానీ మనం లక్ష్యం నిర్ధారిం చుకున్న తరువాత మాత్రం కసితో, చదవాలి. అందరికంటే ఎక్కువ కష్టపడాలి.

మీకు ఇప్పుడు ఒక ప్రముఖ బాస్కెట్ బాల్ క్రీడాకారుడిని పరిచయం చేస్తాను. ప్రత్యర్థి జట్టు ఆటగాళ్ల నుండి తెలివిగా బాల్‌ని (బాస్కెట్ బాల్‌ని) తప్పిస్తూ, ఎళ్లవేళలా సమయస్ఫూర్తితో ఆడుతూ, తరువాతి మూవ్ ఎటు వైపు ఉంటుందో ప్రత్యర్థి ఊహించే లోపలే, బంతిని అనుకోని దిశ వైపు మళ్లించి బాస్కెట్‌లోకి బంతిని వేయడం – బాస్కెట్ బాల్‌లోని కిటుకంతా. చూడటానికి, ఊహించడా నికి అంతే కదా అనిపించే ఈ క్రీడ ఆడాలంటే మొదటి అర్హత ఏమిటంటే వీలైనంత ఎక్కువ ఎత్తు ఉండటం. ఎత్తు ఎందుకంటే – ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు బాస్కెట్‌లోకి బంతిని వేయనీయకుండా బ్లాక్ చేయడం కోసం అంతేకాకుండా ఎత్తు ఉంటే – బంతిని బాస్కెట్‌లో అవలీలగా వేయవచ్చు.

బాస్కెట్ బాల్ రిమ్ (నెట్టు / వల) లేదా బాస్కెట్ భూమికి ఎంత ఎత్తులో ఉంటుందో తెలుసా? పది అడుగుల ఎత్తులో (3.05 మీటర్ల ఎత్తులో) బాస్కెట్ ఉంటుంది. బాస్కెట్‌బాల్ క్రీడ అమెరికాలో బాగా ప్రాచుర్యం పొందింది. ఈ క్రీడని అక్కడ కొన్ని కోట్ల మంది ఆదరిస్తారు. మన దేశంలో క్రికెట్‌ని నిర్వహిం చడానికి BCI ఎలా ఉందో, అమెరికాలో బాస్కెట్‌బాల్‌ని నిర్వహించడానికి NBA (National Basket Ball Association) ఉంది. ఎత్తుగా ఉండటం ఆటగాళ్లకు కావలసిన కనీస అర్హత. అందుకని ఎన్‌బీఏలో ఆడే ప్రతి ఆటగాడు కనీసం 6'7" (ఆరు అడుగుల ఏడంగుళాలు) ఉంటాడు. బాస్కెట్‌బాల్ క్రీడలో ఆడటానికి పొడుగు అయిన ఆటగాళ్లే కావాలి. పొడుగు అయిన క్రీడాకారులే బాస్కెట్‌బాల్ సరిగ్గా ఆడగలరు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఏ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడిని అయినా మీరు తీసుకోండి. వీరి సరసన చేరే ఇంకో పేరు కూడా మీకు తెలిసి ఉండాలి... ఆ పేరు Tyrone Bogues (టైరోన్ బోగ్స్)...

Tyrone కూడా NBA ఆటగాడు. ఆటగాడు అనేకంటే – NBA కి ఒక ధృవతార



లాంటివాడు అంటే బాగుందునేమో. మనవాడు NBA కి పదహారు సీజన్లు ఆడాడు. (మన క్రికెట్‌లో ఆటగాళ్లు ఇన్ని సంవత్సరాలు ఆడారు, ఇన్ని సిరీస్‌లు ఆడారు అని ఎలా చెబుతామో, బాస్కెట్‌బాల్‌లో, సీజన్స్‌తో ఆటగాడు ఆడిన సమయాన్ని కొలుస్తారు.)

ఎంతో మంది బాస్కెట్‌బాల్ క్రీడా పండితుల అత్యంత విలువైన ఆటగాడిగా పేరు తెచ్చుకున్న Tyrone ఎన్నో రికార్డులను తన పేరు మీద నిలుపుకున్నాడు. (రాసుకున్నాడు). Tyrone అందరి కంటే ఎక్కువ నిమిషాలు బాస్కెట్‌బాల్ మైదానంలో ఆడిన ఆటగాడిగా

రికార్డు, ప్రత్యర్థి జట్టు ఆటగాళ్ల నుండి బాస్కెట్‌బాల్‌ని ఎక్కువసార్లు లాక్కున్న ఆటగాడిగా రికార్డు, ఎక్కువసార్లు Assist చేసిన (అనుకూలంగా బంతిని విసిరిన) వాడిగా రికార్డు. బాస్కెట్ బాల్‌లో Assist అనేది ఒక సాంకేతిక (పారిభాషిక) పదం. ఒక ఆటగాడు తన జట్టు సభ్యునికి అందించిన బంతి, రెండు లేక అంతకంటే తక్కువ అడుగులు వేసి, ఆ బంతిని గోల్‌గా మారిస్తేనే అది assist చేసినట్లు లెక్క. అలాగే turnover (టర్న్ ఓవర్) అనేది కూడా బాస్కెట్ బాల్ క్రీడలో పారిభాషిక పదం. ఒర ఆటగాడు తన జట్టు సభ్యునికి అందించాలని చూసిన బంతిని వేరే జట్టు వాళ్లు లాక్కుపోతే - అది టర్న్ ఓవర్ కిందికివస్తుంది. తనకు వచ్చే బంతిని, వేరే జట్టు ఆటగాడిని ఎప్పుడూ లాక్కుపోనీయలేదు - Tyrone. అందులో కూడా మనవాడికి రికార్డు ఉంది. Assist కి Turover నిష్పత్తి ప్రతి బాస్కెట్ బాల్ క్రీడాకారుడికి లెక్కగడ తారు. క్రికెట్‌లో ఆటగాడికి Average (ఏవరేజి)ని లెక్కగట్టినట్లుగా... ఆ నిష్పత్తిలో రారాజు మన Tyrone. ప్రపంచంలో బాస్కెట్ బాల్ ఆటగాళ్ల అందరి కంటే మెరుగుగా ఉంది. ఆ నిష్పత్తి... మనవాడికి.

ఇన్ని అద్భుతాలు సాధించిన టైరోన్ గురించిన అసలు విషయం చెబుతున్నాను ఇప్పుడు మీకు. పొడుగు ఉన్న ఆటగాళ్లు కబ్జా చేసుకున్న బాస్కెట్‌బాల్ క్రీడలో ఆటగాడు అంటే కనీసం ఆరు, ఏడు అడుగుల పైమాటే పొడుగు ఉంటారని ఊహించే బాస్కెట్‌బాల్ క్రీడలో... ప్రపంచం మెచ్చిన మేటి క్రీడాకారుడైన టైరోన్ ఎత్తు కేవలం ఐదు అడుగుల మూడు అంగుళాలు (5'3") మాత్రమే.

మిగతా ఆటగాళ్లతో టైరోన్‌ని చూస్తే, చాలా సరదాగా అనిపిస్తుంది. ఎందుకంటే తన సహచరులు తాడంత ఎత్తు ఉంటే - టైరోన్ వారి మోచేతుల వరకు మాత్రమే ఉండటం చూడ గలం. 5'3" అంటే - ప్రపంచ బాస్కెట్‌బాల్ క్రీడా చరిత్రలో అత్యంత పొట్టి ఆటగాడు... ఊహించండి. 6'7" ఎత్తుండే మిగతా ఆటగాళ్లెక్కడ - 6'3" ఉన్న మనవాడెక్కడ? 1965 జనవరి 9వ తేదీన పుట్టిన టైరోన్ గురించి మీకు ఇంకొంచెం లోతుగా తెలియాలి. అతను తన స్వీయ చరిత్ర In the Land of Giants (మహాకా యుల భూమి మీద)లో రాసిన కొన్ని విషయాలు మీకు వివరిస్తాను.

చిన్నప్పటి నుండి టైరోన్‌కి బాస్కెట్‌బాల్ అంటే మహా సరదా. తనని తాను బాస్కెట్ బాల్ క్రీడాకారునిగా ఊహించుకుంటూ పెరిగాడు మనవాడు. మనవాడి ఆర్థికస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉండేది. అందరిలా ఎత్తు పెరగలేకపోతుంటే - ఎత్తు పెరగడానికని, బోర్లించిన పెద్ద పెద్ద పాల కాన్ల మీద నుండి ఎక్కి దూకేవాడు. పెద్దవాడవుతున్న కొద్దీ ఎత్తు పెరుగుతాడనే నమ్మకం కోల్పోయారు ఇంట్లోవారు. స్కూల్‌లో బాస్కెట్‌బాల్ టీమ్‌లో తనని చేర్చుకునే వారు కాదు. తననీ చేర్చుకోమంటే మిగతా పిల్లలు గేలి చేసేవారు. వీధిలోకి వచ్చి బాస్కెట్‌బాల్ ఆడటం మొదలుపెట్టాడు. చూసిన వారందరూ టైరోన్ సరదాగా బాస్కెట్‌బాల్ ఆడుతున్నాడనుకున్నారు కానీ, NBA లో చేరతాడని ఎవరూ ఊహించలేదు. ఎలా ఊహించగలరు? మన వాడేమో చాలా చాలా పొట్టివాడు కదా... కానీ, టైరోన్ మాత్రం తాను పొట్టివాడిని అయినా గట్టివాడిని అని తనలో తాను అనుకున్నాడు. ఎలాగైనా NBA జట్టులో స్థానం సంపాదించాలని బలంగా నిశ్చయించుకుని, చుట్టుపక్కల వారి ఈసడింపులు, నిరుత్సాహపు నిట్టూర్పులు, గేలి

చేయడాలు, అపహాస్యాలు వంటివి పట్టించుకోవడం మానేశాడు.

తనకు ఎత్తు తక్కువైతేనేమి? మిగతా విషయాలలో అందరి బాస్కెట్‌బాల్ క్రీడాకారుల కన్నా మిన్నగా తయారవుతానని మనసులో అనుకోని, బాల్‌ని స్పీడ్‌గా పాస్ చేయడం, బుల్లెట్ వేగంతో బంతిని పరిగెత్తించడం, మిగతా వారికి అంతుచిక్కని మలుపులు తిరగడం వంటివి ఒంటబట్టించుకున్నాడు.

నా ఈ Talent (నేర్పు)ని NBA వారు గుర్తిస్తారు అని అనుకుంటూ, వారి దగ్గరకి వెళ్తే, కనీసం తన ప్రతిభను చూపించుకునే అవకాశం కూడా టైరోన్‌కి ఇవ్వలేదు. 5’3” ఉన్నావు. నీ పొడవు కనీసం చూసుకున్నావా? నీ మొహం అద్దంలో చూసుకున్నావా? అంటూ వెనక్కి తరిమేశారు.

తను ఇంక ఎక్కువ ఆలోచించలేదు. ఎలాగైనా NBA లోకి ప్రవేశించాలి అని అనుకుని, నర్సు కోర్సు చేశాడు. ఆటగాళ్లకు గాయాలు తగిలితే వాటికి ప్రాథమిక చికిత్స చేయడానికి అని NBA లో ప్రవేశించాడు టైరోన్. చూడండి సంకల్పబలం ఉంటే ఏదైనా సాధ్యమని నిరూ పించాడు టైరోన్. ఎలాగోలా, NBA లోకి ప్రవేశం దొరికింది. ఇక ఒక్క అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. గాయపడి వచ్చిన వారికి తిరిగి జట్టులోకి వెళ్లడానికి కొంత శిక్షణ కూడా ఇవ్వడం మొదలుపెట్టాడు. తను మెరుపువేగంతో బంతిని ఎలా ప్రత్యర్థుల నుండి లాక్కోవచ్చో చూపించాడు... ఇక తరువాతి కథ మీకు వివరించనవసరం లేదనుకుంటాను. తన ప్రతిభ NBA వారిని ఆకర్షించింది. “మహాకాయుల భూమి” మీద మనవాడు అడుగుపెట్టాడు. మనవాడు NBA లో బాస్కెట్‌బాల్ ఆడటానికి ఒక ప్రదేశం వస్తే అక్కడ మేనేజర్ అందరినీ పరిచయం చేసుకుంటాడు. టైరోన్ దగ్గరకి వచ్చి – “మీరు కూర్చుని ఉన్నారు లేదా నిలుచుని ఉన్నారా” అంటూ అతనిని చూసి, దాదాపు మూర్ఛపోయినంత పని చేసింది... ఎందుకో మీరందరూ ఊహించే ఉంటారు.

బాస్కెట్‌బాల్ ఆట ఆడేటప్పుడు, టైరోన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాడు. తను పొట్టివాడవటం చేత మాత్రమే కాదు. ప్రత్యర్థులను బాల్ కోసం జలగలా పట్టి పీడిస్తుంటాడు. మెరుపు వేగంతో కదులుతూ, బల్లి నాలుకకు ఉండే చురుకుదనంతో బాల్‌ని పాస్ చేసే వాడని బాస్కెట్‌బాల్ పండితులు మురిసిపోతుండేవారు. అతనుంటే కనుక, బాస్కెట్‌బాల్ కోర్టులో రెండు బంతులు కావాలి – అనే నానుడి బాగా ప్రచారంలో ఉంది. (ఎందుకంటే ఒక్క బంతి ఎప్పుడూ తన చుట్టూనే ఉంటుంది కాబట్టి.) ఇలా ఆడి అతను 1986 FIBA World Championship లో బంగారు పతకం కొట్టేశాడు.

వజ్ర సంకల్పం అంటే నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తాడు టైరోన్ బోగ్స్. కష్టపడటాన్ని, స్వశక్తిని నమ్మి, చుట్టుపక్కల వారి నిట్టూర్పులు, ఈసడింపులు పట్టించుకోని అఖండ శక్తిసామర్థ్యాలకు ప్రతీకగా నిలుస్తాడు టైరోన్. నేను ఎంత ఎత్తు ఉన్నాననికాదు, నేను ఎంత ఎత్తుకు ఎదిగానో చూడం దని ప్రపంచానికి సంకల్పబలం యొక్క పవరేమిటో (శక్తి ఏమిటో) చాటిచెప్పాడు టైరోన్.

టైరోన్ జీవితానుభవం నుండి మనం నేర్చుకున్నదేమిటంటే – “సంకల్పం ఉంటే ఏదీ అవరోధం కాదు”. మన శక్తిసామర్థ్యాల మీద దృష్టిపెట్టి, మనకి మనం నిర్ణయించుకున్న

హద్దులు, పరిమితులను కొంచెం పక్కనపెట్టి, లక్ష్యసాధన కోసం అహర్నిశలు కృషి చేస్తే, సాధించలేనిదంటూ ఏదీ ఉండదు. అనుకుంటే - ఏదైనా సాధ్యమే. ఎవరికైన సాధ్యమే. మనందరిలోనూ టైరోన్ ఉన్నాడు. NBA లోకి ప్రవేశించి, ప్రపంచాన్ని మెప్పించేంత ప్రతిభాపాటవాలున్న టైరోన్ మనందరిలోనూ ఖచ్చితంగా ఉన్నాడు. అయితే మనమేమి చేస్తున్నాము? మనలోని టైరోన్‌ని ఇతరుల మాటవినేలా చేస్తున్నాము? ఇతరుల నిరుత్సాహ స్వరాలను మనం పట్టించుకోకూడదు. కానీ జరిగేదేమిటంటే మనం అవే పట్టించుకుంటాము. పట్టించుకుని, మనలోని టైరోన్‌ని నిరుత్సాహపరుస్తున్నాము.

"నేను నన్ను మాత్రమే నమ్ముతాను. నేను నా శక్తిసామర్థ్యాలను నమ్ముతాను. నాకు కొన్ని పరిమితులు ఉంటే ఉండవచ్చు గాక, కానీ, నేను వాటిని బూతద్దంలో చూడకుండా, నాకు మాత్రమే ప్రత్యేకమైన లక్షణాల మీద దృష్టి పెట్టి లక్ష్యాన్ని సాధిస్తాను" అని మన మందరం అనుకుంటే నిజంగా మనకి సక్సెస్ ఎంతో దూరంలో ఉండదు. మనకి చేరువైపోతుంది.

గుర్తుపెట్టుకోండి. సక్సెస్ సాధించాలంటే మనం మన పరిమి తుల మీదకన్నా, మన బలం మీద మన శక్తి సామర్థ్యాల మీద దృష్టిపెట్టాలి. నిరుత్సాహాన్ని దరిచేరనీయకూడదు. ఉత్సాహాన్ని ఉరకలు వేయించాలి. పాజిటివ్‌గా ఆలోచించాలి.

మనందరికీ అంతులేనంత శక్తి ఉంది. మనందరం అపరిమితంగా కష్టపడగలము. అలుపెరుగకుండా మనం చదవగలము. "నేను చెయ్యలేను - నా వల్ల కాదు" లాంటి మాటలు మనమిక నుండి మాట్లాడకూడదు. ఇలా మనం అను కుంటూ సక్సెస్ సాదిద్దాం. "ఎదురే మనకి లేదు. మనలను ఎవరూ ఆపలేరు".

# 14

# పడ్డవాడెప్పుడూ చెడ్డవాడు కాదు

**హైలెట్స్**

- ❖ పడ్డవాడెప్పుడూ చెడిపోలేదు. పడినప్పుడు లేచి మళ్లీ ప్రయత్నం చేస్తే సాధించలేనిదంటూ ఏమీ ఉండదు.
- ❖ మనపై జాలి చూపించేవారు మనకి తెలియకుండా మనకి నష్టం చేస్తారు. మన పూర్తిసామర్థ్యం ఏమిటో మనం తెలుసుకునే వీలులేకుండా చేస్తారు.
- ❖ కాంపిటీషన్ ఉన్నప్పుడు జాలి, దయ వంటి భావనలకు తావులేవు.
- ❖ ఎన్నిసార్లు పడ్డామన్నది లెక్క పెట్టుకోవద్దు. పడిన ప్రతీసారి ఎంత తొందరగా లేచి పరిగెట్టామన్నది లెక్క గట్టుకుందాం.
- ❖ పడినప్పుడు గాయాలయ్యాయని చూసుకోకూడదు. పడితే పడ్డాంలే... రాటు దేలే అవకాశం వచ్చిందని అనుకోవాలి.
- ❖ పడ్డప్పుడు చింతించకండి. పడిపోయి లేవలేకపోతుంటే చింతించండి.

పడ్డవాడెప్పుడూ చెడ్డవాడు కాదు అని మనకి ఒక తెలుగు నుడికారం ఉందని మీకు తెలుసుకదా. ఇక్కడి సందర్భంలో పడటం అంటే – ప్రయత్నంలో వైఫల్యం చెందడం. మనం ఎన్నో కలలు కంటుంటాం. ఆ కలల్ని సాకారం చేసుకోవడానికి మనం నడుం బిగించి ప్రయత్నాలు చేస్తాం. ఒక్కోసారి మరి మన ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. మనకి ఓటమి సంభవించవచ్చు. అయితే అప్పుడు మనం నిరుత్సాహపడకూడదు. ఏమి

చేయాలంటే – ఈ తెలుగు సామెతని గుర్తుకు తెచ్చుకోండి. పడ్డవాడెప్పుడూ చెడిపోలేదు. పడినప్పుడు లేచి మళ్లీ ప్రయత్నం చేస్తే సాధించలేనిదంటూ ఏమీ ఉండదు.

మనిషికి ఉన్న సహజమైన నైజం ప్రకారం పడినప్పుడు – వెంటనే పైకి లేచి నిలబడి, మళ్లీ విజయం కోసం ప్రయత్నాలు మొదలుపెడతాడు. ప్రయత్నించేటప్పుడు మళ్లీ పడిపోతే, లేచి మళ్లీ ప్రయత్నం చేస్తాడు. మళ్లీ పడిపోతే, మళ్లీ మళ్లీ ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు. అలా అలుపెరగక ప్రయత్నాలు చేసిన వారే పైకి వస్తారు. విజయం సాధిస్తారు. ఎన్నిసార్లు పడ్డామన్నది కాదు పాయింటు. పడిన ప్రతీసారీ పైకి లేచి ప్రయత్నించామా లేదా అన్నదే పాయింటు. అలా ప్రయత్నిస్తే, ఖచ్చితంగా విజయం సాధిస్తాం. మన జీవితంలోనే మనకి ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. మనం చిన్నప్పుడు అందరం నేల మీద పాకేవాళ్లం. అలా పాకుతూ, పాకుతూ ఒకానొక రోజు పైకిలేచి నిలబడాలని ప్రయత్నించి ఉంటాం. మొదటి ప్రయత్నంలోనే సరిగ్గా నిల్చున్నామా? ఖచ్చితంగా పడి ఉంటాం కదా. అలా పడిపోయామని, మనం లేచి నిలబడటం కోసం ప్రయత్నించడం ఆపామా? అలా ఆపి ఉంటే కనక మనం ఈ రోజు సరిగ్గా నిలబడేవాళ్లం కాదేమో కదా. ఎలాగోలా నిల్చోడం నేర్చుకున్న మనం (చిన్న పిల్లలప్పటి మనం) అంతటితో ఆగిపోలేదు. మెల్లగా నడవడం కోసం ప్రయత్నించాం. అలా ప్రయత్నించేటప్పుడు మొదటి ప్రయత్నంలోనూ సరిగ్గా నడిచేశామా? ఒకటి రెండు అడుగులు వేయగానే బ్యాలెన్స్ తప్పి ఖచ్చితంగా కిందపడిపోయి ఉంటాం. దెబ్బలు కూడా తగిలి ఉంటాయి. దెబ్బలు తగిలి నొప్పి పెడుతుందని, మనం ఊరుకున్నామా? ఎన్నిసార్లు మనం చిన్నప్పుడు నడవడానికి ప్రయత్నించి విఫలమై ఉంటామో ఊహించండి. పడిపోయినా సరే. ఫరవాలేదు. అనుకున్నాం కాబట్టి చిన్ననాటి మనం నడవడం సరిగ్గా నేర్చుకున్నాం. నడవడంతో ఊరుకోలేదు మనం. ఉరుకులు, పరుగులు కూడా పెట్టాం. ఇదంతా ఎలా సంభవం అయింది. పడినప్పుడు కృంగిపోకుండా రెట్టించిన ఉత్సాహంతో నేను ఈ పని చేసి తీరాల్సిందే అని మనకే తెలియకుండా మనతో మనం పందెం వేసుకుని, ఆ పందెంలో గెలిశాం.

అటు తరువాత సైకిల్ నేర్చుకున్నాం. సైకిల్ మొదటిసారి ఎక్కినప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకోండి. ఎన్నిసార్లు మనం సైకిల్ మీద నుంచి పడ్డాం? ఎన్నిసార్లు సైకిల్‌ని మన మీద పడేసుకున్నాం? ఎన్నిసార్లు మన మోకాళ్ల చిప్పలు రక్తం చిందించాయి? ఎన్నిసార్లు మన మోచిప్పలకు చీము కట్టి ఉంటుంది? ఎన్నిసార్లు మన మోచేతులు గీసుకుపోయాయి?

ఏదైనా సాధించాలని సంకల్పించి, ఆ ప్రయత్నంలో వైఫల్యం చెందితే, మనం సైకిల్ నేర్చుకునేటప్పుడు తెలుసుకున్న పాఠాలను గుర్తుకు తెచ్చుకోండి. ఆ పాఠాలను మన జీవితానికి కూడా ఆపాదించండి. జీవితంలో విజయం సాధించడం ఎలాగో తెలిసిపోతుంది.

సైకిల్ తొక్కాలని మనం పూనుకుంటే (మొదలు పెడితే) మనం పడిపోవచ్చు. కొన్నిసార్లు గాయాలవవచ్చు. అయితే అది లెక్క చేయకూడదు. పడిపోయినప్పుడు "ఛీ! సైకిల్ తొక్కితే దెబ్బలు తగులుతున్నాయి. నాకు సైకిల్ అవసరం లేదు. నేను ఇక సైకిల్



తొక్కనే తొక్కను" అని అనుకోకూడదు. పడిన వెంటనే దులుపుకుని మళ్లీ సైకిల్ స్వారీ అనుభవించాలనుకుంటాం. సైకిల్ మీద గెలుపు సాధించాలనుకుంటాం. ఇంకోసారి పడిపోయామా? అయినా ఫరవాలేదు. మళ్లీ పైకి లేశాం. పుట్టీ పుట్టడంతోనే కిందపడి, జీవకోటి మొత్తంలోకెల్లా అత్యంత ఎత్తుకు ఎదిగే జిరాఫీ గురించి మనం ఈ సందర్భంలో కొంత తెలుసుకుందాం.

తల్లి జిరాఫీ, తన బిడ్డకు జన్మనివ్వడం అనేది భూమి కంపించేంతటి ఘోరమైన సంఘటన. తల్లి గర్భం నుంచి అప్పుడప్పుడే బయటకొస్తున్న కూన, అమాంతంగా ఎనిమిది అడుగుల కింద ఉన్న నేలపై పడిపోతుంది. అప్పటి వరకూ తల్లి గర్భంలో వెచ్చగా ఉన్న లేలేత కూన అనుకోకుండా బయటకు వచ్చేసి, వచ్చీ రావడంతోనే ఎనిమిది అడుగుల ఎత్తు నుంచి ఒక్కసారిగా నేల మీదకు కూలబడిపోతుంది. నిలబడటానికి కానీ, అటూ ఇటూ కదలడానికీ కానీ శక్తి ఉండదు.

వణికిపోతూ జాలిగొల్పే విధంగా కూలబడిన తన బిడ్డ మీద అమాంతం ప్రేమ పొంగుకు వచ్చిన తల్లి జిరాఫీ ముద్దాడుదామని ముందుకు వచ్చేంతలో ఒళ్లు గగుర్పొడిచే ఒక సంఘటన జరుగుతుంది. ముద్దాడుదామని ముందుకు రాబోయిన తల్లి జిరాఫీకి ఏదో దివ్యలోకం నుంచి ఆజ్ఞ వచ్చినట్లు, ఆ ఆజ్ఞను శిరోధార్యంగా అమలుచేస్తున్నట్లు తన తలాడిస్తుంది. తన పొడవాటి కాళ్లను వీలైనంత వెనక్కు జరిపి, లాగించి తన్నుతుంది. ఎవరిననుకున్నారు? అప్పుడే పుట్టిన పసికందును. కళ్లు కూడా సరిగ్గా తెరవని తన పేగుబంధాన్ని ఈడ్చి తన్నేంత క్రూరత్వమేమిటో అంతుచిక్కడం లేదు కదా. తల్లి జిరాఫీతో తన్నించుకున్న పసిగుడ్డు మాత్రం అమాంతం గాలిలోకి లేచి ఎంతో ఎత్తు నుంచి కింద పడిపోతుంది.

తల్లి జిరాఫి తన పిల్ల దగ్గరకు వస్తుంది. ప్రేమతో నాకుతుందేమో అని పిల్ల జిరాఫీ ఎదురు చూస్తుంది. దీనంగా తల్లి వైపు చూడబోయేంతలో మళ్లీ ఒక తన్ను. మళ్లీ పిల్ల జిరాఫీ గాలిలోకి ఎగిరి దూరంగా పడిపోతుంది. ఎగిరి పడ్డ పిల్ల జిరాఫీ దొర్లుకుంటూ పక్కకి జరుగుతుంది. తల్లి మళ్లీ పిల్ల దగ్గరకు వస్తుంది. మళ్లీ ఇంకో తన్ను. ఇలా తన్నుల పరంపర కొనసాగుతూనే ఉంటుంది. తల్లి జిరాఫీ ఫుట్‌బాల్ ఆడుకుంటుందా అని చూసే వారికి అనిపిస్తుంది. ఆ తల్లికి కరుణ అనేది అసలు లేనేలేదు అని నిర్ధారణకు వచ్చేయవచ్చు.

పిల్ల జిరాఫీ తనంతట తాను లేచి నిలబడే వరకూ తల్లి తన కాళ్లతో తంతూనే ఉంటుంది. అప్పుడు అర్థమవుతుంది అసలు కథ. పిల్ల జిరాఫీని తన కాళ్ల మీద తను నిలబడమని ఆ తన్నుల తాత్పర్యం. పుట్టిన వెంటనే జిరాఫీ కాళ్లు సాగకపోతే ఆ తరువాత ఎప్పటికీ సాగలేవు. తన కాళ్ల మీద దను నిలుచోవడం పుట్టిన వెంటనే నేర్చుకోకపోతే తరువాత ఇంకెప్పుడూ నేర్చుకోలేదు. పుట్టిన వెంటనే పిల్ల జిరాఫీకి శక్తి ఏమీ ఉండదు. వెచ్చని తల్లి గర్భం నుంచి బయటకు వచ్చి, వాతావరణం మార్పును సహించలేక వణికిపోతూ కూలబడుతుంది. తల్లి తన కాళ్లతో తన్నకపోతే పిల్ల జిరాఫీకి లేచి నిలబడాల్సిన అవసరం, అవకాశం రాకపోవచ్చు. అలా రాకపోతే పుట్టిన కొద్ది గంటలకే చనిపోతుంది. శక్తి లేకపోయినా, పడిన చోట నుండి లేవాలన్న కాంక్ష ఉన్న పిల్ల జిరాఫీ ప్రతికూల పరిస్థితుల మీద ప్రతిఘటన చేసేటప్పుడు, తను జీవితంలో ముఖ్యమైన పాఠం నేర్చుకుంటుంది. తన కాళ్లు వణికిపోతున్నా, తన కాళ్ల మీద తను నిలబడటం నేర్చుకుంది.

పిల్ల పిరాఫీ తనకు తాను లేచి నిలబడగలగడాన్ని తల్లి ఎంతో సంతోషిస్తుంది. కానీ లేచి నిలబడగలగడం మాత్రమే కాదు కావలసినది. అందుకని పిల్ల దగ్గరకు వచ్చి మరొక తన్ను తంతుంది. పిల్ల జిరాఫీ మరొకసారి పడిపోయి, తనంతట తాను లేస్తుంది. లేవడమే కాదు. ఇంకోసారి తల్లి దగ్గరకు రాబోతుంటే తప్పించుకుపోవడానికి తన కాళ్లతో తాను నడుస్తుంది. తల్లి జిరాఫీకి ఖచ్చితంగా ఇదే కావలసింది.

తల్లి ఇలా కనికరం లేకుండా ఎందుకు వ్యవహరించిందో ఇప్పుడు పూర్తిగా మనకి తెలిసిపోయింది కదా! పిల్ల జిరాఫీ మాంసం అడవిలోని మృగాలకు బహుప్రియం. పిల్ల జిరాఫీ త్వరగా లేచి తనంతట తాను నిలబడటం కానీ, నడవడం కానీ, పరుగెత్తడం కానీ నేర్చుకోలేకపోయిందో, ఏ సింహానికో, చిరుత పులికోఎ ఖచ్చితంగా పలహారమైపోతుంది.



పుట్టీ పుట్టగానే తల్లి తన పిల్లని తన్ని తప్పేమీ చేయలేదు. దానికీ జాలి, దయ, కరుణ ఉన్నాయి. కానీ జాలి అడ్డువస్తే పిల్ల జిరాఫీ నేర్చుకోవాల్సిన పాఠాలు నేర్చుకోలేదు. మనలో అందరం పిల్ల జిరాఫీ అంత అదృష్టవంతులం కాదు. మనం పడిపోతే జాలి చూపించేందుకు మన కుటుంబ సభ్యులు మన చుట్టూ మూగిపోవచ్చు. అయ్యో! నీవు మోయలేని భారాన్ని మోయబాకు నాన్నా అంటూ ప్రేమని ఒలకపోయవచ్చు. మనం గానీ అప్పుడు మన వారి మాటలకు లొంగామా... మన ప్రయాణానికి ఫుల్‌స్టాప్ పెట్టేయవలసి వస్తుందేమో...! అలా కాకుండా “ఆ! పడితే పడ్డావు... పడితేనే నీకు బాగా తెలిసి వస్తుంది. పడిన చోట నుంచే మళ్లీ ప్రయత్నించు! పడినా పట్టించుకోకు.. దులుపుకుని ముందుకు సాగిపో! పడ్డవాడు ఎప్పుడూ చెడ్డవాడు కాదు“ అని మనల్ని వెన్నంటి ప్రోత్సహించే వారు

మన నిజమైన ఉన్నతిని కోరుకునే వారని తెలుసుకోవాలి.

మనపై జాతి చూపించే వారు మనకే తెలియకుండా మనకి నష్టం చేస్తారు. మన పూర్తి సామర్థ్యం ఏమిటో మనకి మనం తెలుసుకునే వీలులేకుండా చేస్తారు. మనపై జాలి చూపించేవారు. చిన్నప్పుడు చదివిన ఒక కథని మీకు ఇక్కడ వివరిస్తాను.

ఒక క్లాసులో సైన్స్ టీచర్ లైఫ్ సైన్స్ పాఠం చెబుతుంది. రెండు పట్టు పురుగుల గూళ్లని తీసుకువచ్చి విద్యార్థుల ముందు ఉంచింది. గూటిలో నుంచి పట్టు పురుగులు బయలకు వచ్చేసే సమయం అది. గూట్లో నుంచి పురుగు ఎలా వస్తుందో చూస్తూ ఉండమని పిల్లలకు చెప్పి, ఏదో పని మీద బైటకు వెళ్లింది. గూటిలో నుంచి పురుగులు బైటకు రాసాగాయి. ఎంతో చూడముచ్చటగా ఉంది పిల్లలకు. పురుగులు అతికష్టం మీద తమ శరీరాలను కొంచెం కదల్చడం ఒక పిల్లాడిలో జాలిని కలిగించింది. అందుకని మిగతా పిల్లలు వారిస్తున్నా, ఒక పురుగుకు సహాయం చేద్దామని జాగ్రత్తగా ఆ పురుగుకు హాని కలిగించకుండా దారాలను తెగ్గొడ్డం మొదలు పెట్టాడు. ఈ పురుగు మాత్రం వేరే పట్టు పురుగుకంటే ముందే బైటకు వచ్చేసింది. ఇంతలో టీచర్ వచ్చింది. జరిగిన విషయం పిల్లలు టీచర్‌కు చెప్పారు. టీచర్ ఏమీ అనకుండా, రెండు నిమిషాలు ఆ పురుగులనే గమనించమని పిల్లలకు చెప్పింది. సహాయం పొందిన పురుగు మాత్రం మందకొడిగా తిరుగుతూ కొంత సేపటికి ప్రాణాలు విడిస్తే సహాయం పొందని పురుగు మాత్రం చలాకీగా తిరుగుతూ బతికి ఉంది. అప్పుడు టీచర్ పిల్లలతో సహాయం పొందబడిన ఆ పురుగు ఎందుకు చనిపోయిందో వివరించింది. పట్టు పరుగులకు తాము అల్లుకున్న గూడి నుండి బైటకు వచ్చేటప్పుడు బైట వాతావరణం మెల్లగా అలవాటు అవుతుంది. మెల్లమెల్లగా తాము పట్టుదారాలను తప్పించుకు వచ్చేటప్పుడు తమ అవయవాలు నేర్పుగా కదల్చడం అలవాటు అవుతుంది. అలా కదిలిస్తుంటేనే వాటికి శక్తి వస్తుంది. బలమైన పురుగులుగా బయటకు వస్తాయి. అయితే ఈ తతంగం అంతా చాలా సేపు జరుగుతుంది. చూడటానికి చాలా జాలిగొలుపుతుంది. ఇంతలో పట్టు పురుగుకు సహాయం చేద్దామని మనం దారాలను తెగ్గొట్టామా మనం దానిని బలహీనమైన దానిలో తయారు చేస్తున్నాం. చివరగా టీచర్ డార్విన్ సిద్ధాంతం చెబుతుంది. "డార్విన్ సిద్ధాంతం ప్రకారం బలవంతులైన వారే ఈ జగతిలో జీవించేందుకు అర్హులు. బలహీనులు ఒకవేళ పుట్టినా వారు జీవించలేరు. దీనినే ఆంగ్లంలో "Survival of the fittest" అంటారు.

ఈ "Survival of the fittest" సూత్రం మన నిజజీవితంలో కూడా పనికి వస్తుంది కాంపిటీషన్ ఉన్నప్పుడు, జాలి, దయ వంటి భావనలకు తావులేదు మన మీద మనం జాలి, కరుణ చూపించుకోవడం ముందు మానివేయాలి చిన్నప్పుడు నిలబడటానికి ప్రయత్నించినప్పుడు కింద పడటం గుర్తు చేసుకుందాం పడినా మళ్లీ లేచాం కాబట్టే ఈ రోజు పరిగెత్తగలుగుతున్నాం సైకిల్ తొక్కడానికి ప్రయత్నించినప్పుడు పడటం గుర్తుకు తెచ్చుకుందాం. ప్రయత్నించేటప్పుడు పడ్డాం కాబట్టే ఈ రోజు మంచిగా సైకిల్ తొక్కగలగుతున్నాం.

సక్సెస్ అవాలంటే ఎన్నో అడ్డంకులను ఎదుర్కొనాలి. ఎన్నోసార్లు పడవలసి వస్తుంది. ఎన్నిసాట్ల పడ్డామని లెక్కపెట్టుకోవద్దు. పడిన ప్రతీసారీ ఎంత తొందరగా లేచి



పరిగెత్తామనేది లెక్కగట్టుకుందాం. జీవితంలో ఏదైనా సాధించిన ఏ గొప్పవారి చరిత్రనైనా చూడండి. వారికి కూడా ఎన్నో అవాతంరాలు ఎదురై ఉంటాయి. వారు కూడా పడి ఉంటారు. కానీ పడిన ప్రతిసారీ రెట్టించిన ఉత్మవిశ్వాసంతో లేచి ఉంటారు. పడిపోయినప్పుడు వారిపైనో ఎవరైనా జాలిని చూపిస్తే... "థాంక్స్! మీ జాలి నాకు అవసరం లేద"ని ముందుకు సాగి ఉంటారు. మనం కూడా అలాంటి ఆటిట్యూడ్‌తోనే ఉందాం. ఈసారి మన మీద ఎవరైనా కోపం చూపిస్తే, పిల్ల జిరాఫీని, తల్లి జిరాఫీ తన్నడం గుర్తుకు తెచ్చుకోండి. మీతో కఠినంగా వ్యవహరించే వాళ్లే మీ ఉన్నతిని కోరుకుంటారని తెలుసుకోండి.

ఈసారి మన మీద ఎవరైనా జాలి చూపిస్తే పట్టుపురుగుల కథని గుర్తుకు తెచ్చుకోండి. మన మీద ప్రేమతో ఉండేవారే మనకి. తెలియకుండా మనకి చివరకి నష్టం చేస్తారని గమనించండి.

చివరగా, డార్విన్ సిద్ధాంతంలోని సారాన్ని గమనించండి. బలహీనులకు ఈ జగతిలోచోటు లేదు. బలవంతులు మాత్రమే ఈ ప్రపంచాన్ని శాసించగలరు. బలవంతులు ఎలా తయారవుతారు? పడిన ప్రతిసారీ కృంగిపోకుండా రెట్టించిన ఉత్సాహంతో లేచి అనుకున్నది సాధించి తీరాలని మనసులో గట్టిగా సంకల్పించినప్పుడే బలవంతులవుతారు. పడినప్పుడు గాయాలయ్యాయని చూసుకోకూడదు. పడితే పడ్డాంలే రాటుదేలే అవకాశం వచ్చిందని అనుకోవాలి. అందుకే పడ్డప్పుడు చింతించకండి. పడిపోయి లేవలేకపోతుంటే చింతించండి. ఒంకోసారి పడిపోయినా రెట్టించిన ఆత్మవిశ్వాసం మీకు తోడవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# 15

# శ్రమించడాన్ని వాయిదా వేస్తే విజయం విశ్రమిస్తుంది

**హైలెట్స్**

- ✤ వేల మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది కదా. ఆ మొదటి అడుగు వేసేద్దాం.
- ✤ మన చదువును మనం వాయిదా వేస్తే మనకి రావలసిన సక్సెస్ కూడా వాయిదా పడుతుంది.
- ✤ ఏకాగ్రత లేని చదువు, ఫలితం లేని పూజ వంటిది. అది చేసినా, చేయకపోయినా ఒకటే.
- ✤ సమయాన్ని వృథా చేయకుండా, క్రమశిక్షణ పాటిస్తూ, శ్రద్ధగా చదువుతుంటే సక్సెస్ మీ సరసన చేరాల్సిందే.
- ✤ కొండంత కోర్సు అయినా కొంచెం కొంచెంగా చదివితే పిండి అయిపోవాల్సిందే.
- ✤ సమయం గురించి ఒక పిసినారి వ్యాపారవేత్తలా వ్యవహరించాలి.

నేటి ఈ ప్రపంచం పోటీ ప్రపంచం. Life is a race పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి నిజంగా జీవితం ఒక పరుగు పందెం లాంటిదే. ఎప్పుడూ పరిగెడుతూ ఉండాల్సిందే. గమ్యం చేరే వరకూ అలుపు సొలుపు లేక పోరాడాల్సిందే.



చదివేటప్పుడు మనం మన పుస్తకాల గురించి అత్యంత క్రమశిక్షణతో వ్యవహరించాలి. పుస్తకాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకూడదు. చదువుకోవడం పూర్తి అయిన తరువాత వాటిని చక్కగా ఒక అరమారలో పెట్టుకోవాలి. ఎప్పుడైనా గ్రంథాలయాన్ని చూశారా? లైబ్రరీలో ఒక్కో అరలో పుస్తకాలను ఎలా అమరుస్తారో గమనించండి. ఏ సబ్జెక్టుకు ఆ సబ్జెక్టు పుస్తకాలు వేరు చేసి ఉంటాయి. మనం కూడా మన పుస్తకాలను అలాగే అమర్చుకోవాలి.

నేను చదువుకునేటప్పుడు ప్రతీ చాప్టర్ కోసం వేరుగా పుస్తకాలను పెట్టుకునే వాడిని. దీని వలన మనకు చదువుకునే ఉత్సాహం వచ్చినప్పుడు వెంటనే కావాల్సిన పుస్తకం తీసుకుని చదువుకోవచ్చు. అలాకాకపోతే పుస్తకం కోసం వెతుక్కునే సమయంలో చదవాలన్న ఉత్సాహం సగం చచ్చిపోతుంది. అంతేకాదు. ఎక్కువ పుస్తకాలను చూస్తే ఇన్ని పుస్తకాలు చదవాలా అని మన ఉత్సాహం తగ్గిపోవచ్చు. మన ఉత్సాహం నీరు కారిపోవచ్చు. ఒక విధమైన నీరసం రావచ్చు.

ఇక్కడ నేను మీకు ఒక చిన్న కథని చెబుతాను. ఈ మధ్యన 'డేల్ కార్నిగీ' అనే సుప్రసిద్ధ రచయిత రాసిన పుస్తకం "How to stop worrying and start living" చదివాను. అందులో రెవరెండ్ విలియం ఉడ్ అనే మత గురువు ఇలా చెప్పుకుపోతాడు. ఆ మత గురువు కథనాన్ని ఆయన మాటల్లోనే మీకు చెబుతాను.

"ఒక రోజు మా ఆవిడను గమనించాను. ఆవిడ పాత్రలు శుభ్రం చేస్తూ పాటలు పాడుతుంది. అప్పుడు నాలో నేనే అనుకున్నాను. చూశావా! నా భార్య ఎంత హాయిగా ఉందో! మా పెళ్లయి పద్దెనిమిది సంవత్సరాలు దాటింది. ఆమె అప్పటి నుంచి అంట్లు శుభ్రం చేస్తూనే ఉంది. ఉదాహరణకు మేము పెళ్లి చేసుకున్న కొత్తలో గనుక మా ఆవిడ తాను జీవితాంతం శుభ్రం చేయవలసిన అంట్లను తన మనోఫలకంలో

నిలుపుకుందనుకోంది... అవి ఒక పెద్ద పర్వతంలాగా కనిపించేవి. ఆ పర్వతమంతా అంట్లు ఏ స్త్రీని అయినా కలవరానికి గురిచేసేవి. అప్పుడు నేను ఇలా భావించాను / ఆలోచించాను. అంట్లు తోమడం గురించి మా ఆవిడకు ఎందుకు బెంగ లేదంటే ఆవిడ జీవితాంతం తోమాల్సిన అంట్ల గురించి ఆలోచించదు. ఏ రోజు పాత్రలు ఆ రోజు మాత్రమే శుభ్రం చేస్తుందీవిడ. వాటిని గురించి మాత్రమే ఆలోచిస్తుంది. అందుకే హాయిగా పనిచేసుకోగలుగుతుంది. పాటలు కూడా పాడుకుంటూ ఆనందిస్తుంది".

పైన చెప్పిన కథ నుండి మనం కొన్ని విషయాలను గ్రహిద్దాం. మనం పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులం. అయితే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే కోర్సు స్టడీ మెటీరియల్ చాలా ఉంటుంది. పరీక్షలలో ముందుండాలంటే – ఆ అంతులేనంత స్టడీ మెటీరియల్‌ని చదివి తీరాల్సిందే. వేరే మార్గమేమీ లేదు. రామ్‌గోపాల్‌వర్మ తీసిన 'శివ' సినిమాలో పాటలో అన్నట్లు "కొండలా కోర్సు ఉంది... ఎంతకీ తగ్గనంది... ఏందిరో వింత గొడవ"

కోర్సు కొండంత ఉంది. కాదనడం లేదు. మంచి మార్కులు సంపాదించుకోవాలంటే చాలా ఎక్కువ పుస్తకాలు చదవాల్సిన మాట వాస్తవమే. కానీ, కొండనంతా ఒక్కరోజులోనే ఎవరు పిండి చేయమన్నారు? రెవరెండ్ ఉడ్ భార్య ఒక్కరోజులోనే అన్నీ అంట్లను తోమేయలేదు. పెద్ద పర్వతమంత అయ్యే అంట్లను రోజుకి కొంచెంగా తోముతుంది. కాబట్టి పనిని ఆనందంగా ఆడుతూ పాడుతూ అలుపు, సొలుపూ లేకుండా చేసుకుపోతుంది. మనమెందుకు ఆమె లాగా ఆలోచించలేము? వేల మైళ్ల ప్రయాణమైనా, ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది కదా. ఆ మొదటి అడుగు వేసేద్దాం. మొదటి అడుగు వేసేసి కిమ్మనకుండా కుర్చోవడం కాదు చేయవలసింది. క్రమశిక్షణతో మెలుగుతూ రోజూ ఇన్ని అడుగులు వేయాలని కృతనిశ్చయంతో ఉండి అనుకున్న అన్నీ అడుగులు పూర్తి చేయాలి.

ఒకవేళ రెవరెండ్ ఉడ్ భార్య నాకు ఈ రోజు బద్దకం వేస్తుందని... ఆ రోజు అంట్లను తోమకుండా ఉంటే... ఏమవుతుంది? ఒక్కరోజు సంగతి సరే అలా ఒక్క వారం తోమకపోతే ఏవతుందో ఊహించండి... ఉడ్ భార్య సంగతి కాదు మనకి కావలసినది. మనం వేసుకున్న ప్రణాళిక ప్రకారం మనం ఒక్కరోజు చదవలేకపోతే ఏమవుతుందో ఊహించండి. మన చదువును మనం వాయిదా వేస్తే, మనకి రావలసిన సక్సెస్ కూడా వాయిదా పడుతుంది కదా...!

పోటీ పరీక్షలలో మార్కులు సంపాదించాలంటే... అంత పెద్ద కొండంత మెటీరియల్ చదివి జీర్ణం చేసుకోవాలి. అమ్మో! అంత పెద్ద 'కొండ' అని కలవరపడిపోకూడదు. నేను అంత ఎక్కువ చదవగలనా / చేయగలనా అని డీలా పడిపోతూ ఉండకూడదు. దీనికి మంచి ముహూర్తం చూసి, వారాలు, వర్జ్యాలు బేరీజు వేసుకుని మొదలు పెడదాంలే అనుకోకూడదు. ఏమి చేయాలంటే... కొండను పిండి చేసేంతటి సంకల్పబలం ఏర్పరచుకోవాలి. ఏ రోజు చదవవలసిన సబ్జెక్టు ఆ రోజు తప్పనిసరిగా చదివి తీరాలి. చదవకపోతే కొండ కొండలాగానే ఉంటుంది. రోజూ చేయవలసిన విధి చేయకపోతే మనం చేయవలసిన పనులు పేరుకుపోతాయి. ఉత్సాహం తగ్గిపోతుంది. (సన్నగిల్లుతుంది). పోటీ ప్రపంచంలో మనల్ని మనమే వెనక్కు నెట్టేసుకున్నట్లు అవుతుంది.



అందుకని, ఈ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేటప్పుడు అత్యంత క్రమశిక్షణతో మెలగాలి. ప్రతీ విషయం పట్ల క్రమశిక్షణ అవసరం. జీవితంలో సక్సెస్ అయిన వారిని గమనించండి. వారు ఖచ్చితంగా క్రమశిక్షణతో మెలిగినవారయి ఉంటారు. రోజూ ఇన్ని గంటలు కష్టపడాలంటే అన్ని గంటలు కష్టపడే వారయి ఉంటారు. కష్టపడటం వాయిదా వేసి ఉండరు.

ఎప్పుడైనా చీమల బారుని గమనించారా... చాలా అత్యవసరమైన పని ఉన్నట్లు హడావుడిగా చీమలు తిరుగుతుంటాయి. ఒకదాని వెంట మరొకటి ఏ పదార్థాన్నో మోసుకుంటూ వెళ్లిపోతుంటాయి. ఆ చీమల బారుని చూసి మనం ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. చీమల క్రమశిక్షణను గమనించండి. ఒక్క చీమ కూడా తన దారి తప్పదు. ఒకటే లైనులో అన్నీ చీమలు వెళుతుంటాయి. అన్నీ చీమలు ఒకటే వేగంతో వెళతాయి. ఎక్కువ, తక్కువ వేగంతో వెళితే ఆ బారు గజిబిజిగా ఉండాలి. కానీ అలా ఉండలేదంటే అవన్నీ ఒకటే వేగంతో వెళుతున్నాయన్నమాట. మోసుకెళ్లే పదార్థం చీమలకెంత ప్రీతిపాత్రమైనదైనా, పని చేస్తున్నప్పుడు, కొంచెమైనా ఎంగిలి పడవు. ఏ ఒక్క చీమ అయినా బద్ధకం వేస్తుందని, పని మానివేయదు.

ఎప్పుడైనా చీమల బారులో నుండి ఒక్క చీమను తప్పించండి. దానిని తన దారి నుండి వేరే మార్గం వైపు వెళ్లేలా చేయాలని ప్రయత్నించి చూడండి. కొంత సేపటి లోగా ఆ చీమ తన దారిని, తన వారిని వెతుక్కుంటుంది. ఆ చీమని మళ్లీ దారి తప్పించే ప్రయత్నం చేయండి. మళ్లీ చీమ తన దారిని ఎలాగోలా వెతుక్కుని తన పని తాను చేసుకుంటుంది. మళ్లీ మళ్లీ ప్రయత్నించి చూడండి. మీరు ఎన్నిసార్లు ప్రయత్నించినా, ఆ చీమ మాత్రం తన దారిని మాత్రం వీడదు. దారి తప్పించి తప్పించి మనం అలసిపోవలసిందే కానీ, చీమ మాత్రం ఓటమిని ఒప్పుకోదు.

అప్పుడప్పుడూ ఒక ఐదు, దురు చీమల కలిసికట్టుగా తమ ఆహారాన్ని ఒకచోట నుంచి ఇంకో చోటుకి తరలిస్తుంటాయి. కిందపడిన రొట్టె ముక్కనో, బిస్కెట్టు తునకనో, సగం చచ్చిన పురుగునో, నిర్జీవంగా పడి ఉన్న మిడతనో, తమ బరువు కంటే ఎక్కువ బరువు ఉన్న పదార్థాలను శక్తినంతా కూడదీసుకుని లాక్కుపోతుంటాయి. ఒక్కోసారి ఆ చీమలు గోడలు మీద నుండి పైకి ఎగబాకుతూ, భూమి గురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేకంగా పదార్థాలను లాక్కుపోతుంటాయి. ఆ ఐదారు చీమలు తమ ప్రాణాలొడ్డి, ఆ పదార్థాన్ని పైకి చేర్చాలని ప్రయత్నిస్తాయి. అందులో ఒక్క చీమ అయినా, పైకి ప్రయాణించే ప్రక్రియలో పట్టుతప్పిందా కింద పడిపోతుంది. ఇంత కష్టపడి దాదాపు గమ్యస్థానాన్ని చేరుకునే లోపల ఇలా జరిగిందనుకోండి. ఎవరైనా నిరుత్సాహానికి గురవుతారు. చీమలు అలా కాదు. ఆ చీమలు వెనువెంటనే కింద పడిపోయిన పదార్థాన్ని తమ చిన్న చిన్న మెక్కలతో మళ్లీ లాగి, తమ కార్యదీక్షను చాటుతాయి. పదార్థాన్ని తాము అనుకున్న గమ్యస్థానానికి చేర్చేంతవరకూ విశ్రమించవు. ఆ చీమలు ఎన్నిసార్లు ప్రయత్నించాం. ఎన్నిసార్లు విఫలమయ్యాయని ఆలోచించుకోవు. మనం అనుకున్న గమ్యస్థానానికి మన పదార్థాన్ని చేర్చామా? లేదా? అన్న విషయాన్నే ఆలోచిస్తాయి. అందుకే, తమ ప్రయత్నాలలో వైఫల్యాలు చీమల్ని కృంగదీయవు. ఛీ! ఇన్నిసార్లు అనవసరంగా కష్టపడటం అంతా వృథా. వేరే సులైవన లక్ష్యాన్ని ఎంచుకుందా అని చర్చించుకోవు. కష్టమో... నష్టమో... అనుకున్నది సాధించేవరకూ విశ్రమించకూడదు అన్న భావన ఆ చిన్ని చీమల తలకాలలో ఉన్న ఇంకా చిన్న బుర్రలకు ఉన్నందుకు మనం ఆ చీమల నుంచి ఎంతో నేర్చుకోవచ్చు అని అంటున్నాను.

చీమలు కష్టపడటాన్ని వాయిదా వేయవు. గొప్పవారు శ్రమించడాన్ని వాయిదా వేయరు. విజేతలం అవ్వాలంటే మనం కూడా చదవడాన్ని వాయిదా వేయకూడదు. మనం వాయిదా వేస్తే, మనకు రావలసిన సక్సెస్ కూడా వాయిదా పడుతుందని గమనించాలి.

ఖచ్చితమైన టైమ్ టేబుల్ వేసుకోవాలి. దాని ప్రకారం చదవాలి. ఆరు నూరైనా, నూరు నూట పదహారైనా సరే వేసుకున్న టైమ్ టేబుల్‌ని ఖచ్చితంగా అమలు చేయాలి. మరి టైమ్ టేబల్ ఎలా వేసుకోవాలి? అన్నీ సబ్జెక్టులు చక్కగా కవర్ అయ్యేలా వారిని ప్రతీ సబ్జెక్టులో ఇంత చదవాలి అని ఒక అంచనా వేసుకుని, ప్రతి సబ్జెక్టులో ఇంత చదవాలి అని ఒక అంచనా వేసుకుని, ప్రతి సబ్జెక్టుకి సమయం కేటాయించాలి.

కొంత మంది అభ్యర్థులు ఏది పడితే అది చదివేస్తుంటారు. చేతికి వచ్చిన పుస్తకాన్ని చదువుదామని చదువు మొదలుపెడతారు. దానిని ఎప్పటిలోపు పూర్తి చేయాలో ఒక లక్ష్యం పెట్టుకోరు. దీని వలన ప్రయోజనం ఏమిటి? పరుగు పందెంలో మనం పాల్గొని ఊరికే పరిగెత్తినట్లు ఉంటుంది. ఆ పందెంలో గమ్యస్థానం గురించి ఆలోచించనప్పుడు మనం ఎంత వేగంగా పరిగెత్తాలో ఎలా తెలుస్తుంది? అలా పరిగెత్తడం వలన అవసరమైన అలుపు తప్ప లాభం ఏమిటి?

అందుకని, ఫలానా సబ్జెక్టుకి వారినికి ఇంత సమయం కేటాయించాలి. ఆ సబ్జెక్టులో ఇన్ని చాప్టర్లు పూర్తి చేయాలి అన్న లక్ష్యం పెట్టుకోవాలి. (టైం టేబుల్ వేసుకోవాలి). ఆ విధంగా నిర్ణయించుకున్న తరువాత, తప్పనిసరిగా టైమ్ టేబుల్ పాటించాలి. సమయాన్ని



బట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయకూడదు. చదువుతున్నప్పుడు, చదువుని తప్పించి వేరే విషయాల గురించి ఆలోచించకూడదు. అంటే చదువులో ఏకాగ్రత ముఖ్యం. ఏకాగ్రత లేకుండా ఎంతసేపు చదివినా లాభం ఉండదు. పాత సామెత చెప్పినట్లు మనసు ఒక కోతి. ఫ్రీగా వదిలేస్తే ఎన్ని చక్కర్లు అయినా కొట్టివస్తుంది. సినిమాల గురించి ఆలోచిస్తుంది. హీరో, హీరోయిన్‌లతో డాన్సులాడుతుంది. ఇంటి దగ్గర అమ్మ, నాన్నల దగ్గరకు, చదివిన కాలేజీ దగ్గరకు, చిన్నప్పుడు చేసిన చిలిపి పనుల దగ్గరకు వెళుతుంది. ఇలా అదుపు లేకుండా చాలా కోతి చేష్టలు చేస్తుంది.

చదువు పట్ల, పుస్తకాల పట్ల క్రమశిక్షణ ఉండి తీరాలన్న విషయాన్ని పదే పదే గుర్తుకు తెచ్చుకోండి. మనస్సు అనే కోతిని కట్టేయండి. దానిని గద్దించండం. అదే మీ మాట వింటుంది. ఏకాగ్రత లేని చదువు, ఫలితం లేని పూజ వంటిది. అది చేసినా చేయకపోయినా ఒకటే. ఏకాగ్రతను పెంచుకోవడానికి ఎవరికి వారు పద్ధతులు రూపొందించుకోవాలి. అందరికీ ఒకే cuts dried పద్ధతి ఉండదు.

కొంత మందికి యోగా చేస్తే ఏకాగ్రత పెరుగుతుంది. కొంత మంది మధ్య మధ్యలో కొంచెం విరామం తీసుకుని ఏకాగ్రతని పెంచుకుంటారు. కొంత మంది శూన్యంలోకి చూస్తూ, కొంత మంది అంతకు ముందు సక్సెస్ సాధించిన వారిని గురించి చదువుతూనో, ఆలోచిస్తూనో ఏకాగ్రతను పెంచుకుంటారు. మెల్లిగా సంగీతం వినిపిస్తుంటే దానిని వింటూ శ్రద్ధగా చదవవచ్చు అనుకుంటే అలాగ కూడా ప్రయత్నించవచ్చు. నేను చదువుకునేటప్పుడు నాకు నచ్చిన కొన్ని పాటలు పెట్టుకుని పదే పదే వినేవాడిని.

చదివేటప్పుడు అప్పుడప్పుడూ విరామం కూడా అవసరమే.అరగంట చదివిన తరువాత 2-3 నిమిషాలు విరామం తీసుకోవడం అనేది మంచి ఆలోచనే.

బాగా అలసిపోయినప్పుడు చదువు మానివేయడం మంచిది. ఈ అలసట మానసికమైనదీ, శారీరకమైనది కూడా. నేను అలసిపోతానేమో అనుకుంటే నిజంగానే త్వరగా అలసిపోతాం. అలసటను మనం గుర్తు చేసుకోకూడదు. కానీ అలసట అనిపించినప్పుడు ఒక పెద్ద విరామం తీసుకోవాలి. పెద్ద విరామం అంటే అరగంట నుండి గంట సేపు వరకు అన్నమాట.

మీరే కాస్త కష్టమైనవిగా, క్లిష్టమైనవిగా అనిపించిన సబ్జెక్టులను పొద్దున చదవడం మంచిది. పొద్దున్నే ఎందుకు అంటే అప్పుడు ఫ్రెష్‌గా ఉంటారు. ఏకాగ్రత కుదురుతుంది. మనసులో ఏ ఆలోచనలు రావు. Outside disturbance ఉండదు. చక్కగా రిసీవ్ చేసుకోవడానికి, ఎక్కువ సేపు జ్ఞాపకం ఉండటానికి పొద్దునే మెదడు ఎక్కువ సహకరిస్తుంది. ఇది నా అనుభవం వల్ల చెబుతున్న రహస్యం. కావాలంటే మీరు ఒకసారి టెస్టు చేసి చూడండి. Milton Paradise-lost అన్న ప్రతి రోజు పొద్దున్నే నాలుగు గంటలకు లేచి రాసేవాడట. పొద్దునే లేవడం వల్ల ఒక మంచి లాభం ఏమిటో చెప్పనా? మీకు మీ దినచర్యలో రెండుమూడు గంటలు అధికంగా కలసివస్తాయి. ఆలోచించి చూడండి. రోజు ఏడు లేదా ఏడున్నరకు లేచే ఒక అభ్యర్థి నాలుగు లేదా నాలుగన్నరకు కనుక లేస్తే 3 గంటలు కలిసివచ్చినట్లా కాలా?

అందుకని వీలైనంత పెందలకాడ లేవండి. లేచినందుకు సమయం వృథా కాకుండా మెతుకుపోతుంటే బతుకుపోతుందన్న చందంగా, ఒక సెకండు వృథా అయితే ఒక ర్యాంకు కిందికి తగ్గిపోతుందనుకుంటూ చదవండి. మీరు చదువుకునేటప్పుడు సమయం గురించి వృథా చేయకుండా క్రమశిక్షణ పాటిస్తూ, శ్రద్ధగా చదువుతుంటే సక్సెస్ మీ సరసన చేరాల్సిందే.

అలా కాకుండా ఈ రోజు బద్ధకంగా ఉందని కష్టపడటాన్ని వాయిదా వేస్తే, రేసులో మనని ఓడించడానికి తయారుగా ఉన్న మిగతా అభ్యర్థులు మన బద్ధకాన్ని ఆసరాగా తీసుకుని ముందుకు సాగిపోతారు. మీకు ఎప్పుడైనా బద్ధకంగా అనిపిస్తే చీమల బారుని గుర్తుకు తెచ్చుకోండి. అవి నిరంతరం శ్రమించడాన్ని గుర్తుకు తెచ్చుకోంది.

కొండంత కోర్సు అయినా కొంచెం కొంచెంగా చదివితే పిండి అయిపోవాల్సిందేనని గమనించండి. కష్టపడటాన్ని ఎప్పుడూ వాయిదా వేయవద్దు. అలా చేసే విజయం కూడా వాయిదా పడిపోతుందని గుర్తించండి. శ్రమించడానికి సదా సన్నద్ధంగా ఉండండి.

# 16

# మొట్టమొదటిదేదైనా మహనీయమే మహోన్నతమే

**హైలెట్స్**

- మొదట వచ్చిన వారికి, తరువాత వచ్చిన వారికి టాలెంట్‌లో ఎక్కువ తేడా ఉండదని మన అందరికీ తెలుసు. అయినా సరే మనం మొదట వచ్చిన వారినే గుర్తిస్తాం. వారినే వేనోళ్ల పొగుడుతాం.
- పోటీ ప్రపంచంలో మొదటిస్థానానికి మాత్రమే విలువ ఉంటుంది. ఆలోచిస్తే ఇది ఒకింత అన్యాయమే. కానీ కాంపిటీషన్ దయాదాక్షిణ్యాలను పట్టించుకోదు.
- "ఇంకొంచెం ఎక్కువ"లో కాంపిటీషన్ ఉండదు.
- అదే నీరు. కానీ ఒకే ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెంపుతో ఎంత శక్తిమంతమైనదో కదా. చూడడానికి ఒకే ఒక్క డిగ్రీ. కనిపించడానికి 99 డిగ్రీల సెల్సియస్‌కి తేడా అణువంత. కానీ ఆలోచిస్తే ఆ తేడా అంతులేనంత.
- ఇక నుండి మీరు "ఇంకొంచెం ముందుకెల్దాం" అనే దృక్పథంతో ఉంటే సక్సెస్ ఖచ్చితంగా మీ వెంటే ఉంటుంది.

మొదటి వాడు ఎప్పుడూ ఒంటరే... అన్న కవి మాటలు (కాంపిటీషన్‌ని దృష్టిలో ఉంచుకుని చూసుకుంటే) ఎంతో విశిష్టమైనవి. మొదటివాడు ఒంటరి వాడే అయి

ఉండవచ్చు కానీ, అతను ఎందరికో ప్రేరణ అవుతాడు. మొదటి వ్యక్తి, మొదటి స్థానం, మొదటి అడుగు ఎల్లప్పుడూ మహాద్భుతంగా కీర్తించబతాయి. అందుకని, కాంపిటీషన్‌లో మనం మొదటి స్థానాలలో (ముందు వరసలో) ఉండటానికి సదా శ్రమించాలి. మొదటికున్న మహత్యం ఎంత గొప్పదంటే మొదటి స్థానం తెచ్చుకున్న వారిని మాత్రమే మనం అందలమెక్కిస్తాం. మొదట వచ్చిన వారికి, తరువాత వచ్చిన వారికి టాలెంట్‌లో ఎక్కువ తేడా ఉండదని మన అందరికీ తెలుసు. అయినా సరే మనం మొదట వచ్చిన వారినే గుర్తిస్తాం. వారినే వేనోళ్ల పొగుడుతాం.

చంద్రునిపై కాలు మోసిన మొదటి వ్యక్తి ఎవరంటే మనం నీల్ ఆర్‌మ్‌స్ట్రాంగ్... అని ఠక్కున జవాబు చెప్పగలం. కానీ, చంద్రునిపై కాలు మోసిన రెండివ వ్యక్తి పేరు మనలో ఎంత మందికి తెలుసు?

నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుని మీదకు వెళ్లకముందు దాదాపు 200 విమానాలు ఎక్కాడు. ఎన్నో గంటలు అంతరిక్షంలో గడిపాడు. అయినా తను ప్రాచుర్యం పొందింది. ఒకే ఒక్క అడుగుకని మనందరికీ తెలుసు. ఆ అడుగు చంద్రునిపై కాలు మోపినప్పటిది. తన కాలి బూటు యొక్క ముద్రలను ఫొటోలు తీసుకుని మరీ రోదసీ శాస్త్రజ్ఞులు మురిసిపోతుంటారు. ఎందుకంటే అది మొదటి అడుగుకు సంబంధించినది కాబట్టి.

ఒలంపిక్ క్రీడల్లో ఎంతో మంది క్రీడాకారుదులు, ఎన్నో దేశాల నుంచి పాల్గొంటారు. వారందరికీ దాదాపు సమానమైన ప్రతిభా పాటవాలు ఉండి ఉండవచ్చు. (లేకపోతే వీరందరూ ఒలంపిక్ క్రీడలకు అర్హత సాధించరు కదా). అయినా సరే మనం బంగారు పతకాలు సాధించిన వారిని గురించే ఎక్కువ చర్చించుకుంటాం. ఎందుకంటే మొదటి స్థానానికి ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంది. కాబట్టి ఈ సందర్భంలోనే ఒక చిన్న కథ చెబుతాను. 2008, ఆగస్టు 2008 నాటి టీవీటలో ఒలంపిక్ క్రీడల ప్రారంభోత్సవ మహోత్సవం మనలో చాలామంది వీక్షించాం. ఇందులో చాలా దేశాలు (204 దేశాలు) పాల్గొన్నాయి. కానీ, మనం ఇక్కడ అథ్లెటిక్స్ గురించి మాత్రమే చర్చిద్దాం. అథ్లెటిక్స్‌లోనూ, 800 మీటర్ల పురుషుల పరుగు పందెంలో పాల్గొన్న 42 దేశాల నుండి వచ్చిన 58 మంది క్రీడాకారుల (అథ్లెట్‌ల) మనోభావాలను కొంత పరికిద్దాం. ఆ 58 మంది వారికి వారే సాటి అనేంత ప్రతిభను కనబరచిన వాళ్లు. వారు తమ మీద అత్యంత నమ్మకం పెట్టుకున్న వారి వారి దేశాలు గర్వించేలా ఒలంపిక్ క్రీడల్లో ప్రతిభ కనబరచాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఎవరికి వారే తమదే బంగారు పతకం అనుకుంటూ ప్రారంభోత్సవ వేడుకల్లో మార్చ్ ఫాస్ట్ చేశారు. అలా చేసేప్పుడు వారు తమ కల పండే రోజు కోసం ఎదురుచూస్తూ ఊహ లోకాల్లోకి వెళ్లి ఉంటారు. తమ ప్రతిభను, ప్రపంచం ఆగస్టు 23వ తేదీన తెలుసుకుంటుందని, ఆ రోజు కోసం కనీసం నాలుగు సంవత్సరాలుగా ఎదురుచూపులు చూసిన సంగతిని గుర్తు చేసుకుని ఉంటారు. చూస్తుండగానే ఆగస్టు 20వ తేదీ రానే వచ్చేసింది. ఆ రోజు ఆ 58 అథ్లెట్‌ల్లో 24 మందిని ఎంపిక చేసి రెండవ రౌండ్‌కి పంపిస్తారు. మిగతా వారు ఇంటిదారి పట్టాల్సిందే. ఆగస్టు 21వ తేదీన 24 మందిలో 8 మందిని మాత్రమే 23వ తేదీన జరిగే ఫైనల్స్‌కి ఎంపిక చేస్తారు. ఫైనల్స్‌లో ఒకే ఒక్క బంగారు పతకం మాత్రమే ఉంటుందని మీకు వేరే చెప్పనవసరం లేదుకదా..



ఈ మూడు రోజుల తతంగం చాలా ఆశ్చర్యంగా, అద్భుతంగా, అత్యంత వేగంగా జరిగిపోతుంది. ఏమి జరుగుతుందో మీకు వివరిస్తాను. ఆగస్టు 20వ తేదీన పోటీలో పాల్గొన్న 58 మందిని లాటరీ పద్ధతిలో ఎనిమిది గ్రూపులుగా విభజించారు. ఒక్కొక్క గ్రూపులో 7గురు కానీ,8 మంది గానీ క్రీడాకారులు ఉండేటట్లు ఈ విభజన జరిగింది. ఈ గ్రూపులను సాంకేతిక పదజాలంలో హీట్ అని అంటారు.

ఇప్పుడు ఒక్కో హీట్‌లో ఉన్న ఆటగాళ్ల మధ్య పోటీ పెడతారు. అలా ఎనిమిది గ్రూపులు (హీట్‌లు) కాబట్టి, ఎనిమిదిసార్లు పరుగు పందాలు ఉంటాయి. ఈ పరుగు పందాలలో ఎంపికైన వారు ఆగస్టు 21వ తేదీన జరిగే రెండవ రౌండ్‌లో పాల్గొంటారు. ఒక్కో హీట్‌లో నుంచి ఇద్దరు అత్యంత వేగంగా పరిగెత్తిన ఆటగాళ్లు రెండవ రౌండ్‌కి సూటిగా ఎంపికైపోతారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఆటగాడి టైమ (పూర్తి చేసే సమయం) జాగ్రత్తగా నోట్ చేస్తారు.

ఎనిమిది హీట్‌లు కాబట్టి పదహారు మంది ఆటగాళ్లు సూటిగా రెండవ రౌండ్‌కి ఎంపికయ్యారు. వేరే కాకుండా ఇంకో ఎనిమిది ఆటగాళ్లను కూడా రెండవ రౌండ్‌కి పంపించబడ్డారు. ఈ ఎనిమిది మంది ఎవరంటే – ముందు సూటిగా ఎంపిక కాబడిన 16 మందిని పక్కన పెట్టేసి తరువాత మిగతా ఆటగాళ్ల టైమింగ్‌ని ఒక పట్టిక వేసి, అందులో మొదటి ఎనిమిది ఆటగాళ్లని గుర్తిస్తారు. అంటే సూగిగా ఎంపికైన 16 మంది కాకుండా, అత్యంత వేగంగా పరిగెత్తిన ఇంకో ఎనిమిది మంది రెండవ రౌండ్‌లోకి ప్రవేశిస్తారు. 21వ తేదీన ఎంపికైన 24 మందిని మూడు హీట్‌లుగా విభజించి, మూడు పరుగు పందాలు పెట్టి అందులో ఒక్కో హీట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సంపాదించిన ఆటగాళ్లను 23వ తేదీన జరిగే ఫైనల్స్‌కు ఎంపిక చేస్తారు. ఇలా మూడు హీట్‌లు కాబట్టి,

ఆరుగురు 23వ తేదీన పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారు. ఈ ఆరుగురు మాత్రమే కాకుండా, ఆటగాళ్ల టైమింగ్‌ని బట్టి పట్టిక ప్రకారం ఇంకో ఇద్దరు అత్యంత వేగంగా పరిగెత్తిన ఆటగాళ్లు కూడా ఫైనల్స్‌లో ప్రవేశిస్తారు. 23వ తేదీ ఈ ఎనిమిది మధ్య బంగారు పతకం కోసం పోటీ ఉంటుంది. 23వ తేదీ పోటీ జరిగింది. అందులో కెన్యా దేశానికి చెందిన విల్‌ఫ్రెడ్ బంగారు పతకం కొట్టేశాడు. ఇతను 800 మీటర్ల పరుగు పందాన్ని 1:44.65 (ఒక్క నిమిషం 44.65 సెకండ్లలో) పూర్తి చేశాడు. 1:44.70 (ఒక్క నిమిషం 44.70 సెంకండ్లలో) 800 మీటర్ల పందాన్ని పూర్తి చేసిన ఇస్మాయిల్ అనే సూడాన్ దేశస్తుడు వెండి పతకాన్ని చేజిక్కించుకున్నాడు. ఇక్కడ బంగారు పతకానికి, వెండి పతకానికి తేడా గమనించండి. 0.05 సెకండ్లు. అంటే ఒక్క సెకండులో 20వ భాగం సమయం. అదే సమయం (అంత తక్కువ సమయం) ప్రపంచ విజేతని, రెండవ స్థాన సాధించిన వారిని వేరు చేసింది. పోటీలో మనం మొదట వచ్చిన వారిని గురించి మాత్రమే చర్చిస్తాం. వారినే మనం గుర్తుపెట్టుకుంటాం. మొదటి రెండు స్థానాలకు సమయంలో తేడా ఎంత తక్కువైనా మనం రెండవ స్థానం సాధించిన వారిని గొప్పవారని ఒప్పుకోం.

23వ తేదీ జరిగిన ఫైనల్స్‌లో చివరి స్థానం (8వ స్థానం) దక్కిన అల్జీరియా దేశపు క్రీడాకారుడు 800 మీటర్ల దూరాన్ని 1:45.96 (ఒక్క నిమిషం 45.96 సెకండ్ల)లలో పూర్తి చేశాడు. అంటే 1.31 సెకండ్ల తేడాతో అందరు క్రీడాకారులు పూర్తి లైన్ దాటేశారన్నమాట. 1.31 సెకండ్ల కాలం అంటే ఎంత స్వల్పమైన కాలమో ఒక్కసారి ఊహించండి. అంత కొద్ది టైమ్ గ్యాప్‌లోనే ఎనిమిది మంది ఆటగాళ్లు ర్యాంకింగ్ నిర్ణయమైపోయింది.

ఇంకొక విషయం కూడా ఇక్కడ గమనించవలసినది ఉంది.ఒలంపిక్ పోటీలలో పాల్గొనడానికి వచ్చిన 58 మంది క్రీడాకారులు వారి వారి దేశాలలో పరుగుల రారాజులు. ఆ 58 మంది మధ్య ఎవరు ఫైనల్స్‌కి వెళ్లాలని నిర్ణయించే రెండు అంచల్లో వడపోత కార్యక్రమం కూడా ముఖ్యమైనది. ఆ వడపోత ఎంతో నిర్దాక్షణ్యంగా ఉంటుంది. 58 మంది పాల్గొంటే అందరికంటే చివర 800 మీటర్ల దూరాన్ని పూర్తి చేసిన ఆటగాడికి పట్టిన సమయం 1:50.54 (ఒక్క నిమిషం 50.54 సెకండ్లు). పాల్గొన్న 58 మంది ఆటగాళ్లందరూ బీజింగ్ క్రీడల ప్రారంభోత్సవ వేడుకల సమయంలో బంగారు పతకం మీద కన్నేసిన వారే. అందరూ ప్రపంచ ఒలంపిక్ చరిత్రలో నిలిచిపోవాలని కలలు కన్నవారే. కానీ, సెకనులో 20వ వంతు సమయం ఆలస్యం వారి కలల్ని కల్లలుగా మార్చింది.

దీనిని బట్టి తెలుసుకోవలసిందేమిటంటే కాంపిటీషన్ అంటే – అది నిర్దాక్షణ్యంగా ఉంటుంది. మొదటి స్థానానికి, రెండవ స్థానానికి మధ్య ప్రతిభా పాటవాల్లో చెప్పుకోదగ్గ తేడా లేకపోయినా, ఆయా స్థానాలకు లభించే గౌరవ మర్యాదలకు నక్కకి, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంటుంది.

మౌంట్ ఎవరెస్టుని ఈ పాటికి కొన్ని వేల మంది అధిరోహించి ఉంటారు. 2010 నాటికి అధికారికంగా 5,104 మంది ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించారు. కానీ మనం ఎన్ని సంవత్సరాలు గడుస్తున్నా, టెంజింగ్ నార్గె, ఎడ్మండ్ హిల్లరీ పేర్లను ఎందుకు



మరచిపోలేకపోతున్నాం?

పోటీ ప్రపంచంలో మొదటిస్థానానికి మాత్రమే విలువ ఉంటుంది. ఆలోచిస్తే ఇది ఒకింత అన్యాయమే. కానీ, ఏమిటి చెయ్యడం కాంపిటీషన్స్ దయాదాక్షిణ్యాలను పట్టించుకోదు. అందుకే వీలైనంత వరకు పోటీలో అందరికంటే ముందంజలో ఉండటానికి ప్రయత్నించాలి.

రోజుకి 4–5 గంటలు చదివేసి అబ్బా! ఈ రోజు నేను చాలా బాగా చదివేశాను. నాకు అ సబ్జెక్టులో ఏ ప్రశ్న వచ్చినా ఏదో ఒక రాసేయవచ్చు అనుకోకూడదు. సబ్జెక్టుని

పీల్చి పిప్పిచేయాలి. అందరూ 4-5 గంటలు చదువుతుంటే మనం 6-7 గంటలు చదవాలి. అందరూ ఒక మోస్తరుగా కష్టపడుతుంటే మనం ఇంకొంచెం ఎక్కువ కష్టపడాలి. కష్టపడగలగాలి. అందరూ పది మైళ్ల దూరం పరిగెడుతుంటే మనం 11వ మైలుపై కన్నేయాలి. విజేతలయ్యేవారు. తాము చేయవలసిన పనిని చేసేసి ఇంకా కొంచెం ఎక్కువ పనిచేస్తారు. విజేతలు తమ 100 శాతం శక్తియుక్తులు ధారపోసేసి ఇంకా కొంచెం ఎక్కువ పని చేస్తారు. గమనించవలసింది ఏమిటంటే విజయానికి రహస్యం ఇంకా కొంచెం ఎక్కువ.

మనం పోటీ పరీక్షలకు తయారయ్యే అభ్యర్థులం. పోటీ పరీక్షలకు సామాన్యంగా అందరూ కష్టపడుతుంటారు. మనం కూడా అందరూ పడే కష్టం పడతాము. ఆ కష్టంతో సరిపెట్టకుండా, ఇంకా కొంత ఎక్కువ కష్టపడదాము. అందరూ 15 పుస్తకాలు చదివి ప్రిపేర్ అవుతుంటే మనం ఆ 15 పుస్తకాలతోపాటు అదనంగా 2-3 పుస్తకాలు చదువుదాం. అందరూ రోజుకి 8 గంటలు పుస్తకాల ముందు కూర్చుంటే మనం ఇంకో గంట ఎక్కువ సేపు పుస్తకాలతో గడుపుదాం. మిగతా వారందరూ ఫలానా మార్కులు రావాలని టార్గెట్ పెట్టుకుంటే మనం మన టార్గెట్‌ని 10 మార్కులు ఎక్కువగా నిర్ధారించుకుందాం.

'ఇంకా కొంచెం ఎక్కువ' అని ఎందుకంటున్నానంటే ఆ ఇంకొంచెం ఎక్కువలో కాంపిటీషన్ ఉండదు. మనం అదనంగా చదవబోయే ఆ 2-3 పుస్తకాలు ఎవరూ చదవరు. మనం అదనంగా వెచ్చించే ఒక గంట మిగతా వారు వెచ్చించలేరు.

అందరిలాగ మనం కూడా సామాన్యంగా కష్టపడితే మంచి మార్కులు మనకి మాత్రమే ఎలా వస్తాయి? అందుకే విజయానికి రహస్యం ఇంకొంచెం ఎక్కువ పని చేయడం ఇంకా కొంచెం ఎక్కువ కష్టపడటం ఇంకా కొంచెం ముందుకెళ్లడం.

చిన్నప్పుడు చదివిన ఒక కథ గుర్తుకు వస్తుంది. ఒక ఊరిలో ఓ కట్టెలు కొట్టుకుని జీవనం చేసుకునే వాడుండేవాడు. రోజులాగనే ఒకరోజు అడవిలోకి కట్టెల కోసం వెళ్లబోతుంటే ఒక ఆమె ఎదురువచ్చి ఇంకొంచెం ముందుకెళ్లు అని చెప్పింది. అడవిలోకి వెళ్లిన అతనికి ఈ మాట గుర్తుకు వచ్చి రోజూ వెళ్లే దూరం కాకుండా ఇంకొంచెం ముందుకెళ్లాడు. అక్కడ అతనికి గంధపు చెక్కలు దొరికాయి. వాటిని అమ్ముకుని ఎక్కువ డబ్బులు సంపాదించాడు. రోజూ అలా గంధపు చెక్కల వరకు వెళుతున్న తనకి ఇంకొంచెం ముందుకు వెళ్లన్నమాట గుర్తుకు వచ్చింది. అతను కొంచెం ముందుకెళ్తే అతనికి వెండి దొరికింది. అలా కొన్ని రోజులు వెండి వ్యాపారం చేసుకున్న తనకి మళ్లీ ఇంకొంచెం ముందుకెళ్లమన్న మాట గుర్తుకు వచ్చి, ముందకెళ్తే బంగారం దొరికింది. అలా అతడు ధనవంతుడయ్యాడు.

కథలో నీతి ఏమిటంటే ఇంకొంచెం ముందుకెళ్తే అంతా మంచే జరుగుతుంది. నీళ్లు నీరు 99 డిగ్రీల సెల్సియస్ దగ్గర చాలా వేడిగా ఉంటాయని మనందరికీ తెలుసు. మరి 100 డిగ్రీల సెల్సియస్ దగ్గర ఏమవుతుంది? 100 డిగ్రీల సెల్సియస్ దగ్గర నీరు మరిగి ఆవిరి అవుతుంది. ఆ ఆవిరి ఎంత శక్తిమంతమైనదంటే కొన్ని వేల టన్నుల బరువు ఉండే రైలుని సహితం నడిపించగలుగుతుంది. కొంచెం ఆలోచించండి. అదే నీరు. కీనా ఒకే

ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెంపుతో ఎంత శక్తిమంతమైనదో కదా...

చూడటానికి ఒకే ఒక్క డిగ్రీ. కనిపించడానికి 99 డిగ్రీల సెల్సియస్‌కి 100 డిగ్రీల సెల్సియస్‌కి తేదా అణువంత. కానీ ఆలోచిస్తే ఆ తేడా అంతులేనంత. ఈ పోటీ ప్రపంచంలో 99కి 100కి తేడా 1 కాదు.

అందుకే మనం కొంచెం ఎక్కువ కష్టపడదాం. ఏమో మనం 99 వరకూ వచ్చేశామేమో. దురదృష్టవశాత్తూ మన దగ్గర మన చదువు కొలవడానికి, మన శక్తిని బేరీజు వేయడానికి ధర్మామీటర్ల లాంటి పరికరాలు లేవు. అందుకని మనం ఊరికే ఉండిపోకూడదు. మనకి మనం 99 దగ్గర ఉన్నామని ఊహించుకుని, ఆ ఒక్కటి కూడా పూర్తి చేయాలని చూడాలి. అందుకు సూత్రం 'ఇంకొంచెం ముందుకు వెళ్లు' మనని మనం అలా ప్రోత్సహించుకోవాలి.

ఎప్పుడైనా Thread-mill (జాగర్ మెషిన్) మీద పరిగెల్తారా? దాని మీద పరిగెత్తే క్రీడాకారులు, అథ్లెట్‌లు, బాడీ బిల్డర్లు తమకి చెమట ధారలాగా కారిపోతున్నా కూడా ఇంకా ఒక్క నిమిషం ఎక్కువ చేసి దిగిపోవాలి అనుకుంటూ ఉంటారు. అందుకే వారు అలా తమ తమ రంగాల్లో రాణించగలిగారు. మనం కూడా ఆ ఒక్క డిగ్రీ ఎక్కువ చేయాలని సంకల్పిద్దాం. స్వేదం చిందిద్దాం. అందులోనే అంతులేనంత ఆనందం ఉందని తెలుసుకుందాం.

చివరిగా చెప్పేదేమిటంటే ఇక నుంచి మీరు 'ఇంకొంచెం ముందుకెళ్దాం' అనే ధీమాతో ఉంటే సక్సెస్ ఖచ్చితంగా మీ వెంటే ఉంటుంది. ఇకపై మీకు ఎప్పుడైనా, "నేను చేయగలిగినంత చేసేశాను, నేను చదవవలసినంత సేపు చదివేశాను. నేను కష్టపడగలినంత కష్టపడిపోయాను" అని అనిపిస్తే 'ఇంకొంచెం ముందుకు వెళ్లు' అన్న సూక్తిని నా మాటగా గుర్తుకు తెచ్చుకోండి. ఇంక 'నేను చేయలేను'. 'ఇది చాలు' అని మీ మనసు మీకు చెబుతుంటే నా మాటను గురించి ఒక్కసారి ఆలోచించండి. 99 డిగ్రీల సెల్సియస్‌కి 100 డిగ్రీల సెల్సియస్‌కి తేడా కేవలం 1 డిగ్రీల సెల్సియస్ మాత్రమే కాదని గుర్తించండి. 58 మంది అథ్లెట్లు కలలు కంటే ఒకే ఒక్క క్రీడాకారుని కల పండింది. అతనికి, వేరే వారికి తేడా ఒక్క సెకనులో 20వ వంతు మాత్రమే. కానీ బహుమతులు, రివార్డులు, పేరు ప్రఖ్యాతులు కొలవడానికి వీలవనటువంటివి. మనం 99 డిగ్రీల సెల్సియస్ దగ్గరో, సెకనులో 20వ వంతు సమయం తేడాతోనో వెనుకబడి పోవద్దు. ఇంకొంచెం ముందుకెళదాం. అందరికంటే కొంచెం అధికంగా కష్టపడదాం. అప్పుడు జరిగే మ్యాజిక్ (తమాషా) చూద్దాం. మనమంటే ఏమిటో అందరికీ నిరూపిద్దాం...

# 17

# విజేతలవాలంటే నేర్పుతో పాటు ఓర్పు తప్పనిసరి

**హైలెట్స్**

- సూకీకి ఓర్పుతో పాటు తను అనుకున్నది సాధించుకునే పట్టుదల ఉండటం వలన ఎన్నో ప్రతికూల పరిస్థితులను అవలీలగా ఎదుర్కొంది.
- మనం ఈ రోజు ఏదైనా మొక్కని నాటి, రేపొద్దున ఆ చెట్టు ఫలాలను ఆశిస్తాం. మొక్కలు నాటి వాటి ఫలాలు త్వరగా రావడం లేదని వాటి వేళ్లు సరిగ్గా ఉన్నాయా, లేదా అని మొక్కలనే పీకేసి చూస్తున్నాం.
- ప్రతి గొప్ప పని వెనకాల ఎన్నో ఏళ్ల కఠోర శ్రమ, పనితనం, ఓటమి, గెలుపు, అనుభవం, వ్యక్తిత్వం, కార్యదీక్ష, పట్టుదల, నిద్రలేని రాత్రులు, ఉత్కంఠ మొదలగు భావాలు అల్లుకుపోయి ఉంటాయి.
- గొప్పతనం కలగాలంటే ఎన్నో ఒడిదుడుకులను తట్టుకోవలసిందే. సులువైన షార్ట్‌కట్‌లో వెళ్లామంటే మనం సామాన్యులుగా మిగిలిపోతాం.
- ఉలి దెబ్బలకు భయపడి మొక్కించుకోవలసిన శిల్పం తొక్కించుకునే గడప అయింది. కష్టపడితే సమాజంలో అందరి చేత మొక్కించుకో బడతారు.

ఇంస్టాంట్ కాఫీ, ఫాస్టు ఫుడ్ రోజులివి. ఉరుకుల పరుగుల జీవితం, హడావుడి జీవనంలో పడిపోయి సక్సెస్ కోసం షార్ట్‌కట్‌లు వెతుక్కుంటున్నాం. (మనం)



విజేతలవ్వాలంటే నేర్పుతో పాటు ఓర్పు తప్పనిసరి. Rome was not built in a day. ఒక్క రోజులో అద్భుతాలు జరిగిపోవు.

ఆంగ్ సాంగ్ సూకీ గురించి మీకందరికీ తెలిసే ఉంటుంది. ఇటీవలె (16-జూన్ 2012 నాడు) ఆమె నోబుల్ శాంతి బహుతిని అందుకున్న సందర్భంగా తన శాంతి సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చింది. అయితే ఇక్కడ గమనించవలసినది ఏమిటంటే ఆమెకు నోబుల్ శాంతి పురస్కారం 1991లోనే లభించినా, ఆ సందర్భంగా ఇచ్చే శాంతి సందేశం

వినడానికి మనకందరికీ (శ్రోతలందరికీ) రెండు దశాబ్దాల ఎనిమిది నెలల 28 రోజులు వేచి ఉండాల్సి వచ్చింది. ప్రపంచానికి సూకీ ప్రసంగం వినడానికి రెండు దశాబ్దాలపైనే కాలం పట్టింది. గృహనిర్బంధం నుండి స్వేచ్ఛా వాయువును పీల్చడానికి సూకీకి 21 సంవత్సరాల సుదీర్ఘ సమయం పట్టింది. బర్మాలోని మిలటరీ జుంటా కర్కష పాషాణ హృదయం కరగడానికి 21 సంవత్సరాల కాలం పట్టింది. ఇంత సమయం పడితే పట్టింది. కానీ గాంధేయ మార్గాలైన అహింస, నిజాయితీ ఎప్పటికైనా విజయం సాధించి తీరుతాయని మరోసారి నిరూపితమైంది. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపితే, ఎంతటి మిలటరీ అయినా దిగి వస్తుందని ప్రపంచానికి మరోసారి తెలిసొచ్చింది.

కట్టుకున్న భర్తని కేన్సర్ భూతం కాటేస్తే, కడసారి వీడ్కోలుకైనా వెళ్లలేని పరిస్థితి వచ్చినా, రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, ఎన్నో అవమానాలను సహించి, ఎన్నో అవహేళనలను పట్టికింద నొక్కిపెట్టిన సూకీ 'ఓర్పు' అన్న పదానికి నిలువెత్తు నిదర్శనం. 1945 జూన్ 19వ తేదీన జన్మించిన ఆంగ్ సాంగ్ సూకీ బర్మా జాతిపితగా కొలవబడే ఆంగ్ సాంగ్ సూకీకి కూతురు. దేశానికి స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు కృషి చేసి, ఉన్నదంతా ధారపోసిన ఆంగ్‌సాంగ్, బ్రిటిష్ సామ్రాజ్యం నుండి బర్మా దేశానికి 1947లో స్వాతంత్ర్యం ఇప్పించాడు. అదే సంవత్సరంలో శత్రువుల చేతుల్లో హత్యకి గురయ్యాడు.

సూకీ తన తల్లి దగ్గర పెరిగింది. సూకీ అన్న కొంత కాలానికి బర్మా దేశాన్ని విడిచి, అమెరికా వెళ్లిపోయి అక్కడ పౌరసత్వం కూడా పుచ్చుకున్నాడు. బర్మా ప్రభుత్వం సూకీ తల్లిని భారతదేశానికి, నేపాల్ దేశానికి బర్మా దేశపు రాయబారిగా నియమించింది. 1960లో అలా సూకీ ఇండియాలో ప్రవేశించి, ఇక్కడే విద్యనభ్యసించింది. ఢిల్లీలో లేడీ శ్రీరామ్ కాలేజీలో రాజనీతి శాస్త్రంలో పట్టా పుచ్చుకున్న సూకీ గాంధీజీ సూత్రమైన అహింసను ఒంటబట్టించుకుంది.

1971లో అరిస్ అనే టిబెట్టు పండితునితో వివాహమైన తరువాత సిమ్లాలోని ఐఏఎస్‌లో ఫెలో షిప్ పొందింది. అటు తరువాత బర్మా ప్రభుత్వానికి గౌరవ సలహాదారుగా పనిచేసింది. 1988లో తల్లి అనారోగ్యంగా ఉందని కబురు వస్తే, తల్లిని చూడటానికి సూకీ బర్మాకి వెళ్లింది. కానీ, అక్కడ పరిస్థితి చూసి చలించి పోయింది. తన చదువుకున్న ప్రజాస్వామ్య సిద్ధాంతాలు కాగితాలకే పరిమితం కాకూడదని నిశ్చయించుకుంది. బర్మారో ఎన్ఎల్‌డీ (National League for Democracy) అనే పార్టీ పగ్గాలు చేపట్టి, 1990లో ఎన్నికలలో ఎన్ఎల్‌డీ పార్టీ పార్లమెంటులోని 81 శాతం సీట్లను కైవసం చేసుకునేలా ప్రజలలో చైతన్యం తీసుకువచ్చింది.

అయితే, ఆ ఎన్నికలు చెల్లవని అప్పటి మిలటరీ సూకీని మొదటిసారి గృహ నిర్బంధం చేసింది. అప్పటి నుండి ఆమె విడుదల అయ్యే వరకూ 21 సంవత్సరాల కాలంలో 15 సంవత్సరాలు పైగా గృహనిర్బంధంలో గడిపింది.

సూకీ బర్మా వచ్చినప్పటి నుండి (1988 నుండి) ఆరిస్ చనిపోయేంత వరకూ (1977 వరకూ) అతను సూకీని కేవలం ఐదుసార్లు మాత్రమే కలుసుకున్నాడు. పిల్లలు కూడా లండన్‌లోనే ఉండేవారు. వారిని బర్మాలోకి మిలటరీ ప్రభుత్వం అనుమతించేది



కాదు. కావాలంటే సూకీ మాత్రం విదేశాలకు వెళ్లవచ్చని చెప్పేది. అయితే ఒక్కసారి బయటకు వెళ్లిన తరువాత మళ్లీ దేశంలోకి అనుమతించి ఉండేవారు కాదు మిలటరీ వారు.

భర్త 1995లో చివరిసారిగా సూకీని కలుసుకున్నారు. ఆ తరువాత ఇంకెప్పటికీ లోనికి అనుమతించమని 1995లోనే తేల్చి చెప్పేశారు. 1997లో ఆరిస్‌కి కేన్సర్ అని తెలిసింది. అది కూడా ప్రాణాలను హరించేదని, ఇంక ఆరిస్ ఎంతో కాలం బతకదని డాక్టర్లు తేల్చి చెప్పేశారు. ఐక్యరాజ్య సమితి పోప్ జాన్ పాల్-2 లాంటి ఎంతో మంది ప్రముఖుల విన్నపాలను సైతం మిలటరీ ప్రభుత్వం ఖాతరు చేయక, ఆరిస్‌కి వీసా (ని) నిరాకరించింది. బర్మాలో సరైన వైద్య సదుపాయాలు లేవని సాకును చూపించి, కావాలంటే సూకీని గృహనిర్బంధం నుండి తాత్కాలికంగా విడుదల చేస్తామంటూ ఆమెను శాశ్వతంగా లండన్ పంపించడానికి కుటిలయత్నాలు చేసింది. అయితే బర్మా ప్రజల ప్రజాస్వామ్య హక్కులే ముఖ్యమని భావించిన సూకీ మిలటరీ వారి మాటలను నీటి మీద రాతలుగానే పరిగణించింది. 1999లో ఆరిస్ కన్నుమూసినా, తనని కూడా చూడకపోయినా పరవాలేదు. బర్మా ప్రజాస్వామ్యమే ముఖ్యమని మంకుపట్టు పట్టింది సూకీ. బర్మా విడిచి వెళ్లలేదు. ప్రజాస్వామ్య పోరాట బాటని వీడలేదు.

ఆమె ఇంటి కప్పు తుపానుకి కొట్టుకుపోయినా, గాఢమైన అంధకారంలో జీవితాన్ని కొన్ని నెలలు గడపవలసివచ్చినా ఆమె చలించలేదు.

కొవ్వొత్తులను వెలిగించుకుని ఆమె తన రాత్రిళ్లు గడిపింది. ఒక నోబుల్ శాంతి

బహుమతి గ్రహీత, జాతిపిత కుమార్తె, జీవితంలో అన్నీ కోల్పోయిన మహిళ అన్న కనికరమైనా లేని మిలటరీ ప్రభుత్వం ఆమెకు జనరేటర్‌ను సహితం ఇవ్వలేకపోయింది. అన్నీ ఆమె సహించింది. గాంధీజీ ఆదర్శాలు, బౌద్ధమతంలోని సిద్ధాంతాలను తూచా తప్పక పాటించిన ఆమెకు ఓర్పు ఎంతో ఎక్కువ. అందుకే తను ఇప్పుడు ప్రపంచం మొత్తానికి ఆదర్శమైంది.

2010 నవంబర్‌లో ఆవిడ గృహనిర్బంధం నుండి విముక్తి పొందింది. 2012లో ఖాళీగా ఉన్న 45 పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు జరుగగా, 43 స్థానాలు సూకీ నేతృత్వం వహిస్తున్న ఎన్‌ఎల్‌డీ పార్టీ కైవసం చేసుకుంది. నోబెల్ బహుమతితో పాటు ఎన్నో అంతర్జాతీయ అవార్డులు పొందిన సూకీకి, గౌరవ పౌరసత్వం ఎన్నో దేశాలు పిలిచి ఇచ్చాయి.

సూకీ ఇంత గొప్ప వ్యక్తి ఎలా అయింది? ఓర్పుగా ఉండటం వల్ల. ఓర్పుతో పాటు తను అనుకున్నది సాధించుకునే పట్టుదల ఉండటం వల్ల ఎన్నో ప్రతికూల పరిస్థితులను అవలీలగా ఎదుర్కొంది. ఒక్కసారి ఊహించండి. ఎవరికైనా సంవత్సరాలు గృహ నిర్బంధంలో ఉండటం సాధ్యమేనా? మీరు బర్మా విడిచి వెళ్లిపోతానంటే మిమ్మల్ని విడుదల చేస్తాం... మీ పిల్లా పాపలతో మీరు హాయిగా జీవనం గడపడానికి అన్నీ ఏర్పాట్లు చేస్తాం... మీరు ఈ పట్టుదల వదిలేయండి అని పదే పదే వచ్చే సందేశాలను తృణప్రాయంగా కాదనడానికి ఎంత దమ్ము కావాలి? న్యాయం తనవైపు ఉందని తెలుసు. తనకి దేశ విదేశాల సహాయ సహకారాలు ఉన్నాయని తెలుసు. ఐక్యరాజ్య సమితి తనను విడిపించాలని చూస్తుందని తెలుసు. కానీ తను చనిపోయే లోపల తనవైపు ఉన్న న్యాయం, తనకు సహాయం చేయాలనుకునే ఐకాస మిలటరీ ఆగడాలకు అడ్డుకట్ట వేయగలదా అన్నదే అనుమానాస్పదం. 1996లో తనపై జరిగిన కారు దాడి ఇందుకు నిదర్శనం. చనిపోయినా పరవాలేదు. తను బందీగా ఉన్నా, తనను నమ్ముకున్న ప్రజలను. తను నమ్మిన సిద్ధాంతాలను గెలిపించాలని, తన తరువాతి తరాల వారు స్వేచ్ఛా వాయువులు పీల్చాలని ఉక్కు సంకల్పంతో అనుకున్నది సాధించింది సూకీ. మహా భారతంలో జూదంలో ఓడి పాండవులు 12 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక్క సంవత్సరం అజ్ఞాతవాసం అనుభవించవలసి వచ్చింది. కానీ ఏ పాపం చేయని సూకీ ప్రజాస్వామ్య సిద్ధాంతాలు నమ్మినందుకు 21 సంవత్సరాలు కఠినమైన కారాగారవాసం చేయవలసి వచ్చింది. అయినా చివరకు ఆవిడే గెలిచింది. ఆవిడకు ఉన్న ఆభరణాలు ఓర్పు, పట్టుదల.

2012 జూన్ 16న నెదర్లాండ్స్‌లోని ఓస్లో హాల్‌లో నోబెల్ శాంతి సందేశంలోని ప్రధానమైన సందేశం 'ఓర్పు'తో ఏదైనా సాధించవచ్చు" (అని). చైనీస్ వెదురు చెట్టు గురించి మీరెప్పుడైనా విన్నారా? ఈ వెదురు చెట్టు తను పూర్తిగా పెరగడానికి ఐదు సంవత్సరాల మూడు నెలలు తీసుకుంటుంది.

ఒక్కసారి ఈ వెదురు చెట్టుని నాటిన తరువాత రైతు చాలా జాగ్రత్తగా ఈ చెట్టుని కాపాడుకుంటూ ఉండాలి. దీనిని నాటిన కొద్ది నాళ్లకి ఒక్క చిన్న ఆకు పచ్చ గడ్డి బైటకు వకినిస్తుంది. అంటే అప్పుడది బతికందన్న మాట. దానికి సరైన సమయంలో నీళ్లు పోస్తూ కాపాడుకుంటూ ఉండాలి. సంవత్సరం మొత్తం అలా కాపాడుకుంటూ వచ్చినా, ఒక్క

అడుగు కూడా ఆ మొక్క పెరగదు. వెదురు చెట్టు పెరగాలంటే బాగా ఎరువు వేయాలనుకుని రైతు మంచి నాణ్యమైన ఎరువులను, సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టినా, రెండవ సంవత్సరానికి కూడా దాని పెరుగుదల అడుగుకు మించదు. రైతు ఎంత కష్టపడినా, ఎంత ఎక్కువ నీళ్లు పోసి మొక్కను కంటికి రెప్పలా కాపాడినా, మూడవ సంవత్సరం మొత్తం మీద ఒక్క చిన్న రెమ్మ కూడా వేయదు. కానీ వెదురు చెట్టు మాత్రం పచ్చగా ఉంటుంది. నాల్గవ సంవత్సరం కూడా పరిస్థితిలో మార్పు ఉండదు. ఐదవ సంవత్సరం కూడా అంతే. ఎంత జాగ్రత్తగా పెంచాలని చూసినా ఐదు సంవత్సరాల పాటు బతికి ఉందన్న సూచన తప్ప, ఎదుగూ బొదుగూ లేకుండా పడి ఉంటుంది. ఆ వెదురు మొక్క.

ఇప్పుడే జరుగుతుంది మహాద్భుతం. ఐదు సంవత్సరాలు దాటిన తర్వాత, వచ్చే మూడు నెలల్లో 80 అడుగులు అమాంతంగా పెరిగిపోతుంది. చైనీస్ వెదురు. ఇది నమ్మశక్యంగా ఉందా? అరవై నెలల పాటు ఒక్క అడుగైనా పెరగని మొక్క కేవలం మూడు నెలల్లో 80 అడుగులు ఎలా పెరిగిందంటారు? ఈ అరవై నెలలు కూడా ఆ మొక్క పెరుగుతూనే ఉంది. అయితే, ఆ పెరుగుదల మనకంటికి కనిపించలేదు. అదంతా భూమిలోపల జరుగుతుంది. 80 అడుగుల వెదురుని సపోర్టు చేయాలంటే (మోయాలంటే) భూమిలో వేళ్లు చాలా బలంగా ఉండాలి. అంత ఎత్తు ఎదగవలసిన చెట్టువేళ్లు భూమిలో నలుదిక్కులా పాకి, పైన ఎదగబోయే బరువైన వెదురుకి మంచి ఊతమివ్వాలి. ఆ అరవై నెలలు జరుగుతున్న తతంగం ఇది.

ఆ వెదురు ఎనిమిది అంతస్థుల భవంతి అంత ఎత్తు, మూడు నెలల్లో ఎదిగిపోలేదు. దానికి ఎంతో సేపు వేచి ఉండాల్సి వచ్చింది. మనం ఈ రోజు ఏదైనా మొక్కని నాటి, రేపొద్దున ఆ చెట్టు ఫలాలను ఆశిస్తాం. మనం ఓర్పు లేకుండా ఉంటున్నాం. మొక్కలు నాటి వాటి ఫలాలు త్వరగా రావడం లేదని వాటి వేళ్లు సరిగ్గా ఉన్నాయా లేదా అని ఆ మొక్కలనే పీకేసి చూస్తున్నాం. ఓర్పు లేకపోతే గొప్ప గొప్ప విజయాలు సంభవించవు. వెంటనే ఫలితం రావాలని ఒక్క రోజులో పుట్టుకు వచ్చే పుట్ట గొడుగుల వైపు మొగ్గు చూపుతున్నాం.

ప్రతి గొప్ప పని వెనుకాల ఎన్నో ఏళ్ల కఠోర శ్రమ, పనితనం, ఓటమి, గెలుపు, అనుభవం, వ్యక్తిత్వం, కార్యదీక్ష, పట్టుదల, నిద్రలేని రాత్రులు, ఉత్కంఠ మొదలగు భావాలు అల్లుకుపోయి ఉంటాయి. ఇవన్నీ 80 అడుగుల చైనీస్ వెదురు ఎదగాలంటే ఊతమిచ్చిన కింద ఉన్న వేళ్ల వంటివి. అప్పుడే ఆ వెదురు అంత ఎత్తు ఎదగ గలిగింది.

గొప్ప తనం కలగాలంటే ఎన్నో ఒడిదుడుకులకు తట్టుకోవలసినదే. సులువైన షార్ట్‌కట్‌లో వెళ్లామంటే మనం సామాన్యులుగా మిగిలిపోతాము. ఒక్క చిన్న ఉదాహరణ చెబుతాను. ఒక పురాతన దేవాలయంలో పూజారి గుడి తలుపులు మూసివేసిన తరువాత మూలవిరాట్టు విగ్రహం గుడిలోని గడప కింద ఉన్న మెట్టు మాట్లాడుకుంటున్నాయంట. మెట్టు విగ్రహాన్ని అడిగిందంట. “మనమిద్దరం కూడా ఒకే కొండ నుండి వచ్చిన రాళ్లం కదా. అయినా నన్ను అందరూ తొక్కుతారు. నిన్ను అందరూ మొక్కుతారు. ఎందుకీ వివక్ష పిచ్చి జనాలకు” అన్నదట. అప్పుడు విగ్రహం ఇలా చెప్పిందంట. మొదట నిన్నే

విగ్రహంగా చెక్కాలని శిల్పి చూశాడు. కానీ, నీవు ఉలి దెబ్బలకు తాళలేక అబ్బా! నన్ను ఇలానే వదిలేయ్ అన్నావు. అప్పుడు శిల్పి నీకు నాలుగు ఉలి దెబ్బలు తగిలించి, నిన్ను మెట్టులా ఉండేలా తయారు చేశాడు. ఆ తరువాత శిల్పికి నన్ను నేను అర్పించుకున్నాను. ఎన్ని ఉలి దెబ్బలకైనా నేను సిద్ధం అని చెప్పాను. ఉలి దెబ్బలు తగిలించుకున్నాను కాబట్టి నేను మంచి శిల్పంగా తయారయ్యాను. అప్పుడు కష్టపడ్డాను కాబట్టి, ఇప్పుడు సుఖపడుతున్నాను. నేను మొక్కించుకోబడుతున్నాను, నీవు తొక్కించుకోబడుతున్నావు అన్నదంట.

పోటీ పరీక్షలలో నెగ్గి జీవితంలో ఎంతో సాధిద్దాం అనుకునే మనలాంటి వారికి కూడా ఓర్పు అత్యంత అవసరం. ఒక్కొక్కసారి వెంటనే ఫలితాలు రాకపోవచ్చు. మనకి ఫలితం అనుకోని విధంగా రావచ్చు. ప్రిలిమ్స్‌లో కానీ, మెయిన్స్‌లో కానీ, ఇంటర్వ్యూలో కానీ చుక్కెదురు కావచ్చు. అప్పుడు మనం డీలా పడిపోకూడదు. పోటీ పరీక్షలు మన శక్తి సామర్థ్యాలను మాత్రమే పరీక్షించడం లేదు. మనకి ఉన్న సహనాన్ని, ఓర్పుని, మనల్ని మనం సర్దిచెప్పుకునే తీరును కూడా పరీక్షిస్తాయి. పోటీ పరీక్షలలో నెగ్గడానికి కొంత సమయం పడుతుంది. మీట నొక్కగానే వచ్చేయడానికి అదేమీ ఇంస్టెంట్ కాఫీ కాదు. ఊహించండి ఒకవేళ చైనీస్ వెదురుని నాటిన రైతు ఐదు సంవత్సరాలు చూసి, పెరుగుదల లేదని పొలం మొత్తం దున్నేయిస్తే ఏమయి ఉండేది? అలాగే మనకి ఓర్పు తక్కువైతే, తనకి కరెక్టుగా ఫలితం రావలసిన సమయంలో (ఫలితం దక్కే సమయంలో) మనం పరీక్షరాయడం మానేస్తే ఎలా ఉంటుంది? ఎంతో మంది అభ్యర్థులు పోటీ పరీక్షలకు తయారవుతారు (ప్రిపేర్ అవుతారు). కోచింగ్ తీసుకుంటారు. అయినా కొంత మంది అభ్యర్థులు మాత్రమే విజయం సాధించగలుగుతారు. ఎందుకని? బహుశా అపజయం పాలయ్యే వారు ఓర్పు లేక సగంలోనే వదిలివేసిన వారేమో...

ఇంకొకసారి మీకు ఎప్పుడైనా పట్టిన పట్టును సగంలోనే వదిలేయాలనిపిస్తే, ఆంగ్ సాంగ్ సూకీని గుర్తుకు తెచ్చుకోండి. ఆమె 21 సంవత్సరాలు పడిన వేదనని గుర్తుకు తెచ్చుకోండి. చివరకు ఓర్పు మాత్రమే విజయం సాధిస్తుందని గమనించండి. భవిష్యత్తులో ఎప్పుడైనా మీకు విజయం లభించడం చాలా ఆలస్యమవుతుందని అనిపిస్తే చైనీస్ వెదురుని గుర్తుకు తెచ్చుకోండి. సమయం పడుతున్న విషయం వాస్తవమే కానీ, రేపు రాయబోయే పరీక్షలకు గట్టి పునాది కావలసిన అవసరాన్ని గుర్తు చేసుకోండి. పైకి కనబడే విజయం కొంత ఆలస్యం అవవచ్చునేమో కానీ ఆ లోపు జ్ఞానం అనే బండాగారాన్ని వేళ్లు అల్లుకుపోయినట్లుగా పెంపొందించుకోవలసిన అవసరాన్ని గుర్తించండి. బాగా కష్టపడండి. ఉలి దెబ్బలకు భయపడి మొక్కించుకోవలసిన శిల్పం తొక్కించుకునే గడప అయ్యింది అన్న విషయం గుర్తు చేసుకోండి. కష్టపడటానికి వెనుకాడకండి. కష్టపడితే సమాజంలో అందరి చేత మొక్కించుకోబడతారు. విజయం సాధించాలంటే - కష్టపడవలసిందే. ఓర్పుతో ఉండాల్సిందే. Short-cut లు ఏమీ లేవు.

# 18

# అగాథాల్లోకి పడినా సరే.. ప్రయత్నించడం ఆపవద్దు

**హైలెట్స్**

- ప్రతికూల పరిస్థితులలో సైతం ప్రయత్నం చేయడమే గొప్ప విషయం. ప్రయత్నం సఫలమైందా, విఫలమైందా అనేది తరువాతి సంగతి. ప్రయత్నం చేశామా, లేదా అన్నదే అసలైన సంగతి.
- ప్రయత్నం వల్ల 100 శాతం సక్సెస్ వస్తుందన్న గ్యారెంటీ లేదు. కానీ ప్రయత్నించకపోవడం వల్ల ఖచ్చితంగా విఫలమవుతాం. ఇది మాత్రం గ్యారంటీ.
- ఆకలి, నిద్ర అయినా మానేవాడినేమో కానీ, నా లక్ష్యాన్ని చేరుకునే వరకూ ఎప్పుడూ ప్రయత్నించడం ఆపలేదు.
- ప్రయత్నించడం ఆపకపోతే ఫలితం వస్తుందన్న ఆశ బతికి ఉంటుంది. ప్రయత్నించడం ఆపేస్తే మనకి మనమే అపజయాన్ని ఆహ్వానిస్తున్నట్లు.
- బహుశా, మన కష్టకాలంలో ఏమి చేస్తామో, అదే మన సక్సెస్‌ని నిర్ధారిస్తుందేమో.

మనకు అన్నీ అనుకూలమైన పరిస్థితులు ప్రతిసారీ ఉండవు. అనుకూలమైన పరిస్థితులు ఉన్నప్పుడు అందరూ అనుకున్నది సాధించగలరు. కానీ ప్రతికూల పరిస్థితులలో సైతం ప్రయత్నం చేయడమే గొప్ప విషయం. ప్రయత్నం సఫలమైందా?

విఫలమైందా? అనేది తరువాతి సంగతి. ప్రయత్నం చేశామా, లేదా అన్నదే అసలైన సంగతి. ప్రయత్నిస్తే సఫలమవుతామో, విఫలమవుతామో ఖచ్చితంగా చెప్పలేకపోవచ్చు. అంటే ప్రయత్నం వల్ల 10 సక్సెస్ వస్తుందన్న గ్యారెంటీ లేదు. కానీ ప్రయత్నించకపోవడం వల్ల (ప్రయత్నం చేయకపోతే మాత్రం) ఖచ్చితంగా విఫలమవుతాము. ఇది మాత్రం గ్యారెంటీ. తెలుసుకోవలసినదేమిటంటే "సాధనమున పనులు సమకూరు ధరలోన" ప్రయత్నం చేయగా చేయగా అనుకున్నది సాధించగలం.

ఒక చిన్న కథ చెబుతాను. ఒక కప్ప గెంతుతూ గెంతుతూ అమాంతం ఒక మజ్జిగ కుండలో పడిపోయింది. అది ఒక లోతైన కుండ. కప్ప బయటకు రావాలని ఎంతగానో ప్రయత్నిస్తుంది. అది ఈదగలుగుతుంది కానీ, బయటకు మాత్రం రాలేక పోతుంది. మజ్జిగ చిక్కగా ఉండటం వల్ల తనకు బయట వెలుతురు కూడా కనబడటం లేదు. కళ్లలోకి మజ్జిగ వెళ్లి, కప్పను బాధ పెట్టసాగింది. కప్ప మజ్జిగ కుండ అడుగుకు వెళ్లి బలంగా కాళ్లతో తంతూ పైకి రావాలని చూస్తుంది. లోతైన కుండ కావడం వల్ల, మజ్జిగ చిక్కగా ఉండడం వల్ల అది పైకి రాలేకపోతుంది. ఇంకోసారి బలం మొత్తం కూడదీసుకుని కుండ అడుగ భాగాన్ని బలంగా తన్నింది. అది సగం దూరం కూడా రాలేకపోయింది. అయ్యో! ఈసారి రెండుకాళ్లతో తన్నలేదు కదా అనుకుంటూ ఒకేసారి రెండు వెనుక కాళ్లతో కుండ అడుగున తన్నింది... అయినా ఫలితం లేకపోయింది. ఎన్నోసార్లు అలా ప్రయత్నం చేస్తూనే ఉంది. కానీ, అది కుంట పైభాగం వరకూ గెంతలేకపోతుంది. బలంగా తన్ని తన్నీ తన శక్తిని సగం కోల్పోయింది కప్ప. నీరసంగా అనిపించింది. ఇక నా జీవితం అంతం కాబోతుంది అని తనకు తెలుస్తుంది. కళ్లు కూడా సహకరించడం లేదు. అయినా సరే, ఎటూ చావవలసిందే కదా! ఓపిక ఉన్నంత వరకూ నాకు తెలిసిన మార్గంలో బయట పడేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాను అని నిశ్చయించుకుంది కప్ప. శక్తి లేదు. చూపు లేదు. అయినా ఈదుకుంటూ అడుగుకు వెళ్లి, రెండు కాళ్లతో బలంగా మజ్జిగ కుండను తంతూనే ఉంది. తన కాళ్ల చలనం వల్ల మజ్జిగ చిలకబడింది. ఈదుతున్న కప్పకి పైన ఏదో ఘనపదార్థం లాంటిది తగిలింది. ఆ ఘనపదార్థాన్ని అంతటిని ఒక్క చోటుకు చేర్చింది. దానినే మనం వెన్న అంటాం కదా. ఆ ఘన పదార్థం మీదకు ఎక్కి ఒక్క ఉదుటున బయటకు దూకింది. ఇదీ ప్రయత్నం చేయడం వల్ల ఫలితం. కష్టాలు అందరికీ వస్తాయి. అందరూ అందుకు సహజంగా కృంగిపోతారు. కానీ, విజేతలు మాత్రం తమ కష్టాల నుండి బయటపడడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. అలా ప్రయత్నం చేయడం వల్లనే ఫలితం దక్కుతుంది. ప్రయత్నం చేయకుండా కష్టాలకు కృంగిపోయి ఏడ్చి పెడబొబ్బలు పెట్టడం చాలా సులువు. కానీ ఆ కష్టకాలంలో కూడా ప్రయత్నాలు మానకపోవడం అనేదే కావలసినది. ప్రతికూల పరిస్థితులలో సహితం ప్రయత్నాలను వీడకపోతే ఫలితాల ప్రభంజనం ఎంత అద్భుతంగా ఉంటుందో మీకు మైఖెల్ ఫెల్ప్ప్ కథ ద్వారా చెప్పదలచుకున్నాను. మైఖెల్ 1985లో అమెరికా దేశంలో జన్మించి, ఆ దేశానికి ఒలంపిక్ క్రీడల్లో 22 పతకాలను సాధించి పెట్టిన మేటి ఈతగాడు. 26 సంవత్సరాల వయసులోపు 22 ఒలంపిక్ పతకాలు. అందులో 18 బంగారు పతకాలు. ఒక్కసారి ఊహించండి. ఒలంపిక్స్‌లో ఒక వ్యక్తి గరిష్టంగా ఎన్ని బంగారు పతకాలు సాధించగలడు? ఒలంపిక్ క్రీడల్లో అందరికంటే ఎక్కువ బంగారు



పతకాలు మైఖేల్ తరువాత స్థానంలో ఉన్న వారు ఎన్ని బంగారు పతకాలు సాధించారో తెలుసా? మైఖెల్ సాధించిన పసిడి పతకాలలో సరిగ్గా సగం. ఒలంపిక్ క్రీడల్లో ఒక్క కాంస్య పతకం అయినా సాధిస్తే మనం ఎంతలా సంబరపడిపోతాం? ఎంతలా ఆ వ్యక్తిని అంబరానికి ఎత్తివేస్తాం? అలాంటిది ఒక వ్యక్తి 2004లో ఏథెన్స్‌లో జరిగిన ఒలంపిక్ క్రీడల్లో పాల్గొన్న ఎనిమిది ఈవెంట్‌లలో (అంశాలలో పోటీలలో) ఆరు స్వర్ణ, రెండు కాంస్య పతకాలు, 2008లో బీజింగ్‌లో జరిగిన ఒలంపిక్ క్రీడల్లో పాల్గొన్న ఎనిమిది ఈవెంట్‌లలో ఎనిమిది స్వర్ణ పతకాలు, మొన్న (ఈ మధ్యన) ముగిసిన 2012 లండన్ ఒలంపిక్ క్రీడల్లో పాల్గొన్న ఏడు ఈవెంట్‌లలో నాలుగు స్వర్ణ, రెండు రజిత పతకాలు సాధిస్తే, అతని ఘనకీర్తిని కొలవడానికి ఏ కొలమానాలు సరిపోతాయి. చెప్పండి? ఒక వ్యక్తి పేరు మీద 39 ప్రపంచ రికార్డులు ఉంటే ఆ వ్యక్తి తను ఎంచుకున్న రంగంలో ఎంతలా పండిపోయి ఉంటాడో మీ ఊహలకే వదిలేస్తున్నారు. తను ఈతలో ఇంతలా రాణించడానికి కారణమేమిటో తెలుసా? అలుపెరుగక ప్రయత్నించడమే. అట్టడుగున ఉన్నా, ప్రయత్నాలు మానుకోకపోవడమే.

ఇక్కడ మీకు ఒక ఆశ్చర్యకరమైన విషయం చెబతాను. మైఖెల్ ఈత కొలనులో ప్రపంచ రారాజైతే కావచ్చు కానీ, సరిగ్గా రెండు పాదాలు నేలకు ఆనించి నడవలేడు. వయ్యారంగా నడుస్తాడు. స్విమ్మింగ్ కోసమే ఇదంతా అని అందరూ మొదట అనుకున్నారు. కానీ, తనకు అలా వయ్యారంగా నడవడం అలవాటైపోయింది. అదే అతని కొంప ముంచింది. 2004 ఒలంపిక్ క్రీడల్లో పాల్గొని ప్రపంచాన్ని అబ్బురపరచిన మైఖెల్

2008లో పాల్గొనే ఎనిమిది ఈవెంట్‌లలో స్వర్ణాలు సాధిస్తానని సవాలు చేశాడు. అది చేసి తీరుతాడని అందరూ నమ్మారు కూడా. ఇంకొన్ని నెలలో ఒలంపిక్స్ కోసం బీజింగ్ ప్రయాణానికి సిద్ధం అవుతున్నంతలో ఒక ప్రమాదం జరిగింది. అక్టోబర్ 2007లో మైఖేల్ తన స్నేహితుడి కారులోనికి ఎక్కవలసిన సందర్భంలో వయ్యారంగా నడుస్తున్న తను నేల మీద చలికి గడ్డకట్టిన ఐసు మీద కాలు వేసి, జారిపడి, తన మణికట్టుకి దెబ్బతగిలించుకున్నాడు. డాక్టర్ దగ్గరకు వెళితే మణికట్టు బెణికిందని, దానిని కొన్ని నెలలపాటు కదపడానికి వీలులేదని, కట్టు కట్టేశాడు. మైఖేల్ చేతికి కట్టు అంటే మైఖేల్ స్విమ్మింగ్ ప్రాక్టీస్‌కి, అతని ఎనిమిది బంగారు పతకాల కలకి, స్విమ్మింగ్‌లో పతకాలు ఆశిస్తున్న అమెరికా ఊహలకు పెద్ద ఎదురుదెబ్బ అన్నమాట.

తను అసలు బీజింగ్ ఒలంపిక్స్‌లో పాల్గొంటాడా? పాల్గొన్నా ముందే అనుకున్నట్లు ఎనిమిది బంగారు పతకాలు సాధిస్తాడా? ఇన్నేళ్ల తన కృషి అంతా వృథా కావలసిందేనా? తను కన్న బంగారు కలలు కల్లలయిపోవాల్సిందేనా? ఇవి మైఖేల్ మనసులో మెదులుతున్న ప్రశ్నలు. చేతికి కట్టిన కట్టు చూస్తే, తన ప్రశ్నలకు జవాబులు తెలియకపోగా, కొత్త కొత్త ఆలోచనలు, వింత వింత ప్రశ్నలు తయారవుతున్నాయి. ఇంక ఈ ప్రశ్నల పరంపరను ఆపేయాలని నిశ్చయించుకున్నాడు మైఖేల్. అనుకున్నదే తడవుగా, మైఖేల్ స్విమ్మింగ్ పూల్ వైపు పరిగెత్తాడు. ఆవేశంలో పూల్‌కోకి దూకి చేతులాడిస్తూ ఈత కొడితే, మొదటికే మోసమొస్తుంది. డాక్టర్ ఈసారి నెలల తరబడి కట్టుకట్టేసి ఉంచుతాడు. అందుకు మరి ఏమి చేయాలి? ఖాళీగా మాత్రం కూర్చోరాదు. ప్రయత్నిస్తూనే ఉండాలి. మరి ఎలా ప్రయత్నించడం? స్విమ్మింగ్ అంటే చేతులతో పాటు కాళ్లు కూడా కదలాలి. అందుకు చేతులతో ప్రయత్నించలేకపోతే, కాళ్లు ఉన్నాయిగా. కాళ్లు ఈతకొలనులోకి పెట్టి, తను ఒడ్డు మీద కూర్చొని, బలంగా కాళ్లతో నీటిని తన్నడం మొదలు పెట్టాడు. తనకు ఏమి చేయాలో తెలియదు. కానీ, లక్ష్యం నెరవేరడం కోసం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి. నిరంతరం ప్రయత్నించడం వల్ల మాత్రమే విజయం సాధించవచ్చు అన్న విషయం మాత్రమ మైఖేల్‌కి తెలుసు. అంతే కొన్ని లక్షల సార్లు స్విమ్మింగ్ పూల్‌లోని నీటిని బలంగా తన్ని ఉంటాడు. అలా చేయడం వల్ల తన కాళ్ల కండరాలకు మంచి వ్యాయామం అయి, అవి చాలా బలిష్టంగా తయారయ్యాయి. కొన్ని వారాలలో మైఖేల్ చేతికి కట్టిన కట్టును విప్పదీశారు. అప్పుడే పంజరం నుండి స్వేచ్ఛ పొందిన పక్షి ఎలా అయితే తనివి తీరా ఆకాశంలో రివ్వున ఎగురుతుందో, అలా తన తనివి తీరా ఈతకొలనులో ఈతకొట్టాడు మైఖేల్. బీజింగ్ పోటీలు దగ్గర పడుతున్నాయి. అందుకుతను ఘోరమైన తపస్సు లాంటి ప్రాక్టీస్ చేశాడు. తను అంతకు ముందు సాధించిన రికార్డులు ఎన్నో ఈ ప్రాక్టీసులో బద్ధలై ఉంటాయి. ఇంతలో తను ఎంతగానో ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. 2008 ఒలంపిక్స్ కోసం తను బీజింగ్ వెళ్లాడు. ఎనిమిది పోటీలలో పాల్గొనాలి. ప్రతీ పోటీ ముందు పాటలు విని స్విమ్మింగ్ పూల్‌లోకి దిగేవాడు. కసితో ఈదేవాడు. అలా ఆరు పోటీలు గడిచాయి. ఆ ఆరు పోటీలలో కూడా తనకు తానే సాటి అని నిరూపించుకున్నాడు. ఆరు బంగారు పతకాలు తన వశమయ్యాయి. అది ఆగస్టు 16, 2008. మైఖేల్ ఏడవ పోటీకి, ఏడవ బంగారు పతకానికి రెడీ అయ్యాడు. 100 మీటర్ల



బట్టర్‌ఫ్లై పోటీ అది. పాటలు వింటూ తన ప్రత్యర్థుల వైపు ఒక్కసారి చూశాడు. తన సహ ఈతగాళ్లలో మిలోర్డ్ కావిక్ కూడా ఉన్నాడు. అతడు 100 మీటర్ల బట్టర్ ఫ్లై పందెంలో అందెవేసిన చేయి. ఎలా అయినా మిలోర్డ్‌ని ఓడించి తీరాలని తీర్మానించుకుని మైఖెల్ స్విమ్మింగ్ పూల్‌లోకి దూకాడు. పోటీ ప్రారంభమైంది. చేపల్లా అందరూ ఈదుతున్నారు.

క్షణాలలో పోటీ ముగిసిపోయింది కూడా. ఫలితం మాత్రం తేలలేదు. ఎందుకంటే మిలోర్డ్‌ది, మైఖెల్‌ది ఒక్కటే టైమింగ్. అంటే ఇద్దరూ ఒకేసారి తమ గమ్యస్థానాలు చేరుకున్నారు. ఫలితాల నిర్ధారణ కోసం, బంగారు పతకం ఎవరు సాధించారో తేల్చడం కోసం మంచి రిజల్యూషన్ ఉన్న స్లో మోషన్ కెమెరాలకు పని కల్పించవలసి వచ్చింది. బాగా సునిశితంగా పరిశీలించిన తరువాత తేలిందేమిటంటే ఇద్దరి టైమింగ్‌లో కొంచెం తేడా ఉంది. ఆ తేడా ఎంతో తెలుసా? సెకనులో 100వ వంతు తేడా. నిజమే. సెకనులో వందవ వంతు తేడా. ఒకరికి బంగారు పతకాన్ని, రెండవ వారికి వెండి పతకాన్ని ఇచ్చింది. సెకనులో వందవవంతు తేడా. ప్రపంచ విజేతని, మిగతా వారిని వేరు చేసింది. బంగారు పతకం సాధించి, ప్రపంచ విజేత అయినవాడు మన మైఖెల్ అని మీకు ఇప్పటికి అర్థమయ్యే ఉంటుంది. అయితే ఇక్కడ గమనించవలసింది ఏమిటంటే ఆ సెకనులో వందవ వంతు తేడాని, మనవాడు ఎలా సాధించగలిగాడనేది. స్లో మోషన్ కెమెరాల ద్వారా నిర్ణేతలు గవనించింది ఏమిటంటే రేసులోని చివరి ఐదు మీటర్ల దూరాన్ని అలసిపోయిన మిలోర్డ్ తన కాళ్లని లాక్కుంటూ వస్తే, మైఖేల్ మాత్రం బలంగా నీళ్లను తన్నాడు. అలా చేయడం ద్వారా నీరు మైఖెల్‌ని ముందుకు నెట్టింది. అలా తను అందరికంటే స్విమ్మింగ్ పూల్ గోడని (పట్టుకోగలిగాడు) తాకగలిగాడు. చివర తను బలంగా తన్నినందుకు మాత్రమే ఆ సెకనులో వందో వంతు ఆధిక్యాన్ని సాధించగలిగాడు. అందుకే తను ఆ ఏడవ బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఆ తరువాత జరిగిన ఎనిమిదవ పోటీ కూడా తనకు నల్లేరు మీద నడక లాగానే సాగింది. ఎనిమిదవ బంగారు పతకం కూడా సాధించాడు. ఆశ్చర్యం! తను పాల్గొన్న ప్రతీ పోటీలోనూ బంగారు పతకాలు సాధించాడు. తన కలను నెరవేర్చుకున్నాడు. అనుకున్నది, అన్నది, కలగన్నది, నెరవేర్చినది, చేసి చూపించింది అంతా ఒక్కటే. అయింది మైఖెల్ విషయంలో. అందుకే అతను విశ్వవిజేత అయ్యాడు.

2012 ఒలంపిక్స్ చివరి రోజున మైఖెల్ తను ఇక రిటైరవుతున్నట్లు ప్రకటించాడు. తాను ఇక స్విమ్మింగ్ చేయబోనని, ఇక పోటీలలో పాల్గొనబోనని ప్రకటించాడు. అయితే రిటైరయ్యేటప్పుడు ఒక వ్యాఖ్య చేశాడు. పత్రికల ముందు తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఇలా అన్నాడు. “నేను 2008 ఒలంపిక్స్ తరువాత రిటైర్ అవుదామని అనుకున్నాను. 2010 ఆ ప్రాంతంలో ఇంక ఒలంపిక్స్‌లో పాల్గొనని లోకానికి చెబుదామనుకున్నాను. అప్పుడు ఇంకొన్ని రోజులలో రిటైర్‌మెంట్ ప్రకటించబోతున్నంతలో నేనూ, నా స్నేహితుడు ఒక ఫుట్‌బాల్ మ్యాచ్‌కని బయటకు వస్తే అప్పటికే లావుగా ఉన్న నన్ను కొంత మంది ఫొటోగ్రాఫర్లు ఫొటో తీసి పత్రికలకు ఇచ్చారు. కొన్ని పోస్టర్లలో నా ఫొటోలిచ్చి నిన్నటి ఒలంపిక్ విజేత అని ప్రచురించారు. దానికి అర్థం ఏమిటంటే నేను ఈ సారి జరిగే ఒలంపిక్స్‌లో పాల్గొనని అనుకుంటున్నారంతా. నేను నా ఫిట్‌నెస్ కోల్పోయానని పత్రికలు కథనాలు ప్రచురించాయి. నేను ఓటమిని ఒప్పుకోదలచుకోలేదు. ఆ రోజే నా రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నాను. 2012 ఒలంపిక్స్‌లో బంగారు పతకాలు సాధించి, అదే వేదిక మీద నుండి నేను రిటైరవుతున్నట్లు ప్రకటించాలనుకున్నాను. నేను అనుకున్నట్లే ఈసారి నాలుగు ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టాను. 2010లో లావుగా ఉన్న నేను

అందరికంటే ఫిట్‌గా తయారయ్యాను. ఈ రోజు అలా మీ ముందున్నాను. నేను నా కెరీర్‌ని ఎలా ముగించాలనుకున్నానో, అలాగే ముగించగలుగుతున్నాను. ఇందుకు నేను చేసిందేమిటంటే నిరంతరం ప్రయత్నించడం. ఆకలి, నిద్ర అయినా మానేవాడినేమో కానీ, నా లక్ష్యాన్ని చేరుకునే వరకూ ఎప్పుడూ ప్రయత్నించడం ఆపలేదు. ఇదీ పత్రికల వారితో మైఖేల్ చేసిన వ్యాఖ్య.

ఒక్క విషయం గమనించండి. ప్రయత్నం చేయడం వల్లనే కదా మైఖేల్ మిగతా క్రీడాకారుల దరిదాపుల్లో కూడా లేనటువంటి రికార్డులు సాధించినది! నిరంతరం ప్రయత్నం చేయడం వల్లనే కదా! ఒక 26-27 ఏళ్ల కుర్రాడు వేనోళ్ల పొగడబడుతున్నాడు. ప్రయత్నం చేయడం వల్లనే కదా. అతనిని సక్సెస్‌కి నిలువెత్తు నిదర్శంగా, యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ప్రయత్నం చేయడం వల్లనే కదా ప్రపంచ స్విమ్మర్లు అతనికి తమ గుండెల్లో గుడి కట్టి పూజిస్తున్నారు. అందుకే మనం కూడా ఈ రోజు ఒక గట్టి నిర్ణయం తీసుకుందాం. అదేమిటంటే మనం ప్రయత్నం చేయడం మాత్రం ఆపవద్దు. నిరంతరం కృషి చేస్తూనే ఉందాం. సాధనమున పనులు సమకూరు ధరలోన అని నమ్ముదాం. నమ్మి మన పనులు చేద్దాం.

చీమలనుండైనా, సాలీడునుండైనా, మజ్జిగ కుండలో పడిపోయిన కప్పనుండైనా ప్రపంచ విజేత మైఖేల్‌నుండైనా మనం నేర్చుకునే పాఠం ఒక్కటే. అదేమిటంటే ప్రతికూల పరిస్థితులలో సహితం ప్రయత్నిస్తూ ఉంటేనే సక్సెస్ సాధ్యమవుతుంది. ఇక నుండి ఎప్పుడైనా అగాథాల్లోకి కూరుకుపోయామని మనం భావిస్తే, మనం ఈదాల్సినవి పసిఫిక్ మహాసముద్రమంతటి భవసాగరాలని అనిపిస్తే, చుట్టూ, చీకటి కమ్మి, వెలుతురు జాడ అణువంతైనా మనకి లేకపోతే, ఒక్క పనిని మాత్రం మానకండి. అది ప్రయత్నించడం. ప్రయత్నించడం ఆపకపోతే ఫలితం వస్తుందన్న ఆశ బతికి ఉంటుంది. ప్రయత్నించడం ఆపేస్తే మనకి మనమే అపజయాన్ని ఆహ్వానిస్తున్నట్లు అని గుర్తుంచుకోండి.

మైఖేల్ ఎందుకు ప్రపంచ ఛాంపియన్ అయ్యాడో ఒక్కసారి ఆలోచించండి. మిగతా వారికి, మన ఛాంపియన్‌కి తేడా ఏమిటో గుర్తించండి. ప్రమాదం వల్ల స్విమ్మింగ్ ప్రాక్టీస్‌కి దూరమవ్వాల్సి వచ్చినా, స్విమ్మింగ్ పూల్‌కి దూరంగా ఉండకపోవడం వల్ల తను విశ్వవిజేతయ్యాడు. పైకి ఎదగాలనే కాంక్షతో ప్రయత్నాలను ఆపకపోవడం వల్ల తను ఈ రోజు అందరి చేత ఆరాధించబడుతున్నాడు.

చివరగా చెప్పేదేమిటంటే మీరు ఎప్పుడైనా అగాథాల్లోకి కూరుకుపోయామని భావిస్తే, కృంగిపోవడం పక్కన పెట్టేసి, ఆ అగాథం నుండి బయటపడే ప్రయత్నం చేయండి. కృంగిపోవడం అందరూ చేస్తారు. కానీ, ఏదో ఒకటి చేయాలని సంకల్పించిన మజ్జిగలోని కప్ప, బెణికి కట్టు కట్టించుకుని, బలంగా నీళ్లని తన్నిన మైఖేల్ మనికి ఆదర్శం కావాలి. బహుశా, మన కష్టకాలంలో మనం ఏమి చేస్తామో, అదే మన సక్సెస్‌ని నిర్ధారిస్తుందేమో... ఆలోచించండి. ప్రయత్నించండి. విజేతలవ్వండి.

# 19

# ఓటమెప్పుడూ ఒప్పుకోవద్దు... ఓరిమెన్నడూ కోల్పోవద్దు

**హైలెట్స్**

- మొండి పట్టుదల, రాక్షస ఓర్పు, పాజిటివ్ దృక్పథం ఉన్న వారికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా అవి ఒక లెక్కలోకి రావు. తమకు పరచిన ముళ్లబాటను పూలబాటను చేసుకోగల సమర్థులు.
- కష్టాలు నేను మాత్రమే తట్టుకోగలను కాబట్టి, అవి నాకు మాత్రమే వస్తాయి.
- జీవిత ప్రయాణంలో ఓడిపోయానని మాత్రం ఒప్పుకోనని ఒట్టు పెట్టుకున్నాడు. ఆత్మవిశ్వాసంతో జీవితంలో ప్రతీ పరీక్ష నెగ్గాడు. అనుకున్నది సాధించాడు.
- ఎవరికైనా ఏదైనా మంచి బహుమానం ఇవ్వాలంటే వారిలోని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ప్రేరణనివ్వండి.
- నేను చేయలేని **1000** పనుల మీద కంటే చేయగలిగిన **9000** పనుల మీద దృష్టి పెడతాను. ఆ పనులు అందరికంటే బాగా చేయాలనుకుంటాను.
- గెలవాలి. గెలిచి తీరాలి అని తీర్మానించుకుంటే నన్ను ఆపడం (ఓడించడం) ఎవరితరం కాదు.

ఏదైనా సాధించాలని మనం తలిస్తే, ఆ పని పరిపూర్ణం అయ్యే వరకూ, దానిని ఎట్టి పరిస్థితులలోనైనా నెరవేర్చకుండా వదలకూడదు. గొప్ప గొప్ప పనులు చేయాలని అందరూ



అనుకుంటారు. జీవితంలో ఏదైనా సాధించాలని అందరూ కలలు గంటారు / కంటారు. కానీ, ఆ కలల్ని నెరవేర్చుకునేది కొందరే. వారినే మనం విజేతలుగా గుర్తిస్తాం. కలల్ని సాకారం చేసుకోవాలని మనం పూనుకుంటే ఎన్నో అడ్డంకులు రావచ్చు. ఊహించిన దానికంటే కొన్ని వందల రెట్లు శ్రమించవలసి రావచ్చు. కష్టాలు రావచ్చు, నష్టాలు రావచ్చు, కన్నీళ్లు రావచ్చు, కడగండ్లు రావచ్చు. అయినా సరే వీటన్నింటినీ తట్టుకుని, అనుకున్నది సాధించగలగాలి. కష్టాలు వచ్చినప్పుడు, నష్టాలు వచ్చినప్పుడు, బతుకు అగమ్యగోచరంగా అనిపించినప్పుడు 'నా వల్ల కాదు' అని అనుకుంటూ వదిలివేయడం చాలా సులువు. కానీ, ఎన్ని అడ్డంకులు ఎదురైనా నేను అనుకున్నది సాధించి తీరుతానని తీర్మానించుకుని, 'నా వల్లే అవుతుంది', నాకే సాధ్యమవుతుంది అని అనుకుంటూ ఉండటం చాలా చాలా కష్టం. మొండి పట్టుదల, రాక్షస ఓర్పు, పాజిటివ్ దృక్పథం ఉన్న వారికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా, అవి ఒక లెక్కలోకి రావు. వారు తమ శక్తియుక్తులతో, తమకు పరచిన ముళ్లబాటను పూలబాటను చేసుకోగల సమర్థులు. సరిగ్గా అలాంటి వారి కోవలోకే ఇప్పుడు మనం చెప్పుకోబోతున్న మహనీయుడు వస్తాడు. ఇతని పేరు డబ్ల్యూ మిషల్. పుట్టింది అమెరికాలో ఏప్రిల్ 11, 1943లో జన్మించిన మిషల్ నూనూగు మీసాల నూతన యవ్వనంలో జాలీగా మోటార్ సైకిల్ మీద స్వారీ చేస్తూ గడిపాడు. బండి మీద అతివేగంగా వెళ్తూ ఎదురుగా వచ్చే గాలి, అతి వేగంగా తన జుట్టును తాకుతూ, ఆ జుట్టును పైకి ఎగరేస్తుంటే – ఆ మజాలో ప్రయాణాన్ని ఆసాంతం ఆస్వాదించే కుర్రతనం మిషల్‌ది. తన 28వ ఏట కొత్త హోండా మోటార్ సైకిల్ మీద రైడ్‌ను ఎంజాయ్ చేద్దామని

బయలుదేరాడు మిషల్. హైవే మీద సాయం కాలం పూట వెళుతున్నాడు. చిరు చీకటిలో ఎదురుగా వచ్చే గాలిని ఆస్వాదిస్తూ బండి వేగం పెంచాడు. ఎదురుగా గాలి మాత్రమే రాలేదు. భారీ వాహనం ఒకటి వస్తుందన్న సూచన కూడా మిషల్‌కు వచ్చింది. అకస్మాత్తుగా తన కళ్ల మీద ఎదురుగా వస్తున్న వాహనం తాలూకు లైట్లు పడటంతో ఒక్కసారిగా తడబడ్డాడు మిషల్. బండి వేగం తగ్గింది. కానీ తన గుండె వేగం పెరిగింది. ఎందుకంటే వెనుకగా వస్తున్న లాండ్రీ ట్రక్కు (భారీ వాహనం) పెద్ద శబ్దంతో హారన్ వేయడం తను గమనించాడు. ఎంత దూరంలో ఆ ట్రక్కు ఉందని వెనక్కి తిరిగి చూశాడు. అంతే, క్షణంలో తన కొత్త హోండా బైకు ట్రక్కు ముందు చక్రాల కింద నుజ్జునుజ్జు అయింది. తను మాత్రం ఎగిరి కొంచెం ముందుకు పడ్డాడు. తన చేతులు తన వెనుక భాగం రక్తపు ముద్దలయిపోయాయి. తన బైకులో నుండి కారిందో, లేక ట్రక్కులో నుండి కారిందో కానీ పెట్రోల్ మాత్రం కింద ఒక మడుగును ఏర్పరచుకుంది. బండి నేలను రాపిడి చేసుకుంటూ ట్రక్కు ముందు చక్రాల మధ్య ఇరుక్కుంది. ఆ రాపిడికి పుట్టిన అగ్గి పెట్రోల్ తోడవడం వల్ల పెద్దదయి తన కొత్త బైకులోని పెట్రోల్ ట్యాంకులోకి వెళ్లిపోయింది. చూస్తుండగానే పెట్రోల్ ట్యాంక్‌తో సహా బైకు పేలిపోయింది. రక్తపు మడుగులో ఉన్న మిషల్‌ని ఆ మంటలు పూర్తిగా చుట్టుముట్టాయి. ఇదంతా జరగడానికి 5-6 సెకండ్ల కాలమే పట్టిందంటే నమ్ముతారా? కింద పడిన మిషల్ తెలివిని కోల్పోయి, 5 రోజుల తర్వాత తెలివిలోకి వచ్చాడు. తను కూడా అంత కొద్ది సమయంలోనే తన జీవితంలో పెనుమార్పు సంభవించిందని నమ్మలేదు. కానీ, తను ఉన్న స్థితిని చూసుకుని, నమ్మక తప్పలేదు.

తన శరీరంలో మూడు వంతులు పూర్తిగా కాలిపోయింది. హాస్పటల్‌కి తీసుకురాబడిన మిషల్ అసలు బతకడేమోనని డాక్టర్లు చేతులెత్తేశారు. అయితే ఎన్నో ఆపరేషన్‌ల తరువాత, 16 చోట్ల తన చర్మాన్ని ఒక చోట నుండి తీసి మరో చోట అంటు కట్టిన తరువాత, 13 ట్రాన్స్‌ఫ్యూజన్‌ల తరువాత, మాంసపు ముద్దలా పడిన మిషనల్‌ని మనిషి ఆకారంలోకి తీసుకురాగలిగారు. ముఖం మాత్రం గుర్తు పట్టలేనంతగా కాలిపోవడం వల్ల క్రితం తన ముఖాన్ని తర్వాత తన ముఖానికి పోలికే లేకుండా పోయింది. ముఖం వరకూ అయితే ఏదో ఒకటి చేసి డాక్టర్లు కష్టపడి, అమర్చగలిగారు. కానీ, పూర్తిగా కాలిపోయి పనికిరాకపోయిన చేతులను, చేతి వేళ్లను ఎంతగా ప్రయత్నించినా, ఎంతగా శ్రమించినా అమర్చలేకపోయారు. తన చేతులకు ఉన్న పది వేళ్లూ ఇప్పుడు లేవు. చేతులు ఉండాల్సిన ప్రదేశంలో రెండు చిన్న చిన్న కట్టెలు ఉన్నాయి ఇప్పుడు. తన మారిపోయిన ముఖాన్ని చూసి ఎన్నిసార్లు అద్దంలో చూసుకుని బాధపడ్డాడో తెలియదు కానీ, అద్దం లేకుండా తన కంటికి ఎదురుగా కనబడుతున్న చేతులనబడే కట్టెలను చూసుకుని బాధపడి, కంట తడి పెట్టాడు. చేతులు సరే, వేళ్లేవి అని చూసుకునేంతలో, అప్రయత్నంగా దేవుణ్ణి, విధిని బూతులు తిట్టేస్తున్నాడు. కసి పెరిగిపోతుంది. ఏం చేయాలి? ఎవరిని నిందించాలి? యవ్వనంలో ఉన్న తను, జీవితాన్ని ఎంతో ఆనందిద్దామనుకున్నాడు. అది సంభవమయ్యేటట్లు లేదు. అందుకు జీవితంలో ఏదో సాదిద్దామనుకుని నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా, తను తనకు జరిగిన



అన్యాయం గురించి ఆలోచించడం మానేశాడు. జరిగిందేదైనా బాధపడి ప్రయోజనం లేదు కాబట్టి జరగవలసిన దానిని గురించి ఆలోచించాలనుకున్నాడు. తను జీవితంలో ఎవరి దగ్గరకూ వెళ్లి ఉద్యోగం అడగలేదు. తను ఎవరినైనా ఉద్యోగం అడిగినా, వారు తన మీద జాలి చూపిస్తారు. అది తను అసహ్యించుకునే విషయం. అందుకని, తను ఎవరి దగ్గరా ఉపాధి కోసం చేతులు చాచకుండా తనే వందల వేల మందికి ఉద్యోగం కల్పించాలనుకున్నాడు. పట్టుదల ఉండాలే కానీ, అనుకున్న లక్ష్యం ఎంత పెద్దదైనా సాధించవచ్చు అని విషల్ మరోసారి ప్రపంచానికి చాటాడు. తనకు యాక్సిడెంట్ జరిగిన ఆరు నెలల లోపు వెర్మాంట్ కాస్టింగ్ కంపెనీ స్థాపించాడు. ఆ కంపెనీ ఇంధనం తక్కువ ఖర్చు చేసే పొయ్యిలు తయారు చేసేది. అనతి కాలంలోనే ఆ కంపెనీ మిషల్ ఆత్మవిశ్వాసం వలె ఇంతింతే వటుడింతై అన్నట్లు పెరిగి పెద్దదవసాగింది. వెర్మాంట్ పట్టణంలో మరే ఇతర సంస్థలు ఇవ్వలేనన్ని ఉద్యోగాలు (పని చేసే వారికి) యువతకు అందించింది. అంతేకాదు, అప్పుడు ఆ కంపెనీ నికర విలువ 65 మిలియన్ డాలర్లగా లెక్కకట్టబడింది. చూస్తుండగానే అతను 3 మిలియన్ డాలర్లకు ఆసామి అయ్యాడు. ఇంద్ర భవనం లాంటి బంగళాను కొనుక్కోగలిగాడు. ఒక సొంత విమానం ఖరీదు చేశాడు.

తన కంపెనీ వేగంగా విస్తరిస్తూ ఉంది. తను ఎంతో మంది యువతకు ఉపాధి కలిగించగలుగుతున్నాడు. ఎన్నో కోట్ల రూపాయలు సంపాదించగలుగుతున్నాడు. అతి కొద్ది కాలంలోనే రాజకీయాలలోకి ప్రవేశం కూడా జరిగిపోయింది. తను రెండుసార్లు మేయర్ పదవిని చేపట్టాడు. తమ దేశ పార్లమెంట్‌కి పోటీకి కూడా నిలబడ్డాడు. తను

కురూపిని అని అందరికీ తెలిసినా, తెలియకపోయినా తన ప్రచారం కోసం ఇలా అంటుండేవాడు.

"నన్ను మీరు పార్లమెంట్‌కి పంపించండి. మీరు చూడదలచుకోని ముఖాలలో నా ముఖాన్ని కూడా చేర్చండి" అని హాస్యాలాడే వాడు. తను రాజకీయ నాయకుడి లాగ కూడా మంచి పేరు తెచ్చుకున్నాడు. దేశంలో అత్యున్నతమైన రాజకీయ పదవి చేపట్టాలనుకున్నాడు. ఎంతో ఎత్తు ఎదగాలనుకున్నాడు. కానీ, తనకు విధి సహకరించలేదు. తన రాజకీయ భవిష్యత్తు ఎత్తుకు ఎదగలేకపోతుంటే కుంగిపోలేదు. గగనంలో ఎత్తుగా విహరించే వాహనాలలో ప్రయాణించానుకున్నాడు. ప్రయాణించాడు. కానీ, ఇంకా ఏదో కావాలి. తను వేరే ఎవరో నడిపే వాహనంలో ఎందుకు ప్రయాణించాలి? తనే ఎందుకు నడపకూడదు? అన్న ఆలోచన వచ్చింది. వెంటనే పైలెట్ ట్రైనింగ్ తీసుకున్నాడు. అందులో అన్నీ స్టేజీలలో పాస్ అయ్యాడు. తరువాత కమర్షియల్ విమానాన్ని నడపడానికి లైసెన్సు లభించింది. ఆ తరువాత మల్టీ–ఇంజన్ విమానాన్ని నడపడానికి లైసెన్స్, అటు తర్వాత సెయిల్ ప్లేన్ లైసెన్స లభించింది. ఈ లైసెన్సులు డబ్బులు సంపాదించడానికి కాదు, తను అనుకున్నది సాధించడానికి. అందరికంటే ఎత్తులో ప్రయాణించే అవకాశం గగనతలంలో విమానాలు నడిపే అవకాశం లభించింది. గుర్తుంచుకోండి. తనకు వేళ్లు లేవు. ఒక్కవేలు కూడా లేదు. తన మోచేతులు గుర్తించబడటానికి వీలులేకుండా కాలిపోయాయి. తన చేతులు చిన్న చిన్న కట్టెల్లా ఉంటాయి. మిషల్ తప్ప వేరెవరైనా సరే అట్లాంటి పరిస్థితులలో పైలెట్ ట్రైనింగ్ గురించి ఊహించడానికే భయపడతారు. కానీ, మిషల్ నిజమైన వీరుడు అనుకున్నది సాధించిన మగధీరుడు.

అంతా బాగుందన్నంతలో విధి మరోసారి వింత నాటకమాడింది. 1975 నవంబర్‌లో అంటే తను రోడ్డు ప్రమాదం నుండి బైటపడ్డ నాలుగు సంవత్సరాలలో ఇంకో ప్రమాదం జరిగింది. ఈసారి ఆకాశంలో విహరిస్తుండగా తను పైలెట్ ట్రైనింగ్‌లో భాగంగా, శిక్షణ పూర్తయిన తరువాత, కొన్ని వందల సార్లు ఆకాశంలో విమానాలతో చక్కర్లు కొట్టాడు. ఈసారి కూడా నలుగురు ప్రయాణికులతో ఉన్న విమానాన్ని నడుపుతున్నాడు. ఆ రోజు బయట వాతావరణం చాలా చల్లగా ఉంది. కొంత మంచు కురుస్తుంది కూడా. 75 అడుగుల ఎత్తుకు విమానం వెళ్లినప్పుడు ఒక వింతని గమనించాడు మిషల్. అదేమిటంటే విమానం ఎగరాల్సిన వేగంతో ఎగరడం లేదు. ఏదో ప్రమాదం ముంచుకు వస్తుంది అని నిర్ధారించడానికి ఎంతో సమయం పట్టలేదు. త్వరగా రన్‌వే వైపుకి వెళదామని ప్రయత్నించిన మిషల్‌కి పెద్ద పెద్ద కొండరాళ్లు అడ్డువచ్చేశాయి. ఇంకేదేమైనా చేసేంతలో ఒక్క పెద్ద బండరాయి వలె విమానం కొండరాళ్ల మీద కుప్ప కూలింది.

ఈ ప్రమాదం నుండి మిగతా అందరూ సురక్షితంగా బయటపడగలిగారు. ఒక్క మిషల్ తప్పించి గాయాలయ్యాయి. తనకు బలంగా గాయాలయ్యాయి. తన కాళ్లు కదుపుతుంటే చాలా భారంగా అనిపించింది. అప్పుడు తను తన కాళ్లు విమానంలోని పెడల్స్‌లో ఇరుక్కుపోయాయోమోనని అనుకున్నాడు. కాళ్లు కొంచెం బలంగా కదిపితే



మోకాళ్ల కింద భాగంపైకి రాలేదు. ఆ తరువాతే అర్థమైంది. తనకు జరిగిన ఆ విమాన ప్రమాదం తన రెండు కాళ్లని బలి తీసుకుందని. జీవితంలో రెండోసారి స్పృహ తప్పి పడిపోయి హాస్పిటల్‌కి చేరుకున్న మిషల్‌ని చూసిన డాక్టర్లు మళ్లీ చేతులెత్తేశారు. ఇతనికి చేతులు లేవు. ఇప్పుడు కాళ్లు కూడా లేవు. చూస్తే రక్తపు మడుగులో ఉన్నాడు. ట్రీట్‌మెంట్ చేయాలన్నా ఎక్కడ నుండి మొదలు పెట్టాలో తెలియలేదు డాక్టర్లకు. ఎన్నో టెస్టులు చేసిన తరువాత డాక్టర్లు ఒక నిర్ధారణకు వచ్చారు. విమాన ప్రమాదంలో మిషల్ కేవలం కాళ్లు మాత్రమే కోల్పోలేదు. 12 పక్కటెముకలకు కూడా పెళ పెళమని విరిగిపోయాయి. అంటే తన వెన్నెముక ఇక జన్మలో బాగుపడలేనంతగా ఎముకలు విరిగాయి. తను కాళ్లు ఎటూ పోయాయి. దాని అర్థమేమిటంటే మిషల్ శాశ్వతంగా వీల్ చైర్‌కి అంకితమై పోవలసిందే. అదే నిర్ణయం మిషల్‌కి చెప్పారు డాక్టర్లు. వినగానే చివుక్కుమని అనిపించినా, మిషల్ మాత్రం ధైర్యంగా తనని తాను తమాయించుకున్నాడు. కష్టాలు నేను మాత్రమే తట్టుకోగలను కాబట్టి, అవి నాకు మాత్రమే వస్తాయని సర్దిచెప్పుకున్నాడు. తన జీవిత ప్రయాణంలో ఓడిపోయానని మాత్రం ఒప్పుకోనని ఒట్టు పెట్టుకున్నాడు. మిగతా వారయితే ఇలాంటి ప్రమాదాల వల్ల ఆత్మవిశ్వాసం కోల్పోతారు. కానీ, తను మాత్రం ఆత్మవిశ్వాసంతో జీవితంలో ప్రతీ పరీక్ష నెగ్గాడు. అనుకున్నది సాధించాడు. ఎవరికైనా ఏదైనా మంచి బహుమానం ఇవ్వాలనుకుంటే వారిలోని ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ప్రేరణను ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చాడు. తను పెంపొందించిందుకున్న ఆత్మవిశ్వాసం ఇతరులకు ప్రేరణను ఇచ్చి, వారిలో తమపై తమకు నమ్మకం ఏర్పడేలా చేయడం తన

తరువాతి కర్తవ్యం అని భావించాడు. ఇప్పుడు మిషల్ చేస్తున్నది సరిగ్గా అదే. తను ఒక మోటివేషన్ గురువు అయిపోయాడు. పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు ఆయన డేట్‌ల కోసం, కాల్ షీట్ల కోసం పడిగాపులు కాస్తుంటారు. దీనికి తోడు మిషల్ ఎన్నో కంపెనీలను స్థాపించాడు. ఎంతో మందికి ఉపాధి కల్పించాడు, కల్పిస్తున్నాడు. అతను నేడు ఒక సక్సెస్‌ఫుల్ వ్యాపారవేత్త, ఎన్నో కంపెనీలకు డైరెక్టర్, కర్త, కర్మ, క్రియ.

జీవితంలో ఇన్ని ఒడిదుడుకుల గురించి ఎవరైనా అడిగితే తను చెప్పేది వింటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. అదేమిటంటే నాకు ప్రమాదాలు జరగకముందు నేను పదివేల పనులు చేస్తుండేవాడినేమో. ప్రమాదాలు జరిగిన తరువాత నేను తొమ్మిదివేల పనులు చేసుకోగలుగుతున్నాను. వెయ్యి పనులు చేసుకోలేకపోతున్నాను. నిజమే. కానీ, వెయ్యి పనులు చేసుకోలేకపోతున్నానని బాధపడుతూ కూర్చుంటే మిగతా 9 వేల పనులు సరిగ్గా చేయలేను. నేను చేయలేని 1000 పనుల మీదకంటే కూడా చేయగలిగే 9000 పనుల మీద దృష్టిపెడతాను. ఆ పనులు అందరికంటే బాగా చేయాలనుకుంటాను. నేను ఓటమిని ఎప్పుడూ ఒప్పుకోదలచుకోలేదు. గెలవాలి. గెలిచి తీరాలని తీర్మానించుకుంటే నన్ను ఆపడం ఎవరి తరమూ కాదు. కొసమెరుపు ఏమిటంటే మిషల్ ఇప్పుడు సాహస క్రీడల్లో పాల్గొంటాడు. తనకు స్కైడైవింగ్, రివర్ రాఫ్టింగ్ అంటే ఎంతో ప్రీతి.

ఇతని జీవితం గురించి ఎన్నో ప్రేరణాత్మకమైన పుస్తకాలు వచ్చాయి. "The man who would not be dejeated", "It's not what happens to you, Its what you do about it" అన్నవి బాగా ప్రాచుర్యం పొందాయి.

మీకు ఏమైందని కాదు, మీకు ఏదైనా అయితే, దానిని గురించి మీరు ఏమి చేస్తారనేదే గమనించాలి. ఇది అక్షర సత్యం. మనం ఉన్న ఫీల్డ్‌లో ఎన్నో అడ్డంకులు ఎదురు కావచ్చు. ఎన్నోసార్లు ఎదురు దెబ్బలు తగలవచ్చు. కొన్ని కొన్నిసార్లు మనని కోలుకోనీయకుండా దెబ్బతీసేంత పెద్ద పెద్ద అవాంతరాలు సంభవించవచ్చు. వీటన్నింటినీ ఎదిరించకుండా ఓటమిని ఒప్పేసుకుంటే గెలవడంలో మజా ఏముంటుంది?

మన జీవితంలో ఇంక ఎప్పుడూ ఓటమిని ఒప్పుకోకూడదు. ఎప్పుడైనా ఆ సందర్భం వస్తుందనిపిస్తే మిషల్‌ని గుర్తుకు తెచ్చుకుందాం. మనకు ఉన్న సమస్యలు మిషల్ ఎదుర్కొన్న సమస్యలకంటే బహుశా చిన్నవే అయి ఉండవచ్చు. ఆశను చంపుకోవద్దు. ఓటమిని ఒప్పుకోవద్దు. మనం ఎంచుకున్న ఫీల్డ్‌లో విజయం సాధించడం కోసం నిరంతరం ప్రయత్నిద్దాం. ఏవైనా అవాంతరాలు ఏర్పడితే ఇంకా బాగా ప్రయత్నిద్దాం. ఆశావాద దృక్పథంతో ఉందాం. అందుకే ఎప్పుడూ ఒప్పుకోవద్దు ఓటమి ఎన్నడూ కోల్పోవద్దు ఓరిమి.

# 20

# ఆత్మవిశ్వాసమే ఆశావహుల (ఆశావాదుల) ఆభరణం

**హైలెట్స్**

- ఎవరికైనా ఏదైనా మంచి బహుమతి ప్రదానం చేయాలంటే వారి (యొక్క) ఆత్మవిశ్వాసాన్ని పెంపొదింపజేయాలంట.
- సక్సెస్ అవాలంటే కావలసినది వయసు కాదు డిగ్రీలు కాదు, అనుభవం కాదు, ఆస్తిపాస్తులు అంతకన్నా కాదు. అన్నిటికన్నా ముందు కావలసినది ఆత్మవిశ్వాసం.
- మనల్ని కుంగదీసే శక్తిని మనం కష్టనష్టాలకు ఇవ్వకూడదు. మనల్ని మరింత రాటుదేల్చేందుకు సాధనాలుగా కష్టాలని మార్చుకోండి.
- ఆత్మ విశ్వాసం కలవారే అందరికంటే ఎక్కువ ఆస్తిపరులు.

చిన్నప్పుడు విన్న తాబేలు-కుందేలు కథ గుర్తుందా? కుందేలు, తాబేలుని గేలి చేయడానికి తనతో పరుగు పందెంలో పాల్గొనమందట. ఎవరు ముందు గమ్యస్థానాన్ని చేరుకుంటే వారు పందెంలో గెలిచినట్లన్నమాట. పోటీ ప్రారంభమైంది. తాబేలు అడుగు తీసి అడుగు వేసే లోపల కుందేలు నాలుగు గెంతులు గెంతింది. కొంత సమయం గడిచిన తరువాత, కుందేలు దాదాపు గమ్యస్థానం వరకూ చేరుకొని, ఎక్కడో దూరాన మెల్లిమెల్లిగా వస్తున్న తాబేలుని చూసి అది రావడానికి చాలా సమయం పడుతుందని గ్రహించి ఆ లోపు ఒక కునుకు తీద్దామని నిద్రపోయింది. ఈ లోపు తాబేలు తన చిన్ని చిన్ని పాదాలతో వచ్చీ

వచ్చి నిద్రిస్తున్న కుందేటిని దాటేసింది. తాబేలు సరిగ్గా గమ్యస్థానాన్ని తాకబోతుండగా కుందేలుకి మెలకుల వచ్చింది. ఫలితంగా పరుగు పందెంలో తాబేలు గెలిచింది. ఈ కథలో నీతిని చెబుతూ కుందేలు చేసిన తప్పు గురించి చర్చిస్తారు. ఏమి చేయకూడదో చెబుతారు. కానీ, నేను తాబేలుని చూసి ఏమి చేయాలో నేర్చుకోమంటున్నాను. తనకు ఎంత ఆత్మవిశ్వాసం ఉంటే చెంగు చెంగున గెంతే కుందేటితో పరుగు పందెం ఒప్పుకుంటుంది తాబేలు? తన మీద తనకు నమ్మకం ఉంది కాబట్టే కదా. కుందేటితో పందెం అంటే సై అంది.

మన నిజజీవితంలోనైనా అంతే... ఏదైనా గొప్ప పని సాధించాలంటే అన్నిటికన్నా ముందు మనని మనం నమ్మాలి. 'నేను చేయగలను' అన్న నమ్మకం మనలో ఉండాలి. మనం ఈ ప్రపంచంలో ఎవరిని నమ్మినా, నమ్మకపోయినా పరవాలేదు. కానీ, ఒక్కరిని మాత్రం నమ్మాలి. ఆ ఒక్కరూ ఎవరో కాదు. (మీకు) మీరే. మీ ఆత్మవిశ్వాసంతో ఎన్నో అద్భుతాలు చేయవచ్చు. ఒక విదేశీ సామెత ప్రకారం ఎవరికైనా ఏదైనా మంచి బహుమతి ప్రధానం చేయాలంటే వారి (యొక్క) ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేయాలంట.

మనం ఎంతో మంది సక్సెస్ సాధించిన వారిని గురించి వింటుంటాం, చదువుతుంటాం, చూస్తుంటాం, మాట్లాడుతుంటాం. అందులో మనం సక్సెస్‌ని మాత్రమే గమనిస్తాం. నిజానికి, ప్రతీ విజయగాథ ఎన్నో అపజయాల కథ కూడా... సక్సెస్ సాధించిన ఎవ్వరినైనా (ఉదాహరణకు) తీసుకోండి. వారు సక్సెస్‌ని పొందటానికి ముందు ఎన్నో అపజయాలు, ఓటములు అనుభవించి ఉంటారు. అయితే ఆ అపజయాలు, ఓటములు, చీత్కారాలు, ఈసడింపులు అన్నీ ఆత్మవిశ్వాసం ద్వారా అధిగమించాలి. తమ మీద తాము నమ్మకం పెట్టుకుని అపజయాలను విజయానికి సోపానాలు చేసుకున్నారు / చేసుకుంటారు. కల్నల్ సాండర్స్ విన్నారా? కేఎఫ్‌సీ ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్ గురించి మీకు తెలిసే ఉంటుంది కదూ... ఈ మధ్య చిన్న చిన్న పట్టణాలల్లో కూడా కెఎఫ్‌సీ రెస్టారెంట్ తెరవబడుతుంది కదా. కెఎఫ్‌సీ సృష్టికర్త కల్నల్ సాండర్స్. అతని గురించి కొన్ని విషయాలు చెబుతాను. 1890లో ఒక నిరుపేద కుటుంబంలో సాండర్స్ మొదటి సంతానంగా జన్మించాడు. తండ్రి అవిటివాడవడం చేత ఉన్న కొద్దిపాటి పొలం కూడా సాగులోకి వచ్చేది కాదు. సాండర్స్‌కి ఐదేళ్ల వయసులో తండ్రికి జబ్బు చేసి మరణించాడు. తల్లి టమాటాసాస్ తయారు చేసే కంపెనీలో పనిచేయడం వల్ల, సాండర్స్ ఆ కుటుంబానికి వండిపెట్టేవాడు. తన తల్లి సలహా మేరకు కోడి మాంసాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో ఉడికించేవాడు. త్వరగా వంట పూర్తి చేయాలని అన్నీ మసాలా దినుసులు ఒకేసారి కోడి మాంసం కూరలో వేసేవాడు.

సాండర్స్‌కి 12 సంవత్సరాలు నిండే లోపు తల్లి మళ్లీ పెళ్లి చేసుకుంది. సవతి తండ్రి (కొత్త తండ్రి) సాండర్స్‌ని కొట్టాడు. కోపంతో అతను చదువు మానేసి ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. ఎక్కడెక్కడో తిరిగాడు. పొట్టకూటి కోసం లాంచీలు నడిపాడు. వ్యవసాయ కూలీగా చేరాడు. ఇన్స్యూరెన్స్ సేల్స్‌మెన్‌గా పనిచేశాడు. ఇంకా ఎన్నో ఎన్నో వృత్తులు చేశాడు. బిజినెస్ మొదటుపెడితే అది విఫలమై చివరికి తన అరవై ఐదో ఏట రోడ్డు మీద పడ్డాడు. అమెరికా ప్రభుత్వం వృద్ధులకు దయతలచి సోషల్ సెక్యూరిటీ అన్న పేరుతో




ఇచ్చిన 105 డాలర్లు తప్పించి తనకు వేరే ఆస్తి లేనేలేదు. తన దయనీయ పరిస్థితిని తలచుకుని తన మీద తనకి జాలివేసింది. అప్పుడు సాండర్స్‌కి జీవితంలో ఏదైనా సాధించాలి అనే తపన పుట్టింది. 65 ఏళ్ల ముసలి వయసులో ఎవరైనా ఏమి సాధించగలరు? ఏ కొత్త బిజినెస్ చేయాలన్నా డబ్బు ఉండాలి కదా. ఆకలి వేయడం లేదు. నిద్రపట్టడం లేదు. బోనులో చిక్కుకున్న పులిలా ఉంది సాండర్స్ పరిస్థితి.

ఏదైనా సాధించాలన్న తపన ఉంది. కానీ డబ్బు లేదు. ప్రపంచానికి తనేమిటో నిరూపించాలన్న కసి ఉంది. కానీ వయసు లేదు. మామూలు వాళ్లయితే డబ్బు లేదు, వయసు లేదు అని మాత్రమే చూస్తారు. కానీ సాండర్స్ ఇలా అనుకున్నాడు. 'డబ్బు లేకపోయినా, వయసు మీద పడుతున్నా, నాకు నా మీద విశ్వాసం ఉంది. అది చాలు నేను ప్రపంచ ప్రసిద్ధిని పొందడానికి.

ఏమి చేస్తే నేను విజేతనవుతాను అని తనకి తెలిసిన విద్యలన్నిటినీ గుర్తుకు తెచ్చుకుంటుంటే చిన్నప్పుడు తన కుటుంబానికి వండి పెట్టేప్పుడు కోడి మాంసాన్ని వండిన పద్ధతి గుర్తుకు వచ్చింది. అదే తనకు సరైనదని నమ్మాడు. కోడి మాంసాన్ని వండి విక్రయించాలని చూశాడు. మొదటి ఆర్డర్ సంపాదించడం కోసం సాండర్స్ ఎన్ని గడపలు తొక్కాడో ఊహించగలరా? పొద్దునే లేవడం, తన వంటకాన్ని తయారు చేసుకుని సిద్ధమవడం, గొప్ప గొప్ప వ్యక్తుల దగ్గర, పెద్ద పెద్ద రెస్టారెంట్‌ల యజమానుల దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకోవడం, వారిని వెళ్లి కలవడం, వారికి తన వంటకాన్ని రుచి చూపించడం. ఇదీ తన దిన చర్య. రుచి చూసిన వాళ్లు ఫరవాలేదు బాగానే ఉంది అని అనేవారే తప్ప భలే బాగుంది. దీనితో వ్యాపారం చేద్దామని చెప్పిన వారు ఒక్కరు కూడా లేరు. రోజులు గడిచిపోతున్నాయి. నెలలు దొర్లిపోతున్నాయి. సాండర్స్ కనీసం వెయ్యి మంది కొత్త వ్యక్తులను కలిశాడు. తన వంటకాన్ని రుచి చూపించాడు. బిజినెస్ గురించి మాట్లాడాడు. కనీసం ఫంక్షన్లకైనా తన వంటకానికి అవకాశం ఇవ్వమని

బతిమిలాడాడు. 1050వ వ్యక్తి సాండర్స్‌కి అవకాశం ఇచ్చాడు. అలా పుట్టింది కెఎఫ్‌సీ. ఇపపడు కెఎఫ్‌సీ ఎంత పేరు సంపాదించిందంటే ప్రజల మన్ననలు ఎంతగా పొందుతుందంటే ఆ వంటకాన్ని తయారు చేసి, అమ్మకానికి 112 దేశాలలో 18000లకు పైగా షాపులు / రెస్టారెంట్ చైనులు కెఎఫ్‌సీతో అనుబంధమైనవి. ఇంతకీ కెఎఫ్‌సీ పూర్తి పేరు కెంటకీ ఫ్రైడ్ చికెన్. కెంటకీ అనేది అమెరికాలోని ఒక రాష్ట్రం పేరు. సాండర్స్ నివసించిన ప్రాంతం కెంటకీ. కెఎఫ్‌సీ అంటే కోడి మాంసాన్ని ఫ్రై (ఇగురు) చేసే అమ్మే చోటు. కేవలం కోడి మాంసపు వంటకానికి ఒక షాపు ఉందంటే మొదట్లో నేను కూడా నమ్మలేదు. కానీ, ఆ వంటకాన్ని లొట్టలేసుకుంటే తినే వాళ్ల సంఖ్యను ఇంటర్నెట్‌లో చూసి విస్తుపోయాను. రోజుకి కొన్ని లక్షల కోళ్లు ఈ కెఎఫ్‌సీ వాళ్ల 'ఒరిజినల్ రిసిపి' పేరు మీద పలహారమైపోతున్నాయని తెలుసుకున్నాను. ఈ రహస్యమైన ఒరిజినల్ రిసిపితో సాండర్స్ ఎన్ని లక్షల కోట్లు సంపాదించి ఉంటాడో ఊహించుకుంటే 'అమ్మో!' అని అనిపిస్తుంది. టీవీలలో కెఎఫ్‌సీ గురించిన వాణిజ్య ప్రకటన మీరందరూ చేసే ఉంటారు. మన రాష్ట్రంలోనే కెఎఫ్‌సీ వాణిజ్య ప్రకటనల ఖర్చు 300 కోట్ల రూపాయలు అంటే మీరు నమ్మగలరా? ఇంతటి భారీ సంస్థ ఏర్పడటానికి అది వివిధ దేశాలలో తనదైన కీర్తిని గడించడానికి కారణం ఎవరు? సాండర్స్, సాండర్స్‌లోని విశ్వాసం. సాండర్స్‌కి తన మీద తనకున్న విశ్వాసం. అతనిని ఒక సక్సెస్‌ఫుల్ వ్యాపారవేత్తగా నిలబెట్టింది.

మనలో ఎంత మంది సాండర్స్‌లా వ్యవహరించగలం? తన మొదటి ఆర్డరు తెప్పించుకోవడానికి సాండర్స్ వెయ్యి మందిని పైగా కలిశాడు. వేలసార్లు ప్రయత్నించాడు. మనమైతే ఒక నాలుగు, ఐదు సార్లు ప్రయత్నించి వదిలేసేవాళ్లం. మరీ మొండి ఘటాలైతే ఒక 50, 60 సార్లు ప్రయత్నించేవారు. ఎవరైనా వెయ్యిసార్లు అంతే ఉత్సాహంతో తమ వంటకాన్ని రుచి చూపిస్తారా? ఆ పని సాండర్స్ చేశాడు. ఒక్కసారి ఊహించండి. తన మీద తను వండిన వంటకం మీదతనకి ఎంత నమ్మకం ఉంటే సాండర్స్ గడప గడపకి అలుపు లేకుండా తిరుగుంటాడు.

సక్సెస్ అవాలంటే కావలసినది – వయసు కాదు, డిగ్రీలు కాదు, అనుభవం కాదు, ఆస్తిపాస్తులు అంతకన్నా కాదు. అన్నిటికన్నా ముందు ఉండవలసినది ఆత్మవిశ్వాసం. అది ఉంటే మిగతావేవీ లేకపోయినా ఫరవాలేదు. ఆత్మవిశ్వాసం లేకుండా మిగతా ఏమున్నా, వాటి ప్రయోజనం ఏమీ లేదు.

బితోవెన్ పేరు ఎప్పుడైనా విన్నారా? ప్రపంచ సంగీత చరిత్రలో బితోవెన్ కాలం ఒక స్వర్ణయుగమని చెప్పక తప్పదు. 1770లో జన్మించిన బితోవెన్ గురించి చెబుతుంటే నేటికీ సంగీత కళాకారులు చెవి కోసుకుంటారు. చిన్నప్పుడు బితోవెన్‌కి సంగీత జ్ఞానం అసలు లేనేలేదని, తనకు సంగీతం నేర్పిన గురువులు బితోవెన్‌ని తిట్టిపోస్తుండేవారు. బితోవెన్ తండ్రి కూడా సంగీత విద్వాంసుడే. అతను చాలా కోపిష్టి. బాల బితోవెన్ కీ–బోర్డు ముందు కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు కోకొల్లలంట. బితోవెన్ ఈ లోకానికి కొన్ని గొప్ప పాటలను అందించాడు. అతని ప్రసిద్ధమైన కృతులలో 9 సింఫనీలు, 5 పియానో కాన్సర్టులు, 32 పియానో సొనాటాలు, 16 స్ట్రింగ్ క్వార్టెట్‌లు ఉన్నాయి. వీటిని సంగీత ప్రపంచం ఎప్పటికీ మరచిపోలేదు.




బిథోవెన్‌కి 26 సంవత్సరాల వయసు వచ్చే సరికి తనకి వినికిడి లోపం ప్రారంభమైంది. ఇంకొన్ని సంవత్సరాలకి అసలు పూర్తిగా చెవుడు వచ్చేసింది. అయినా సరే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పియానిస్టు అయ్యాడు. చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే బిథోవెన్ చెవిటివాడని, తను వినలేడు కానీ, ప్రపంచానికి అద్భుతమైన సంగీతాన్ని, మధురమైన స్వరాలని వినిపించాడు. బిథోవెన్‌కి ఆరోగ్యం సరిగ్గా ఉండేది కాదు. ఎప్పుడూ ఏదో ఒక వ్యాధితో బాధపడుతుండేవాడు. విపరీతమైన కడుపులో నొప్పి, బై-పోలార్ డిసార్డర్ తన చిరకాల నేస్తాలు. నొప్పిని, వేదనను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందామని బిథోవెన్ ఎన్నోసార్లు నిశ్చయించుకున్నాడు.

తను స్టేజీ మీద వాయిస్తుంటే - ప్రేక్షకులు పూర్తిగా మంత్రముగ్ధులై పోవాలని, బిథోవెన్ ఆరాటపడిపోయేవాడు. ప్రేక్షకులు తన సంగీతాన్ని పెడచెవిన పెట్టారని తెలిసిందో, తన ప్రదర్శన అర్ధాంతరంగా ఆపేసేవాడు. తను మిగతా వారు, ప్రేక్షకులు ఏమంటున్నారో, ఏమనుకుంటున్నారో వినలేడు. కానీ, చూడగలడు. తన 9వ సింఫనీ తరువాత ప్రేక్షకుల కరతాళ ధ్వనులు (చప్పట్లు) చూశాడు. వాటిని పూర్తిగా ఆస్వాదించలేకపోతున్నందుకు అందరి ముందు చిన్న పిల్లాడిలా భావుకుడై ఏడ్చేశాడు. 9వ సింఫనీ 1824లో జరిగింది. అంటే తన 54వ ఏట జరిగిన ఘట్టమది. అంతకు 28 ఏళ్లకు పూర్వం నుండి బిథోవెన్‌కి వినికిడి లోపం. ఒక్కసారి ఆలోచించండి. ఒక బదిరుడు (28 సంవత్సరాల నుండి బదిరుడు) ఎంతగా కృషి చేసి ఉంటే కొన్ని వేల మందిని మెప్పించగలడు? 'నాకు చెవుడు వచ్చేసింది'లే అని ఒక మూలన కూర్చోకుండా ప్రపంచం

మెచ్చుకునేలా సంగీత దర్శకత్వ బాధ్యతలు నిర్వహించడమేమిటి? తన మీద తనకు ఎంత విశ్వాసం ఉంటే ఇలాంటి సాహసకృత్యానికి పూనుకుంటాడో ఊహించండి.

అనుకుంటే ఏదీ అవరోధం కాదు. ఏదైనా సాధించాలని నడుం బిగిస్తే, ఎంత పెద్ద అవాంతరాన్ని అయినా ఎదుర్కొనవచ్చు. దానికి కావలసినది ఆత్మవిశ్వాసం. మనం తలచుకుంటే దేన్నయినా సాధించగలమన్న ధీమా మనలో కూడా ఉండాలి.

గొప్ప పనులు సాధించిన వారి బాట అంతా పూల బాట కాదు. ఎన్నో పరీక్షలు, ఎన్నో అవరోధాలు, ఎన్నో ముళ్లు వారి బాటలోనూ వచ్చాయి. అయితే వాటిని తప్పించుకుని, తమ గమ్యాస్థానాలు చేరుకున్నారు. మనం కూడా గొప్పవారి అనుభవాల నుంచి నేర్చుకుందాం. మీమీద మీకు నమ్మకం ఉంటే ఏ పెద్ద లక్ష్యం అయినా మీ ఆత్మవిశ్వాసం ముందు చిన్నదే అవుతుంది. వయసు మీద పడుతున్నా ఫరవాలేదు, ఆస్తులు కోల్పోయినా ఫరవాలేదు, శరీరంలోని అవయవాలు కోల్పోయినా ఫలరవాలేదు. శక్తి కోల్పోయినా ఫరవాలేదు. మనం ఆత్మవిశ్వాసం కోల్పోకపోతే మనం ఏదీ కోల్పోయినట్లు కాదు.

కష్టాలు అందరికీ వస్తాయి. ఒక్కసారి కష్టం వస్తే మనలో చాలా మంది దిగులు పడిపోతారు. తమ సామర్థ్యం మీద తమకి అనుమానాలు వస్తుంటాయి. ఫలితంగా ఆత్మ విశ్వాసాన్ని కోల్పోతారు. కష్టాలకు, నష్టాలకు కుంగిపోతే, ఆత్మవిశ్వాసం సన్నగిల్లి పోతే 'సక్సెస్' దూరం జరిగిపోతుంది. లక్ష్యం గొప్పదైనప్పుడు కష్టనష్టాలు సహజం. మనల్ని కృంగదీసే శక్తిని మనం కష్టనష్టాలకు ఇవ్వకూడదు. కష్టం వచ్చినపపడు ఒక్క కన్నీటి బొట్టు రాలిస్తే రాల్చండి కానీ, కష్టాన్ని మన ఇష్టమైన లక్ష్యం మీద ప్రతికూల ప్రభావాన్ని చూపనీయకుండా చేయండి. 'నీకు అంత సీను లేదమ్మా' అంటూ కష్టాన్ని మన ఆత్మ విశ్వాసం అనే ఆయుధంతో తరిమేయండి. మనల్ని మరింత రాటుదేల్చే సాధనాలుగా కష్టాలని మార్చుకోండి.

ఒక్కటే గుర్తుంచుకోండి. ఆత్మవిశ్వాసముంటే అసాధ్యమైనా సుసాధ్యమైపోతుంది. ఆత్మవిశ్వాసం గలవారే అందరికంటే ఎక్కువ ఆస్తిపరులు. కాబట్టి ఏది కోల్పోయినా మీ మీద మీకున్న విశ్వాసాన్ని మాత్రం కోల్పోవద్దు.

# 21

# ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి

**హైలెట్స్**

- ✤ మనల్ని మనం నమ్ముకుంటే ఇంక వేరే ఎవరినీ నమ్మనవసరం లేదు.
- ✤ అవతలి వాళ్లు మనల్ని నిరుత్సాహపరచాలని చూసినా, మనం నిరుత్సాహపడనంత వరకూ, మనల్ని మన లక్ష్యం నుండి ఎవరూ వేరు చేయలేరు.
- ✤ మనకి మనమే హీరోలం. "ఇది నేను చేసి తీరతాను" అని మనకి మనం ప్రతిజ్ఞ చేసుకుంటే ఆ పని ఖచ్చితంగా నెరవేరుతుంది.
- ✤ చాలాసార్లు పరిమితులు మనకి మనం ఏర్పరచుకున్నవి అవుతాయి. ఆత్మవిశ్వాసంతో పరిమితులను అధిగమించండి.

జీవితంలో ఉన్నతస్థితికి చేరుకున్న వారిని ఎవరినైనా తీసుకోండి. వారి గురించి లోతుగా తెలుసుకోవడానికి ప్రయత్నించి చూడండి. వారు ఖచ్చితంగా సెల్ఫ్ బుల్లెట్ అయి ఉంటారు. అంటే తమని తాము నమ్ముతారు. ఇంకెవరినీ నమ్మరు.

దేవుడిని నమ్మవద్దని నేను చెప్పను. అది వ్యక్తిగత విషయం. కానీ, దేవుణ్ణి నమ్మితేనే నేను గట్టెక్కుతాను, ఆకుపూజ చేయిస్తే 10 మార్కులు పెరుగుతాయి. 108 కొబ్బరి కాయలు కొడితే ఇంటర్వ్యూ అన్నీ తెలిసిన ప్రశ్నలు అడుగుతారు అని ఆశించవద్దు అంటున్నాను. మన చేతిలో, మన అధీనంలో లేని వాటిని నమ్మడం కంటే, కష్టాన్ని

నమ్ముకుంటే చాలా మంచిది. మనల్ని మనం నమ్ముకుంటే ఇంక వేరే ఎవరినీ నమ్మనవసరం లేదు.

మీరు చేయవలసిందంతా చేయండి. 100 శాతం కష్టపడండి. ఆ తరువాత ఫలితం ఎందుకు రాదో చూడండి. 70 శాతం కష్టపడి, చాలా ఎక్కువ కష్టపడి పోయామనుకుని 30 శాతం దైవాదీనం అంటూ దీపారాధన చేసే వారిని నేను చూశాను. వారు వారికున్న సమయాన్ని కూడా అదే నిష్పత్తిలో వినియోగిస్తారు. అంటే రోజులో 70 శాతం చదువుకోవడానికి, 30 శాతం గుళ్లకి వెళ్లడానికి, మొక్కులు తీర్చుకోవడానికి, దేవుడితో డైరెక్ట్‌గా హాట్ లైన్ ఉన్నట్లు దేవుడికి అర్జీలు పెట్టుకోవడం లాంటి పనులకు వినియోగిస్తారు.

నాకు ఫలానా మంచి చేస్తే నీకు నేను ఇన్ని కొబ్బరి కాయలు కడతాను, అభిషేకం చేయిస్తాను అంటూ దేవుడితో వ్యాపారం చేసే అమాయకులను చూశాను.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే మిమ్మల్ని మీరు నమ్మినంతగా ఇంకెవరినీ నమ్మకూడదు. మరీ ముఖ్యంగా మీరు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నప్పుడు, మన చదువుకు సంబంధం లేని విషయాలు మనల్ని ఎప్పుడూ ప్రభావితం చేయకూడదు. పరీక్ష వాయిదా పడుతుందనో, పరీక్ష రద్దు అవబోతుందనో, పరీక్షలో ఛీటింగ్ జరుగుతుందనో ఎవరు చెప్పినా ఆ సంగతులు వినకండి. ఆ వదంతులు నమ్మకండి. ఇంటర్వ్యూకి డబ్బులు తీసుకుంటున్నారంటూ (వచ్చిన) ఊహాగానాల్లో సమయం వృథా చేయకండి. ఇంటర్వ్యూ పానల్‌లో ఎవరిని ప్రభావితం చేయాలా అన్న ఆలోచనలతో బుర్ర బద్దలు కొట్టుకోకండి. అవకాశం కోసం ప్రయత్నించి ఉన్న విలువైన సమయాన్ని ఖర్చు చేసేయకండి. అలాంటివేవీ జరగవు అని తెలుసుకోండి. జరగవు అని నమ్మండి. ఒకవేళ అలా జరుగుతున్నా మనకు సంబంధం లేదు. ఎప్పుడైనా ప్రతిభకు అన్యాయం జరగదు. బయట జరిగే సంబంధం లేని విషయాలు మన మెదడు మీద చాలా ప్రతికూల ప్రభావం తెచ్చే ప్రమాదముంది. అందుకే జాగ్రత్తగా వ్యవహరించాలి. ఊహాగానాలకు మన మైండు 'నో' చెప్పేలా మైండుకి శిక్షణ ఇవ్వాలి. సంబంధం లేని విషయాలు పట్టించుకోవద్దు అని మెదడుని గద్దించాలి. దీనిని ఒక ఉదాహరణ ద్వారా మీకు వివరిస్తాను.

నాలుగు కప్పలు ఒక పందెం వేసుకుని, ఊరి పొలిమేరలోని పాత బంగళా దాకా వెళ్లాలనుకున్నాయి. ఎవరు వెళ్లి పాత బంగళా పెద్ద గేటుని తాకి, ఆ గేటుపై నుండి దూకితే వాళ్లు గెలిచినట్లు. మార్గమధ్యలో ఎవరికి ఆటంకం వచ్చినా అన్నీ కలిసికట్టుగా దానిని ఎదుర్కోవాలని ఒప్పందం. రేపు రాత్రి పందెం మొదలవుతుందనగా, ఈ రోజు పొద్దున నుండి మొదటి కప్పకి ఆత్రం ఆగలేదు. పాత బంగళా పెద్ద గేటు ఎంత ఎత్తు ఉంటుందోనని వాకబు చేయడం మొదలు పెట్టింది. చుట్టు పక్కల ఉన్న మిగతా కప్పలు అంతని, ఇంతని చెప్పడం మొదలుపెట్టాయి. చివరికి ఆరు అడుగులు ఉన్న గేటు వీరి ఊహాగానాల్లో పదహారడుగుల ఎత్తు అయింది. ఇక మొదటి కప్పకి నిద్ర పట్టలేదు. పదహారడుగులు గెంతడం అభ్యాసం చేయాలనుకుని, ఆ రాత్రి నీరసంతో నిద్రపోయి, పొద్దున్నే పూనకం వచ్చిన దానిలా ఎగిరితే, కాళ్లు విరిగాయి. ఇలా పోటీ నుండి తప్పుకోవలసి వచ్చింది.



మిగతా మూడు కప్పల మధ్య పోటీ మొదలైంది. మూడూ కూడా ఎంతో ఉత్సాహంతో ఒకదానితో ఇంకోటి పోటీ పడుతూ గెంతుతుండగా, దురదృష్టవశాత్తూ రెండు కప్పలు అమాంతం లోతైన గోతిలో పడిపోయాయి. మూడవ కప్ప మాత్రం పక్క నుండి తప్పుకుంది కాబట్టి, అది బైటే ఉంది.

గోతిలో పడ్డ రెండు కప్పలు బయటకు రావడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఒప్పందం ప్రకారం ఏదైనా ఆటంకం వస్తే అన్నీ కప్పలు కలిసి ఎదుర్కోవాలి. ప్రమాదంలో ఉన్న కప్పల్ని ఆదుకోవాలి. అందుకు మూడవ కప్ప ముందుకు సాగిపోకుండా, ఆ గుంత పక్కనే ఉండిపోయింది.

మూడో కప్ప గోతిలో పడ్డ కప్పలని బయటకు రావాలని ప్రోత్సహించడం మొదలు పెట్టింది. నేను ఇక్కడే ఉన్నాను. గెంతండి, ఇంకొంచెం బలంగా నేలని తన్నండి అని అరిచింది. రెండు కప్పలు విపరీతంగా ఎగురుతున్నాయి కానీ, కావలసినంత ఎత్తు ఎగరలేకపోతున్నాయి. మూడో కప్ప Come on! ఊపిరి బిగపట్టి శక్తినంతా కూడదీసుకుని, 'హైసరబజ్జ' అనుకుంటూ గెంతండి అని సలహా ఇచ్చింది. గుంతలో ఉన్న రెండు కప్పలు ఇంకా ఇంకా ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. అప్పుడు మూడో కప్పకి ఒక దుర్బుద్ధి పుట్టింది. ఈ రెండు కప్పలు బయటకు రాకపోతే, నేనే పందెం గెలుస్తానని కదా. వీటి కోసం నేను ఎందుకు శ్రమించాలి? అనుకుని ఆ రెండు కప్పలతో చూడండి ఇది చాలా లోతైన గుంత. ఇంత లోతు గుంత నుండి రావడం అసాధ్యం. మీరు విశ్వ ప్రయత్నం చేసినా బయటకు రాలేరు. ఎందుకీ వృథా ప్రయాస చెప్పండి. మీ కోసం ఇంకో రెండు

నిమిషాలు నేను ఇక్కడ వేచి ఉంటాను. ఏమి చేయమంటారో నాకు చెప్పండి అన్నది.

అయితే ఇంకొక నిమిషం లోపల ఆ రెండు కప్పట్లో ఒకటి బయటకు దూకి వచ్చింది. రెండవ కప్ప ఎక్కడరా అని చూస్తే ఆ గుంతలో పడి చచ్చిపోయి ఉంది. ఇందుకు కారణం గురించి బయటకు వచ్చిన కప్పని, మూడవ కప్ప (అప్పటికే బయట ఉన్న కప్ప) అడిగింది. నువ్వు బయటకు ఎలా వచ్చావు? అని.

అప్పుడు ఆ బయటకు వచ్చిన కప్ప నాకు మీరు ఏమి అంటున్నారో వినపడటం లేదు. నాకు చెవుడు మీరు చెప్పదలచుకున్న విషయం ఏదో సైగ చేసి చెప్పండి అని అన్నది.

అప్పుడు అర్థమైంది అసలేమైందో... బయట ఉన్న కప్ప నిరుత్సాహపరచడం వల్ల తన శక్తి ఏమిటో తెలియని కప్ప గుంతలో పడింది కాబట్టి తన మిగతా జీవితం మొత్తం అక్కడే గడపాలనుకుని, నిరాశ నిస్పృహలతో గుండె ఆగి చచ్చింది. చెవిటి కప్పకి గుంత బయట ఉన్న కప్ప ఏమి చెప్పిందో వినపడదు. బయట ఉన్న కప్ప పెదాలు కదుపుతుంటే తనని బయటకు రమ్మని ప్రేరణ ఇస్తుందనే అనుకుంటుంది. అందుకే లంఘించి లంఘించి దూకి, ఒక్క ఉదుటున గెంతి పైకి వచ్చేసింది.

పైకి వచ్చి రెట్టించిన ఉత్సాహంతో చెవిటి కప్ప ఆరు అడుగుల పాత బంగళా పెద్ద గేటుని తాకి, దానిపై నుండి కూడా గెంతేసింది. ఫలితంగా కప్పల పందెంలో కప్పు కొట్టేసింది. దీని వల్ల మనం నేర్చుకున్న నీటి ఏమిటంటే వాస్తవాలు తెలుసుకోకుండా ఊహల్లో ఉంటే మన నిజమైన శక్తిని సరిగ్గా అంచనా వేయలేము. అవతలి వాళ్లు మనని నిరుత్సాహపరచాలని చూసినా, మనం నిరుత్సాహపడనంత వరకూ, మనల్ని ఎవరూ మన లక్ష్యం నుండి వేరు చేయలేరు. దేనినైనా నమ్మాలంటే ముందు మనల్ని మనం నమ్మాలి. మన మీద మనకి అపారమైన నమ్మకం ఉండాలి. ఆ నమ్మకం ఉన్నప్పుడు ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, మన విజయం తథ్యం.

థామస్ ఆల్వా ఎడిసన్ గురించి మీకు తెలిసే ఉంటుంది. యావత్ ప్రపంచం గర్వించదగ్గ అనేక ఆవిష్కరణలు చేసిన ఎడిసన్ తన స్వశక్తిని నమ్ముకునేవాడు. గెలుపు ఓటములు దైవాదీనాలు అంటూ వేదాంతాలు వల్లించలేదు. తను చేసే ఎన్నో ప్రయోగాలు విఫలమవుతుంటే నా టైం బాగోలేదు. అనుకోలేదు. తన ప్రయోగాలు తనకి తాను ఆశించిన ఫలితాలనివ్వకపోతే నా గ్రహస్థితి కొంచెం కుదుటపడే దాకా ప్రయోగాలు ఆపుదాం అని తలచలేదు. లైటు బల్బుని కనిపెట్టక ముందు ఆ ప్రయోగాలలో బల్బుని వెలిగించేందుకు ఎడిసన్ దాదాపు పది వేల సార్లు విఫలమయ్యాడని అందరికీ తెలిసిన విషయమే.

ఎడిసన్ గురించి ఒక ఆసక్తికరమైన కథ చెబుతాను. అది 1914 సంవత్సరం. ఎడిసన్ వయసు అప్పుడు 67. దురదృష్టవశాత్తు ఒక రోజు ఎడిసన్ ఫ్యాక్టరీ కాలిబూడిదై పోయింది. అప్పటికే అందులో తను భవిష్యత్తులో తయారు చేయబోయే వస్తువులకు సంబంధించిన ప్రయోగాలు చాలా జరిగి, చివరి దశకు చేరుకున్నాయి. కొన్ని కోట్ల విలువైన సామాను అగ్నికి ఆహుతైపోయింది. దారుణమైన విషయం ఏమిటంటే ఆ ఫ్యాక్టరీ భీమా కూడా చేయించలేదు. తన జీవితం మొత్తం కష్టపడి సంపాదించుకుని సాధించిన



ఫ్యాక్టరీ తన 67వ ఏట తగలబడిపోవడం అత్యంత బాధాకరమైన విషయం. ఫ్యాక్టరీ తగలపడి పోవడాన్ని ప్రత్యక్షంగా చూసిన ఎడిసన్ ఏమన్నాడో తెలుసా? దేవుడికి ధన్యవాదాలు... ఎందుకంటే ఆ ఫ్యాక్టరీతోపాటు నేను చేసిన పొరపాట్లు అన్నీ కాలిబూడిద అయిపోతున్నాయి. సంతోషం. ఎందుకంటే నేను ప్రతీ విషయాన్ని తాజాగా మొదలు పెట్టవచ్చు అన్నాడు. ఆ ప్రమాదం జరిగిన సరిగ్గా 20 రోజులకి ఫోనోగ్రాఫ్‌ని కనుగొన్నాడు - ఎడిసన్.

తనని తాను నమ్ముకున్నాడు కాబట్టి ఎడిసన్ ఇలా చేయగలిగాడు. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త అయ్యాడు. ఏదైనా మనం మనకి చెప్పుకోవడంలో ఉంటుంది. మనకి మనమే హీరోలం. ఇది నేను చేసి తీరతాను అని మనకి మనం ప్రతిజ్ఞ చేసుకుంటే ఆ పని ఖచ్చితంగా నెరవేరుతుంది. అలా కాకుండా అమ్మో! నేను ఈ పనిని చేయగలనా? అని సందేహిస్తే మనల్ని ఎవరూ బాగుచేయలేరు.

అందుకే, అనుకున్నది సాధించాలంటే మిమ్మల్ని వారు నమ్మాలి. చేసి తీరతాను అని అనుకోవాలి. కానీ, పరిస్థితుల గురించి ఆలోచించకూడదు. చాలాసార్లు ఈ పరిమితులు మనకి మనం ఏర్పరచుకున్నవి అవుతాయి. ఆత్మవిశ్వాసంతో పరిమితులను అధిగమించండి.

ఇక్కడ ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. కందిరీగని (లేదా) గండు తుమ్మెదని మీరు చూసే ఉంటారనుకుంటున్నాను. అది చాలా బరువుగా ఉంటుంది. దాని రెక్కలు చాలా పల్చగా, చిన్నవిగా ఉంటాయి. విజ్ఞానశాస్త్రంలో ఎయిరో డైనమిక్స్ అనే ఒక శాఖ ఉంది.



ఎయిరో డైనమిక్స్‌లో ఉన్న సూత్రాల ప్రకారం కందిరీగ లాంటి బరువైన కీటకం, అంత చిన్న చిన్న పల్చటి రెక్కలతో ఎగరడం అసంభవం. కానీ, కందిరీగ ఎయిరో డైనమిక్స్ చదవలేదు. అందులో సిద్ధాంతాలు నేర్చుకోలేదు. తన పొట్ట కూటి కోసం ఎగరాలి కాబట్టి, మిగతా కీటకాల్లా కాకుండా తన చిన్న చిన్న రెక్కల్ని పదిరెట్లు ఎక్కువసార్లు కదిలిస్తూ / ఆడిస్తూ ఎగరగలుగుతుంది. (అంటే మిగతా జీవులు తమ రెక్కల్ని ఒక్కసారి ఆడించే లోపు కందిరీగ తన రెక్కల్ని 10 సార్లు ఆడిస్తుందన్నమాట).

కందిరీగ మనకి ఆదర్శం కావాలి. మనం ఏమైనా అర్థం పర్థం లేని పరిమితులు మనకి పెట్టుకుని ఉంటే వాటిని తొలగించి వేయండి. అన్నిటికన్నా ముందు మనమీద మనకి అపారమైన విశ్వాసం ఉండాలి. విధి ఇంతేలే, నా బతుకింతేనే అని దేవదాసులా పాడుకునే వారిని, తమ శక్తి తాము తెలుసుకోమని వేడుకుంటున్నాను.

మీ శక్తి మీరు తెలుసుకుని, మిమ్మల్ని మీరు నమ్ముకుంటూ, మీ చదువు మీరు చదువుకుంటుంటే మిమ్మల్ని విజయపథం నుండి తప్పించడం ఎవరి తరం కాదు.

మిమ్మల్ని మీ ఏకాగ్రతని భంగపరిచే ఏ విషయాలకైనా చెవిటి కప్ప వ్యవహరించిన తీరుని గుర్తుకు తెచ్చుకుని జవాబు చెప్పండి. మనం ఎదుగుతుంటే మన కాళ్లు లాగాలని చూసే ఎన్నో పరిస్థితులు ఎదురుకావచ్చు. అలాంటప్పుడు ఎడిసన్ తన 67వ ఏట తన సర్వస్వం కోల్పోయినా కూడా 20 రోజుల్లో ఫోనోగ్రాఫ్ కనిపెట్టడం గుర్తుకు తెచ్చుకోండి. ఎవరైనా మనకి మన పరిమితులు గుర్తు చేస్తుంటే మీరు మాత్రం కందిరీగ ఎయిరో డైనమిక్స్‌ని సవాల్ చేసిన విషయం గుర్తుకు తెచ్చుకోండి.

చివరకు చెప్పేదేమిటంటే మన నిజ జీవితంలో (కూడా) మనని ఉత్సాహపరిచే సంఘటనల కంటే నిరుత్సాహపరిచే సంఘటనలు ఎక్కువ. వాటికి డీలా పడిపోకూడదు. మనని మనం నమ్ముకోవాలి. మన శక్తి మీద, మన సామర్థ్యం మీద మనకి పూర్తి నమ్మకం ఏర్పరచుకుని, ప్రతికూల పరిస్థితులను ఎదిరించినపపడే, మనకి సక్సెస్ సాధ్యమవుతుంది.

# 22

# సమయాన్ని సద్వినియోగం చేస్తే సమస్తం సాధ్యమే

**హైలెట్స్**

- జీవితంలో ఏదో సాధించాలని తపన పడుతుంటే మీరు చేయవలసిన ముఖ్యమైన పనుల్లో మొదటి పని మీ సమయాన్ని మీరు సరిగ్గా మేనేజ్ చేయడం.
- జీవితం అకౌంట్‌లో ఉన్న క్షణాలను మనం ఎటూ దాచుకోలేము. వాటిని వెచ్చించి చరిత్ర పుటల్లో మనకంటూ ప్రత్యేకించి కొన్ని పేజీలు ఉండేలా చూసుకోవచ్చు.
- మీరు కావాలంటే ఒక తులం బంగారం కొనగలరు కానీ, ఒక క్షణం సమయాన్ని కొనగలరా?
- పరీక్ష ఫలితాలు వచ్చిన రోజు పడే బాధకంటే ఈ రోజు పడే కష్టం చాలా తక్కువ. అందుకని కష్టపడండి. బాగా శ్రమించండి.

ఒక రోజుకి 24 గంటలు. అందులో మీరు ఎన్ని గంటలు సరిగ్గా వినియోగించు కుంటున్నారు? జీవితంలో ఏదో సాధించాలని మీరు తపనపడుతుంటే- మీరు చేయవలసిన ముఖ్యమైన పనుల్లో మొదటి పని ఏమిటంటే- మీ సమయాన్ని మీరు సరిగ్గా మానేజ్ (మేనేజ్) చేయడం. ఏ విషయానికి ఎంత సమయాన్ని కేటాయించాలో మీరు ముందే నిర్ణయించుకుని, ఆ నిర్ణయానికి అనుగుణంగా సమయాన్ని వినియోగించాలి.

మీకు బ్యాంకులో ఖాతా ఉండే ఉంటుంది. అందులో డబ్బులు ఉన్నా, లేకపోయినా, మీ "జీవితం" అనే అకౌంటులో ఎన్నో క్షణాలు ఖర్చు అవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. బ్యాంకు అకౌంటులో డబ్బులని మీరు ఖర్చుచేయవచ్చు లేదా దాచుకోవచ్చు లేదా వాటిని ఎక్కడైనా వెచ్చించి (investment చేసి) ఇంకా ఎక్కువ డబ్బులు (లాభం) పొందవచ్చు. బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బుల మీద మనకు నియంత్రణ ఉంటుంది. అదే జీవితం అనే అకౌంటులో ఉన్న క్షణాలను గురించిన నియంత్రణ మనకు ఉండదు. మనం మన బ్యాంకు అకౌంటులో ఉన్న డబ్బు ఖర్చు చేయవద్దు అని అనుకుంటే వాటిని దాచుకోవచ్చు. కానీ జీవితం అకౌంటులో (ఉన్న) క్షణాలను మనం దాచుకోలేము. మనం "వద్దు" అనుకున్నా అవి ఖర్చు అయిపోతూనే ఉంటాయి.

ఎలాగైతే బ్యాంకులోని డబ్బులు తెలివైన చోట్ల వెచ్చించి లాభం (ఇంకా ఎక్కువ డబ్బు) పొందవచ్చో, అలాగే మన జీవితంలోని మన సమయాన్ని వెచ్చించి చరిత్ర పుటల్లో మనకంటూ ప్రత్యేకించి కొన్ని  పేజీలు ఉండేలా చూసుకోవచ్చు.

మనమందరం పుట్టేటప్పుడు ఒకేవిధంగా పుడతాం. పుట్టిన ప్రతి జీవికి తమ జీవితం అకౌంటులో కొన్ని క్షణాలు క్రెడిట్ అయ్యి ఉంటాయి. ప్రధానమంత్రికయినా, రిక్షా తొక్కేవాడికైనా- ఇద్దరికీ సమయ కేటాయింపు వారి వారి ఆర్థిక స్థితిగతుల మీద ఆధారపడి జరగదు. ధనవంతుడికి ఎక్కువ క్షణాలు, పేదవాడికి తక్కువ క్షణాలు అనే బేధభావం ఉండదు. జీవితం అకౌంటులో ఉన్న సమయాన్ని ఎలా వినియోగిస్తున్నామన్న దానిపైనే సమాజంలో మనకి గుర్తింపు లభించడమా లేదా అన్న విషయం ఆధారపడి ఉంది.

పోటీ పరీక్షలకు తయారయ్యే అభ్యర్థులు సమయపాలనలో చాలా నిక్కచ్చిగా వ్యవహరించాలి. పోటీపరీక్షలకు ఎంతోమంది ప్రిపేర్ అవుతారు. కానీ, కొంతమంది మాత్రమే అందులో విజేతలుగా నిలుస్తారు. ఎందుకు ఇలా కొందరే అనుకున్నది సాధించగల్గుతున్నారు? మిగతావారు ఎందుకు విఫలమవుతున్నారని లోతుగా పరిశీలిస్తే తెలిసినదేమిటంటే- విజేతలయిన వారు తమ సమయాన్ని పూర్తిగా తమ లక్ష్యం నెరవేర్చుకోవడానికే వినియోగిస్తారని. మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతున్నాను- రోజులో ఉన్న 24 గంటలలో మీరు మీ గమ్యాన్ని చేరుకోవడానికి ఎన్ని గంటలు వినియోగిస్తున్నారు? మిమ్మల్ని మీరు మోసగించకుండా ఆలోచించండి-- ఎంత సమయాన్ని వృథా చేస్తున్నారో.. గుండెల మీద చేయి వేసుకొని చెప్పండి. మీరు రోజులో కనీసం ఒక్క నిమిషం కూడా వృథా చేయడం లేదని.. ప్రతి నిమిషాన్ని మీ గమ్యాన్ని చేరుకోవడానికి మాత్రమే ఉపయోగిస్తున్నామని-- గుండెలమీద చేయి వేసుకొని చెప్పండి. మీరు ఉపయోగించినట్లు మీరు సద్వినియోగపరుచుకుంటున్నట్టు ప్రపంచంలో ఎవరూ సమయాన్ని సద్వినియోగ పరచుకోలేరని- ఛాలెంజ్ చెయ్యండి- సమయాన్ని మీరు వాడినంత పిసినారితనంగా ఇంకెవరూ వాడి ఉండరని.

మనం చదువుకోవడానికి పుస్తకాలు ముందువేసుకుని కూర్చుంటాం. ఎంతసేపు చదువుతాము? ఎంతసేపు మనల్ని మన బుక్స్ ఆకట్టుకోగల్గుతాయి? ఒక ఇరవై నిమిషాలు, ముప్ఫై నిమిషాలు, నలభై-- ముప్పావుగంట, గంట? రెండు గంటలు...? మనలో ఎంతమందికి ఒక ఇరవై నిమిషాలు సీరియస్‌గా పుస్తకాల ముందు కూర్చుంటే



నిద్ర వస్తుంది? ఎంతమంది బోర్ ఫీలవుతారు? ఆలోచించండి. మీ సందు చివరన ఉన్న ఇస్త్రీ షాపు అతనికేసి చూడండి. పొద్దున ఒక మూటెడు బట్టలతో వచ్చి ఉంటాడు. మధ్యలో ఎంతోమంది బట్టలు ఇస్త్రీ కోసం ఇచ్చి ఉంటారు. అతనిని ఎప్పుడు చూసినా ఇస్త్రీ చేస్తూనే ఉంటాడు. పొద్దున నుండి విశ్రాంతిలేకుండా, బోర్ ఫీల్ అవకుండా- ఇస్త్రీ చేస్తూనే ఉంటాడు. అతనికి బోర్ ఎందుకు కొట్టదంటే- అదే తన జీవనాధారం. ఎవరైనా తాము చేసే పనిని జీవనాధారం అనుకుంటే- అదే తమ life అనుకుంటే బోర్ ఫీలవ్వరు.

నేను ఇస్త్రీ అతనినే ఎందుకు ఉదాహరణగా తీసుకున్నానంటే- నేను సివిల్ సర్వీసుకు ప్రిపేర్ అయ్యే తొలి రోజుల్లో నన్ను ప్రభావితం చేసిన సంఘటనల్లో మా వీధి చివరన ఉన్న ఇస్త్రీ షాపతను వ్యవహరించే తీరు నన్ను ఆశ్చర్యపరిచింది. నన్ను ప్రభావితం చేసిన ఇంకొక సంఘటన గురించి కూడా ఇక్కడ చర్చిస్తాను.

మా అమ్మ ఏదైనా పనిచేయవలసి వస్తే అసలు నిద్రపోయేది కాదు. ఏ పని అయినా త్వరత్వరగా అయిపోవాల్సిందే. ఇంట్లో ఉన్న కుట్టుమిషన్‌తో (ఇంట్లో వారికొరకు) చిన్న చిన్న బట్టలు కుట్టేది. ఆ రోజులు- నేను సివిల్స్ కోసం బుడిబుడి నడకలు వేసే రోజులు. ఇంజనీరింగ్ అయిపోయింది. సివిల్స్ కోసం బాగా కష్టపడాలి అని విన్నాను. రోజుకు 18 గంటలు చదవాలని విన్నాను. అప్పటికి నాకు అమెరికా వెళ్లే అవకాశం, ఇండియాలో ఉంటే- మా ఇంజనీరింగ్ కాలేజీలోనే చేరే అవకాశం, హైదరాబాద్ వెళ్తానంటే మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో చరే అవకాశం ఒకేసారి వచ్చాయి. నన్ను నేను అప్పుడు పరీక్షించుకోవాలనుకున్నాను. నేను నిజంగా సివిల్స్ కోసం ప్రయత్నించాలంటే- చాలా ఎక్కువ సేపు చదవాల్సి ఉంటుంది. కాబట్టి, మా అమ్మకు తెలియకుండా, ఒక పందెం నాకు నేను వేసుకున్నాను. మా అమ్మ కుట్టుమిషన్‌తో పనిచేసేటప్పుడు అక్కడినుండి అస్సలు కదిలేది కాదు. ఒకరోజులో అమ్మ కుట్టు మిషన్‌తో కుట్టనంత సేపు నేను పుస్తకం

పట్టుకుంటేచాలు. నాకు సివిల్స్‌కి కావలసిన ఓపిక ఉంటుంది.. అని నమ్మాను. ఆ ఓపిక ఉంటేనే సివిల్స్‌కి ప్రిపేర్ అవుతాను అని అనుకున్నాను. ఆ ఓపిక లేకపోతే- నేను నాకు వచ్చిన మిగతా అవకాశాలను గురించి ఆలోచించుదామని అనుకున్నాను.

తర్వాత రోజు పందం మొదలంది. అమ్మ కుట్టుమిషన్ ముందు కూర్చుంది. నేను పుస్తకాలు ముందేసుకున్నాను. అరగంట అయ్యింది. నాకు బోర్ కొట్టడం మొదలైంది. నేను కుర్చీలోనుండి లేచి, టీవీ దగ్గరకు వెళ్లాలనుకున్నాను. 'పందెం' అని గుర్తుకొచ్చింది. ఇంక లేవలేదు. బలవంతంగా కూర్చున్నాను. నా దగ్గర "భారతదేశ చరిత్ర" పుస్తకం ఉంది. మామూలుగా అయితే రెండు-మూడు పేజీలు చదవగానే "rest" అని పుస్తకాల ముందునుండి లేచేవాడిని. కానీ 'పందెం' కోసమని అంతే కూర్చున్నాను. గంట దాటింది. అమ్మ కుట్టడం ఆపలేదు. నేను పంతం వీడలేదు. రెండు గంటలు కావస్తోంది. నేను అమ్మదగ్గర ఇంకా ఎన్ని బట్టలు ఉన్నాయని చూశాను. అయిపోవస్తున్నాయి. హమ్మయ్య... అనుకున్నాను... నేను పందెం అయితే గెలిచాను. కానీ దానివల్ల చాలా పాఠాలు నేర్చుకున్నాను.

★ ఆ రోజు నేను రెండు చాప్టర్స్ చదివాను. రెండు గంటల్లో.. మధ్య మధ్యలో breaks తీసుకుని రెండు గంటలు చదివితే కనీసం ఒక్క చాప్టర్ కూడా చదివి ఉండేవాణ్ణి కాదు.
★ ఏ పని చేసినా దానిని dedication తో చేయాలని అమ్మ దగ్గర నుండి నేర్చుకున్నాను. ఆ రెండు గంటలు అమ్మ మా ఇంట్లో ఉన్న స్టూల్ మీద కూర్చుంది. (నేను మాత్రం కుర్చీలో కూర్చున్నాను) దీనివల్ల నేను నేర్చుకున్నదేమిటంటే- ఒక పని dedication తో చేయాలని నిశ్చయించుకుంటే- facilities గురించి పట్టించుకోకూడదు. ఇది (ఈ పాఠం) నాకు తర్వాత చాలా పనికొచ్చింది.
★ Dedication తో ఏ పనిచేసినా బోర్ కొట్టదు.

నేను అప్పుడు ఇక సీరియస్‌గా ఆలోచించాను. ఒక ఇస్త్రీ షాపతను రాత్రనకు, పగలనక, అదే పనిగా ఇస్త్రీ చేస్తున్నా- బోర్ ఫీలవ్వడు. మరి నేను ఇంత చదువుకున్నాను- నేను ఎందుకు పుస్తకాలు ముందేసుకుంటే- బోర్ ఫీలవ్వాలి? మా అమ్మని ఎవ్వరూ అడగరు- కుట్టు మిషన్‌తో కుట్టమని.. అయినా తను ఆ పని అప్పుడు చేసెయ్యాలి అనుకున్నది కాబట్టి గడియారంతో సంబంధం లేకుండా ఆ పని పూర్తిచేసి తీరింది. నేను కూడా బోర్ ఫీలవ్వకుండా- dedication తో చదవగలిగితే- కచ్చితంగా నేను అనుకున్నది సాధించగలను- అన్న నమ్మకం ఏర్పడింది.

నేను ఇక్కడ నా మిత్రులను ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. మనలో ఎంతమంది 20-30 నిమిషాలు చదివి, ఈ రోజు చాలా చదివేశాం అని అనుకుని, బోర్ కొడుతుందని ఫీలయ్యి, టీ బంకుల దగ్గరకు పరిగెత్తుతాం? అక్కడ టీ తాగాలని ఎంత సమయం వృధా చేస్తాం? మీరు పుస్తకం పక్కనపెట్టిన దగ్గర నుండి మళ్లీ టీ బంకు నుండి వాపసు వచ్చేవరకూ- మళ్లీ పుస్తకం పట్టుకునేంతవరకూ టైం లెక్కపెట్టండి. ఒక టీ కోసం గంటలు గంటలు వృధా చేసుకునే స్నేహితులను చూశాను నేను. చదువుకోవలసిన సమయంలో బోర్ కొడుతోందని రిలాక్స్ అవ్వడానికి టీవీలో ఏం వస్తుందో చూద్దామని టీవీలు ఆన్




చేసేవాళ్లు చాలామందే ఉన్నారు. రెండు నిమిషాలు రిలాక్స్ అవ్వాలని వచ్చినవారు రెండు గంటలకు పైగా టీవాలక అతక్కుపోయే వాళ్లని చూశాను నేను.

కొంతమందికి ఉన్నట్లుండి పూనకం వచ్చినవాళ్ల లాగా అర్జెంటుగా ఏదో చేసేయాలని ఊగిపోతూ ఉంటారు. ఇక మన లక్ష్యమే మనకి ముఖ్యమంటూ చదువుకోవడానికి ప్రణాళిక వేసుకుంటారు. రోజుకి 15-16 గంటలు కష్టపడవలసిందే అని తీర్మానించుకుంటారు. ఇక ఫలానా సమయం నుండి నేను కొత్త వ్యక్తిని అయిపోతాను అని

నిశ్చయించుకుంటారు. అప్పటినుండి చాలా స్ట్రిక్ట్‌గా, సిన్సియర్‌గా ఉంటాను కాబట్టి ఈరోజు మాత్రం రిలాక్స్ అవాలి అని అనుకుంటూ సినిమాలకి, షికార్లకి పరుగెడుతుంటారు.

టీ బంకుల దగ్గర, టీవీల దగ్గర, సినిమాల కోసం, షికార్ల కోసం వృథా అయ్యే సమయం ఇంతా, అంతా కాదు. చదువుకోవలసిన టైం ఇలా దుర్వినియోగపరిస్తే ఇంక చదువుకోవడానికి సమయం ఎక్కడ మిగులుతుంది చెప్పండి? పోటీపరీక్షల కోసం ప్రిపేర్ అయ్యే అభ్యర్థులను చేయవలసిన పనుల్లో అన్నిటికన్నా ముఖ్యం చదువుకోవడం. స్టడీ అవర్స్ (చదువుకోవలసిన టైం) పెంచుకోవడం, పుస్తకాల ముందు వీలైనంత ఎక్కువసేపు కూర్చుని బుద్ధిగా చదువుకోవడం. కానీ విచారించాల్సిన విషయం ఏమిటంటే- చాలామంది అభ్యర్థులు ఈ పని తప్ప మిగతా పనులన్నీ చేస్తుంటారు. కనీసం పదవ తరగతి చదివే పిల్లలు చదివినంత సేపు అయినా మనం చదవగల్గుతున్నామా? లేదా అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఈ మధ్యకాలంలో ఇంటర్‌మీడియెట్‌లో ఉన్న పిల్లలు ఐఐటీల కోసం, ఎంసెట్ కోసం, ఎఐఈఈఈ ల కోసం ఎంత కష్టపడుతున్నారో మీకు తెలియనిది కాదు. వారు చదివేది ఇంటర్. మనం aim చేసేది ఐఎఎస్/ గ్రూప్-1 లాంటి పెద్ద పెద్ద పరీక్షల కసం. ఇంటర్ చదివే వాల్లే అంతసేపు కష్టపడితే మనం ఎంత కష్టపడాలి? ఎంతసేపు చదవాలి? ఆలోచించండి.

మీరు కావాలంటే ఒక తులం బంగారం కొనగలరు. కానీ ఒక క్షణం సమయాన్ని కొనగలరా? ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి. పరీక్ష తేదీ వచ్చినప్పుడు, పరీక్ష రాసేటప్పుడు, పరీక్ష రాసేసిన తర్వాత- మనమందరం కచ్చితంగా ఒక్క విషయాన్ని గురించి పదే పదే బాధపడతాం.. ఇంకొంచెం సమయం ఉండి ఉంటే ఇంకా బాగా ప్రిపేర్ అయ్యి ఉండే వాళ్లం. ఇంకా పరీక్షను బాగా రాసేవాళ్లం.. అని అనుకుంటాం. సమయాన్ని సరిగ్గా వినియోగిస్తే అలా బాధపడవలసిన పని ఉండదు కదా..!

మిమ్మల్ని ఇంకొక ప్రశ్న అడుగుతాను. మనలో ఎంతమంది టైం టేబుల్ వేసుకున్నాం? నాకు తెలుసు.. కనీసం 60-70 శాతం మంది టైం టేబుల్ వేసుకుని ఉంటాము.. ఒక పక్కా ప్రణాళిక వేసుకొని ఉంటాం. చాలా scientific గా కూడా ప్రణాళిక వేసుకుంటాం. కానీ అస్సలు ప్రశ్న ఏమిటంటే- మనలో ఎంతమంది అనుకున్నది అనుకున్నట్టు సాధిస్తారు? వేసుకున్న టైం టేబుల్‌ని 100% ఎంతవరకూ follow అవుతారు? ఎంతమంది అనుకున్న ప్రకారం ప్రతిరోజూ వేసుకున్న టైం టేబుల్‌ని 100% (ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా) ఫాలో అవుతున్నాం? ఆలోచించండి.

కొంతమందిని టైం టేబుల్‌ని వేసుకోమంటే వచ్చే సోమవారం నుండి నేను ఈ ప్రకారంగా చదువుతాను.. అని- పెన్, పేపర్ తీసుకుంటారు. వారందరినీ నేను ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను.. ఈ వారం ఎందుకు చదవడం లేదు? ఈ రోజు నుండి... అసలు ఇప్పటినుండి ఎందుకు ప్రణాళిక వేసుకోవడం లేదు? వీరి psychology ని గమనిస్తే- వీరిలో చాలామంది పరీక్ష పోస్ట్‌పోన్ అవ్వాలని కోరుకుంటారు. ఎందుకని ఆలోచిస్తే- చదువుకోవడానికి ఎక్కువ సమయం దొరుకుతుంది కదా-- అని అనుకుంటారు. అయితే ఇక్కడ ఒక్క వషయం మర్చిపోతూన్నరు. వీరికిలాగా- అందరికీ

టైమ్ కలిసి వస్తుంది. (exam postpone అయితే). వీరు అప్పుడు బాగా చదువుదామని అనుకుంటారు. కానీ అప్పటికే అంతకుముందునుండి చదువుతున్న వారు- ఇంకా బాగా చదువుతారు కదా--

ఇప్పటివరకు బాగా చదవని వీరు- ఇకముందు బాగా చదువుతారని ఏమిటి గ్యారెంటీ? కాబట్టి- టైం టేబుల్ కోసం ముహూర్తం చేసే మిత్రులు- తస్మాత్ జాగ్రత్త-- కాంపిటీషన్ అంటే ఒక పరుగు పందెం-- ఈ పరుగు పందెంలో ముందు మెల్లిగా నడిచి, తర్వాత చివరకు ఉరకలెత్తుదామని (స్ప్రింట్ చేద్దామని) అనుకుంటే- పప్పులో కాలేసినట్లే.

ప్రణాళికాబద్ధంగా ప్రతిరోజూ (కొంచెం కొంచెం) చదివితే కొండంత కోర్సు అయినా పూర్తిగా చదివేయవచ్చు.

సమయం చాలా విలువైనది. ఒక్కసారి ఖర్చు అయిపోతే దానిని తిరిగి రాబట్టలేము. సమయం వృధా చేయకుండా స్టడీ అవర్స్ పెంచుకోండి. ఏదైనా పని చేసేటప్పుడు- ఆ పని నా లక్ష్యానికి నన్ను ఎంత దగ్గరకు చేరుస్తుంది? అని ఆలోచించండి.

ఒక్క విషయం ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి. పరీక్ష ఫలితాలు వచ్చిన రోజు పడే బాధకంటే- ఈ రోజు పడే కష్టం చాలా తక్కువ. అందుకని కష్టపడండి. ఈ రోజే కష్టపడడం మొదలుపెట్టండి. కాదు... ఇప్పుడే మొదలుపెట్టండి. బాగా కష్టపడండి. సమయం వృధా చేయకండి. మీ విజయం తథ్యం.

# 23

# ఊరికే ఊహల్లో ఉండక, ఉషోదయానికై ఉద్యమిద్దాం (రండిక)

**హైలెట్స్**

- మనసులో "నా లక్ష్యం ఇది" అని బలంగా నాటుకుపోవాలి. అలా జరిగిందంటే మన లక్ష్యం సగం నెరవేరినట్లే.
- మన ఊహలకు రెక్కలు కట్టి భవిష్యత్‌ని దర్శించండి. మిమ్మల్ని మీరు రాబోయే కాలంలో చూసుకోండి. అనుకున్నది సాధించినప్పుడు మనం పొందే సంతోషం. సంతృప్తి ఒక్కసారి ఊహించండి.
- మీరు కొన్ని లక్షల టన్నుల బరువు మోసేంత కష్టపడి ఉండవచ్చు. ఆ కష్టం అంతా కూడా మీరు రిజల్ట్ వచ్చిన రోజు పొందే ఆనందంతో సరితూగలేదు.
- లక్ష్యం, కష్టమూ తోడైతే బంగారు పతకాలు వస్తాయి. పేరు ప్రఖ్యాతులు వస్తాయి. రాష్ట్రపతులు కావచ్చు, రాజ్యాలు ఏలవచ్చు.

కలలు కనండి. వాటిని సాకారం చేసుకునేందుకు సదా శ్రమించండి. ఈ మాటలు మన ఏపీజె అబ్దుల్ కలాం పిల్లలతో ముచ్చటిస్తూ తరచూ అంటుండేవారు. తను దేశానికే వన్నె తెచ్చిన రాష్ట్రపతి. భారత క్షిపణి వ్యవస్థ. మూలవిరాట్టు. తను ఉన్నత పదవులను అధిరోహించింది. కేవలం కలలు కంటుండటం వల్లనే నంట. ఈ విషయాన్ని తన ఆత్మకథ అయిన 'వింగ్స్ ఆఫ్ ఫైర్'లో కూడా పేర్కొన్నారు. తను చదువుకునేప్పుడు తన




ఉపాధ్యాయుడు కలలు కనమని చెప్పిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ తన బాల్యంలో రామేశ్వరంలో ఆకాశంలో విహరించే కొంగలు తదితర పక్షులను చూసి, తనూ అలా జీవితంలో ఎదగాలని, ఎగరాలని నిశ్చయించుకున్నాడట. అందుకే ఒక మామూలు పేపర్ బాయ్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా కాగలిగాడు. పొట్ట కూటి కోసం ఇంటింటికీ తిరిగి పేపర్‌లు వేసే ఒక మామూలు కుర్రవాడు, దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన ఒక సాధారణ వ్యక్తి, అనితర సాధ్యమైన తెలివి తేటలు ప్రదర్శించి, భారతదేశ క్షిపణి వ్యవస్థను బలోపేతం చేసి, దేశ ప్రజలందరినీ ఎంతగా ఆకట్టుకున్నాడంటే ఏ రాజకీయ ప్రవేశం లేకపోయినా భారతదేశపు అత్యున్నత పదవి తనని వరించేంతలా. ఇదంతా ఎలా సాధ్యమైంది? అబ్దుల్ కలాం కలలు కనడం వల్ల. కలలు ఎవరైనా కంటారు. కానీ, వాటిని సాకారం చేసుకునే వారు చాలా అరుదు. అందుకే కలలు కనండి. వాటిని నెరవేర్చుకోవడానికి విశ్వప్రయత్నం చేయండి. ఖచ్చితంగా మీ కల నిజమవుతుంది. మీరు అనుకున్నది సాధించగలుగుతారు.

ఏదైనా సాధించాలి అంటే ముందుగా ఆ లక్ష్యం గురించి కల కనాలి. మనసులో నా లక్ష్యం ఇది అని బలంగా నాటుకుపోవాలి. అలా జరిగిందంటే – మన లక్ష్యం సగం నెరవేరినట్లే. ఎందుకంటే మనసులో బలంగా నాటుకుపోయిన లక్ష్యం గురించిన కోరిక మనల్ని (లక్ష్యం వైపుకి) లక్ష్యం దిశగా అడుగులు వేయిస్తుంది.

1963వ సంవత్సరంలో హార్వాడ్ బిజినెస్ స్కూల్‌లో మనస్తత్వ శాస్త్రజ్ఞులు ఒక ప్రయోగం చేయాలని నిశ్చయించుకున్నారు. వారి దగ్గర గ్రాడ్యుయేషన్ చదువుతున్న

వారిని తమ భవిష్యత్‌లో ఏమి సాధించాలనుకుంటున్నారో కలలు కని, దానిని గురించి ఆలోచించమన్నారు. పగటి కలలు కనడం ఎలా జీవితంలో మార్పు తీసుకువస్తుందో చూడాలని ఆ ప్రయోగం ఉద్దేశం. వారం రోజుల పాటు ఆ కలల గురించి, లక్ష్యాల గురించి, తమ జీవన గమనం గురించి, ఆలోచించి, ప్రతీరోజూ తాము భవిష్యత్తులో చేయాలనుకున్నది ఒక కాగితం మీద పెట్టమన్నారు.

వారం తిరిగిన తరువాత ఆ విద్యార్థులను అడిగితే వంద మందిలో కేవలం ముగ్గురు మాత్రమే కలలు కన్నారంట. తమ జీవిత లక్ష్యం గురించి కాగితంలో రాసుకున్నారంట. ఇలాంటి ప్రయోగాలకు సంబంధించిన క్లాసులకు మార్కులు ఉండవు. కానీ అటెండెన్స్ ఉంటుంది. కాబట్టి క్లాసు పూర్తి అయిన తరువాత అమ్మయ్య! పీడ వదిలిపోయింది అని అనుకున్నారంతా. కానీ, అసలు కథ అక్కడే ప్రారంభమైంది. ఆ మనోవైజ్ఞాన శాస్త్రజ్ఞులు క్లాసులోని వారందరినీ, వారికి తెలియకుండా ఫాలో అవుతున్నారు. వారు జీవితంలో ఏమి సాధించారో, ప్రతీ సంవత్సరంలో వారి ప్రగతి ఏమిటో తెలుసుకుంటూనే ఉంటున్నారు. వారి ఆర్థిక స్థితిగతులను వారు సంపాదించిన ఆస్తిపాస్తులను లెక్కగడుతూనే ఉన్నారు. సరిగ్గా 25 సంవత్సరాల తరువాత వారి ప్రయోగ ఫలితాలు వెల్లడించారు. వారి ప్రయోగంలో తేలినదేమిటంటే ఎవరైతే ముగ్గురు తమ భవిష్యత్ గురించి కలలు కని, పేపర్ మీద తమ లక్ష్యం ఇదీ అని నిర్ధారించుకున్నారో వారు ఖచ్చితంగా ఆ లక్ష్యాన్ని ఛేదించారు. అంతేకాకుండా ఆ ముగ్గురు సంపాదించిన ఆస్తి మొత్తం మిగతా 97 మంది సంపాదించిన ఆస్తికన్నా చాలా ఎక్కువ.

జీవితంలో సక్సెస్ సాధించాలంటే మన లక్ష్యం ఏమిటో ఖచ్చితంగా మనం నిర్ధారించుకోవాలి. ఆ లక్ష్యం గురించి కల కనాలి. డే డ్రీమింగ్ అంటే పగటి కలలు కనడం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరం. మన ఊహలకు రెక్కలు కట్టి భవిష్యత్తుని దర్శించండి. మిమ్మల్ని మీరు రాబోయే కాలంలో చూసుకోండి. మనం అనుకున్నది సాధించినప్పుడు మనం పొందే ఆనందం, సంతోషం, సంతృప్తి ఒక్కసారి ఊహించుకోండి. కావాలంటే ఒకటి రెండు నిమిషాలు ఈ వ్యాసాన్ని చదవడం ఆపి భవిష్యత్తుని గురించి ఊహించండి. మనం అనుకున్నది సాధించినప్పుడు మనం ఎలా ఫీల్ అవుతామో ఒక్కసారి ఆలోచించి, ఆ అనుభూతిని పూర్తిగా ఆస్వాదించండి. ఎంత అద్భుతంగా ఉంటుందో కదా. ఆ ఫీలింగ్ (అనుభూతి).

ఊహించండి. మీరు ఒక ఐఏఎస్ ఆఫీసర్ అయ్యారు. మీరు ఒక కార్యక్రమంలో పాల్గొనాలి. అందుకోసం ఎంతో మంది మీ రాక కోసం ఎదురుచూస్తున్నారు. మీరు రాబోతున్నారని తెలిసి అక్కడ మిగతా అధికారులంతా అలెర్ట్‌గా ఉంటున్నారు. కొంత మంది కిందిస్థాయి అధికారులు మీరు వస్తున్నారని హడావుడి చేస్తున్నారు. ప్రజలు మిమ్మల్ని కలవాలని అందరూ ఎగబడుతున్నారు.

లేదా మీరు ఒక ఆర్‌డీఓ ఆఫీసర్ లాగ రండి, మీ వెనకాల ఒక బిళ్ల బంట్రోతు, ఒక గన్‌మెన్ వస్తున్నారనుకోండి. మీరు నడిచి వస్తుంటే ఎదురుగా ఉన్న వారు మీకు నమస్కారం చేస్తున్నారు. పోలీసులు మీకు సెల్యూట్ చేస్తున్నారు. మీరు మీ కార్ వరకు వస్తుంటే ఆ కార్ డోర్‌ని మీ డ్రైవర్ తీసి మీకు నమస్కరిస్తాడు.



లేదా మీరు ఒక డీఎస్పీ అయినప్పుడు మీ చుట్టూ పోలీస్ డ్రస్‌తో ఉన్న ఎస్ఐలు, కానిస్టేబుల్స్ లైనులో నిలబడి సెల్యూట్ చేస్తూ, మీ రాకకోసం ఎదురు చూస్తున్నారు. మీరు పోలీస్ యూనిఫాంలో పోకిరీ సినిమాలో మహేశ్‌బాబు లాగ టిప్‌టాప్‌గా తయారై మీ భుజాల మీద స్టార్స్, మీ టోపీ మీద భారతదేశం ఎబ్లమ్ (మూడు సింహాల గుర్తు) ఉంటే మీ ఇంట్లో వారు మిమ్మల్ని చూడాలని ఆరాటపడటం గమనించండి.

ఈ ఊహలు నువ్వు నాకు నచ్చావ్ సినిమాలో వెంకటేశ్ కనే కలలుగా కామెడీగా అనిపించినా, అవి నిజంగా అనుభవిస్తే చాలా తీయని అనుభూతులవుతాయి. మనని ఇంకా చదవాలని ప్రోత్సహించే ప్రేరకాలు అవుతాయి. మరీ అంత ఎక్కువ దూరం ఊహించలేము అనుకునే వారు, మీ ఫలితాలు వచ్చిన రోజుని గురించి ఊహించండి. ఆ రోజు మీ ఫొటో పేపర్‌లో పడటం గురించి ఊహించండి. లేదా మీ పేరు పేపర్‌లో గురించి, మీ ఫొటోని టీవీలో చూపించడం గురించి ఆలోచించండి. మీ పేరుని ఫొటోలని టీవీలోనూ, పేపర్‌లోనూ చూసి మీ తల్లిదండ్రులు పొందే ఆనందం గురించి ఊహించండి. నిజం చెప్పాలంటే నేను ప్రేరణ పొందింది ఇలాగే. నేను నా ఫొటోని న్యూస్‌పేపర్‌లో మొదటి పేజీలో వేయాలి అని అనుకున్నాను. నా గురించి టీవీలో చెప్పాలి అని అనుకున్నాను. నా తల్లిదండ్రులు అది చూసి గర్వపడాలిఅని కూడా అనుకున్నాను. చాలా చాలా సార్లు అలా అనుకునేవాడిని. అనుకున్న ప్రతిసారీ నాలో చదవాలనే పట్టుదల, కసి, ఇంకా పెరిగేవి. వాటి కోసం ఎంత కష్టమైనా పడవచ్చు అనుకునే వాడిని. నేను పెరిగిన ప్రదేశంలో జనం నా గురించి చెప్పుకోవాలి. మన వాడు ఐఏఎస్ ఆఫీసర్ అయ్యాడు అని

చెప్పుకోవాలి అని అనుకునేవాడిని. మీరు కూడా అలా ఊహించి చూడండి. మీ బంధువులు మీరు సక్సెస్ అయితే ఎలా ఫీలవుతారో ఊహించండి. మా ఇంట్లో వాళ్లందరికీ సూత్రధారులు సినిమా అంటే ఇష్టం. ఎప్పుడు టీవీలో ఆ సినిమా వచ్చినా చూస్తూ ఉంటాం. మా నాన్నగారు అక్కినేని నాగేశ్వరరావు గారిలా ఉంటారు. ఆయన పోలికలు మా నాన్నగారిలో ఉంటాయి. నాన్నగారిని అందరూ అక్కినేని అని పిలుస్తుంటారు కూడా. అయితే మేము ఆ సినిమాని ఒకే ఒక్క డైయలాగ్ కోసం చూస్తాం. అందులో హీరో తండ్రి నాగేశ్వరరావు అందులో హీరో కష్టపడి కలెక్టర్ అవుతాడు. హీరో తల్లిదండ్రులు అప్పుడు ఎంత మంచి కొడుకుని కన్నావయ్యా అని అనుకుంటారు. ఇదంతా మీకు కావాలనే చెబుతున్నాను. మీరు కూడా మీ తల్లిదండ్రులకు అవకాశం ఇవ్వండి. మీ గురించి గొప్పగా చెప్పుకునేందుకు, మీ గురించి గొప్పగా ఫీలయ్యేందుకు మనం వారి కడుపున పుట్టినందుకు వారిని గొప్పగా ఫీలయ్యేలా చేయడం మన బాధ్యత లని నేను అనుకుంటాను. కాదంటారా?

నేను అనుభవంతో చెబుతున్నాను. మీరు కొన్ని లక్షల టన్నుల బరువును మోసేంత కష్టపడి ఉండవచ్చు. కానీ ఆ కష్టమంతా కూడా మీరు ఫలితాలు వచ్చిన రోజున పొందే ఆనందంతో సరితూగలేదు.

కలలకు ఉన్న మహత్యమేమిటో మీకు ఒక చిన్న కథ ద్వారా చెప్పదలచుకున్నాను. విల్మా రుడాల్ఫ్ గురించి మీరు ఎప్పుడైనా విన్నారా? 1960వ దశకంలో ప్రపంచంలో ఒక వెలుగు వెలిగిందీ మహిళ. ఈమె గురించి కొంచెం లోతుగా తెలుసుకుందాం.

విల్మా రుడాల్ఫ్ 1940 జూన్ 23వ తేదీన అమెరికాలోని టెన్నిసీ అనే ప్రాంతంలో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించింది. తండ్రి రైల్వేలో పోర్టరుగా పనిచేసేవాడు. తల్లి ఇళ్లల్లో పాచిపని చేసేది. ఆ కుటుంబానికి 22 మంది సంతానం. విల్మా 20వ సంతానంగా జన్మించింది. అది కూడా నెలలు నిండకుండా తన తల్లి గర్భంలో నుండి ఏడవ నెలలోనే బయట పడింది. భారీ సంతానం వల్లనో, పేదరికం వల్లనో కానీ విల్మా ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేకపోయినా, తల్లిదండ్రులు పట్టించుకునే వారు కాదు. బతుకుతుందో లేదా అనుకుంటూ ఉండగా బక్కపల్చగా ఉండే విల్మా ఎలాగోలా బతికేసింది. కానీ చిన్నప్పుడు ఎప్పుడూ ఆరోగ్య సమస్యలు విల్మాకి అగ్నిపరీక్షలు పెట్టేవి విల్మాకి నాలుగు సంవత్సరాలు వచ్చాయి. అప్పుడు మొదటిసారి పోలియో భూతం విల్మాని కబళించాలని చూసింది. పోలియో వచ్చి ఎడమ కాలిని బలి తీసుకుంది. ఇన్‌ఫాన్‌టైన్ పారాలసిస్ వల్ల కొన్ని రోజులు ఎడమ కాలు చచ్చుబడిపోయింది. డాక్టర్లు ఇంక ఎడమ కాలి వల్ల ప్రయోజనం లేదు అన్నారు. తన తోటి వారు అక్కలు, అన్నలు ఆడుకుంటుంటే నేను చలనం లేకుండా ఎందుకు కూర్చోవాలని విల్మా తనని తాను ఎన్నో వేలసార్లు ప్రశ్నించుకుంది. ఎలాగైనా నేను నడపాలని తల్లిని బతిమిలాడింది. అప్పుడు తన ఎడమ కాలికి షూ తయారు చేయించారు. విల్మా నడవడం మొదలు పెట్టింది రెండు సంవత్సరాలు గడిచాయి. చచ్చుబడి పోయిందనుకున్న ఎడమ కాలికి షూ తయారు చేయించారు. విల్మా నడవడం మొదలు పెట్టింది. రెండు సంవత్సరాలు గడిచాయి. చచ్చుబడిపోయిందనుకున్న ఎడమ కాలికి జీవం వచ్చింది. అయితే కాలి మడమ మాత్రం వంకరపోయింది. విల్మా తనంతట

తాను నడవగలుగుతుంది.

విల్మాకి తొమ్మిది సంవత్సరాలు వచ్చేసరికి పోలియో భూతం రెండవ సారి విజృంభించింది. సరిగ్గా ఇప్పుడే విల్మాకి డబల్ నిమోనియా, స్కార్లెట్ ఫీవర్ అనే జబ్బులు కూడా వచ్చాయి. డాక్టర్‌కి చూపిస్తే ఇక విల్మా ఎప్పటికీ తన కాళ్లు భూమి మీద పెట్టలేదు అని చెప్పారు. తను లేచి తన పనులు కూడా చేసుకోలేదని నిర్ధారించేశారు. జీవితాంతం ఇక మంచానికి అంకితమవాలని తేల్చేశారు.

మంచం మీద పడుకుని విల్మా కిటికీలో నుండి చెంగు చెంగున గెంతే మిగతా పిల్లల్ని చూసి తనూ అలా ఆడుకోవాలని అనుకుంది. తల్లికి ఆ విషయం చెబితే మొదట వద్దన్నా, తరువాత విల్మా పట్టుదలకు సరే అనక తప్పలేదు. విల్మా నడవడానికి చిన్నప్పుడు తయారు చేయించిన షూ ఇంకొకసారి రెండు కాళ్లకి తయారు చేయించాల్సి వచ్చింది. చిన్న పిల్లలు పాకుతూ నిల్చోడానికి పక్కన ఉన్న వస్తువులు పట్టుకుని నిలుచునే విధంగా విల్మా కూడా రెండుచేతులతో పక్కన ఉన్న గోడలను పట్టుకుని నిల్చోడానికి ప్రయత్నం చేసేది. ఆ ప్రయత్నంలో ఎన్నోసార్లు విఫలమైంది. కాళ్లలో శక్తి లేక ధాం అంటూ కిందపడి పోయేది. పడిపోతున్నావు కదా వద్దు అని ఎవరైనా వారించినా వినేది కాదు. మళ్లీ ప్రయత్నించేది. మళ్లీ మళ్లీ ప్రయత్నించేది. కొన్ని నెలలకు విల్మా ప్రయత్నం ఫలించింది. తనంతట తాను నిల్చోగలుగుతుంది. భూమి మీద తను కాలు పెట్టలేదు అన్న డాక్టర్ల నిర్ధారణను సవాల్ చేస్తూ తను తన సొంత కాళ్ల మీద నిలబడగలిగింది.

విల్మా తల్లికి అప్పుడు విల్మా మీద నమ్మకం ఏర్పడింది. నిలబడగలుగుతున్నావు కదా ఇప్పుడు ఏమి చేయాలనుకుంటున్నావు? అని తల్లి అడిగితే నేను కూడా మిగతా పిల్లలు లాగా ఆడుకోవాలనుకుంటున్నాను అని అంది. తల్లి ఆశ్చర్యపడి అతి కష్టం మీద నిలబడుతున్నావు. అసలే వంకపోయిన కాలు నువ్వు ఎలా పరిగెత్తగలవు? అని అంటే విల్మా తన కోరిక చెప్పింది.

డాక్టర్లు తన పరిస్థితి తల్లికి చెబుతున్నప్పుడు తను విందంట. కాళ్లు భూమి మీద నేను పెట్టలేకపోవడం ఏమిటి? నాలుగు సంవత్సరాల అప్పుడు కూడా డాక్టర్లు నన్ను నిరుత్సాహపరిచారు. అయినా నేను పట్టుదలతో నడిచాను. ఇప్పుడు కూడా డాక్టర్లు నేను నడవలేను అని అంటున్నారు. డాక్టర్లు చెప్పింది నేను నమ్మదలచుకోలేదు. వీళ్లని ఛాలెంజ్ చేయాలని అనుకున్నాను. నేను నడవడమే కాదు, పరిగెత్తుతాను కూడా. నేను ప్రపంచంలో అందరికంటే వేగంగా పరిగెత్తాలని కల కన్నాను. అది నేను నెరవేర్చుకోవాలి. అందుకే ఇప్పుడు అందరిపిల్లలాగ నేను కూడా చెంగుచెంగున గెంతుతూ ఆడుకోవాలి. అని అంది.

ఇంక తల్లి తనని సపోర్టు చేయడం మొదలుపెట్టింది. తను చేతులు ఊతంగా విల్మా నడవడం మళ్లీ నేర్చుకుంటుంది. పది నెలలు గడిచాయి. డాక్టర్లు వద్దంటున్నా వినకుండా తనకు ఆసరాగా ఉన్న కృత్రిమ అంగాల లాంటి బూట్లని తొలగించి నడవడం మొదలు పెట్టాంది. తను అలా అలా నడుస్తూనే ఉంది. ఎన్నివేలసార్లు విఫలమైనా ఇంటి గేటు నుండి తన మంచం వరకూ, తన మంచం నుంచి ఇంటి గేటు వరకూ ఎవరి సహాయం లేకుండా నడవడంలో ఆఖరికి విజయం సాధించింది. తన సంకల్ప బలానికి తరువాత పరీక్ష పరుగెత్తడం. ఇంటి గేటు బయటకు రాలేని విల్మా అప్పటికి దాదాపు రెండు

సంవత్సరాలు ఇంట్లోనే గడిపింది. ఇప్పుడు పరిగెత్తాలని నిశ్చయించుకుంది. తను కన్న కలని నెరవేర్చుకోవాలని విశ్వప్రయత్నం చేసే వారిని విధి మాత్రం ఎంత కాలం ఆపగలుగుతుంది చెప్పండి? మైదానంలో పరుగులు మొదలుపెట్టింది విల్మా. పన్నెండు సంవత్సరాల ప్రాయంలో తను మొదటి రేసులో పాల్గొంది. ఎంత మంది వద్దన్నా పట్టుబట్టి మరీ తోటివారితో రేసులో పరిగెత్తింది. అందరూ అనుకున్నట్లుగానే ఆ రేసులో తను చివర స్థానం తెచ్చుకుంది.

అయితే తరువాత రేసుల్లో పాల్గొనడం ఆపలేదు. తనకు ఎవరూ పోటీ కాదు. ఎందుకంటే అందరూ తనని దాటిపోతుంటారు. తనకి తానే పోటీ. అంతకుముందు పట్టిన సమయం కన్నా, ఈ సారి రేసులో కొంత మెరుగైన సమయంలో రేసుని పూర్తి చేయాలి. అదీ తన పట్టుదల. ఇలా పరిగెడుతూనే ఉంది. ఎన్నో రేసుల్లో పాల్గొన్నది. అలా చేస్తూ చేస్తూ ఉండగా, తన స్థానం కూడా మెరుగైంది. కొన్నిసార్లు ఐదవస్థానం, కొన్నిసార్లు నాల్గవ స్థానం, కొన్నిసార్లు మూడవ, రెండవ స్థానాలు. చివరికి తను రేసులో ప్రథమ స్థానం సంపాదించింది. అప్పటికి తన వయసు 15 సంవత్సరాలు.

15వ ఏట తను టెన్నీసీ స్టేట్ యూనివర్సిటీకి వెళ్లింది. అక్కడ ఎడ్ టెంపుల్ అనే కోచ్‌ని కలిసింది. తన పరుగుల చరిత్రని చెప్పి తన కల గురించి చెప్పింది. "ప్రపంచంలో కెల్లా వేగంగా పరిగెత్తగల దానిలా నాకు పేరు రావాలి" అని తన చిరకాల కోరికను నెరవేర్చమని వేడుకుంది. అపపడు టెంపుల్ ఇలా అన్నాడు 'నీ లక్ష్యం గురించి నీవు కన్న కల నుండి నిన్ను ఎవరూ వేరు చేయలేరు. నేను నీకు చేతనైనంత సహాయం చేస్తాను' అని తన శిక్షణ మొదలుపెట్టాడు.

రోజులు దొర్లుతున్నాయి. నెలలు మారుతున్నాయి. కాలం గడచిపోతుంది. ఇటు విల్మా శిక్షణ కఠోరంగా సాగిపోతుంది. 1956వ సంవత్సరం అనగా విల్మాకి 16 సంవత్సరాల వయస్సు. అప్పుడు విల్మా మెల్‌బోర్న్ ఒలంపిక్ క్రీడలకు అర్హత సాధించింది. ఒలంపిక్ క్రీడల్లో అన్నీ పరుగు పందాలలో అర్హత సాధించలేకపోయినా, పాల్గొన్న రెండు అంశాలలో ఒకదానిలో కాంస్య పతకం సంపాదించింది. కానీ అది కాదు విల్మాకి కావలసినది. తను విశ్వంలోకెల్లా అత్యంత వేగవంతమైన మహిళగా పేరు తెచ్చుకోవాలి. అందుకు 1960వ సంవత్సరం రోమ్ ఒలింపిక్ క్రీడల వరకూ వేచి ఉండాలి.

విల్మా వేచి ఉంది. అత్యంత కఠినమైన ప్రాక్టీస్ చేసింది. మహిళల పరుగు పందాలలో అప్పుడు మూడు అంశాలు ఉండేది. మూడు అంశాలలో పాల్గొనాలి. ఆ పాల్గొన్న అంశాలలో బంగారు పతకాలు సాదించాలి. ఇదీ విల్మా సంకల్పం. అప్పటికి జర్మనీకి చెందిన జట్టా హీన్ పేరు బాగా వినిపిస్తుంది. ఆవిడ జర్మనీ దేశానికి మూడు బంగారు పతకాలు తెచ్చిపెడుతుందని, ఆమె పరుగులు చూసిన వారి నమ్మకం. 1960 రోమ్‌లో విల్మా, జుట్టాతో తలపడి పరిగెత్తాలి.

చూస్తుండగా పోటీపడే రోజు రానే వచ్చేసింది. మొదటి అంశం 100 మీటర్ల పరుగు పందెం. విల్మా, జుట్టా పక్కపక్కనే పరిగెట్టాలి. ఇద్దరినీ ఒకరినొకరు చూసుకున్నారు. పందెం మొదలయ్యే ముందు విల్మా తన కలని గుర్తుకు తెచ్చుకుంది. తన కలని ఎలాగైనా నెరవేర్చుకోవాలని తీర్మానించుకుంది. శక్తినంతా కూడదీసుకుని పరిగెత్తింది. క్షణాలలో

పరుగు పందెం అయిపోయింది. ఫలితం ఏమిటంటే విల్మా తన మొదటి బంగారు పతకం సాధించింది. జుట్టాకి వెండి పతకం దక్కింది.

రెండవ అంశం 200 మీటర్ల పరుగు పందెం. ఈసారి కూడా విల్మా జుట్టాని ఓడించి బంగారు పతకం కొట్టేసింది. మూడవ అంశం 400 మీటర్ల రిలే పరుగు. రిలే పరుగులో ఒక్కో జట్టుకి నలుగురు క్రీడాకారులు ఉంటారు. వారి చేతిలో బేటన్ ఉంటుంది. బేటన్ ఉన్న వాళ్లు పరిగెత్తాలి. బేటన్‌తో క్రీడాకారులు పరిగెత్తడం ఈ రిలే పరుగు పందెందో ప్రత్యేకత. మొదటి క్రీడాకారిణి రెండవ వారికి, రెండవ వారు మూడవ వారికి, మూడవ వారు నాల్గవ వారికి చేటన్‌ని అందించుకుని పరుగెత్తుతారు. 400 మీటర్ల రిలేలో చివర 100 మీటర్ల టీమ్ లీడర్లు పరుగెత్తుతారు. అలా అమెరికా తరఫున విల్మా, జర్మనీ తరఫున జుట్టా తమ తమ టీమ్‌లలో చివర లాప్ (చివర 100 మీటర్లు) పరిగెత్తాలన్నమాట. 400 మీటర్ల రిలే ప్రారంభమైంది. మొదటి ముగ్గురు క్రీడాకారులు. ఇరు జట్లవైపున చక్కగానే బాటన్‌ను మార్చుకున్నారు. విల్మా వంతు వచ్చేసరికి విల్మా తన చేతిలో బేటన్‌ని జారవిడిచింది. అది కిందపడిపోయింది. తనకు ఎదురుగా జుట్టా బేటన్‌తో పరుగెత్తడం విల్మా చూసింది. ఒక్క ఉదుటున కిందకి వంగి బాటన్ పుచ్చుకుని, ఒక మెషీన్‌లా పరుగెత్తింది. జుట్టా ఫినిష్ లైన్ తాకేలోపు తను అప్పటికే ఫినిష్ లైన్‌ని దాటేసింది. ఇలా మూడవ బంగారు పతకాన్ని కూడా సాధించింది.

తన కలని నెరవేర్చుకుంది. ఇదిచరిత్రలో నిలిచిపోయే సత్యం. ఒక పోలియో పీడిత బాలిక ప్రపంచంలోకెల్లా వేగవంతమైన మహిళగా గుర్తింపు పొందింది. 1960 రోమ్ ఒలంపిక్స్ ఇందుకు సాక్ష్యం.

అందుకే మీరు ఏమి సాధించాలనుకుంటున్నారో ముందు మీకొక లక్ష్యాన్ని నిర్దేశించుకోండి. కలలు కనండి. వాటిని సాకారం చేసుకోవడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉండండి. కలలకు ఉన్న శక్తిని తెలుసుకోండి. ఒక మామూలు పేపర్ బాయ్‌ని ప్రెసిడెంట్‌గా చేయగల శక్తి కలకు ఉంది. ఒక పోలియోగ్రస్థ వ్యక్తిని అత్యంత వేగవంతమైన వ్యక్తిగా మార్చగలిగే శక్తి కలకు ఉంది. అందుకే మనమూ మన లక్ష్యం గురించి కలలు కందాం. వాటిని నెరవేర్చుకునేందుకు కష్టపడదాం. లక్ష్యం, కష్టం తోడైతే బంగారు పతకాలు వస్తాయి. పేరు ప్రఖ్యాతులు వస్తాయి. రాష్ట్రపతులు కావచ్చు, రాజ్యాలు ఏలవచ్చు.

# 24

# నిరంతర శ్రమతో నిరాశకే నిరాశ కలగదా?

**హైలెట్స్**

- మనం ఒక పరీక్షలో ఓడిపోయి, పోగొట్టుకున్న మన గెలుపుని మళ్లీ అదే పరీక్ష ఇంకోసారి రాసి రాబట్టుకోవాలి.
- గెలుపు కోసం ఓర్పు వహించిన వారే నిజమైన విజేతలు.
- సక్సెస్ అయ్యేవారు వేరే పనులు చేయరు. వారు అందరూ చేసే పనిని వేరే విధంగా చేస్తారు.
- మనం ఓడిపోయాం అని మనకి మనం చెప్పుకునేంత వరకూ, మనకి ఓటమి సంభవించినట్లు కాదు.

"కెరటం నాకు ఆదర్శం
పడినందుకు కాదు -
పడినా లేచినందుకు"

అన్న ఒక కవి మాటలు నాకు ఎప్పుడూ ప్రేరణనిస్తుంటాయి. జీవితంలో మనం ఎన్నో కలలు కంటుంటాం. వాటిని నెరవేర్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటాం కూడా. అయితే మనం నిర్ధారించుకున్న అన్నీ లక్ష్యాలూ నెరవేరకపోవచ్చు. దానికి కారణం మన ప్రయత్నం మనం సరిగ్గా చేయలేకపోవడమనే చెప్పాలి.

కొన్ని కొన్నిసార్లు మనం మన లక్ష్యాన్ని నెరవేర్చుకోవడం కోసం మనం



చేయవలసినదంతా చేసేశాం అనిపిస్తుంది. మన ప్రయత్న లోపం ఏమీ లేదు అని మనకి మనం నచ్చజెప్పుకుంటుంటాం. అయితే ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే మన ప్రయత్నం మన లక్ష్యాన్ని– చేరుకోవడానికి సరిపోలేదని గుర్తించకపోతున్నాం. పోటీ పరీక్షలకు తయారయ్యే అభ్యర్థులను నేను ఎంతో మందిని చూశాను. కొంత మంది అందులో నిజానికి బాగానే ప్రిపేర్ అవుతారు. పరీక్ష బాగా రాసుంటారు. చివరికి పరీక్ష ఫలితాలలో వారి పేర్లు ఉండవు. ఇక చూడండి. ఏడుపులు – ఏకరువులు. కష్టాలు – కన్నీళ్లు. నాకే ఎందుకీ శాపం అని శని నెత్తిమీద ఉందని తెగ బాధపడిపోతూ ఉంటారు. చాలా బాగా ప్రిపేర్ అయ్యాం, అంతకంటే బాగా పరీక్ష రాశాం, అయినా మాకు రాలేదంటే పరీక్ష ప్రక్రియ లోపభూయిష్టమైనది, పేపర్ దిద్దేవాళ్లకు నాలెడ్జ్ లేదు అంటే కంప్లయింట్‌లు మొదలవుతాయి.

వీళ్లు తెలుసుకోవలసిన అసలు విషయం మరచిపోతున్నారు. వీరు పరీక్ష బాగా రాసి ఉండవచ్చు. కాదనను. వీరికన్నా బాగా రాసేవాళ్లు ఉంటారు కదా. న్యాయంగా సీటు వారికే రావాలి కదా. ఆ విషయం వీరికి అప్పుడు జ్ఞాపకముండదు. గెలుపు సాధించాలంటే ముందు ఓటమిని సరిగ్గా తట్టుకోగలగడం తెలిసి ఉండాలి. ఏదైనా పరీక్ష ఉన్నప్పుడు గెలుపు ఓటములు సహజం. గెలుపొందినప్పుడు పొంగిపోతే ఫరవాలేదు కానీ, ఓటమి ఎదరైతే కృంగిపోతే మాత్రం చాలా కష్టం. మరి ఓటమి సంభవిస్తే ఏమి చేయాలి? ఏమి చేయాలంటే మరొకసారి ప్రయత్నించాలి. మళ్లీ ప్రయత్నించాలి. పోగొట్టుకున్న చోటే వెతుక్కోమని ఒక సామెత ఉంది. మనం ఒక పరీక్షలో ఓడిపోయి, పోగొట్టుకున్న మన

గెలుపుని మళ్లీ అదే పరీక్ష ఇంకోసారి రాసి రాబట్టుకోవాలి. గత సారి మనం చేసిన తప్పులు ఏమైనా ఉంటే అవి ఈ సారి దొర్లకుండా జాగ్రత్తపడాలి. మన కష్టం గతసారి పరీక్షకు సరిపోకపోతే, ఈసారి రెట్టించిన ఉత్సాహంతో ఇంకా ఎక్కువ కష్టపడాలి. గతసారి చిచూసిన వైఫల్యాన్ని ఒక అనుభవ పాఠంగా మలచుకోవాలి. గుర్తు పెట్టుకోవలసిన విషయం ఏమిటంటే మనం ఒప్పుకునేంత వరకూ, ఓటమి మనకి ఓటమి కాదు. అది కేవలం ప్రయత్న లోపంగానే మిగిలిపోతుంది. ఓటమి ఎదురైనప్పుడు పైన చెప్పిన విధంగా కాకుండా, భూమి భారమంతా మనపైన పడిపోయినట్లు, ప్రపంచంలో మనమే అత్యంత దౌర్భాగ్యులమయినట్లు, మన జీవితానికే అర్థం లేదు అన్నట్లు భావించే వాళ్లు మనలో ఉన్నారు. బహుశా, నేను కూడా ఆ కోవలోకి చెందిన వాడినేమో. అయితే అది ఒకప్పుడు. దాని వల్ల ఏమయింది? ప్రపంచం తల్లకిందులు కాలేదే... భూమి మొత్తం అల్లకల్లోలం కాలేదే. ఏమైనా జరిగి ఉంటే మనకి (ఓడిపోయిన వారికి) మరింత నష్టం జరిగి ఉంటుంది. ఛీ! నాకే ఎందుకు ఇలా జరుగుతుంది? నేను ఎందుకు ఇలా ఓడిపోయాను అనుకుంటూ విషాద వియోగాలలో ఉంటే అందరికంటే ఎక్కువ నష్టపోయేది మనమే. నా అనుభవం వల్ల చెబుతున్నాను. ఓటమి ఎదురైతే ఎక్కువ బాధపడవద్దు. ఎక్కువ అనుభవాన్ని గ్రహించామని సంబరపడండి. బాధ అందరూ పడతారు. అది సహజమైన విషయమే. కానీ, విజేతయ్యే వారు బాధని అధిగమించి, మళ్లీ ప్రయత్నాలు మొదలు పెడతారు.

అది 1870వ దశకం. అప్పుడప్పుడే కొత్తగా థామస్ ఆల్వా ఎడిసన్ పేరు న్యూజర్సీ నగరంలో ప్రసిద్ధి పొందుతున్నది. అతను ఒక సైంటిస్టుగా పేరు తెచ్చుకుంటున్న రోజులవి. అప్పటికే ఎడిసన్ కొన్ని పరికరాలు కనిపెట్టడం వల్ల తను తర్వాత ఏమి చేయబోతున్నాడో అందరి నోళ్లలోనూ చర్చ మొదలైంది. ఇంతలో, ఒక పుకారు న్యూజర్సీ వీధుల్లో షికారు చేస్తుంది. ఎడిసన్ విజయవంతంగా 500వ సారి కూడా విఫలమైనాడని. ఆ పుకారు సారాంశం. ఏమి కనిపెట్టబోతున్నాడో – తను 500వ సారి కూడా విఫలమైనందుకు తన స్పందన ఏమిటోనన్న కుతూహలం కొద్దీ ఒక యువ జర్నలిస్టు ఎడిసన్ దగ్గరకు వచ్చి, ఇలా అడిగింది. “మీరు ఏదో కనిపెట్టాలని, 500 సార్లు విఫలమైనారు కదా... ఎందుకు ఆ పనిని వదిలేసి వేరే కొత్త పరికరాన్ని కనిపెట్టకూడదు?’ ’ అని అడిగింది. అందుకు ఎడిసన్ నేను లైట్ బల్బుని కనిపెట్టాలని అనుకుంటున్నాను. మీరు నన్ను లైట్ బల్బుని కనిపెట్టడంతో 500 సార్లు విఫలమైనానని అంటున్నారు. నేను ఒప్పుకోను. నేను విఫలం అవలేదు. ప్రయత్నించాను. ఇప్పుడు కూడా ప్రయత్నిస్తూనే ఉన్నాను. నా ప్రయత్నాలలో నేను లైటు బల్బుని ఎలా తయారు చేయలేమో తెలుసుకున్నాను. ఇప్పటికి 500 పద్ధతుల ద్వారా తయారు చేయలేనని తెలుసుకున్నాను. నా ఈ ప్రయోగాల వల్ల ఏమి చేయకూడదో తెలిసిపోయింది. ఇక ఏమి చేయాలో తెలియడం బాకీ ఉంది అని అన్నాడు. ఇలా అన్న కొద్ది నెలలకే ఎడిసన్ లైటు బల్బుని వెలిగించి ప్రపంచానికి ఒక కొత్త ఆవిష్కరణను అందజేశాడు. ఎడిసన్ తనకు ఎదురైన వైఫల్యాలను తను ఛాలెంజ్‌గా తీసుకోకపోతే, తన ఓటమిని అనుభవ సారాలుగా మలుచుకోకపోతే, మనకి ఈ నాటికీ ఫిలమెంట్ లైట్ బల్బు అంటే ఏమిటో తెలిసి ఉండేది




కాదేమో. మనం ఆధునిక ప్రపంచంలో ఇంత ప్రగతిని సాధించి ఉండేవాళ్లం కాదేమో కదా...

విజయం కోసం ఓర్పు వహించి ఉండటం చాలా కష్టం. ఏదైనా సాధించాలని మనం ఒక కల కనగానే, వెంటనే అది నెరవేరదు. ఆ కలని సాకారం చేసుకోవడానికి ప్రయత్నించాలి. మన లక్ష్యం ఎంత గొప్పది అన్న దాన్ని బట్టి మన ప్రయత్నాలు కూడా అంత గొప్పవి అయి ఉండాలి. పెద్ద లక్ష్యం అయితే, బాగా ఎక్కువగా కష్టపడవలసి వస్తుంది. మనలో చాలా మంది చాలా గొప్ప గొప్ప లక్ష్యాలు పెట్టుకుని, దానికి సరిపోవునంతగా కృషి చేయడం లేదు. ఫలితంగా తాము అనుకున్నది సాధించలేకపోతున్నారు. దీనినే నేను ప్రయత్న లోపం అంటున్నాను.

ఎప్పుడు ప్రయత్నంలో విఫలమవుతారో, అప్పుడు ఇంక ఈ లైనులో సక్సెస్ కాలేమని తేల్చేస్తారు. ఇది చాలా కష్టం అని చేతులెత్తేస్తారు. అలా చేయడం చాలా సులువు "నేను ఒకసారి కల గన్నాను కదా. దానిని నేను సాధించి తీరుతాను" అని అనుకోగలగడం చాలా కష్టం. "నేను మళ్లీ నా లక్ష్యం కోసం ప్రయత్నాలు మొదలు పెడతాను. అవసరమైతే రెండుసార్లు విఫలం అయినా సరే..." అని ఓర్పు వహించి ఉండటం చాలా చాలా కష్టం.

మీరు గమనించండి. గెలుపు కోసం ఓర్పు వహించని వాళ్లే నిజమైన విజేతలు. మొదట్లో దాదాపు అందరూ ఫెయిల్ అయిన వాళ్లే. కానీ ఆ వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకుని, మళ్లీ సమరభేరీ మోగించిన వాళ్లే మన ముందు విజేతలుగా నేడు నిలబడ్డారు.

తెలివి తక్కువ వాళ్లు, సోమరులు, తమ మీద తమకి నమ్మకం లేనివాళ్లు ఏమి

చేస్తారంటే తమ ప్రయత్నంలో వైఫల్యం చెందినప్పుడు చేతులెత్తేసి, వేరే మార్గాల వెంబడి పయనిస్తారు. గుర్తుంచుకోండి. సక్సెస్ అయ్యేవారు వేరే వేరే పనులు చేయరు. వారు అందరూ చేసే పనిని వేరే విధంగా చేస్తారు. జీవితంలో ఏదైనా సాధించి పేరు తెచ్చుకున్న ఎవ్వరినైనా చూడండి. వారు కూడా తమ మొదటి ప్రయత్నాలలో వైఫల్యం చెందిన వాళ్లే. అయితే వారు సాధించిన తరువాత అందరూ విజయాన్నే చూస్తున్నారు. కానీ, అంతకు ముందు వాళ్లు ఎన్నిసార్లు విఫలమయ్యారని పట్టించుకోరు.

ఒక్కోసారి మనం విజయానికి అతి చేరువలో ఉండి, మనకి తెలియక, ఇంక చేతులెత్తేస్తాం. మనం ప్రయత్నించడం మానేస్తాం. ఎడిసన్‌ని జర్నలిస్టు 500 సార్లు విఫలమయ్యారు కదా ఇంక దీనిని వదిలేసి వేరే కొత్తదేమైనా కనిపెట్టండని అడగడం గమనించండి. ఎడిసన్ కూడా 500 సార్లు ప్రయత్నించాను కదా ఇంక లైట్ బల్బు కనిపెట్టడం నా వల్ల కాదు అని అనుకుని ఉంటే ఎలా ఉండేదో ఒక్కసారి ఊహించండి. నిజానికి 500వ సారి ఎడిసన్ విఫలమైనప్పుడు అతను బల్బు కనిపెట్టడానికి అతి దగ్గరగా వచ్చాడు. ఆ విషయం అప్పటికి ఎడిసన్‌కి కూడా తెలియదు. కానీ, పట్టుదల వహించి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అందుకే కొంత కాలానికి బల్బు కనిపెట్టబడింది.

ఎప్పుడైనా కొండరాళ్లని, బండరాళ్లని కొట్టేవాళ్లని చూశారా? వాళ్లు పెద్ద పెద్ద సుత్తులతో కొండరాళ్లని పగలకొడుతూ ఉంటారు. ఇంతింత రాళ్లని శక్తినంతా కూడదీసుకుని ఎన్నోసార్లు సుత్తితో కొడుతూ ఉంటారు. వంద సార్లు సుత్తితో కొట్టినా, ఆ రాళ్లు పగలకపోవచ్చు. కానీ 101వ సారికి పెద్ద బండరాయి, రెండు ముక్కలు అయిపోవచ్చు. ఇప్పుడు చెప్పండి. రాయి ఎలా పగిలింది? 101వ దెబ్బకు పగిలితే, ఆ ముందు కొట్టిన 100 దెబ్బలకు ఒక చిన్న క్రాకు (పగులు) కూడా ఉండకపోవడమేమిటి? ఆ ముందు కొట్టిన 100 దెబ్బల సంగతేమిటి? ఆలోచించండి.

మన నిజ జీవితంలో మన లక్ష్యానికి మనం ఎంత దగ్గరగా ఉన్నామో మనకి చాలాసార్లు తెలియదు. ఇంకొంచెం ఎక్కువ సేపు పుస్తకాలతో కుస్తీ పట్టి ఉండి ఉంటే ఈ పాటికి మనలో చాలా మంది ఐఏఎస్‌లు అయ్యేవారేమో. ఇంకొంచెం ఎక్కువ శ్రద్ధగా చదివి ఉంటే మనకి గ్రూప్-1 ఇంటర్వ్యూకి పిలుపువచ్చి ఉండేదేమో... ఇంకొంచెం కష్టపడితే ప్రిలిమ్స్ ఫలితాలలో మన నెంబరు కూడా ఉండి ఉండేదేమో. ఏమో మనం 100 దెబ్బలు కొట్టి, 101వ దెబ్బని కొట్టకుండా వదిలేస్తున్నామేమో.

అందుకే అంటున్నాను. గెలుపుకి అర్హత సాధించాలంటే ఓటమిని సరిగ్గా ఎదుర్కొనాలి. పడిపోతున్నప్పుడు పక్కకి తప్పుకోవడం సులువైన విషయమే. ఓడిపోతున్నప్పుడు పోటీ నుంచి తప్పించుకుపోవడం చాలా ఈజీనే. కానీ, అది విజేత లక్షనం కాదు. దాని వల్ల మన లక్ష్యం నెరవేరదు. గత సంవత్సరం జరిగిన పరీక్షలో తప్పాను కాబట్టి, ఈసారి పరీక్ష రాయననడం పిరికి పందల లక్షణం. గత సంవత్సరం జరిగిన పరీక్షలో నేను పాసవలేదు కాబటిట, ఈ సంవత్సరం పరీక్షలలో నేను మొదటి గ్రేడులో పాసవ్వాలి అని అనుకోవడం గొప్పవాళ్ల లక్షణం.

మన చుట్టూ ఎంతో మంది పిరికిపందలు కనిపిస్తారు. వారు ఎందుకు అలా తయారయ్యారంటే వారు ప్రయత్నించడం మానేశారు కాబట్టి. ప్రయత్నించడం ఎందుకు




మానేశారంటే వారంటే వారికే నమ్మకం లేదు కాబట్టి. తమ మీదవ తమకి నమ్మకం లేని వారిని, ఎవరు మాత్రం బాగుపరచగలరు చెప్పండి? తమని తామే నమ్మని వారు దేవుడు దిగి వచ్చి వరాలు ఇస్తానన్నా వాటిని స్వీకరించలేరు. అలాంటి వారి కలలు కలలుగానే ఉండిపోతాయి. పోటీ పరీక్షలలో ఎక్కువ మంది ఫెయిల్ అయ్యేది పేపర్‌లు కష్టంగా ఉండటం వల్ల కాదు. తమని తాము నమ్మకపోవడం వల్ల. ఓటమిని సరిగ్గా ఎదుర్కొనడం తెలియకపోవడం వల్ల.

బైబిల్‌లో ఒక కథ ఉంది. ఒక రైతు తన పొలంలో విత్తనాలు నాటుతూ ఉంటాడు. అతని చేతిలో చాలా నాణ్యమైన విత్తనాలు ఉంటాయి. తను విత్తనాలు చల్లుతుంటే పక్షులు వచ్చి కొన్ని విత్తనాలను తినేస్తాయి. అప్పుడు ఆ రైతు ఏమి చేసి ఉంటాడో ఊహించండి. తను మనం అనుకుంటున్నట్లు పక్షులను చెదరగొట్టడానికి ప్రయత్నించలేదు. ఇంకా ఎక్కువ విత్తనాలు చల్లాడు. కొన్ని విత్తనాలు బండరాయి ఉన్న నేలపై పడ్డాయి. అవి మొలకెత్తడానికి మాత్రం మొలకెత్తాయి కానీ, పెద్ద గాలి వస్తే వంగిపోయి చచ్చిపోయాయి. కొన్ని విత్తనాలు కలుపు మొక్కలలో పడిపోయాయి. ఆ విత్తనాన్ని ఎదగనీయకుండా కలుపు అడ్డుకుటుంది. అయినా ఆ రైతు మాత్రం నిరుత్సాహపడలేదు. తను చేయవలసిన పనిని చేస్తూ పోయాడు. మిగతా చోట్ల విత్తనం పడి, బాగా ఏపుగా పెరిగి రైతుకు మంచి పంటని ఇచ్చింది. ఆ రైతుకి జరిగిన విధంగా మనకి కూడా కొన్ని కొన్ని సందర్భాలలో జరగవచ్చు. మన నాణ్యమైన విత్తనాలు పక్షులకు పలహారమైపోవచ్చు. మన నాణ్యమైన విత్తనాలు బండనేలపై పడి మొతకెత్తకపోవచ్చు. కలుపులో పడి మన విత్తనం నిర్వీర్యమైపోవచ్చు.

కానీ, ప్రయత్నించడం ఆపకపోతే, మన విత్తనాలు సారవంతమైన భూమిలో పడి మనకి భోగభాగ్యాలను సంపాదించిపెట్టవచ్చు.

పక్షులు తింటున్నాయని విత్తనాలు విత్తడం మానేసి పక్షుల వెంబడి పడితే విత్తనాలు నావలసిన సమయం కాస్తా ముగిసిపోతుంది. మనలో కొంత మంది అభ్యర్థులు చేసేది కూడా ఇలాంటి పనే. ఒక్కసారి ఓటమి ఎదురైతే వాళ్లు వ్యవస్థలో తప్పులు వెతుకుతుంటారు. దిద్దే వాళ్లు సరిగ్గా లేరు. పరీక్ష నిర్వహించే సంస్థ లోపభూయిష్టమైనది అంటూ తమ ఓటమిని సమర్థించుకోవడానికి కారణాలు వెతుకుతుంటారు. ఇలా చేస్తే వాళ్లు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నట్లే కదా. వారు దృష్టి పెట్టవలసినది ఇంకా తమ చేతిలో ఉన్న గింజల మీద. పక్షుల మీద కాదు. తమ చేతిలో ఉన్న గింజలు సారవంతమైన నేల మీద పడేలా విసరగలగాలి. అప్పుడే తాము సక్సెస్ సాధించగలుగుతారు.

మన గింజలు ఒక్కోసారి బండరాళ్ల మీద, కలుపు పెరిగే చోట పడవచ్చు. అలాంటప్పుడు చేతులెత్తేయడం సులభమనిపిస్తుంది. నాకే ఎందుకు ఇలా జరుగుతుందని మెట్ట వేదాంతం వినిపించాలనిపిస్తుంది. అలా చేస్తే ఏమి ప్రయోజనం ఉంటుంది చెప్పండి.

గుర్తు పెట్టుకోండి. పోటీ ప్రపంచం నిజంగా కరుణ లేనటువంటిది. దయాదాక్షిణ్యాలు బూతద్దంలో పెట్టివెదికినా దొరకవు. పోటీ అంటే – అంతే మరి. చిన్న పొరపాటు జరిగినా ఓటమి ఎదురుకావచ్చు. అందుకే గెలుపు పొందాలంటే ముందు ఓటమిని ఎదుర్కొనే విధానం తెలియాలి.

మనం ఓడిపోయాం అని మనకి మనం చెప్పుకునే వరకూ, మనకి ఓటమి సంభవించినట్లు కాదు. ఏదైనా గొప్ప పని చేయాలంటే ఘోరమైన ఓటమిని కూడా ఎదుర్కొనాల్సి వస్తే అందుకు సిద్ధంగా ఉండాలి. కెరటం పడుతుంది. కానీ, అది పడినా లేస్తుంది కాబట్టే సముద్రంలో చలనం ఉంటుంది. పడిపోయానులే అని పడ్డ చోటే పడి ఊరుకుంటే ప్రయాణం ఆగిపోతుంది. కెరటానికైనా, మనకైనా అందుకే పడిపోయామని తలపట్టుకు కూర్చోండి. పడినా లేవాలని ప్రయత్నించండి. పడిలేవడం అన్న దానిలోనే (జీవం ఉన్నది, ఉనికి ఉన్నది). ప్రాముఖ్యత ఉన్నది. కెరటానికైనా... మనకైనా...

# 25

# క్రమశిక్షణ అనే కఠోర తపస్సుకు కొండలైనా కరిగిపోవలసిందే

**హైలెట్స్**

- అసాధ్యమనుకున్న ఏ పనులైనా క్రమశిక్షణగా ఉండడం లవ్ల సుసాధ్యాలయిపోతాయి.
- క్రమశిక్షణతో మెలగడం, జీవితం అనే పోటీలో ఓడిపోవడం రెండూ బాధించే విషయాలే. అయితే రెండింటిలో దేనిని మనం ఎన్నుకోవాలి?
- క్రమశిక్షణ వల్ల మస్తీ – మజా తగ్గదు. ఇంకా చెప్పాలంటే పెరుగుతుంది.
- మందు కఠోర తపస్సు చేసి తరువాత సుఖాలను అనుభవిస్తారో లేదా ముసుగుతన్ని మంచం మీద నిద్రపోతారో మీ ఇష్టం.

మీరు ఎప్పుడైనా రిపబ్లిక్ డే (గణతంత్ర దినోత్సవం) నాడు ఢిల్లీలో జరిగే పెరేడ్‌ని ప్రత్యక్షంగా కానీ, టీవీలలో కానీ చూశారా? ప్రతి సంవత్సరం అదే సైనిక కవాతు. ప్రతిసారి అవే యూనిఫారమ్‌లు. ప్రతీసారీ అవే బాండ్‌లు, అవే బాజాలు. అయినా భారతీయులందరూ ఆ రోజు టీవీలకు అతుక్కుపోతారు. మిగతా రోజుల్లో దూరదర్శన్ ఛానల్‌ని చూసినా, చూడకపోయినా, జనవరి 26 మాత్రం రిపబ్లిక్‌డే వేడుకల కోసం దూరదర్శన్ ఛానెల్‌ని పెట్టుకుని మరీ చూస్తుంటారు. ఎందుకంటే – సైనికుల క్రమశిక్షణ జనాలను ఆకర్షిస్తుంది. క్రమశిక్షణగా సైనికులు కానీ, పోలీసులు కానీ పారామిలటరీ దళాలు కానీ ఒకేసారి అడుగు తీసి అడుగువేస్తారు. వారందరూ ఒకేసారి తమ తలలు

కుడివైపుకి తిప్పుతారు. ఒకేసారి తమ చేతిలో ఉన్న ఆయుధాలు పైకి పట్టుకుంటారు. ఒకేసారి సెల్యూట్ చేస్తారు. క్రమశిక్షణతో ఏ పని చేసినా, అది ముచ్చటగా ఉంటుంది. అంతేకాదు క్రమశిక్షణ వల్ల ఎన్నో కష్టమైన పనులు సులువైపోతాయి. అసాధ్యమనుకున్న ఏ పనులైనా క్రమశిక్షణ ఉండటం వల్ల సుసాధ్యాలైపోతాయి. క్రమశిక్షణ వల్ల మన శక్తి సరిగ్గా ఎక్కడ ఉపయోగపడాలో అక్కడే ఉపయోగించగలుగుతాము. మన మెదడు చేయవలసిన పనుల మీద మాత్రమే ఫోకస్‌గా ఉండగలుగుతుంది. ఇలా క్రమశిక్షణ వల్ల ఎన్నో లాభాలు.

ఆర్ఏఎఫ్ జవాన్లని ఎప్పుడైనా కలిశారా? ఆర్ఏఎఫ్ అంటే రాపిడ్ యాక్షన్ ఫోర్స్. అది సీఆర్‌పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్)లో ఒక ప్రత్యేకమైన శాఖ. దేశం మొత్తం మీద కేవలం పది బెటాలియన్ల దళం మాత్రమే ఆర్ఏఎఫ్‌కి ఉంది. కానీ, అది సాధించిన పేరు ఇంతా, అంతా కాదు. ఏ రకమైన విధ్వంసకాండనైనా ఎదుర్కొని పరిస్థితిని మామూలు స్థితికి తీసుకురావడానికైనా ఆర్ఏఎఫ్ ప్రత్యేకతని సాధించింది. ముఖ్యంగా ఆర్ఏఎఫ్ దళాలను మనం ఖర్ఫ్యూలప్పుడు, పరిస్థితి మరీ అదుపు తప్పినప్పుడు చూస్తుంటాం. వారు ఎలా అదుపుతప్పిన పరిస్థితులను గాడిలోకి తీసుకురాగలుగుతున్నారో తెలుసా? అది ఒక చిన్న రహస్యం. ఆర్ఏఎఫ్  దళాలను ఎక్కడైతే మోహరించాలని ప్రభుత్వం నిర్ణయిస్తుందో, అక్కడకు ఆర్ఏఎఫ్ చేరుకుని, అన్నింటికంటే ముందు తమతో పాటు తెచ్చుకున్న ఆయుధాలతో కవాతు చేస్తారు. ఆ కవాతు చూడడానికి ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఒక్క ఈలతో అందరు జవాన్లు అలర్ట్ అయిపోతారు. మరొక ఈలతో ఠక్, ఠక్, ఠక్ మనే శబ్దంతో వారితో తెచ్చుకున్న గన్నులను చేతితో కొట్టి కవాతును చేస్తారు. ఒకేసారి 40 మంది జవాన్లు ఠక్, ఠక్, ఠక్‌మని మూడు వేరు వేరు చోట్ల వారి గన్నులను మోగిస్తుంటే గుండెలు అదిరిపోతాయి. వారు చూపించే క్రమశిక్షణ, అల్లరిమూకలు చూస్తే వారి ఆగడాలను అడ్డుకట్ట పడిపోతుంది. ఎందుకంటే ఆర్ఏఎఫ్ జవాన్ల క్రమశిక్షణ అసాంఘిక శక్తుల వెన్నులో వణుకు పుట్టిస్తుంది. ఈల వేస్తే ఒకేసారి అంతమంది జవాన్లు ఎలా ప్రవర్తించేది చూసిన వారికి ఎవరికైనా భయం కలిగిస్తుంది. ఇంకో ఈలకి వారు వారి చేతుల్లో ఉన్న గన్నులకుఏ పని చెప్తారో ఏమో అని అందరూ పారిపోతారు. ఇలా ఆర్ఏఎఫ్ జవాన్ల క్రమశిక్షణ పరిస్థితిని అదుపులోకి తీసుకురాగలుగుతారు.

డిసిప్లేన్ లేనిదే ఈ లోకంలో చాలా పనులు జరగవు. అసలు చాలా విషయాలను డిసిప్లేన్ లేనిదే ఊహించలేము. ఉదాహరణకు ఒక రైలుని నడిపే డ్రైవర్‌కి డిసిప్లేన్ లేదనుకోండి. తను తన ఇష్టం వచ్చినట్లు ట్రైన్‌ను నడుపుతూ ముందు కనపడే సిగ్నల్స్‌ని ఖాతరు చేయలేదనుకోండి ఏమవుతుంది? ఉదయాన్నే తూర్పున ఉదయించే సూర్యుడు తన డిసిప్లేన్ తప్పితే ఈ లోకం అంతా అల్లకల్లోలమవుతుంది కదా. అంతదాకా ఎందుకు? మన ఇంట్లో విషయాలే తీసుకుందాం. మన ఇంట్లో పని చేసే పనిమనిషి క్రమశిక్షణ తప్పి ఒక్క గంట ఆలస్యంగా వచ్చిందనుకోండి. మనం ఉక్కిరిబిక్కిరి అయిపోము... ఇంట్లో అమ్మ వంట వండలేదనుకోండి. ఆకలితో మాడిపోము. కొంత మందికి డిసిప్లేన్ అంటే చికాకు. డిసిప్లేన్ తమ స్వాతంత్ర్యాన్ని సవాల్ చేస్తుందని చెబుతారు. ముఖ్యంగా మన విద్యార్థులు, పోటీ పరీక్షలకు తయారయ్యే అభ్యర్థులు డిసిప్లేన్ అంటే మండిపోతుంటారు.



స్కూల్‌లో ప్రిన్సిపాల్ అన్నా, స్ట్రిక్ట్‌గా ఉండే టీచర్‌లు అన్నా పిల్లలకి పడదు. ఎందుకంటే పిల్లలకు ఫ్రీగా ఉండటం ఇష్టం. టీచర్లేమో డిసిప్లేన్‌లో ఉండమంటారు.

మీరే ఆలోచించండి. డిసిప్లేన్‌గా ఉన్న వారు ఎంతో పైకి ఎదిగారు. జీవితంలో ఎన్నో సాధించారు. క్రమశిక్షణతో చదువుకున్న వారు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. క్రమశిక్షణగా మెలగని వారు చిన్న చిన్న బ్రతుకులను వెలగబెడుతున్నారు. క్రమశిక్షణ లేకుండా పెరిగిన వారు తమ జీవితంలో ఏమీ సాధించలేక జీవితం మొత్తం బాధపడుతూ ఉంటారు. డిసిప్లేన్‌గా ఉండవలసి రావడం కూడా బాధించే విషయమే. అయితే ఆ బాధ తాత్కాలికం. దానిని నేను బాధ అని కూడా అనను. అది ఒక చిన్నపాటి త్యాగం లాంటిది. పొద్దుపోయేంత వరకు అందరూ మొద్దునిద్ర పోతుంటే క్రమశిక్షణతో మెలిగే వారు కొంత పెందలకాడనే నిద్రలేచి తమ పనులలో నిమగ్నమైపోవాలి. హాయిగా పడుకోలేకపోవడం ఒక త్యాగమే కదా. కానీ, కొన్ని సంవత్సరాలకు ఏమవుతుందో ఊహించండి. క్రమశిక్షణగా ఉన్న వాళ్లు జీవితంలో బాగా సెటిల్ అవుతారు. క్రమశిక్షణ లేనివారు ఇంకా నిద్రపోతూనే ఉంటారు. జీవితం అనే పోటీలో తమని తామే వెనక్కు నెట్టేసుకుంటున్నారు. క్రమశిక్షణతో మెలగడం, జీవితం అనే పోటీలో ఓడిపోవడమూ రెండూ బాధించే విషయాలే. అయితే రెండింటిలో దేనిని మనం ఎన్నుకోవాలనేది మీ సొంత వివేకానికి వదిలేస్తున్నాను. ఒక్క విషక్ష్మం మాత్రం చెప్పదలచుకున్నాను. డిసిప్లేన్‌తో మెలిగిన ఏ వ్యక్తి కూడా ఇప్పటి వరకూ నష్టపోలేదు. పది మందిలో పేరు సంపాదించిన ఏ వ్యక్తిని అ యినా తీసుకోండి. ప్రపంచ ప్రఖ్యాతిని పొందిన ఏ సంస్థనైనా గమనించండి. సక్సెస్

సాధించిన ఎవరినైనా చూడండి. ఖచ్చితంగా వారు క్రమశిక్షణ గలవారై ఉంటారు.

మన చుట్టూ ఉన్న ఎంతో మందిని మనం గమనిస్తూ ఉంటాం. కొంత మందికి అపారమైన మేధస్సు, ఎనలేని టాలెంట్, ఎక్కడా లేనటువంటి ఎబిలిటీ ఉంటాయి. అయినా వీరు సక్సెస్ కాలేకపోవడం మనం చూస్తుంటాం. అందుకు కారణం వారికి క్రమశిక్షణ లేకపోవడం. నేను కూడా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారిని చాలా మందిని గమనించాను. వారి ప్రజ్ఞాపాటవాలు అసమానం అవవచ్చు. వారి మేధోసంపత్తి అనితర సాధ్యం కావచ్చు. ఒక పుస్తకాన్ని పూర్తిగా చదివేగల నేర్పు కలిగి ఉండవచ్చు. గంటలు గంటలు కదలకుండా పుస్తకం ముందు కూర్చోగలిగే ఓర్పు ఉండవచ్చు. కానీ క్రమశిక్షణ లేకపోతే వారు విజేతలు కాలేరు. ఒక్కసారి పుస్తకాన్ని పట్టుకుంటే కదలకుండా 10-12 గంటలు చదివేసి, రెండు మూడు రోజుల వరకూ ఇక పుస్తకాల జోలికి వెళ్లని వారు కాదు విజేతలయ్యేది. చదివేదేదో కొద్ది కొద్దిగా చదివినా, క్రమశిక్షణతో ప్రతీరోజూ 5-6 గంటలు చదివే వాళ్లే విజేతలవుతారు.

క్రమశిక్షణగా మెలగడం విద్యార్థికి ఒక ఆభరణం లాంటిది. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు చాలా మంది పరీక్ష మొదలయ్యే నెలముందో, రెండు నెలల ముందో పుస్తకాలు ముందేసుకుని కుస్తీ పడుతుంటారు. పరీక్ష ముందు వారు బాగానే చదువుతారు. కానీ, తీరా ఫలితాలు వచ్చే సరికి వారి నెంబర్ కనపడకపోయే సరికి తమకి లక్కు లేదని దేవుళ్లని, గ్రహాలని తిట్టుకుంటారు. నిజానికి ఫలితాలలో ఎవరి నెంబర్‌లు ఉంటాయంటే క్రమశిక్షణగా మొదటి నుంచి అంటే నోటిఫికేషన్ వెలువడినప్పటి నుండి పరీక్షకు ప్రిపేరయ్యే వారివి. మీరే చెప్పండి. పరీక్ష ఫలితాలలో ఎవరి నెంబర్ ఉండాలి? పరీక్ష నెలనాళ్లు ఉందనగా రోజుకి 20 గంటలు చదివిన అభ్యర్థి నెంబర్ ఉండాలా? ఆరు ఏడు గంటలు నుండి క్రమం తప్పకుండా రోజుకి 5-6 గంటలు చదివిన వారి నెంబర్ ఉండాలా?

మనలో ఎంతో మేధోసంపత్తి ఉండవచ్చు. మనం ఎంతో తెలివైన వారం కావచ్చు. కానీ, ఆ శక్తి అంతా ఒక మంచి పద్ధతిలో వాడుకుంటేనే కదా. ఆ తెలివికి, మేధస్సుకి సార్థకత... ఆ మంచి పద్ధతిలో వాడుకోవడాన్నే క్రమశిక్షణ అంటున్నాను నేను. జలపాతాలను చూడండి. వాటి యొక్క శక్తి అపారం. లక్షల కిలోల బరువున్న టర్‌బైన్‌లను కదిలించి, విద్యుత్‌ని ఉత్పత్తి చేయవచ్చు. అలా ఎప్పుడు జరుగుతుంది? జలపాతాలను ఒక పద్ధతిలో టర్‌బైన్ బ్లేడుల మీద పడేలా చేస్తేనే అది సంభవిస్తుంది. ఒకటే పద్ధతి. రెండో విధానం లేనేలేదు. ఇదే క్రమశిక్షణ అంటే. ఆవిరిని గురించి, దాని శక్తిని గురించి మీకు తెలిసే ఉంటుంది. వందల టన్నుల బరువున్న రైలుని సహితం ఆవిరి పరిగెట్టించగలదు. దానికి కావలసినది ఆవిరిని పట్టి ఒక పద్ధతిలో ఇంజనులో ప్రవేశపెట్ట గలగడం. నేను చెప్పదలుచుకున్నదేమిటంటే ఎంతో అపారమైన శక్తిని క్రమశిక్షణ ద్వారా మానవాళి ప్రగతికి ఉపయోగించవచ్చుని. మనం కూడా క్రమశిక్షణతో మెలిగితే సమాజానికి ఎంతో మేలు చేయవచ్చు.

ఈ భూమి మీద సంచరించే జంతువులలో అత్యంత శక్తిమంతమైన జంతువు ఏనుగు. దానిని ఎలా కట్టివేస్తారో తెలుసా మీకు? నాలుగు కాళ్లకు నాలుగు పెద్ద పెద్ద ఇనుప



గొలుసులు కట్టి, వాటిని నాలుగు వైపులా ఉన్న పెద్ద పెద్ద చెట్లకో, ఇనుప స్తంభాలకో కట్టేస్తారేమో అని అనుకుంటున్నారు కదూ. అలా కాదు. మన పల్లెలో పశువులను కట్టేసేందుకు కొయ్య చీల లేదా గూటము ఉంటుంది. దానినే ఇంగ్లిష్‌లో పెగ్ అంటారు. దానికి కట్టేస్తారు. అది కూడా ఒక కాలికి చిన్న చెయిన్ చుట్టి, రెండో కొనని ఓ చెక్కతో చేసిన పెగ్‌కి తగిలిస్తారు. ఆశ్చర్యంగా ఉంది కదూ...! ఏనుగు తలచుకుంటే దానిని నాలుగు వైపులా నాలుగు స్తంభాలకి కట్టేసినా తెంచుకొని బయటకు రాగలదు. కానీ, అది అలా చేయదు. ఎందుకంటే అది క్రమశిక్షణ నేర్చుకుంది. కాబట్టి అవును. నేను చెప్పేది నిజమే.

ఏనుగు చిన్నప్పటి నుండి దానికి క్రమశిక్షణ నేర్పారు మావటివాళ్లు. ఏనుగు చిన్నగా ఉన్నప్పుడు, అంటే అది రెండు నెలలప్పుడు దానిని మొదటిసారి మావటివాడు కట్టేసి ఉంటాడు. ఎలాగంటే ఒక ఇనుప గొలుసు తగిలించి, దానిని చెట్టుకో, లేకపోతే ఒక స్తంభానికో కట్టేస్తారు. చిన్న ఏనుగు స్వాతంత్ర్యం కావాలని పోరు పెట్టి గొలుసుని విడిపించుకోవాలని చూస్తే, ఆ గొలుసు మరింత బిగుసుకొని, ఏనుగు కాలికి నొప్పి పుట్టిస్తుంది. చిన్న ఏనుగు మరింత మొండిగా తన కాలిని విడిపించుకోవాలని చూస్తే గాయం అయి, ఒక్కోసారి రక్తం కూడా వస్తుంది. అది భరించలేని నొప్పిని కలిగిస్తుంది. చిన్న ఏనుగు తన నొప్పి తగ్గించుకోవడం కోసం తన స్వాతంత్ర్యాన్ని మానుకుంటుంది. మావటివాడు చిన్న ఏనుగుని అలా ఇనుప గొలుసులతో రెండు మూడు నెలలు దాకా కట్టేసి ఉంచుతాడు. ఆ తరువాత చిన్న పరికొసతో కట్టేసినా ఏనుగు ఎక్కడికి కదలదు.

ఎందుకంటే ఎప్పుడైనా కాలిని విడిపించుకుందామని ఏనుగు తలస్తే ముందు గుర్తుకు వచ్చేది తను గతంలో అనుభవించిన నొప్పి. తప్పించుకు పారిపోవాలని చూసినప్పుడల్లా ఏనుగుకి (ముందు) ఆ నొప్పి జ్ఞాపకం రావడం వల్ల ఒక చిన్న పెగ్గు లేదా కొయ్య చీలతో కట్టేసినా ఏనుగులు ఎక్కడికీ కదలవు.

క్రమశిక్షణ వల్ల ఒక్కోసారి కటువుగా ఉండాల్సి వస్తుంది. అయినా ఒక మంచి ఉద్దేశం కోసం, ఒక కఠినమైన లక్ష్యాన్ని ఛేదించడం కోసం ఇలా ఉండక తప్పదు. ఉదాహరణకు మీ చంటి పిల్లాడికి విషజ్వరం వచ్చిందనుకోండి. ఆరు గంటలకు ఒకసారి టాబ్లెట్ వేయాలని డాక్టరు చెప్పారనుకుందాం. పిల్లాడికి టాబ్లెట్‌లు మింగడమంటే చికాకు అని, మనం టాబ్లెట్ వేయడం మానేస్తామా? చిన్న పిల్లలకు సరదాలే అన్నీ చోట్ల పిల్లలను ఫ్రీగా వదిలేస్తామా? పిల్లలకు వారి ఆటలకు అడ్డు చెప్పకూడదు అనుకుంటూ కరెంటు దగ్గరకు వాళ్లు వెళుతుంటే మనం ఏమి చేస్తాం? పిల్లలకు క్రమశిక్షణ నేర్పుతాం. గుర్తుంచుకోండి. క్రమశిక్షణ వల్ల మస్తీ – మజా తగ్గదు. ఇంకా చెప్పాలంటే పెరుగుతుంది.

సిక్కు మతంలో ఐదవ గురువైన గురు అర్జున్‌దేశ్ గురించి మీకు తెలియజేస్తాను. అతను క్రమశిక్షణకి పెట్టింది పేరు. ఏదైనా పనిని క్రమశిక్షణతో చేసేవాడు. తన క్రమశిక్షణకు మెచ్చి మొఘల్ సామ్రాజ్యాధినేత అయిన అక్బర్ చక్రవర్తి ఎన్నో వరాలు, వరహాలు ఇచ్చాడు. సిక్కులకు పవిత్ర స్థలమైన బంగారు దేవాలయం (స్వర్ణ దేవాలయం) అమృత్‌సర్‌లో ఉంది. దాని అసలు పేరు హర్‌మిందర్ సాహిబ్. హర్‌మిందర్ సాహెబ్ కట్టడం గురించి ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. అదేమిటంటే గురు అర్జున్‌దేవ్ తన హయాంలో ఒక కొత్త పద్ధతి ప్రారంభించాడు. దాని పేరు గురు–కా–లంగర్. ఆంధ్ర దేశంలో పల్నాటి బ్రహ్మనాయుడు మొదలు పెట్టిన సహపంక్తి భోజనాలతో ఈ గురు–కా–లంగర్‌ని పోల్చవచ్చు. ఇందులో ఒక లైనులో పేద – ధనిక, చిన్న – పెద్ద అనే బేధం లేకుండా కులమతాలకు అతీతంగా భోజనాలు వడ్డించబడేవి. ఈ కార్యక్రమం అంతా చాలా క్రమశిక్షణగా జరిగేది. కొన్ని వేల మంది భోజనం చేసినా, ఎక్కడా చెత్తా – చెదారం ఉండేది కాదు. ఎంగిలి విస్తరాకులు వాడిన గంగాళాలు, మంచినీరు అన్నీ ఒక క్రమపద్ధతిలో ఉండేవి. రోత పుట్టించేవి కావు. ఈ పద్ధతి చూసి అక్బర్ చక్రవర్తి మెచ్చి, హర్‌మిందర్ సాహిబ్‌కి కావలసిన బంగారం, ఇంకా ఇతర సామాను గురు అర్జునదేవ్‌కి ఈనాంగా ఇచ్చాడు. ఒక దేవాలయం మొత్తం స్వర్ణమయం అవాలంటే అది ఎంత ఖర్చుతో కూడుకున్న పనో ఆలోచించండి. ఆ పనిని క్రమశిక్షణ వల్లనే సాధ్యమైంది. గురు అర్జున దేవ్ తన గురువు అయిన గురురామ్ దాస్ దగ్గర శిష్యరికం చేశాడు. తనతోపాటు గురు రామ్‌దాస్‌కి ఇంకో 20–25 మంది శిష్యులు ఉన్నారు. గురువుగారి దగ్గర చేరినప్పుడు అర్జున దేవ్‌కి లభించిన పని అంట్లు తోమడం. గురుకులంలో భోజనం చేసిన అందరి పళ్లాలు, వాడేసిన పాత్రలు అన్నీ శుభ్రంగా తోమేవాడు. తెల్లవారుజామునే అందరికంటే ముందే లేచి, అంట్లకు అవసరమయ్యే నీళ్లు తెచ్చేవాడు. తనకి అప్పగించిన పనిని చాలా కార్యదీక్షతో నెరవేర్చేవాడు. మిగతా శిష్యులు అలా ఉండేవారు కాదు. తాము చేసిన గోరంత పని కొండంతలు అయ్యేలా గురువుగారి దగ్గర చూపించుకునేవారు. అర్జున్ దేవ్ స్నేహితులు తమ మిత్రుడికి అంట్ల పని భారమైపోతుందని గ్రహించి, గురువు దగ్గరకు



వెళ్లి, పని మార్చమని అడగమని సలహా ఇచ్చారు. అర్జునదేవ్ వారి మాటలు వినలేదు. కనీసం "నీవు చేసే పనిని గుర్తించేలా గురువు ముందు అంట్లు తోము" అన్న సలహాని కూడా పెడచెవిన పెట్టాడు. తనకి అప్పగించిన పనిని క్రమశిక్షణతో నెరవేర్చడమే గురువుని ప్రసన్నం చేసుకోవడమని బదులు చెప్పాడు అర్జునదేవ్. చాలా కాలం గడిచింది. గురు రామ్‌దాస్ ముసలివాడయ్యాడు. రేపో మాపో చనిపోతాడు అని నిర్ధారణకు వచ్చేశారు అంతా. శిష్యులంతా గురువుగారి పాదాలను వత్తుతూ, ఐదవ సిక్కు గురువుగా తమని చేయమంటే తమని చేయమని ప్రాధేయపడుతున్నారు. అర్జునదేవ్ మాత్రం తన పని తాను చేసుకుపోతున్నాడు. అప్పుడు గురుదామ్‌దాస్ తన వారసుడు అర్జునదేవ్ అని ప్రకటించి పరమపదించాడు. ఇందుకు కారణం కూడా మిగతా శిష్యులకు చెప్పి రామ్‌దాస్ కన్నుమూశాడు. అర్జున్‌దేవ్‌లో తనకి క్రమశిక్షణ నచ్చిందంట.

జాన్ మిల్టన్ అనే కాల్పనిక కవిని ప్రాశ్చాత్య దేశాలలో కొన్ని లక్షల మంది అభిమానించారు. అతను పారడైస్ లాస్ట్ అనే గ్రంథ సృష్టికరత . ఆ గ్రంథ రచనా కాలంలో మిల్టన్ రోజూ తెల్లవారు జామునే నాలుగు గంటలకల్లా లేచి గ్రంథ రచన మొదలు పెట్టేవారంట. నేడు మనం వాడుతున్న డిక్షనరీ మొదట వెబ్‌స్టర్ అనే అతను తయారు చేశాడు. తనకు డిక్షనరీ తయారు చేయడానికి పట్టిన సమయం ఎంతో ఊహించగలరా? అక్షరాలా 36 సంవత్సరాలు. ఒక వ్యక్తి సక్సెస్ సాధించిన తరువాత, ఆ వ్యక్తి సక్సెస్‌ని మాత్రమే చూస్తాం కానీ, అందుకు పట్టిన సమయాన్ని మనం పట్టించుకోం. ఏదిఏమైనా మిల్టన్‌ని గానీ, వెబ్‌స్టర్‌ని గానీ మనం ఈ రోజు ఎందుకు తలచుకుంటున్నాం?

వారిని ఎందుకు పొగుడుతున్నాం? వారు క్రమశిక్షణతో మెలగారు కాబట్టి. వారు చూపిన బాట కొన్ని కోట్ల మందికి ఆదర్శమైంది.

"ఒకరి జీవితంలోకి సక్సెస్ రావడమనేది చాలా గొప్ప విషయం. అది ఏదో లక్కు (అదృష్టం) ఉండబట్టి మాత్రం రాదు. సక్సెస్ అనేది ఒక ఆక్సిడెంట్ (ఒక అనుకోని సంఘటన) కాదు. అది ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. ఆ వ్యక్తి క్రమశిక్షణ కలవాడైతే, తన వ్యక్తితం సక్సెస్‌ని ఆకర్షిస్తుంది" అని ఒక ప్రఖ్యాత తత్త్వవేత్త క్రమశిక్షణకు అగ్రతాంబూలం ఇచ్చాడు.

క్రమశిక్షణ కలిగి ఉంటే ఏ పరీక్షలోనైనా లక్షణంగా నెగ్గవచ్చు. క్రమశిక్షణ ఉంటే అన్నీ పనులు సవ్యంగా జరుగుతాయి. చదువు కూడా బాగా చదువుకోగలుగుతాం. బాగా చదువుకుంటే మనం పరీక్ష బాగా రాయగలం. బాగా పరీక్ష రాస్తే మంచి ఫలితాలు వస్తాయి. మనం అనుకున్నది సాధించగలుగుతాము.

క్రమశిక్షణ ఒక కఠోర తపస్సు. మన పక్కవాళ్లు పక్కలో నక్కి మంచం మీద ముసుగుతన్ని నిద్రపోతుంటే మనం మాత్రం ఒళ్లు వంచి పనిచేయాల్సివస్తుంది. ఎందుకు నేనింత కష్టపడాలి అని మనకి అనిపించవచ్చు. అయినా సరే క్రమశిక్షణను వీడకుండా కష్టపడితే జీవితాంతం సుఖాలను అనుభవించేందుకు మనం అర్హులవుతాము. క్రమశిక్షణ ఒక కఠోర తపస్సు అని ఎందుకన్నానంటే క్రమశిక్షణా రాహిత్యంగా ఉండటం చాలా సులభం. అది మనని ఎప్పుడూ ఆకర్షించాలని చూస్తుంది. క్రమశిక్షణతో ఉండగలగడం చాలా కష్టం. ఇప్పుడు నిర్ణయం మీ చేతిలో ఉంది. ముందు కఠోర తపస్సు చేసి తరువాత సుఖాలను అనుభవిస్తారో, లేదా ముసుగు తన్ని మంచం మీద నిద్రపోతారో మీ ఇష్టం. కానీ, ఈ పోటీ ప్రపంచంలో కష్టపడి పనిచేసే వాళ్లకే స్థానం ఉంది. ఎముకలు క్రుళ్లిన, వయస్సు మళ్లిన సోమరులకు చోటు లేదు. క్రమశిక్షణతో మెలిగి నెత్తురు మండే శక్తులు నిండే సైనికులను ఈ లోకం శభాష్ అంటుంది. వారి క్రమశిక్షణకు సలాం చేస్తుంది. ఆలోచించండి.

# 26

# గెలుపుకి గొప్ప సూత్రం 'ఇంకొంచెం ఎక్కువ'

**హైలెట్స్**

- మన సామర్థ్యం కన్నా మనం ఎక్కువ శ్రమించాలని సంకల్పించి, ఆ దిశగా కష్టపడితే, మనం అనుకున్న లక్ష్యాలను అవలీలగా ఛేదించగలుగుతాం.
- ఒక మనిషి హీరో అయ్యేది తను ప్రపంచంలో అందరికంటే ధీరుడు, శూరుడు అవడం వల్ల కాదు. తన ధీరతం పది నిమిషాలు ఎక్కువ సేపు ప్రదర్శించడం వల్ల.
- మనం అదనంగా కష్టపడితే కష్టకాలంలో అదే మనికి అక్కరకి వస్తుంది.
- "ఇంకొంచెం ఎక్కువ" శ్రమిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి.

చదువు కానివ్వండి. పరీక్షలు రాయడం కానివ్వండి. వ్యాపారం కానివ్వండి, ఉద్యోగం కానివ్వండి. మన సహచరులు చేసే పనికన్నా మనం ఎక్కువ పని చేస్తే మనకి ఒక ప్రత్యేక గుర్తింపు రావడం తథ్యం. మనం ఏమి చేయాలని నేను చెబుతున్నానంటే – మనం చేయవలసినంత కృషి చేసేసి, ఇంకొంచెం ఎక్కువ కృషి చేయాలంటున్నాను. దీనివల్ల కాంపిటీషన్ తగ్గుతుంది. ఎందుకంటే పోటీలో ఉన్న మిగతా వారంతా ఉన్న సమయంలో తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి పరిగెడుతుంటే మనం ఉన్న సమయంలో మన టార్గెట్‌ని ఒక కిలోమీటర్ ఎక్కువగా అదనంగా నిర్ణయించుకుని పరిగెడుతున్నాం. ఇందువల్ల మనం

మన వేగాన్ని పెంచుకుంటాం.

ఇందులో ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమిటంటే మనం అదనంగా పరిగెత్తాలనుకునే ఆ కిలోమీటర్‌లో పోటీ లేదు. ఆ కిలోమీటర్‌లో మనమే రారాజులం.

మీరు బరువు తగ్గాలని వ్యాయమం చేస్తున్నారనుకోండి. కొంత సేపు వ్యాయామం చేసిన తరువాత మీరు అలసిపోతారు. అలసిపోయాయమంటూ మనం అప్పుడు చేస్తున్న ఎక్సర్‌సైజ్ ఆపేస్తాం. అలా కాకుండా అలసిపోయిన తరువాత కూడా ఇంకొంత ఎక్కువ సేపు మీరు చేస్తున్న వ్యాయామాన్ని కొనసాగిస్తే, అప్పుడు మీరు నిజంగా బరువు తగ్గుతారు. ఇది శాస్త్రీయపరంగా నిర్ధారించబడ్డ విషయం. ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసుకుందాం. మీరు ఒక పాత్రలో నీటిని వేడి చేయాలంటే ముందు పాత్ర వేడెక్కాలి. ఆ పాత్ర వేడెక్కిన తరువాతే అందులోని నీటికి సెగ తగులుతుంది. మనం అలసిపోయేంత వరకూ మన కొవ్వు కరగడానికి సిద్ధమవుతుంది. అటు తరువాత మనం వ్యాయామం చేసే నిమిషం కొన్ని మిల్లీగ్రాముల కొవ్వుని కరిగిస్తుంది. అలసిపోయిన తరువాత మనం చేసే అదనపు వ్యాయామం మాత్రమే మన కొవ్వుని కరిగిస్తుందని తెలుసుకోండి.

బాక్సింగ్ చేసే వారిని, వెయిట్ లిఫ్టింగ్ చేసేవారిని గమనించండి. ముఖ్యంగా వారు వ్యాయామం చేసేటప్పుడు వారిని చూడండి. ముఖం మాత్రం కనపడేటట్లు చూసుకుని మిగతా శరీరాన్నంతా కప్పేసుకుని వ్యాయామం చేస్తారు. కొంత మంది అయితే రెండు మూడు చొక్కాలు, రెండుమూడు ప్యాంట్స్ లేదా రెండు మూడు ట్రాక్ సూట్‌లు వేసుకుని వ్యాయామం చేస్తారు. కొందరైతే ఉన్ని బట్టలు వేసుకుని వ్యాయామం చేస్తారు. ఎందుకిలా చేస్తారంటే ఎక్కువ బట్టలు వేసుకుంటే ఎక్కువ చెమట పడుతుంది. ఆ చెమట వంటిలో నుండి వచ్చేటప్పుడు చర్మానికి అంటుకున్న కొవ్వుని కరిగించి వేస్తూ వస్తుంది. ఇందువల్ల క్రీడాకారులు బరువు పెరగరు. బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ చేసే వారు కొన్ని గ్రాములైనా తమ బరువును పెంచుకుంటే తాము వేరే కేటగిరిలోకి వెళ్లిపోతారు. కేటగిరీలు ఆటగాళ్ల బరువుని బట్టి నిర్ణయిస్తారు. వీరు కనుక తమకన్నా ఎక్కువ బరువు కలిగిన ఆటగాళ్లు ఉండే కేటగిరీలోకి వెళ్లారా. వీరు రికార్డులు బద్దలు కొట్టడానికి ఎక్కువ బరువులు ఎత్తాల్సి వస్తుంది. బలశాలులతో పోటీ పడాల్సి వస్తుంది. ఈ క్రీడాకారులు తమని, తమ సామర్థ్యాన్ని ఎలా అంచనా వేసుకుంటారో తెలుసా? నిన్న పట్టిన చెమటకన్నా ఈ రోజు ఇంకొంచెం ఎక్కువ మోతాదులో చెమట పట్టాలి. అంత ఎక్కువ సేపు పరిశ్రమించాలి. నిన్నటి కంటే నేడు, నేటికన్నా రేపు 'ఇంకొంచెం ఎక్కువ' కష్టపడతారన్నమాట వీళ్లు. ఇలా చేయకపోతే వారికి ఉనికి ఉండదు. వారిని ఎవరూ గుర్తించరు.

కుంగ్‌ఫూ అనే క్రీడలో ఒక కీలకమైన అంశం ఉంది. అదేమిటంటే ఒక వ్యక్తి తను దూకగల ఎత్తుకంటే మరింత ఎత్తుకు దూకేలా ఆ వ్యక్తిని ప్రేరేపించడం. కుంగ్‌ఫూ బాగా తెలిసిన వాళ్లు అలా దూకేస్తారు కూడా. విదేశీ సినిమాలలో జాకీచాన్ లాంటి వారిని చూసే ఉంటారు. వీరు ఎగిరే ఎత్తుని ఈసారి గమనించండి. మన సామర్థ్యం కన్నా మనం ఎక్కువ శ్రమించాలని సంకల్పించి, ఆ దిశగా కష్టపడితే మనం అనుకున్న లక్ష్యాలను అవలీలగా ఛేదించగలుగుతారు.

మనం రోజుకి ఒక 5-6 గంటలు కష్టపడలగమనుకోండి. నేటి నుండి ఇంకో గంట



ఎక్కువ కష్టపడాలి అని నిశ్చయించుకోండి. అవసరమైతే ఒక గంట తక్కువ సేపు విశ్రమించండి. విందులు- వినోదాలు, సరదాలు-సంతోషాలు అన్నీ మనం లక్ష్యం చేరుకున్నా తరువాత చేసుకుందాం. వాటిని ఇప్పుడు వాయిదా వేద్దాం. ఆ వేడుకలకు మనం వెచ్చించే సమయం మనం మన లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉపయోగిద్దాం. తెల్లవారు జామున 6 గంటలకు నిద్ర లేచే మనం ఇక నుండి 4 గంటలకు మేల్కొందాం. దివంగత నేత ఎన్.టి.రామారావు, మన ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్, ఆది గోద్రేజ్, గోర్డన్ బ్రౌన్ లాంటి వారి పేర్లు మనం ఇప్పటికీ తలుచుకుంటున్నామంటే వారికి ఒక ప్రత్యేక ఉంది. వీరు తమ వృత్తిలోనూ, ప్రవృత్తిలోనూ నిష్ణాతులు. వీరికి వీరే సాటి. వీరందరికీ అంత సమయం ఎలా ఉంటుందో కదా! అందరికీ ఉండేది రోజుకి 24 గంటలే. మరి వీరు ఎలా తమ తమ రంగాలలో రాణించాలంటే వీరు తెల్లవారు జామునే లేస్తారు. తెల్లవారు జామున లేవడం వల్ల వీరు విజేతలుగా లేనిది మనం కాలేమా?

కాంపిటీషన్ అన్న తరువాత, మిగతా పోటీదారుల కంటే ఒక్క సెకను ఎక్కువ కష్టపడినా సరిపోతుంది. అలాంటివి మనం పెందలకాడనే నిద్రలేచి మిగతా వారికన్నా 2-3 గంటలు ఎక్కువ శ్రమిస్తే మనం ఎంతో ముందుకు వెళ్లిపోతాము కదా. రాల్ఫ్ ఎమర్‌సన్ అన్న వ్యాఖ్యలు మీకు గుర్తు చేస్తాను. 'ఒక మనిషి హీరో అయ్యేది. తను ప్రపంచంలో అందరికంటే ధీరుడు, శూరుడు అవడం వల్ల కాదు. తనకి కూడా ఒకింత భయం ఉంటుంది. కానీ, తన ధీరత్వం, శూరత్వం పది నిమిషాలు ఎక్కువ సేపు ప్రదర్శించడం వల్ల తను హీరోగా కొనియాడబడతాడు. మన జీవితంలో కూడా ఇంతే. ఏ పనినైనా తీసుకోండి. ఏ పోటీ అయినా తీసుకోండి. ఐఏఎస్ పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన వ్యక్తికి 100కి 100 మార్కులు రావు. మిగతా అందరికంటే కొంచెం ఎక్కువ మార్కులు వస్తాయి. ఒక నిజం చెప్పనా? 55 శాతం మార్కులు సాధించగలిగితే సివిల్ సర్వీస్ పరీక్షల్లో మొదటి పది స్థానాల్లో ఉండవచ్చు. ఊహించండి. దేశంలోకెల్లా అత్యంత ప్రతిష్టాత్మకమైన పరీక్షలో మొదటి ర్యాంకు రావాలంటే కనీసం ఫస్ట్‌క్లాస్ మార్కులు కూడా అవసరం లేదు. అయితే మిగతా పరీక్ష రాసే అభ్యర్థులకన్నా ఒక రవ్వంత ఎక్కువ మార్కులు వచ్చేస్తే చాలు.

ఈ సందర్భంలోనే ఒక చిన్న కథ చెబుతాను. రాముడు, భీముడు ఇద్దరు స్నేహితులు కట్టెలు తెచ్చేందుకు అడవికి వెళ్లారంట. ఆ ప్రాంతంలో పులి సంచరిస్తుందని వారికి ఎవరో చెప్పారు. అయినా ఖాతరు చేయకుండా కారడవిలోకి ప్రవేశించారు. పులి వస్తే

పొడిచేస్తాను, దాని తోక పట్టుకుని గిరగిరా తిప్పుతాను అని కొంత బలిష్టంగా ఉండే భీముడు గీరాలు పలుకుతుంటే రాముడు ఇవేవీ పట్టించుకోకుండా నడుస్తున్నాడు. మనసులో ఒకింత భయంగానే ఉంది. ఇంతలో పులి రానే వచ్చింది. భీముడు కెవ్వుమని కేకపెట్టాడు. అప్పటి వరకూ పొడిచేస్తాను, నరికేస్తానని అన్నవాడు భయంతో గజగజ వణికిపోతున్నాడు. కాళ్లు చేతులు ఆడటం లేదు. ఏమి చేద్దామని రాముడిని అడిగాడు. రాముడు పారిపోదామని సలహా ఇచ్చాడు. 'నీ ముఖం పులి మనకన్నా వేగంగా పరిగెట్ట గలదు... నేను నేర్చుకున్న మంత్రాలు సమయానికి గుర్తుకు రావడం లేదు. లేకపోతే ఈ పులి నా ముందు పిల్లి అయిపోయేది' అని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాడు. ఇంతలో రాముడు పరుగు లంఘించుకున్నాడు. అప్పుడు భీముడు 'పులికన్నా వేగంగా పరిగెత్తగలవా?' అని ఆశ్చర్యంగా అడిగాడు. దానికి రాముడు 'పులికన్నా వేగంగా పరిగెత్తలేకపోవచ్చు. కానీ నీ కన్నా వేగంగా పరిగెత్తగలను' అంటూ పరుగు తీశాడు. తన ప్రాణాలను దక్కించుకున్నాడు.

కాంపిటీషన్‌లో మనం మిగతా అందరికంటే ఎక్కువ మన ప్రతిభను చూపించగలగాలి. అందరికన్నా మన ప్రతిభ ఎలా మెరుగైనది అవుతుంది. ఎలా అవుతుందంటే మిగతా అందరికన్నా మనం ఎక్కువ శ్రమిస్తే అవుతుంది. మనం మన అదనపు కిలోమీటర్ పరిగెడితే అవుతుంది. అందరూ శ్రమించే లాగా మనం కూడా శ్రమించిన తరువాత, ఇంకొంచెం ఎక్కువ శ్రమిస్తే సక్సెస్ మన వశమవుతుంది.

ఒలంపిక్స్‌లో మల్లయుద్ధంలో బంగారు పతకం సాధించిన డాన్ గాబుల్ ఇలా అంటాడు. 'నేను బాగా శ్రమిస్తాను. నాకు అలుపు వచ్చి ప్రాక్టీస్ ఆపాలనిపించినప్పుడు నా ప్రత్యర్థి ఏమి చేస్తున్నాడో ఊహించుకుంటాను. తను కష్టపడుతున్నాడనిపిస్తే నేను ఇంకా ఎక్కువ కష్టపడాలని తీర్మానించుకుని ప్రాక్టీస్ చేస్తాను. నా ప్రత్యర్థి తన ప్రాక్టీస్‌ని మాని వేరే పనులు చేస్తున్నాడేమోననిపిస్తే, అప్పుడు ఇంకా బాగా కష్టపడగలిగే సమయం ఇది అని, కఠోరంగా ప్రాక్టీస్ చేస్తాను'.

మనం కూడా డాన్ గాబుల్ నుండి నేర్చుకుందాం. అతనిలా నిరంతరం కష్టపడేందుకు నడుం బిగిద్దాం. ఇక అందరికన్నా ఎక్కువ కష్టపడదాం. ఎప్పుడైనా మనం చేస్తున్న పని మనకి బోరు అనిపిస్తే అప్పుడు మరింత కష్టపడదాం. ఇంకా పది ఎక్కువ నిమిషాలు కష్టపడిన తరువాత విశ్రాంతి తీసుకుందాం అని మనకి మనం చెప్పుకుందాం. ఏమో ఆ అదనంగా చదివే పది నిమిషాల్లో మనకి పరీక్షలో వచ్చే ప్రశ్న తగలవచ్చేమో కదా. అది సరిగ్గా చదివితే మిగతా వారందరికన్నా మనం బాగా రాయగలం కదా.

చీమలు ఆహారాన్ని మోసుకెళ్తుండటం మనం అందరం చూస్తూనే ఉంటాం. తాను తీసుకెళ్లే ఆహారం తనకి సరిపోతుందని ప్రతీ చీమకి తెలుసు. నా వరకూ ఈ ఆహారం సరిపోతుంది కదా. మరి చీమల పుట్టల్లో ఎందుకు ఆహారాన్ని దాయాలి? అందరి కోసం ఎందుకు శ్రమించాలి? మళ్లీ మళ్లీ మోయలేనంత బరువు పెట్టుకుని వెట్టిచాకిరీ ఎందుకు చేయాలి? తన అవసరానికి మించి ఎందుకు కష్టపడాలి? అని అన్నీ చీమలు కనుక ఆలోచిస్తే, ఈ పాటికి చీమల జాతి అంతరించిపోయి ఉండేది. ఎందుకంటే చీమలన్నీ కలిసికట్టుగా ఇంకా కొంచెం ఎక్కువ కష్టపడ్డాయి. కాబట్టే వాటికి చలికాలంలో ఆహారానికి కొదవలేకుండా పోయింది. చలికాలంలో చీమలు తమ గూడు (పుట్ట) విడిచి రాలేవు



కాబట్టి, ఆ సమయంలో అంతకుముందు కూడబెట్టిన ఆహారం తమ కడుపులని నింపుతుంది. అదనపు శ్రమ ఎప్పుడూ వృథా కాదు. ఏదో ఒక రూపంలో ఆ శ్రమ ఫలితాలు మనకి పనికివస్తాయి. మనని విజేతలుగా నిలబెడతాయి.

యూసఫ్ పఠాన్ గురించి మీకు తెలిసే ఉంటుంది. భారత క్రికెట్ జట్టుకి ఎన్నో కీలక విసయాలని అందించిన మేటి క్రీడాకారుడతను. ముఖ్యంగా 20-20 మ్యాచ్‌లో అతను బాగా పేరు సంపాదించాడు. పఠాన్‌ది నిరుపేద కుటుంబం. తండ్రిది మసీదులో ప్రార్థనలు చేసే ఉద్యోగం. చాలీచాలని జీతంతో బతుకు వెళ్లదీసింది ఆ కుటుంబం. వాళ్లంటి పక్కన ఉన్న ఇరుకు సందుల్లో క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నాడు యూసఫ్. అప్పుడప్పుడే తన సోదరుడు ఇర్ఫాన్ పఠాన్‌కి క్రికెట్‌లో గుర్తింపు లభిస్తుంది. తను కూడా అలాంటి గుర్తింపు పొందాలనుకున్నాడు. అప్పటి నుండి ఒక అలవాటు చేసుకున్నాడు. తనతో ఆడే వాళ్లందరికన్నా ఎక్కువ కష్టపడటం అలవర్చుకున్నాడు. అది గల్లీలో ఆడుతున్నా, రంజీ మ్యాచ్‌లు ఆడుతున్నా, లేక ఇరానీ ట్రోఫీ కోసం ఆడుతున్నా సరే... మిగతా ఆటగాళ్లకంటే కొంచెం ఎక్కువ శ్రమించేవాడు. ఆ శ్రమకి గుర్తింపు లభించింది. భారత క్రికెట్ జట్టులో స్థానం దక్కింది. సోదరునితో సమానంగా గౌరవం వచ్చింది.

యూసఫ్ పఠాన్ టి-20 మ్యాచ్‌ల్లో వీరబాదుడు బాదేవాడు. అతనికి కొద్ది కాలంలోనే అభిమానులు కూడా ఎక్కువయ్యారు. తనకి ఎక్కువ మ్యాచ్‌ల్లో అవకాశాలు వచ్చాయి. మ్యాచ్‌ల్లో పాల్గొనడం ఎక్కువైంది. ప్రాక్టీస్ తగ్గింది. ఫలితంగా వన్‌డే మ్యాచ్‌ల్లో అతని ప్రతిభ ఆశించినంతగా లేదు. ఒకసారి వన్‌డే మ్యాచ్‌లకు అతనిని సెలక్టర్లు తీసుకోలేదు.

అప్పుడు తెలిసివచ్చింది తనకి. తన అలవాటుని సరిగ్గా అమలుపరచలేకపోవడం వల్ల తనకి తన క్రికెట్ జీవితానికి చుక్కెదురు అయిందని. ఇంటి ముఖం పట్టిన యూసఫ్ పఠాన్ తన అలవాటును మళ్లీ మొదలుపెట్టాడు. దేశంలో ఏ మూలనైనా క్రికెట్ ఆడే ఎవరైనా రోజుకి కొన్ని గంటలు మాత్రమే కష్టపడగలరు. యూసఫ్ మాత్రం వారిని గురించి తలచుకుని, వారు పడేంత కష్టపడి, అదనంగా ఇంకో అరగంట కష్టపడేవాడు. ఇలా ప్రతీరోజూ అదనంగా అరగంట కష్టపడ్డాడు. చిన్న చిన్న బిందువులన్నీ కలిసి మహాసముద్రం ఎలా అవుతుందో, ఒక్కో అరగంట కలిసి కొన్ని వందల గంటల ప్రాక్టీస్ అయింది. ఒక్కసారి గమనించండి. ఈ వందల గంటల ప్రాక్టీస్ అదనంగా చేయబడింది. అంతకుముందే వేల గంటల ప్రాక్టీస్ ఉండనే ఉంది కదా.

ఫలితం ఏమైందంటే యూసఫ్ పఠాన్‌కి భారత క్రికెట్ జట్టు నుండి ఆహ్వానం వచ్చింది. తన ప్రతిభ చూసి వరల్డ్ కప్‌లో బరిలోకి దిగే జట్టులో యూసఫ్ పఠాన్‌ని తీసుకున్నారు. ఆసక్తికర విషయం ఏమిటంటే (వరల్డ్ కప్ జట్టులో) అందులో తన సోదరుడు ఇర్ఫాన్ స్థానం సంపాదించలేకపోయాడు. ఇక యూసఫ్ వెనుతిరిగి చూడలేదు. తన అలవాటు మానుకోలేదు. జట్టులోని సభ్యులంతా ప్రాక్టీస్ అయిపోయిన తర్వాత తమ తమ గదులకి వెళ్లిపోతే స్టేడియంలో ఒకరు మాత్రం అవిశ్రాంతంగా ఇంకో అరగంట ఎక్కువ సేపు చెమటోడుస్తాడు. ఏదైనా మ్యాచ్ ముగిసిన తరువాత కూడా ఒకరు అరగంట ఎక్కువ సేపు బ్యాట్, బాల్‌తో కుస్తీ పడతారు. అతడే యూసఫ్.

యూసఫ్ భారత బ్యాటింగ్‌ని మరింత పటిష్టం చేశ్యాడు. ఇప్పటికీ, తను ఎదుర్కొన్న బాల్ల కంటే ఎక్కువ రన్‌లు చేశాడు. దీనినే సాంకేతిక పరిభాషలో స్ట్రైక్ రేట్ అంటారు. తన స్ట్రైక్ రేట్ 110 పైనే ఉంది. టి-20 మ్యాచ్‌లలో అయితే తన స్ట్రైక్ రేట్ 150కి పైమాటే. అంటే తను ఎదుర్కొన్న ప్రతీ రెండు బాల్స్‌కి మూడు రన్నులు చేశాడన్న మాట. ఇంకా కొంచెం ఎక్కువ సూత్రం ఇక్కడ కూడా ఎలా ఉపయోగించాడో గమనించారా?

ఇంకా కొంచెం ఎక్కువ శ్రమిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. ఫలితాలు త్వరగా కూడా వస్తాయి. మీరు ఎవరినో చూసి మోటివేట్ అవనసరం లేదు. మీ తోటి వారిని, పోటీ పరీక్షలో బరిలో ఉండే వారిని, మీ స్నేహితులని చూసి మీ లక్ష్యం నిర్ధారించుకుంటే చాలు. మిగతా వారు రోజుకి 10-11 గంటలు చదవగలుగుతుంటే మీరు మీ లక్ష్యాన్ని వారికన్నా ఇంకొక గంట ఎక్కువ చదివేటట్లు నిర్ధారించుకోండి. మీరు చదివే ఆ అదనపు గంటలో కాంపిటీషన్ లేదు. దాని వల్ల మన ఆత్మ విశ్వాసం పెరిగిపోతుంది. మనం అనుకున్నది సాధించి తీరుతాం. మనం అదనంగా కష్టపడితే కష్టకాలంలో అదే మనకి అక్కరకి వస్తుందని చీమల ద్వారా నేర్చుకున్నాం. అదనంగా కష్టపడటం ఎప్పుడైనా విసుగనిపిస్తే చీమలని గుర్తుకు తెచ్చుకుందాం. ఒక్క అరగంట అదనంగా కష్టపడటం వల్ల గల్లీలో క్రికెట్ ఆడేవారు భారతదేశానికి ప్రపంచ కప్‌ని సాధించిపెట్టారు. ఇంకా కొంచెం ఎక్కువ కష్టపడితే మన జీవితంలో మనం ఉన్నతస్థానాన్ని సాధించలేమా? సాధించగలం. సాధించగలం అని నిరూపిద్దాం. ఇంకా కొంచెం ఎక్కువ శ్రమిద్దాం.

# 27

# ఎదురు దెబ్బలు ఎదుగుదలకు అడ్డు కా(కూడ)దు

**హైలెట్స్**

- ✤ మనకి తగిలే ఎదురుదెబ్బలు, మనకి ఎదురయ్యే చేదు అనుభవాలు, మన లక్ష్యం మీద మనకున్న తపనని తేల్చేస్తాయి.
- ✤ సక్సెస్ అనేది అనుకోకుండా ఆకాశం నుండి ఊడిపడదు. సక్సెస్ అవాలంటే ఎంతో కష్టపడాలి. కష్టపడటం ఒక్కటే మార్గం.
- ✤ తన శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరు అయిపోతున్నా తన చేతిలో సక్సెస్ అందినట్లే అంది జారిపోతున్నా తను నిరుత్సాహపడ్డాడేమో కానీ కష్టపడి పనిచేయడం మాత్రం ఆపలేదు.
- ✤ మనం లక్ష్యానికి అవసరమైనంత కష్టపడలేక మధ్యలో వదిలేస్తున్నాం. అసంభవం, అసాధ్యం అని పేర్లు పెడుతున్నాం.

కలలు కనడం సులభమే. వాటిని నెరవేర్చుకోవాలంటేనే కష్టం. అందరూ తాము ఏదో సాధించాలని కలలు కంటారు. కానీ చాలా కొద్ది మంది మాత్రమే తమ కలల్ని నిజం చేసుకోవడానికి కృషి చేస్తారు. ఆ కృషి సరిపడేంతలా ఉంటేనే కలలు నెరవేరతాయి. మనలో చాలా మంది ఆరంభశూరులు. మొదట్లో మన కలని నిజం చేసుకోవడానికి బాగానే కష్టపడతాం. కానీ, ఏదైనా చిన్న ఎదురు దెబ్బ తగిలే సరికి మన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి, ఆ పనిని మధ్యలో వదిలేస్తాం. వేరే చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకుని, వాటితో

సంతృప్తిపడతాం.

మనకి తగిలే ఎదురుదెబ్బలు, మనకి ఎదురయ్యే చేదు అనుభవాలు, మన లక్ష్యం మీద మనకి ఉన్న ప్రేమని, మన లక్ష్యం మీద మనకున్న తపనని తేల్చేస్తాయి. మన కలని నెరవేర్చుకునే క్రమంలో ఎదురుదెబ్బలు తగలకపోతే, ఆ లక్ష్యం సాధించడంలో మజా ఏముంది చెప్పండి? మనం వెనుదిరిగామా మనల్ని ఎవరూ బాగుచేయలేరు. వెన్ను చూపక పోరాడామా విజేతలవుతాము. కలలు కన్న వెంటనే అవి నెరవేరవు. సక్సెస్ అనేది కలలు కన్న వెనువెంటనే వరించదు. అది అనుకోకుండా ఆకాశం నుండి ఊడిపడదు. సక్సెస్ అవాలంటే చాలా కష్టపడాలి. కష్టపడటం ఒక్కటే మార్గం. సక్సెస్‌కి వేరే అడ్డదారులు, షార్ట్‌కట్‌లు ఉండవు.

సోయిచిరో హోండా పేరు విన్నారా మీరు? హోండా కంపెనీ గురించి మీకు తెలిసే ఉంటుంది. ఆ కంపెనీ సృష్టికర్తే సోయిచిరో హోండా. ఇతను జీవితంలో ఎంతో కష్టపడ్డాడు. నేడు ప్రపంచ వ్యాప్తంగా తన పేరు మీద మోటార్ సైకిళ్ళు, కార్లు, పిస్టన్ పంపులు తయారవుతున్నాయంటే తను ఎంత కష్టపడి ఉంటాడో ఊహించండి. తను స్థాపించిన కంపెనీ ఒక సంవత్సరానికి 1.4 కోట్ల ఇంటర్నల్ కంబష్చన్ ఇంజన్‌లను తయారు చేస్తుంది. ఆ ఇంజను తయారు చేసే వేరే కంపెనీలు అన్నీ కలిపి కూడా ఒక కోటి ఇంజన్‌లను తయారు చేయలేవంటే హోండా ప్రపంచ ఆటోమొబైల్ రంగంలో మొదటి స్థానం సంపాదించింది అని వేరే చెప్పనవసరం లేదు కదా. 1959 నుండి ప్రపంచంలో అతి పెద్ద మోటార్ సైకిల్ విక్రయదారు హోండా కంపెనీ.

ఈ ఘనకీర్తి హోండా కంపెనీ సాధించిందంటే దాని వెనకాల సోయిచిరో హోండా కృషి ఎంతో ఉంది. అతను ధనికుల కుటుంబంలో పుట్టలేదు. ఓ నిరుపేద కుటుంబంలో జన్మించాడు. సక్సెస్ గురించి తను కల కనగానే అది నెరవేరలేదు. ఎన్నో అగ్నిపరీక్షలు ఎదురయ్యాయి. కఠిక దారిద్ర్యం అనుభవించిన రోజులు ఉన్నాయి. ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన నెలలు ఉన్నాయి. మరెన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న సంవత్సరాలు ఉన్నాయి. ప్రతి పరిస్థితి తనకు ప్రతికూలంగా ఉన్నా, తను ఒక్క విషయాన్ని మాత్రమే నమ్మాడు. అది (ఆ విషయం) కష్టపడి పనిచేయడం. తన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు అయిపోతున్నా, తన చేతిలో సక్సెస్ అందినట్టే అంది జారిపోతున్నా తను నిరుత్సాహపడ్డాడేమో కానీ, కష్టపడి పనిచేయడం మాత్రం ఆపలేదు. మనలో కొంతమంది దేవుణ్ణి నమ్ముకుంటారు. మరికొంత మంది అదృష్టాన్ని నమ్ముకుంటారు. కానీ సోయిచిరో హోండా కష్టపడటాన్ని నమ్ముకున్నాడు. ఇతని గురించిన కొన్ని ఆసక్తికర విషయాలు చెబుతాను.

జపాన్‌లో 1906లో హోండా ఒక నిరుపేద కుటుంబంలో జన్మించాడు. తండ్రికి ఒక సైకిల్ షాపు ఉండేది. సైకిల్ షాపు అంటే సైకిళ్లు అమ్మే షోరూం కాదు. సైకిల్‌కి పంచర్లు వేసే షాపు తల్లి బట్టలు నేసేది. హోండాకి చదువు అబ్బలేదు. స్కూల్‌లో కూర్చోవడం అంటే చిరాకు. పెద్దయ్యాక సైకిల్ మెకానిక్ అవుదామని అపపడు అనుకున్నాడంట.

క్లాసులో పాఠాలు అంటే ఇష్టముండేది కాదు. ఏదైనా వస్తువు దొరికితే దానిని విప్పదీసి, అది ఎలా పనిచేస్తుందో తెలుసుకోవాలనే కుతూహలం మాత్రం ఉండేది.



స్కూల్‌లో పరీక్షలు పెడితే, మార్కులు అందరికంటే తక్కువ వచ్చేవి. క్లాస్‌లో టీచర్లు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చేవారు. వాటిని ఇంటిలో చూపించి, తల్లిదండ్రుల సంతకం తీసుకుని, వారి ఇంటి స్టాంపును కూడా వేయించి, తిరిగి క్లాస్ టీచర్‌కి ఇచ్చేయాలి. కానీ, ఇంట్లో అమ్మా, నాన్న మార్కులు తక్కువ వస్తే ఊరుకునే వారు కాదు. అందుకని, వాళ్లకి ప్రోగెస్ కార్డును చూపించకుండా దాచేసేవాడు. తండ్రి సంతకం ఫోర్జరీ చేసి, తనే పెట్టేసేవాడు. వారి

ఇంటి స్టాంపును తండ్రి భద్రంగా దాచిపెట్టాడు. అందుకని హోండా కొత్త స్టాంపు తయారు చేసి ప్రోగ్రెస్ కార్డు మీద ముద్రించేవాడు.

మనవాడు చేసిన నిర్వాకం కొంత మంది పిల్లలకి తెలిసిపోయింది. వాళ్లు కూడా వారి వారి ఇళ్లల్లో తమ ప్రోగ్రెస్ రిపోర్టు చూపించడానికి భయపడ్డారు. హోండా వారికి నేనున్నాను అంటూ అభయమిచ్చాడు. వారి వారి తల్లిదండ్రుల సంతకం అచ్చుగుద్దినట్లు ఫోర్జరీ చేసి ప్రోగ్రెస్ కార్డుల మీద పెట్టేసేవాడు. ఇతర పిల్లల ఇంటి స్టాంపులను కూడా తయారు చేసి, ప్రోగ్రెస్ కార్డుల మీద ముద్రించేసే వాడు. ఆ స్టాంపులు ఎలా తయారు చేసేవాడంటే సైకిల్ పెడల్ (కాలు పెట్టి తొక్కే చోటు)కి రెండు వైపులా రబ్బరు ఉంటుంది. గమనించారా? ఆ పెడల్స్‌కి ఉన్న రబ్బరును తండ్రి షాపుకి వచ్చే సైకిళ్ల నుండి దొంగిలించేవాడు. ఒక బ్లేడు తీసుకుని రబ్బరుని తగు విధంగా కోసి స్టాంపులు చేసేవాడు. తన షాపుకి వచ్చిన సైకిళ్ల పెడల్స్‌కి అప్పుడప్పుడూ రబ్బరులు మాయమవడం తండ్రి గమనించాడు. కొద్ది కాలంలోనే హోండా చేస్తున్న దొంగపని గట్టు రట్టు అయిపోయింది. 15 సంవత్సరాలు వచ్చే సరికి తను ఇంటి నుండి పారిపోవలసి వచ్చింది. చదువు సంధ్యలు లేవు. ఇప్పుడు ఇంట్లో కూడా స్థానం లేదు. బయటకు వచ్చిన సోయిచిరో ఒక ప్రదర్శనకు వెళ్లాడు. అక్కడ జపాన్ వాళ్లు సొంతంగా తయారు చేసి ప్రదర్శనకు ఉంచారు. దానిని సోయిచిరో గమనించాడు. గంటలు గంటలు దాని చుట్టూ తిరిగి చూశాడు. అవకాశం ఉన్నప్పుడు విమానం లోపలికి వెళ్లి అందులో ఉన్న విడి భాగాలను చాలా ఉత్సాహంగా చూశాడు అప్పుడే మెషీన్‌లంటే తనకు విపరీతమైన ప్రేమ ఏర్పడిపోయింది. తను కూడా ఏదైనా మంచి వాహనాన్ని కానీ మెషీన్‌ని సొంతంగా తయారు చేయాలని నిశ్చయించుకున్నాడు. ఇల్లు వదిలి పారిపోయాడు కదా. తను తన లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలి అని ఆలోచించగా తనకు మెరుపు లాంటి ఐడియా వచ్చింది. ఏదైనా మెకానిక్ షెడ్డులో పనిచేస్తే తను అన్నీ వాహనాలను చాలా దగ్గరగా పరిశీలించవచ్చు. వాడి విడి భాగాలను పూర్తిగా అధ్యయనం చేయవచ్చు. అందుకు అన్నీ వాహనాలు ఉండే మెకానిక్ షెడ్డు కోసం వెతికితే, అలాంటిది జపాన్ రాజధాని టోక్యోలో ఉందని తెలిసింది. మనవాడు టోక్యో వచ్చేసి, అక్కడ ఆరు సంవత్సరాలు పనిలో చేరాడు. అటు తరువాత ఇంటి మీద గాలి మళ్లింది. తల్లిదండ్రులు గుర్తుకు వచ్చారు. తప్పుచేసింది తను, అయితే శిక్ష అనుభవిస్తుంది వాళ్లు అన్న జ్ఞానోదయం కలిగి ఆరు సంవత్సరాల తరువాత ఇళ్లు చేరుకున్నాడు. అక్కడ తను కారు మెకానిక్ షెడ్ పెట్టాడు. తండ్రి సైకిళ్లు రిపేరు చేస్తుంటే కొడుకు కార్లు రిపేర్ చేయడం మొదలు పెట్టాడు. కార్లు ఏమైనా రిపేర్ కోసం వస్తే వాటిని రేసింగ్ కార్లుగా తయారు చేసేవాడు. తన ప్రతిభని ఉపయోగించి, ఆ కార్ల ఇంజన్‌లలో కొన్ని మార్పులు చేసి భేష్ అనిపించుకునేవాడు. ఖాళీ సమయాల్లో కొత్త పద్ధతిలో ఇంజను తయారు చేయాలని ఏదో పనిలో నిమగ్నమైపోయేవాడు. తనకు 30 సంవత్సరాలు వచ్చే సరికి ఒక కంపెనీ స్థాపించాడు. ఆ కంపెనీలో పిస్టన్ రింగులు తయారయ్యేవి. తన లక్ష్యం ఏమిటంటే ఆ పిస్టన్ రింగులను అప్పటికే ఆటోమొబైల్ రంగంలో ఉన్న టయోటా కంపెనీకి అమ్మాలని.

రాత్రి, పగలు బాగా కష్టపడి టయోటా కంపెనీ వారిని మెప్పించి పిస్టన్ రింగులను



సప్లయి చేసే కాంట్రాక్టు దక్కించుకున్నాడు. అయితే దురదృష్టం చూడండి. ఆ సమయంలో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడింది. ఆర్థిక మాంద్యం టయోటా కంపెనీని బాగా దెబ్బతీసింది. అందుకని, వాళ్లు హోండా తయారు చేసిన పిస్టన్ రింగులను కొనలేదు. అందులో (టయోటాలో ) పనిచేసే ఒకతను హోండాతో తన పిస్టన్ క్వాలిటీ ఇంకా మెరుగుపడితే, తనకి ఎన్నో మంచి అవకాశాలు ఉన్నాయని సలహా ఇచ్చాడు. అప్పుడు హోండా ఇంజనీరింగ్ కళాశాలలో చేరాడు. ఇంజనీరింగ్ తను చేయడానికి తన విద్యార్హత సరిపోకపోయినా, తను పాఠాలను వినడానికి వెళ్లేవాడు. తనకి డిగ్రీలు అవసరం లేదు. జ్ఞానం కావాలి. అందుకని కళాశాలలో పాఠాలు వినేవాడు. ప్రాక్టికల్ లాబ్‌లో సమయాన్ని గడిపేవాడు. జపాన్ చుట్టూ ఉన్న వివిధ కర్మాగారాలను పరిశీలించి ఇక తను కూడా మంచి క్వాలిటీ పిస్టన్‌ను తయారు చేయగలనన్న నమ్మకం వచ్చినప్పుడు తన ఫ్యాక్టరీకి తిరిగి వచ్చాడు. ఆటోమేటిక్ మెషీన్‌లను తయారు చేయాలని సంకల్పించాడు. అందుకు తన దగ్గర డబ్బు లేదు. స్నేహితుల దగ్గర అప్పు చేశాడు. తన భార్య నగలని అమ్మాడు. 1941వ సంవత్సరంలో అంటే తనకి 35 సంవత్సరాల వయస్సు వచ్చే సరికి తనకి కొత్త మెషీన్‌లు తయారయ్యాయి. వాటి ద్వారా మెరుగైన పిస్టన్ రింగులు తయారయ్యాయి. ఇప్పుడు మళ్లీ టయోటా కంపెనీకి తన రింగులు అమ్మే కంట్రాక్టు కుదిరింది.

ఆ సమయంలో జపాన్ రెండవ ప్రపంచ యుద్ధానికి కాలుదువ్వింది. సరిగ్గా తను టయోటా కంపెనీకి రింగులు సప్లయి చేస్తూ అంతా సవ్యంగా ఉంది అని అనుకునే లోపు

ఒక అనుకోని ప్రమాదం. ప్రపంచయుద్ధంలో ప్రత్యర్థి దేశమైన అమెరికా జపాన్‌ని నాశనం చేయాలని కంకణం కట్టుకుంది. చాలాచోట్ల విమానాల మీద నుండి బాంబుల వర్షం కురిపించింది. అప్పుడు రెండు బాంబులు హోండా స్థాపించిన కర్మాగారం పైన కూడా పడ్డాయి. తన ఫ్యాక్టరీ అంతా బూడిదై పోయింది. అయినా హోండా ఓటమిని ఒప్పుకోలేదు. మళ్లీ తన ఫ్యాక్టరీని నిర్మించాలని పట్టుబట్టాడు. అయితే అప్పుడు యుద్ధం కారణంగా స్టీల్‌కి కొరత ఏర్పడింది. స్టీల్ దొరకడం లేదని హోండా కష్టపడటం మానేయలేదు. పాత ఇనుముని కొని, దానిని శుద్ధి చేసి ఫ్యాక్టరీ నిర్మించాడు. మళ్లీ కష్టపడి పిస్టన్ రింగులు తయారు చేయడం మొదలుపెట్టాడు. ఇంతలో అనుకోకుండా మళ్లీ ఇంకో ప్రమాదం. 1945లో భూకంపం వచ్చి తన ఫ్యాక్టరీ మొత్తం నేలమట్టమై పోయింది. మళ్లీ ఫ్యాక్టరీ ఎలాగోలా నిర్మిద్దామనుకున్నాడు. ఓటమి సంభవించే ఎన్నో పరిస్థితులు ఎదురైనా, తనకు తానుగా ఓటమిని ఒప్పుకుంటే తప్ప ఓడిపోయినట్లు కాదు. సరిగ్గా ఇదే విషయం హోండా పట్ల కూడా నిజమైంది. తను ఫ్యాక్టరీ పెట్టి పిస్టన్ రింగులను టయోటా కంపెనీకి అమ్మడానికి సిద్ధమే. కానీ కొనడానికి టయోటా సిద్ధంగా లేదు. ఎందుకంటే ప్రపంచ యుద్ధం అప్పుడే ముగిసి, ప్రజల దగ్గర ఖాళీ అయింది. పెట్రోల్ దొరకడం లేదు. అందరూ కార్లు వాడటం మానేసి, సైకిళ్లు తొక్కడం మొదలుపెట్టారు. తన ప్రతిభ ఇప్పుడు సైకిళ్ల మీద చూపెట్టాలి అని అనుకున్నాడు. సైకిల్‌లో బలం ఉపయోగించాలి. రెండు కాళ్లతో తొక్కాలి. ఎక్కువ శ్రమతో కూడుకున్న పని అది. అలా కాకుండా మెషీన్‌లను ఉపయోగించి సైకిల్‌ని ఎక్కువ శ్రమ లేకుండా తొక్కే పద్ధతి ఏమైనా ఉందా అని ఆలోచించాడు. సైకిల్‌కి చిన్నపాటి ఇంజను ఎందుకు అమర్చకూడదు అని ఆలోచించాడు. ఆ ఊహని కొంత మందితో చెబితే నవ్వి గేలిచేశారు. అయినా సరే కష్టపడి చిన్నపాటి ఇంజను తయారు చేసి సైకిల్‌కి బిగించాడు. అలా వచ్చిందే మోటార్ సైకిల్. ముందు గేలి చేసినవాళ్లే బాగుందన్నారు. మెచ్చుకుని మాకూ తయారు చేయండి అని ఆర్డర్‌లు ఇచ్చారు. బహు కొద్దికాలంలోనే మోటార్ సైకిల్ బాగా ప్రాచుర్యం పొందింది. ఎన్నో వేల సంఖ్యలో ఆర్డర్లు రావడం ప్రారంభమైంది. డిమాండ్ ఎక్కువ సప్లయ్ తక్కువయిపోయింది. హోండా అప్పుడు తన కంపెనీ స్థాపించాడు. తన పేరు మీద ఆ కంపెనీ మొదలుపెట్టి, దేశంలో ఉన్న 18,000 మంది సైకిల్ షాపుల యజమానులకు ఒక ఉత్తరం రాశాడు. జపాన్ దేశాన్ని పునర్నిమిద్దామంటూ ఒక సంకల్పం తీసుకోమని ఆ ఉత్తరంలో బాగా మోటివేట్ చేశాడు. తను స్థాపించిన మోటర్ సైకిల్ కంపెనీకి విడిభాగాలు సప్లయ్ చేయమని కూడా అందులో ఉంది. చూస్తుండగా ఇంతింతై వటుడింతై అన్నట్లు హోండా కంపెనీ పెరిగిపోయింది. విదేశాలలో కూడా హోండా కంపెనీ తయారు చేసిన మోటార్ సైకిళ్లకు గిరాకీ బాగా పెరిగిపోయింది. కష్టపడి పనిచేస్తే అవకాశం వచ్చినప్పుడు దానిని అందిపుచ్చుకోవడం విజేతల లక్షణం. అందుకు ఎప్పుడూ కష్టపడుతూ ఉండాలి. అప్పుడే వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలం. అవకాశం వచ్చినప్పుడు కష్టపడదాంలే అని అనుకుంటే ఎప్పుడు అవకాశం మెరుపులా వచ్చి వెళ్లిపోతుందో మనకి తెలియనే తెలియదు. అందుకని, మనం అవకాశం కోసం ఎదురు చూడకూడదు. అవకాశం దానంతట అదే వస్తుంది. కానీ, అవకాశం వచ్చినప్పుడు మనం సిద్ధంగా ఉన్నామా?

లేదా? అనేదే పాయింటు.

హోండా కంపెనీ మోటార్ సైకిళ్ల తయారీలో ప్రపంచ ప్రసిద్ధి పొందింది. అంతటితో సోయిచిరో హోండా ఊరుకోలేదు. కష్టపడుతూనే ఉన్నాడు. 1970వ దశకంలో ప్రపంచ వ్యాప్తంగా పెట్రోల్ రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. దానిని కూడా ఒక అవకాశంగా సోయిచిరో మలచుకున్నాడు. పెట్రోల్ ధర పెరిగినప్పుడు పెద్ద పెద్ద కార్లను మెయింటేన్ చేయడం చాలా కష్టం. అందులోను పెద్ద కార్లు చాలా ఖరీదైనవి. అందరూ పెద్ద కార్లు కొనే స్తోమత కలిగి ఉండరు. అందుకని చిన్నకార్లు తయారు చేయాలని సంకల్పించాడు. అనుకున్నదే తడవుగా చిన్నకార్లు తయారు చేశాడు. తను కష్టపడి పెట్రోల్ తక్కువ వాడే కార్లు మార్కెట్‌లోకి విడుదల చేశాడు. అప్పటికే హోండా కంపెనీ బాగా ప్రాచుర్యం పొందడం వల్ల ఆ కార్లు బాగా అమ్ముడైపోయాయి. హోండాకి వద్దన్నా డబ్బు వచ్చి పడుతుంది. తన కంపెనీతో వివిధ దేశాలలో కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకుని, హోండా కంపెనీ పేరుని పనిగట్టుకుని కలుపుకున్నాయి. హీరో హోండా, శ్రీరామ్ హోండా అని మన దేశంలో కూడా కంపెనీలు ఏర్పడ్డాయి. హోండా కంపెనీలలో ఇప్పటికీ కొన్ని కోట్ల మంది పనిచేస్తున్నారు. కొన్ని చోట్ల కుటుంబాలు హోండా పేరు చెప్పుకుని బతికేస్తున్నాయి.

ఇంత మందికి జీవనోపాధి కల్పించడం వెనుక ఒక కల ఉంది. తాను సొంతంగా ఏదైనా మెషీన్‌ని కానీ, ఏదైనా వాహనాన్ని కనిపెట్టాలని 15 ఏళ్ల ప్రాయంలో సోయిచిరో కల కన్నాడు కల కనేసి ఊరుకోలేదు. దానిని సాకారం చేసుకోవడం కోసం ఎంతగానో కృషి చేశాడు. పరిస్థితులు అనుకూలించక తనని కుంగదీస్తే, అతను కుంగిపోలేదు. తన కలను కరిగించేసుకోలేదు. కష్టపడ్డాడు. కష్టపడటాన్ని మాత్రమే నమ్ముకున్నాడు. ప్రపంచ యుద్ధాలు వచ్చినా, భూకంపాలు వచ్చినా, బాంబులు మీద పడినా, తన బజారున (వీధిన) పడినా, ఎప్పుడూ ఒక్కటి మాత్రం వీడలేదు. అది తన కష్టపడే గుణం. కనడానికి కలలు అందరూ కంటారు. కానీ కొంత మంది మాత్రమే వాటిని నిజం చేసుకుంటారు. కల నిజమవాలంటే కృషి చేయాలి. కష్టపడాలి. ఆ కృషి సరిపోకపోతే ఇంకా ఎక్కువ కసితో కృషి చేయాలి. కష్టపడితే సాధించలేని పనులు అంటూ ఏమీ ఉండవు. మనం లక్ష్యానికి అవసరమైనంత కష్టపడలేక మధ్యలో వదిలేస్తున్నాం. అసంభవం, అసాధ్యం అని పేర్లు పెడుతున్నాం.

ఇప్పటి నుండి మనకెప్పుడైనా మన కలని నెరవేర్చుకునే దిశలో ఎదురుదెబ్బలు తగిలితే, వెంటనే వెన్ను చూపవద్దని నిశ్చయించుకుందాం. సోయిచిరో హోండాని స్ఫూర్తిగా తీసుకుందాం. కలల్ని నెరవేర్చుకోవాలంటే కసితో కృషి చేయాలని మనకి మనం చెప్పుకుందాం. రెట్టించిన ఉత్సాహంతో కష్టపడదాం.

విషయాలు ఎన్నో ఉన్నాయి. అనువుగాని చోట అధికులం. కాకపోతే, కాకపోయాం. మనకి తగిన లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించి శభాష్ అనిపించుకుందాం.

# 28

# కష్టపడడాన్ని ఇష్టపడితే, అభీష్టం సిద్ధిస్తుంది

**హైలెట్స్**

- మనకి బాగా సులభంగా కనపడిన మార్గమే మనకి చెరుపు చేయవచ్చు.
- ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా వెళ్తే ఫలితాలు చాలా దారుణంగా ఉంటాయి. మనం కష్టపడవలసినప్పుడు కష్టపడకుండా దానిలో సుఖాలను వెతుక్కోవాలని చూస్తే మనమే నష్టపోతాం.
- కష్టపడకుండా సక్సెస్ గురించి ఆలోచించడం, ఆరాటపడటం అంటే ఇంతవరకూ నాటని చెట్టు నుండి ఫలాలను ఆశించడం లాంటిది.
- ఈ రోజున సక్సెస్ అవడం తేలిక. రేపొద్దునకి కాంపిటీషన్ పెరిగి పోతుంది కదా మరి.

సక్సెస్ అవ్వాలంటే షార్టుకట్‌లు వెతకకండి. సక్సెస్‌కి షార్ట్‌కట్‌లు ఉండవు. ఒక్కటే ఒక్క మార్గం ఉంది. ఆ మార్గం పేరు హార్డ్‌వర్క్. ఈ మార్గంలో ఎప్పుడూ పయనించాలంటే చాలా కష్టం. కానీ, ఇందులో వెళ్తేనే సక్సెస్ సాధించగలం. వేరే మార్గాలు మనల్ని ఎంత ఆకర్షిస్తున్నా, వాటిలో వెళ్తే మనం మన లక్ష్యాన్ని చేరుకుంటామన్న గ్యారంటీ లేదు. మనకి బాగా సులభంగా కనబడిన మార్గమే మనకి చెడు (చెరుపు) చేయవచ్చు. మనం పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులం (మనుకోండి). మనల్ని ప్రలోభ పెట్టడానికి, అడ్డదారులు తొక్కించడానికి, సక్సెస్‌కి షార్ట్‌కట్ లివీ అంటూ చెప్పడానికి చాలామంది



ప్రయత్నిస్తూ ఉంటారు. వారి మాయలో పడి మనం మన అసలు లక్ష్యాన్ని మరిచిపోయే ప్రమాదం ఉంది. మన జవాబుపత్రాలకి ఎక్కువ మార్కులు వేయిస్తామని, మన ఇంటర్వ్యూలో సహాయం చేస్తామని కొందరు పనిగట్టుకొని మన చుట్టూ తిరుగుతారు. వీరిని నమ్మామా- మనల్ని ముంచేస్తారు. పరీక్షా విధానాన్ని, పరీక్ష నిర్వహించే సంస్థని గౌరవించండి. ఇలాంటి పనులకు ఈ రోజుల్లో అస్సలు ఆస్కారమే లేదు. ప్రతిభకి ఎప్పుడూ అన్యాయం జగగదు. కష్టానికి ఎప్పుడూ ఫలితం దక్కక మనదు. ఇలాంటి షార్ట్‌కట్‌ల వల్ల కొన్నికొన్నిసార్లు జైళ్లకి కూడా వెళ్లవలసి వస్తుంది. చాలా సులువు అని అనిపించిన మార్గం మన జీవితాలనే నాశనం చేయవచ్చు.

కొన్ని సంవత్సరాల క్రితం కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో రైతులు రొయ్యల చెరువులు సాగుచేశారు. ఇక్కడి ప్రాంతం డెల్టా ప్రాంతం కావడంతో పంటలు బాగానే పండేవి. సంవత్సరానికి మూడు పంటలు కూడా తీసుకోవచ్చు. అయితే దానికి రైతులుమూడు పూటలా కష్టపడవలసి వచ్చేది. ఎంత ఎక్కువ కష్టపడితే, అన్ని ఎక్కువ డబ్బులు సంపాదించేవారు. ఇంతలో కొంతమంది వ్యాపారస్తుల ప్రోద్భలం వల్ల కొందరు రైతులు రొయ్యల చెరువులు సాగుచేశారు. తమ నేలని తవ్వి రొయ్యల చెరువులు తయారు చేసుకున్నారు. టైగర్ రొయ్యల పెంపకం చేపట్టి కొన్ని లక్షల రూపాయలు సంపాదించారు. దీనిని చూసిన మిగతా రైతులు- అరె- వరు మూడుపూటలా కష్టపడకుండానే బాగా సంపాదిస్తున్నారే- అని చెప్పి తమ పచ్చని పొలాల్ని తవ్వించి వాటిలో సముద్రపు నీరు నింపారను. పంట కాల్వల్లో కృష్ణా, గోదావరి నదులవల్ల బంగారం లాంటి మంచినీరు

పక్కనుడి పారుతుంటే కాదని, దగ్గరలో ఉన్న సముద్రం నుండి ఉప్పునీరు మోటార్లు, పంపుసెట్ల ద్వారా తెచ్చి సారవంతమైన నేలని పాడుచేశారు. నేల యొక్క సారం భూమి పైపొరలో ఉంటుంది. ఈ డెల్టా ప్రాంతంలో ఆ పొర మరింత దట్టగా ఉంటుంది. దానినంతా రొయ్యల చెరువుల తవ్వకంలో తమ పొలాలనుండి తీసుకున్నారు మన రైతులు. పోనీ, రొయ్యల సాగు బాగా నడిచిందా అంటే అదీ లేదు. మొదటి రెండు, మూడు సంవత్సరాలు లక్షలు ఇప్పించిన రొయ్యలు తరువాత కాలంలో రైతుకి కన్నీరు తెప్పించాయి. రొయ్యలకు ఫంగస్ సోకి ఒకేసారి కొన్ని లక్షల టన్నుల రొయ్యలు చనిపోయాయి. విదేశాలకు ఎగుమతి అయ్యే మన ఆంధ్రా రొయ్యని ఇక అప్పటినుండి ప్రతిబంధించారు. మన రొయ్యలకు గిరాకీ తగ్గి, రొయ్యల సాగులో ఖర్చు పెరిగింది. రైతులు దివాళా తీశారు. లక్షలు కాకపోయినా, వేలు సంపాదించే రైతులు ఇప్పుడు అప్పుల పాలయ్యారు. బంగారం లాంటి సారవంతమైన నేలని చేజేతులా నాశనం చేసుకున్న రైతులు– అంతకుముందు కాలమే మంచిది అని నిర్ణయానికి వచ్చేశారు. కానీ, అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది. కష్టపడకుండా డబ్బులు సంపాదించే షార్ట్‌కట్‌ల వల్లే ఇదంతా జరిగింది. ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా వెళ్తే ఫలితాలు చాలా దారుణంగా ఉంటాయి. మనం కష్టపడవలసినప్పుడు కష్టపడకుండా దానిలో సుఖాలను వెతుక్కోవలని చూస్తే మనమే నష్టపోతాం.

పెద్దవారు ఎప్పుడూ చెబుతుంటారు. ఒక గమ్యస్థానాన్ని చేరుకోవడానికి రెండు మార్గాలు మనకి కనపడవచ్చు. ఒక మార్గం చాలా కష్టమైనది. రెండవది సులువైనదిగా మనకి తోస్తుంది. కష్టమైన మార్గంలో మొదట కొన్ని అడ్డంకులు ఉంటాయి. వాటిని అధిగమించాలంటే కష్టపడాలి. అందుకే దీనిని కష్టమైన మార్గం అని అంటారు. రెండవ మార్గం సులువుగా అనిపించిమనని ఆకర్షిస్తుంది. మనం ఆకర్షణలకు లొంగిపోరాదు. బహుశా కష్టమైన మార్గంలో వెళ్తే మనం మన గమ్యస్థానానికి కచ్చితంగా చేరుకోగలమేమో. సులువైన మార్గంలో వెళ్లిన తరువాత గమ్యస్థానం ఎన్నటికీ చేరుకోలేమేమో.. ఈ విషయాన్ని గుర్తించి మార్గాన్ని ఎంచుకోవడం మంచిది. నేను చెప్పేది ఏమిటంటే– ఆకర్షణగా ఉన్న మార్గం మనం వెళ్లాల్సిన అసలైన మార్గం కాకపోవచ్చు. కష్టపడాల్సి వచ్చినా, ఆకర్షణ లేని మార్గమే మనల్ని మన లక్ష్యానికి చేరుస్తుంది.

మన చేనులో కలుపు మొక్కలు పెరుగుతున్నాయనుకోండి. వాటిని లేకుండా (కనబడకుండా) చేయడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి కష్టమైన మార్గం, మరొకటి సులువైన మార్గం. సులవైన మార్గం ఏమిటంటే– కలుపును కొడవలితో కోయడం. అలా చేస్తే కొన్ని రోజులకి కలుపు మరింత ఏపుగా పెరిగిపోతుంది. కొంచెం కష్టమైన మార్గం ఏమిటంటే– కిందికి వంగి, చేతిని నేలలోకి పోనిచ్చి కలుపుని కూకటివేళ్లతో సహా పెకిలించివేస్తూ కలుపుని పీకడం. ఒక్కో మొక్కని అలా పీకుతూ ఉండాలి. రెండు మార్గాలలో కూడా కలుపు కొన్ని రోజుల వరకూ కనబడదు. కానీ, మొదటి మార్గంలో కలుపు ఎంత తొందరగా కనబడకుండా పోయిందో, అంతే తొందరగా తిరిగి ప్రత్యక్షమవుతుంది. రెండవ మార్గం చాలా సమయం తీసుకుంటుంది. ఒక్కో మొక్క పీకడం కోసం వంగి నడుముకి కూడా పని చెప్పవలసి వస్తుంది. కానీ ఏ మార్గం వల్ల



నిజంగా సమస్యకు సమాధానం దొరికింది?

సులువైన మార్గాలు ఒక్కోసారి ప్రాణాంతకాలు కూడా అవుతాయి. కష్టపడి పనిచేయలేకపోవడం వల్ల, బద్ధకం వల్ల సులువైన మార్గాలు ఎంచుకునే అతితెలివిగలవారు గోతితో పడడం ఖాయం. కాయకష్టం చేయవలసి వచ్చినా, అసలైన మార్గంలోనే పయనించాలి. ఒక ఊరిలో ఒక నెమలి ఉంది. అది తన ఆహారం కోసం చాలా కష్టపడవలసి వస్తుంది. రోజూ పక్కన ఉన్న అడవిలోకి వెళ్లి చిన్న చిన్న పురుగుల కోసం, తిండిగింజల కోసం చాలా ఎక్కువగా కష్టపడాల్సి వస్తుంది. ఈ నెమలి బ్రతుకు ఎందుకు ఇచ్చావురా దేవుడ అనుకుంటూ తిట్టుకుంటుంది. అంతలో ఒక వ్యాపారి వస్తాడు. నెమలి దగ్గరకు వచ్చినీ పించెం భలే ఉంది. నాకు నీ ఈకలు ఇస్తే నీకు తిండిగింజలు, పురుగులు నేను ఇస్తాను అంటూ బేరం పెట్టాడు. రెండు ఈకలు ఇస్తే- రోజుకి సరిపడా ఆహారాన్ని తెచ్చి ఇస్తాను అని హామీ ఇచ్చాడు. చాలా ఈకలు ఉన్నాయి కదా- రెండు పోతే ఏమైంది అనుకుంటూ ఆ బేరానికి సరేనంది. మొదటిరోజు వ్యాపారి రెండు ఈకలు పీకుకుపోయాడు. ఎక్కడికీ కదలకుండా, కష్టపడకుండా, హాయిగా నోటి దగ్గరకు ఆహారం వస్తుందని నెమలి ఎంతగానో సంబరపడిపోయింది. రెండవ రోజు కూడా వ్యాపారి వచ్చి రెండు ఈకలు పీక్కునిపోయి, ఆహారాన్ని ఇచ్చాడు. వ్యాపారి అమ్మిన నెమలి ఈకలు తనకి ఎంతో డబ్బుని తెచ్చిపెట్టాయి. అందుకు మూడవరోజు కూడా నెమలి దగ్గరకు వెళ్లాడు. సులభంగా ఆహారం లభిస్తుందని నెమలి సరే అంటూ పోయింది. ఇలా నాల్గవ రోజు, ఐదవ రోజు, పదవరోజు, ఇరవయ్యో రోజు, ముప్పైవ రోజు-- గడిచాయి. చివరకు

నెమలి దగ్గర ఈకలు లేనేలేని రోజు వచ్చింది. ఆ రోజు వ్యాపారి రాలేదు. ఇక ఎన్నడూ వ్యాపారి నెమలి దగ్గరకు రాలేదు. నెమలి తన ఈకలు మాత్రమే కోల్పోలేదు. తన అందం కూడా కోల్పోయింది. అంతకుముందు తను ఎగిరేటప్పుడు ఊతమిచ్చే ఈకలు ఇక లేనందున, నెమలి సరిగ్గా ఎగరలేకపోతున్నది. తన ఆహారం వెతుక్కోవడం మరింత కష్టమైపోయింది నెమలికి. చివరికి రెండు- మూడు రోజుల్లో చనిపోయింది.

సక్సెస్‌కి షార్ట్‌కట్‌లు ఉండవు. బాగా కష్టపడి పనిచేయడం ఒక్కటే మార్గం. కష్టపడకుండా సక్సెస్ గురించి ఆలోచించడం, ఆరాటపడడం అంటే- ఇంతవరకూ నాటని చెట్టునుండి ఫలాలను ఆశించడం లాంటిది. కష్టపడితే ఏదైనా సాధించవచ్చు. భర్తృహరి సుభాషితాల ప్రకారం-

తివిరి యిసుమున దైలంబు తీయవచ్చు
దవిలి మృగతృష్ణలో నీరు ద్రాచవచ్చు
దిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు... అంట.

ప్రయత్నిస్తే ఇసుకనుండి నూనె తీయవచ్చు. ఎండమావులలో నీరు తాగవచ్చును. తిరిగి తిరిగి కుందేటి కొమ్ములు సంపాదించవచ్చును అని దీని భావం. భర్తృహరి చెప్పిన విషయాలు అతిశయోక్తులు అయ్యి ఉండవచ్చు కానీ, ప్రయత్నిస్తే, కష్టపడితే- ఏ పని అయినా నెరవేరక మానదు. చీమలు (ఒకే బాటలో) నడవగా నడవగా రాళ్లలో కూడా గాడి ఏర్పడగలదని మనకి ఒక పాత సామెత ఉంది.

కష్టపడవలసి వస్తే ఆ పనిని వాయిదా వేయవద్దు. మనలో చాలా మంది, రేపటినుండి కష్టపడదాం, వచ్చే వారంనుండి కష్టపదాం, లేదా వచ్చే నెలనుండి కష్టపడదాం అంటూ పోస్ట్‌పోన్ చేస్తాం. అలా చేయడం వల్ల తెలియకుండా మనకి మనమే అపారమైన నష్టం చేసుకుంటున్నాం. పోటీ పరీక్షలకు తయారయ్యే మనం మన కష్టపడడాన్ని వాయిదా వేసుకొని, మన చేతితో మన కన్నును పొడుచుకుంటున్నాం. ఎందుకంటే ఈ రోజున సక్సెస్ అవ్వడం తేలిక. రేపొద్దునకి కాంపిటీషన్ పెరిగిపోతుంది కదా మరి. ఒకరోజు గడుస్తున్న కొద్దీ మనతోపాటు పోటీపడేవారు ఎక్కువ చదివేస్తున్నారేమో. వారు కష్టపడుతుంటే- మనం రేపు మాపు అంటూ వాయిదా వేస్తుంటే- ఎక్కువ చదివిన వాళ్లతో పోటీ పడాల్సిందేగా మరి. మన పోటీ పరీక్షలలో పాల్గొనాలంటే ఎక్కువ అర్హతలు అవసరం లేదు. ఎవరైనా, ఏదైనా డిగ్రీ చేసి పోటీ పరీక్షలలో పాల్గొనవచ్చు. పదవ తరగతి మూడుసార్లు తప్పి బి.ఎలో బొటాబొటిగా పాసయ్యి, సివిల్స్ పరీక్ష రాసి అధికారులైన వారు నాకు తెలుసు. వారు ఎలా అయ్యారంటే- తమ లక్ష్యం ఇదీ అని నిర్ధారించుకున్న తరువాత రాత్రనక, పగలనక కఠోరమైన తపస్సు చేసేంత కష్టపడ్డారు కాబట్టి. సివిల్స్ పరీక్ష కోసం ప్రతి సంవత్సరం 4 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటారు. అందులో 40 మంది దాకా ఐఎఎస్‌లు అవుతారు. అంటే ప్రతి పదివేల మందిలో ఒక్కరికి ఐఎఎస్ అయ్యే అవకాశం ఉందన్నమాట. మనకి ఉన్న పరీక్షలు ఏవైనా, అభ్యర్థులు ఎక్కువగా సీట్లు తక్కువగా ఉన్నాయి. అందుకని, అందరికంటే ఎక్కువగా కష్టపడాలి. మామూలుగా కష్టపడితే ఈ పరీక్షలలో విజేతలు అవ్వలేరు మరొక విషయం ఏమిటంటే నిజంగా బాగా కష్టపడినవారికి, పరీక్షకు సరిపోయినంతగా కృషిచేసిన వారికి



ఫలితం దక్కి తీరుతుంది.

కష్టపడడాన్ని వాయిదా వేశామా– బహుశా మనం విజేతలయ్యే అవకాశాలు కూడా సన్నగిల్లిపోతాయి. కబీర్ చెప్పినట్లు– రేపు చేసే పనిని ఈరోజు చేసి, ఈరోజు చేసే పనిని ఇప్పుడే చేస్తే మన విజయావకాశాలు మెరుగవుతాయి. మీరు ఎప్పుడైనా తెల్లవారుజామునే లెగవాలని అలారం పెట్టుకొని, అది మోగిన వెంటనే లేవకుండా, దానిన కట్టేసి పడుకున్నారా? మనలో దాదాపు అందరూ అలాచేసిన వారే... (వారమే). ఎవరైతే అలా అలారం మోగిన వెంటనే లేచి, అనుకున్న లక్ష్యం కోసం ప్రయత్నించారో వారు కచ్చితంగా జీవితంలో ఎంతో ముందుకు వెళ్లి ఉంటారు. బద్ధకం వల్ల చాలా నష్టాలే జరిగిపోతుంటాయి. మనం డిసిప్లేన్ తప్పుతాం. ఏ పని ఎప్పుడు జరగాలో అప్పుడు జరగదు. మనకి టైం తక్కువ, చేయవలసిన పని ఎక్కువ అవుతుంది. దీనివల్ల మనకే తెలియకుండా మనం చాలా స్ట్రెస్‌కి గురవుతాం, చికాకు పడతాం, నెగెటివ్ ఆటిట్యూడ్ వస్తుంది. ఫలితంగా మన లక్ష్యాలను మనం చేరుకోలేం.

ఒక చైనా కథ ఉంది. దానిలో ఒక చిన్నపిల్లవాడికి ఎవరో చెప్పారు. నీవు జీవితంలో సుఖపడాలంటే ముందు కష్టపడాలి అని. ఆ పిల్లవాడు ఇలా అనుకుంటాడు– “నేను కొంచెం పెద్దయిన తరువాత, బాగా కష్టపడి ఏదైనా సాధిస్తాను. అప్పుడు నేను సుఖపడతాను, సంతోషిస్తాను. ఇప్పుడు మాత్రం ఆడుకుంటాను” అని. తన బాల్యం అంతా ఆడుకోవడంలో గడిచిపోయింది. తను పెద్దయిన తరువాత కష్టపడాలి అని అనుకునేంతలో “నేను కాలేజీకి వెళ్లాలి కదా. మిగతా పిల్లలందరూ తమ యవ్వనంలో

బాగా ఖుషీ చేసుకుంటుంటే– నేను ఎందుకు కష్టపడాలి” అని ఆలోచించాడు. అందుకని నా కాలేజీ చదువు పూర్తయిన తరువాత నేను కష్టపడతాను. ఆ తరువాత జీవితం మొత్తం సుఖపడతాను అనుకున్నాడు. కొన్ని రోజులకి కాలేజీ కూడా పూర్తయింది. అప్పుడు కష్టపడి ఏదైనా గొప్ప పని సాధించాలని అనుకునేంతలో– ముందు జీవితంలో సెటిల్ అవ్వాలంటే ఒక చిన్న ఉద్యోగం అయినా ఉండాలి. మనకంటూ ఒక చిన్న జాబ్ అయినా లేకుండా కష్టపడుతూ కూర్చుంటే– ఎలా? అని తనని తాను ప్రశ్నించుకొని, ఓ చిన్న ఉద్యోగం సంపాదించిన తరువాత జీవితంలో బాగా కష్టపడి పెద్ద పెద్ద స్థానాలకి పోటీపడి, వాటిని సాధించి అప్పుడు సుఖపడతాను అనుకుంటూ– కాలం వెళ్లదీశాడు. కొన్ని రోజులకి ఒక చిన్న ఉద్యోగం సంపాదించాడు. ఆ తరువాత కష్టపడాల్సిన తరుణం వచ్చేసరికి, నేను కెరీర్‌లో అయితే కొంత సెటిల్ అయ్యాను కానీ నా (లైఫ్‌లో) జీవితంలో ఇంకా సెటిల్ కాలేదు కాబట్టి, నాకు పెళ్లి అయిన తరువాత పెద్ద లక్ష్యాలను పెట్టుకుని, వాటిని కష్టపడి సాధిస్తాను అని అనుకున్నాడు. కొన్ని రోజులకి తనకి పెళ్లికూడా జరిగింది. కష్టపడాల అని అప్పుడు గుర్తుకు వచ్చినప్పుడు పిల్లలు పుట్టిన తరువాత కష్టపడతానని, పిల్లలు పుట్టిన తరువాత వాళ్లు స్కూలులో జాయిన్ అయిన తరువాత, కష్టపడతానని, వాళ్లు స్కూలుకి వెళ్లేటప్పుడు, వారు కాలేజీలోకి వెళ్లిన తరువాత కష్టపడతానని, వాళ్లు కాలేజీలకు వెళ్లేటప్పుడు వారి పెళ్లిళ్లు చేసేసిన తరువాత కష్టపడతానని, వాళ్ల పెళ్లిళ్లు అయిన తరువాత తను రిటైర్ అయ్యిన తరువాత కష్టపడతానని, ఇలా ఎప్పటికపపడు తను కష్టపడవలసిన సమయాన్ని పోస్ట్‌పోన్ చేస్తూ వచ్చాడు. తను రిటైర్ అయ్యిన తరువాత గతం అంతా గుర్తుచేసుకుని, చూస్తే కళ్లలో నీళ్లు తిరిగాయి. తను జీవితాన్ని మొత్తం వృధా చేసుకున్నాడని తనకి తెలిసి వచ్చింది. ఎప్పుడూ కూడా తన జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకొని, నేను కచ్చితంగా ఇప్పుడు కష్టపడాలి– అనుకోలేదు. అలా అనుకుని ఉంటే– తను ఈపాటికి ఒక ఉన్నతస్థానంలో ఉండేవాడు. కష్టపడవలసిన తరుణం వచ్చినప్పుడు ఆ విషయాన్ని వాయిదా వేయడం చాలా సులభం. నేను కచ్చితంగా ఇప్పటినుండే కష్టపడాలి అని రంగంలోకి దూకడం చాలా కష్టం. అలా చేసినవారే విజేతలవుతారు. అలా చేయలేని వారు గతాన్ని తలుచుకొని బాధపడతారు. ఒక ఆంగ్ల పండితుని ప్రకారం ఈ లోకంలో రెండు రకాల మనుషులు ఉంటారంట. మొదటి రకం– చేసేవారు, రెండవ రకం– చేయనిచ్చేవారు. ఏదైనా సాధించాలని పట్టుబట్టి మరీ కష్టపడేవారు మొదటిరకం మనుషులైతే, రెండవ రకం మనుషులు మొదటి రకం మనుషులను కష్టపడనిస్తారు. మొదటి రకం మనుషులు అద్భుతాలు చేస్తారు, రెండవరకం– ఆ అద్భుతాలు చూస్తారు. మొదటి రకం మనుషులు ఏదైనా సాధించిన తరువాత తమకు లభించే సుఖాన్ని చూస్తారు. రెండవ రకం మనుషులు ఏదైనా సాధించాలని సంకల్పిస్తే ఆ మార్గంలో ఉండే కష్టనష్టాలను చూస్తారు. మొదటిరకం వారు అవకాశాలను గమనిస్తుంటే, రెండవ రకం సమస్యలను గమనిస్తారు. మొదటిరకం వారు సక్సెస్ అవ్వాలని అన్ని విషయాలు ముందే ప్లాన్ చేసుకుని, ఆ ప్లాన్ ప్రకారం సిద్ధమవుతారు. అప్పుడు కష్టపడవలసి వస్తే ఎంతైనా కష్టపడగలరు. మొదటి రకం మనుషులను అందరూ విజేతలంటారు. ఇప్పుడు మనకి మనమే ఆలోచించుకోవాలి. మనం మొదటిరకం మనుషులమో, లేక రెండవ రకానికి

చెందిన వారమో. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన విలియం జేమ్స్ ఇలా అంటాడు. "మీరు మీ జీవితాన్ని మార్చుకోవాలని తలిస్తే, మీరు వెంటనే మొదలుపెట్టాలి. రేపు మాపు అనుకుంటూ గోళ్లు గిల్లుకుంటుంటే– ఆ రేపు ఎప్పటికీ రాదు". ఇది అక్షరాలా లక్షలు విలువచేసే సత్యం. కష్టపడడాన్ని వాయిదా వేస్తే మన సక్సెస్‌ని వాయిదా వేసుకున్నట్టే.

ఏదైనా సాధించాలంటే– కష్టపడవలసిందే. వేరే మార్గమే లేదు. ఎటూ కష్టపడాలి కాబట్టి, ఆ కష్టపడడాన్ని మన ఇష్టంగా మార్చుకున్నామనుకోండి. మన ప్రయాణం ఆడుతూ పాడుతూ సాగుతుంది. సులువైన షార్ట్‌కట్‌లు నమ్మడం అంటే– కుక్కతోక పట్టుకొని గోదారిని ఈదినట్లేనని గమనించండి. కష్టపడడాన్ని ఆస్వాదించండి. మన లక్ష్యం నెరవేరిన తరువాత, ఆ కష్టపడిన నిమిషాలన్నీ మధురస్మృతులుగా మనకి మిగిలిపోతాయి. ఇప్పుడు ఎంత ఎక్కువ కష్టపడితే, తరువాత అంతకు వందింతలు సుఖపడతారు. మీరు అనుకున్నది సాధించి జీవితంలో చివరి దశలో, ఎప్పుడైనా గతాన్ని తవ్వుకుంటే మనం ఒక అద్భుతమైన జీవితం గడిపామని మనకి మనం గర్వపడాలి. గర్వపడేంతలా ఉండాలంటే ఇప్పుడు మన చేతిలో ఉన్న సమయాన్ని కష్టపడడానికి వినియోగిద్దాం. కష్టపడడాన్ని ఇష్టపడదాం.

# 29

# వైఫల్యాలే విజయానికి విశిష్టమైన సోపానాలు

**హైలెట్స్**

- గొప్పవారు పుట్టడం విజయాలతో పుట్టలేదు. వారికి అపజయాలు ఎదురయ్యాయి. అపజయాల మీద దండయాత్ర చేసి తామేమిటో నిరూపిస్తున్నది.
- థామస్ వాట్సన్ ప్రకారం "మీరు గెలుపొందాలంటే మీరు వైఫల్యం చెందే అవకాశాలు రెట్టింపు చేసుకోవాలి.
- నేను గెలవాలి అనుకుంటే మీరు ఖచ్చితంగా గెలిచి తీరుతారు. అలా కాకుండా నేను ఓడిపోయాను అనుకుంటే మీరు నిజంగానే ఓటమి పాలైనట్లే.
- గెలుపుకోసం గురిపెట్టినప్పుడు గెలుపుని మాత్రమే చూడండి. మనకి మధ్యలో వచ్చే వైఫల్యాలను చూడవద్దు.

మనం సక్సెస్ గురించి ఎన్నెన్నో కలలు కంటుంటాం. మన ప్రయత్నాలలో ఒక్కసారి విఫలమైతే మనమీదేమనం జాలి పడేలా ప్రవర్తిస్తుంటాం. చాలామంది ఓటమి పాలయ్యేది వారిలో తెలివి లేక కాదు. వారు తమ వైఫల్యాన్ని తేలికగా తీసుకోలేకపోవడం వల్ల పోతే పోయిందిలే- ఇంకోసారి ప్రయత్నిద్దాం- అని అనుకోకపోవడం వల్ల.

నేడు మనం గొప్పవారని ఒప్పుకుంటున్న వారు పుట్టిన వెంటనే విజయాలతో



పుట్టలేదు. వారికి ఎన్నో అపజయాలు ఎదురయ్యాయి. ఆ అపజయాల మీద దండయాత్ర చేసి తామేమిటో నిరూపించుకున్నారు. నేడు కొనియాడబడుతున్నారు. కాంపిటీషన్ అన్న తరువా బలహీనులు వైఫల్యం చెందక తప్పదు. మనం బలహీనులం కనుక వైఫల్యం చెందాం అని సరిపెట్టుకున్నామా? మనం ఓడిపోయినట్లు. అలా కాకుండా- ఈ వైఫల్యం వల్ల నా బలహీనతలు నాకు తెలిసి వచ్చాయి- వాటిని సరిచేసుకొని మళ్లీ పోరాడామా? మనం గెలుపు దిశగా అడుగులు వేస్తున్నట్టు. గుర్తుపెట్టుకోవలసిన విషయం ఏమిటంటే- విఫలం చెందడం ఓడిపోయినట్లు లెక్కకాదు. మనకి మనం ఓడిపోయామని చెప్పుకునేంత వరకూ,మనం ఓడిపోయినట్లు కానే కాదు.

ఒక ఆంగ్ల తత్త్వవేత్త ప్రకారం- మీరు విఫలమవ్వక పోతే, మీరు సరిగ్గా జీవించినట్ల కాదంట. మనలో చాలామంది నేను ఓడిపోతానేమో అనుకుంటూ భయపడుతుంటారు. నేనేమైనా తప్పులు చేసేస్తానేమో అని భయాలు ఉంటుంటాయి. నేను ఫెయిల్ అయిపోతాను అనుకుంటూ తెగ బాధపడిపోతూ ఉంటారు. కానీ, అసలు విషయం ఏమిటంటే- ఓటమి లేనిదే గెలుపు లేనేలేదు (కదా)- తప్పులు జరగకపోతే- ఒప్పు అన్న విషయం ఉండనే ఉండదు (కదా) ఫెయిల్ కాకపోతే- పాస్ అయిపోవడంలో మజా ఎక్కడుంటుంది? ఓడినా- గెలిచినా, తప్పయినా- ఒప్పయినా, ఫెయిల్ అయినా- పాస్ అయినా- ముందు భయపడకూడదు. ధైర్యంగా ముందుకెళ్లాలి. ఒకవేళ మనం అనుకోనివిధంగా మనకి చేదు అనుభవం ఎదురైతే దానిని గురించి తెగ మదనపడిపోవద్దు. అలా గొప్పవాళ్లు చేసి ఉంటే- నేడు వాళ్లు గొప్పవాళ్లు అయి ఉండేవారు కాదు. మనం వారిని గుర్తించేవాళ్లం కాదు.

అమితాబచ్చన్ మొదట్లో ఆల్ ఇండియా రేటియోకి ఇంటర్వ్యూకి వెళ్లాడు. అక్కడ

అతనిని తీసుకోలేదు. కారణం– తన గళం రేడియోకి పనికి రాదంట. తనని రేడియోవాళ్లు కాదంటే– తను ఓడిపోయినట్లేనా? ఆ తరువాత ఏమైంది? తను దేశం మొత్తం పాపులర్ అయ్యాడు. ఆ ఇంటర్వ్యూలో అమితాబచ్చన్ గట్టెక్కి ఉండి ఉంటే– తన పేరుని మహా అయితే– ఆకాశవాణి వార్తల్లో వార్తలు చదువుతున్నదీ–– అన్నప్పుడు విని ఉండేవాళ్లం.

మైఖేల్ జోర్డాన్ అనే బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు తన చిన్నప్పుడు తనని స్కూల్ టీమ్‌లోకి తీసుకోలేదని ఇంటికి వచ్చి గదిలోకెళ్లి గొళ్లెం పెట్టుకొని పెద్దగా ఏడ్చేవాడు. తనని అప్పుడు వాళ్ల టీచర్లు– నీకు బంతిని సరిగ్గా పట్టుకోవడమేరాదు అనబట్టే కసితే బాస్కెట్‌బాల్ క్రీడని నేర్చుకున్నాడు. ఎన్నోసార్లు వైఫల్యం చెందాడు కనుకనే ఇంకా ఇంకా కసి పెరిగింది. 1992లో ఒలింపిక్ క్రీడల్లో పాల్గొన్నాడు. ఆరు బంగారు పతకాలు తన క్రీడా జీవితాన్ని సార్థకం చేశాయి. తను ఎన్నో లెక్కలేనన్నిసార్లు వైఫల్యం చెందాడు కాబట్టే తనకి ఈరోజు ఇంత కీర్తి లభించిందని తను చెబుతూ ఉంటాడు. IBM సంస్థని స్థాపించిన థామస్ వాట్సన్ వైఫల్యం చెందడం గురించి ఇలా అంటాడు. "మీరు గెలుపొందాలంటే మీరు వైఫల్యం చెందే అవకాశాలు రెట్టింపు చేసుకోవాలి".

అతనికి నాలుగు సంవత్సరాల వరకూ మాటలు వచ్చేవి కాదు. నత్తినత్తిగా గొనిగేవాడు. తను ఏడు సంవత్సరాల వరకూ స్కూల్ మొహం చూడలేదు. తను మానసికంగా పూర్తిగా ఎదగలేదంట. తను తెలివితక్కువ దద్దమ్మ వలె వ్యవహరించేవాడంట. నలుగురితో కలిసేవాడు కాదంట. చింపిరి జుట్టుతో ఎప్పుడూ ఏదో లోకంలో ఉండేవారంట. అతనే కొంతకాలానికి థీరీ ఆఫ్ రిలేటివిటీ కనుగొన్నాడు. 1921లో ఫిజిక్స్‌లో నోబుల్ బహుమతి కూడా అతనిని వరించింది. అతనెవరో కాదు– ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్. తనని గేలిచేసే వాళ్లకి జవాబు చెప్పాలని ఐన్‌స్టీన్ పట్టుబట్టకపోతే, మనకి నేటికీ ఫిజిక్స్‌లో కొన్ని సూత్రాలు తెలిసి ఉండేవి కాదు. తన వైఫల్యాలకు కృంగిపోయి ఉంటే మనం ఒక గొప్ప శాస్త్రజ్ఞున్ని కోల్పోయి ఉండేవాళ్లం కదా..

బెతోవెన్ అనే సంగీత విద్వాంసుని గురించి అతనికి మ్యూజిక్ నేర్పించిన టీచర్లు చిన్నప్పుడు ఏమనేవారో తెలుసా? "నీకు గిటారు సరిగ్గా పట్టుకోవడం కూడా మేము నేర్పలేకపోతున్నాము.. నీవల్ల మా ఏకాగ్రత మొత్తం పోతుంది.. నకు సంగీతం దేనికి? ఇంటికి వెళ్లి హాయిగా నిద్రపో" అని క్లాసునుండి తరిమివేశారు. ప్రపంచ ప్రసిద్ధి పొందే సిఫనీలను తను కంపోజ్ చేస్తాడని, అతని వైఫల్యాలే తనకి గెలుపు పాఠాలు అవుతాయని వారు అప్పుడు ఊహించి ఉండరు.

అబ్రహాం లింకన్ గురించి మీకు తెలిసే ఉంటుంది. 21 ఏళ్లప్పుడు మొదటిసారి వ్యాపారంలో దెబ్బతిన్నాడు. 22 ఏళ్లప్పుడు మొదటిసారి ఎలక్షన్‌లలో ఓడిపోయాడు. 24 సంవత్సరాలప్పుడు రెండవసారి వ్యాపారంలో నష్టం వచ్చింది. 26 సంవత్సరాలప్పుడు తన ప్రియురాలు మరణించింది. 27 సంవత్సరాలప్పుడు తన జేబులో చిల్లి గవ్వలేదు. అయినా 34 ఏళ్లప్పుడు ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయాడు. మళ్లీ 45 సంవత్సరాలప్పుడు ఎన్నికలలో ఓడిపోయాడు. 47, 49 ఏళ్లప్పుడు కూడా ఎన్నికలలో తనకి ఓటమే ఎదురైంది. చివరికి 52 ఏళ్లప్పుడు తన అమెరికా ప్రెసిడెంట్ అయ్యాడు. తను జీవితం మొత్తం ఓడాడా.. లేక గెలిచాడా?




విఫలమవడం- సక్సెస్ సాధనలో మొదటి మెట్టు. వైఫల్యం అనే దారి సక్సెస్‌కి రాజమార్గం లాంటిది. ఆ మొదటి మెట్టు ఎక్కితేనే కదా- చివరి మెట్టులో ఉన్న 'విజయం' అనే ఫలాన్ని అందుకునేది. వైఫల్యాలనుండి మనం పాఠాలు నేర్చుకుందాం. విఫలం చెందడం, ఓడిపోవడం రెండూ ఒకటి కాదు- అని మనకి మనం చెప్పుకుందాం. మిమ్మల్ని మీరు నమ్ముకుని, ఇంకోసారి నేను గట్టి పోటీ ఇస్తాననుకుంటూ ముందుకు దూకండి. మీరు ఏదైనా అనుకుంటే అది కచ్చితంగా అయి తీరుతుంది. నేను గెలవాలి అనుకుంటే మీరు కచ్చితంగా గెలిచి తీరుతారు. అలా కాకుండా నను ఓడిపోయానని అనుకుంటే మీరు నిజంగానే ఓటమి పాలైనట్లే.

మనం ఒక కలని కని, దానిని సాధించకుండా ఓటమిని ఒప్పేసుకోవడం మనల్ని మనమే కించపరుచుకున్నట్టు అవుతుంది. ఓటమిని మనం ఎదుర్కొందాం. ఒకసారి విఫలంచెందితే ఇంకోసారి ప్రయత్నిద్దాం. మళ్లీ విఫలమైతే- మళ్లీ ఇంకోసారి ప్రయత్నిద్దాం. అలా ప్రయత్నిస్తూనే ఉందాం- మనం విజయం సాధించేవరకూ.

పరీక్షల నియమ నిబంధనల వల్లనో, లేక వయస్సు మీద పడడం వల్లనో మనం గరిష్టంగా ప్రయత్నించదగినన్ని సార్లు ప్రయత్నించినా మనని వైఫల్యాలే వెంటాడుతున్నాయనుకోండి. అప్పుడు కూడా ఓటమిని ఒప్పుకోకండి. అంతకన్నా మంచి లక్ష్యం, ఉన్నతమైన లక్ష్యం, కఠినమైన లక్ష్యం పెట్టుకోండి. దానిని సాధించాలని ప్రయత్నించండి. మళ్లీ మళ్లీ ప్రయత్నించండి. ఉన్నత లక్ష్యాలను పెట్టుకోండి. కానీ, దేనినీ చిన్నచూపు చూడకండి. ప్రతి విషయానికి తగిన గౌరవం ఇవ్వండి. నేను చెప్పదలుచుకున్న దేమిటంటే- ఏ పరీక్షా చిన్నది కాదు ఏ ఉద్యోగమూ లోకువ కాకూడదు. నా కథే తీసుకోండి. నేను ఈ రోజు కలెక్టర్ అయ్యానంటే- ముందు ఎన్నోసార్లు విఫలమయ్యాను.

 

ఒకసారి సివిల్స్ ఇంటర్వ్యూ వరకూ వెళ్లి తరువాతి సంవత్సరం ప్రిలిమినరీ పరీక్ష కూడా పాసవ్వలేదు. అప్పుడు తెలిసివచ్చింది నాకు- ప్రతీ పరీక్షా చాలా ముఖ్యమైనది. సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యేవారికి గ్రూప్-1 పరీక్షకు ప్రిపేర్ అయ్యేవారు లోకువ. గ్రూప్-1కి తయారయ్యే వారికి గ్రూప్-2 కి తయారయ్యేవారు లోకువ. ఏ ఉద్యోగమూ చిన్నది కాదు. మన దృష్టి పెద్దదయి ఉండాలి. మన లక్ష్యం పెద్దదయి ఉండాలి. అంతే... నాకు సివిల్స్‌లో ప్రిలిమినరీ పరీక్ష కూడా గట్టెక్కలేదని తెలిసినప్పుడు నేను కనపడిన ప్రతి పరీక్ష రాశాను. బ్యాంకులలో క్లర్క్ పోస్టులకు పరీక్షలు రాశాను. గ్రూప్-1, గ్రూప్-2, రిజర్వ్ బ్యాంక్, సైంటిస్టు పరీక్షలు రాశాను. నేను నా మీదే నమ్మకం కోల్పోయే స్థితిలో నాకు ధైర్యం చెప్పింది ఎవరో తెలుసా? ఒక చిన్న ఉద్యోగం... ఆ తరువాత నేను వెనుదిరిగి చూడలేదు. నా వైఫల్యాలు నా విజయాలకు సోపానాలుగా మార్చుకున్నాను. IPS వచ్చినా, IAS వచ్చేవరకూ కృషి చేశాను.

మొదటల్లో విఫలం చెందినా కష్టపడగలమన్న నమ్మకం మనమీదమనకి ఉంటే సక్సెస్ సగం సాధించినట్లే. వైఫల్యాలు మన ప్రయాణంలో మైలురాళ్లే. మనలో గెలుపుమీద ఆశ చావనంతవరకూ మనని ఓటమి పాలు చేయడం ఎవ్వరి తరం కాదు. అప్పుడు గెలుపుకి కొంచెం ఎక్కువ సమయం పడుతుందేమో కానీ, గెలుపు మాత్రం తథ్యం. గెలుపుకోసం గురిపెట్టినప్పుడు గెలుపుని మాత్రమే చూడండి. మనకి మధ్యలో అడ్డు వచ్చే వైఫల్యాలను చూడవద్దు. ఒకసారి ఒక పాత్రికేయుడు (పత్రకారుడు) రిక్కీ పాంటింగ్ అనే క్రికెటర్‌ని మీరు మీ చుట్టూ అంతమంది ఫీల్డర్‌లు ఉన్నా, బంతిని చక్కగా బౌండరీలు ఎలా దాటించగలుగు తున్నారు? అని అడిగాడంట. దానికి రిక్కీ పాంటింగ్ ఇలా అన్నాడంట. "మా ప్రత్యర్థి టీమ్ ఫీల్డింగ్‌కి పెట్టింది పేరని అందరూ అంటారు. నిజమేమో. మా బ్యాట్స్‌మెన్ బంతిని బాదితే అవి అన్నీ వీళ్ల చేతికి చిక్కుతున్నాయి. నేను అప్పుడు- ఏమనుకున్నానంటే- అంత పెద్ద ఫీల్డ్ ఉంది ప్రత్యర్థి జట్టులో కేవలం పదకొండు మంది మాత్రమే ఉన్నారు. నేను వాళ్లని మాత్రం చూడను. వారి మధ్యలో ఉన్న గ్యాప్‌లు చూస్తాను ఫీల్డర్ ఉన్నాడని నేను కొట్టడం మానేయను. గ్యాప్ ఉంది కాబట్టి నేను బ్యాట్‌కి పని చెప్తాను. చూడడంలో తేడా. అందరూ ఫీల్డర్‌లని చూస్తే నేను గ్యాప్‌లు చూస్తాను".

మనం కూడా గెలుపు మీద దృష్టి పెట్టినప్పుడు కేవలం గెలుపుని మాత్రమే చూద్దాం. మధ్యలో వస్తే వచ్చే అపజయాలను పట్టించుకోవద్దు. మనమీద మనకి నమ్మకం



పెంచుకుని, అపజయాలను అవలీలగా అధిగమించి, గెలుపుకోసం ప్రయత్నిద్దాం.

స్కాట్‌లాండ్ దేశాన్ని ఆంగ్లేయుల చెరనుండి విముక్తి చేసిన రాబర్ట్ బ్రూస్ కథ ఇక్కడ చెప్పదలుచుకున్నాను. ఎన్నో అపజయాలు ఎదుర్కొన్న తరువాత, తను ఎలా గెలిచిందో తెలుసుకుంటే మనకెంతో ప్రేరణ కలుగుతుంది.

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో స్కాట్‌లాండ్ కూడా ఒక భాగమే. ఎడ్వర్డ్

అనే రాజు ఒకింత క్రూరుడు. పక్కనే ఉన్న స్కాట్‌లాండ్ దీవిని పీడించుకుతినేవాడు. తన లాభం కోసం ఎప్పటికప్పుడు స్కాట్‌లాండ్‌లో తన ప్రతినిధులను మార్చేవాడు. వాళ్లలో వాళ్లకి అంతర్యుద్ధాలు కలిగేలా చేసి, ఎప్పుడూ తన రాజ్యాధికారం ఉండేలా చూసుకునేవాడు.

అప్పుడు రాబర్ట్ బ్రూస్ ఎదురుతిరిగాడు. తను స్కాట్‌లాండ్‌కి స్వతంత్రం ప్రకటించాడు. గెరిల్లా యుద్ధం చేసి ఆంగ్లేయుల సైన్యాన్ని తరిమికొట్టాడు. స్కాట్‌లాండ్‌లో ప్రజలను స్వాతంత్ర్యం కోసం ఉత్తేజపరిచి, వారిని పాలించాడు. తన చల్లని పాలనలో స్కాట్‌లాండ్ వర్ధిల్లుతుండగా, ఇంగ్లండ్ రాజుకి కన్ను కుట్టింది. తన సైన్యాన్ని పంపించి బ్రూస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూశాడు. స్కాట్‌లాండ్ దేశపు ఆర్మీ చాలా చిన్నదవడం మూలాన, ఇంగ్లండ్ సైన్యం గెలుపొందింది. బ్రూస్ ఓడిపోయాడు. కొంతకాలానికి పుంజుకొని, మళ్లీ గెరిల్లా యుద్ధం చేశాడు. ఈసారి కొంత ఎక్కువ సైన్యాన్ని తయారుచేసుకొని ఇంగ్లండ్ రాజ్య ప్రతినిధి మీద దండెత్తాడు. ఫలితంగా ఆంగ్లేయులు దేశం విడిచి పారిపోవలసి వచ్చింది. స్కాట్‌లాండ్ దేశం మళ్లీ ఆంగ్లేయుల చెరనుండి విడుదల అయ్యింది. కొంతకాలం బ్రూస్ పాలన చేశాడు. ప్రజలకు మంచి చేస్తూ గొప్ప రాజని కీర్తిని గడించాడు. ఇంగ్లండ్ రాజు మళ్లీ మండిపడ్డాడు. తన సార్వభౌమత్వాన్ని ఒప్పుకోమని కబురు పంపాడు. బ్రూస్ కాదన్నాడు. ఈసారి గొప్ప గొప్ప కామాంజర్‌లను పంపి స్కాట్‌లాండ్‌ని మళ్లీ తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. బ్రూస్‌కి ఇంగ్లండ్ పాలన నచ్చలేదు. వారు కట్టించుకునే పన్నులు ప్రజలను పీడించే విధంగా ఉండేవి. అందుకని మళ్లీ గెరిల్లా యుద్ధానికి తయారయ్యాడు. ప్రజలను ఉత్తేజపరిచి ఇంగ్లండ్ సైన్యాన్ని తరిమి కొట్టాడు.

మళ్లీ గద్దెనెక్కి పాలించడం మొదలుపెట్టాడు. ఇంగ్లండ్ దేశానికి రాజులు మారినా, రాజ్యాధికారం కోసం వారి దాహార్తి మారలేదు. స్కాట్‌లాండ్ మీద దండయాత్రలు కొనసాగాయి. ఏదిఏమైనా సరే– ఓటమి మాత్రం ఒప్పుకోకూడదనుకున్న బ్రూస్ యొక్క దృక్పథం కూడా మారలేదు. ఇలా మొత్తం ఆరు సార్లు యుద్ధం జరిగింది. ఏడవసారి ఇంగ్లండ్ రాజు ఉగ్రుడైపోయాడు. తన పక్కనున్న స్కాట్‌లార్ తిరుగుబాటు చేస్తే మిగతా దేశాలలో తన పరువు మంట కలిసిపోతుందని నిశ్చయించుకొని, మామూలుగా పంపే సైన్యానికన్నా మూడింతలు ఎక్కువ సైన్యాన్ని పంపాడు. ఎంతో రక్తం వృథా అయింది. వందల్లో సైనికులు చనిపోయారు. ఇరువైపులా నష్టం అపారంగా జరుగుతుంది. ఇంగ్లండ్ సైన్య బలానికి తట్టుకోలేక, బ్రూస్ యుద్ధభూమిని వదిలి పారిపోయాడు. ఒక గుహలో తలదాచుకున్నాడు. అటు ఇంగ్లండ్ ప్రభుత్వం విజయ సంబరాలు చేసుకుంటుంది. కొన్నిరోజులు గడిచాయి. గుహ బయట వర్షం వస్తుంది. లోపల ఉన్న బ్రూస్ ఆలోచనలో పడ్డాడు. ఇంత రక్తపాతం అవసరమా అనుకుంటూ బాధపడుతున్నాడు. ఓటమి ఒప్పుకోవలసి రావడం మింగుడు పడకపోయినా, తన ప్రజలు చనిపోవడం ఇష్టం లేక ఇంక గెరిల్లా యుద్ధం కూడా మానివేద్దామనుకున్నాడు. అంతలో తన దృష్టి గుహలో ఓ మూలన ఉన్న సాలీడు మీద పడింది. అది తన గూడు కట్టుకుంటుంది. వర్షం నీళ్లు తన పాత గూటిని తెంపేసినట్టు ఉన్నాయి. వర్షం పడని చోట గూడు కట్టుకోవాలని

ప్రయత్నిస్తుంది. తన నోటిలో ఉన్న దారంతో ఒక కొననుండి మరొక కొనకి పాకుతూ వెళ్తుంది. దూరం కొంచెం ఎక్కువగా ఉండటంతో, దారం మధ్యలో తెగిపోతుంది. సాలీడు కిందకి జారిపోతుంది. అలా ఆరుసార్లు జరిగింది. బ్రూస్ అదంతా గమనిస్తున్నాడు. ఆరుసార్లు విఫలమైంది కదా-- సాలీడు తన ప్రయత్నం మానుకుంటుందేమో అని అనుకుంటున్నాడు. ఆశ్చర్యం సాలీడు తన పంతం వీడడం లేదు. ఏడవసారి కూడా ప్రయత్నిస్తుంది. ఇలా కిందికి జారిన ప్రతిసారీ పైకి రావాలనే చూసింది కానీ తన ఉద్దేశం మాత్రం మార్చుకోవడం లేదు. కొంతసేపటికి ప్రయత్నించిన సాలీడు విజయంసాధించింది. తన గూడు పూర్తయింది. పూర్తిచేసిన సాలెగూడులో సాలీడు గర్వంగా ఉన్నట్టు తోచింది బ్రూస్‌కి. అంతే. తన నిరాశా నిస్పృహలను పక్కన పెట్టేసి, ఒక్క గెంతు గెంతాడు. తనకి ఏమి చేయాలో తెలిసివచ్చింది. ఒక్క సాలీడు లాంటి చిన్న జీవి తన ఓటమి ఒప్పుకోకుండా తన గూటికోసం ప్రయత్నిస్తూనే ఉంది కదా... మరి నా మీద ఆశలు పెట్టుకున్న ప్రజల కోసం, తన కోసం ప్రాణాలనైనా అర్పించే వారి బాగుకోసం, విలువిద్యలు, గెరిల్లా యుద్ధాలు తెలిసిన తను పోరాడక పోవడమేమిటని.. తన ప్రజలకు కబురు పెట్టాడు. రెట్టించిన ఉత్సాహంతో చావో,రేవో పోరాడదామని పిలుపునిచ్చాడు. మళ్లీ యుద్ధం జరిగింది. ఇంగ్లండ్ సైనికులు తరిమి తరిమి కొట్టబడ్డారు. ఎంత శక్తిని ఉపయోగించినా, కొరకరాని కొయ్య అయిన స్కాట్‌లాండ్‌కి స్వాతంత్ర్యం ఇవ్వక తప్పలేదు ఇంగ్లండ్ రాజుకు.

ఇలా ఒక సాలీడు బ్రూస్‌లో పోయిన ఆత్మ విశ్వాసాన్ని రాబట్టగల్గింది. స్కాట్‌లాండ్‌కి స్వాతంత్ర్యం రావడానికి కారణం అయింది. ఓటమి ఒప్పుకోని తత్త్వం వల్ల ఇదంతా జరిగింది. ఓటమి చెందాం అని దిగాలు పడిపోతే మన ప్రగతి అక్కడితో ఆగిపోతుంది. అలా ఆగిపోకూడదు. ఒక ఆంగ్ల సామెత ప్రకారం ముందుకు సాగడం కఠినమైనప్పుడు, కఠినమైన మనుషులు మాత్రమే ముందుకు సాగుతారంట. వైఫల్యాలు మనని కృంగదీయాలని చూస్తాయి. మన ఓర్పుని, మన నేర్పుని పరీక్షిస్తాయి. అందుకని వైఫల్యాలకు వెనుదిరగకూడదు. ఓర్పుని పెంచుకోండి.. నేర్పుని సాధించండి.

వైఫల్యం చెందడంతప్పుకాదు. ఓటమి పాలయ్యామని ఒప్పుకోవడం తప్పు. వైఫల్యాలని చూసే దృష్టిని మార్చండి. వాటిని మంచి అనుభవాలుగా మార్చుకోండి. అలా చేస్తే అవి విజయానికి విలువైన బాటలు వేస్తాయి. గొప్ప గొప్ప పనులు సాధించిన విజయాల వెనుక ఎన్నో అపజయాలు ఉన్నాయని గుర్తించండి. సాలీడు లాంటి చిన్న జీవులు ఓటమిని ఒప్పుకోనప్పుడు విద్యాబుద్ధులు నేర్చిన మనం మాత్రం మన వైఫల్యాలకు ఎందుకు కృంగిపోవాలి. ఆలోచించండి.

# 30

# అనుకున్నది అవకపోయినా ఆత్మన్యూనత అసలు వద్దు

**హైలెట్స్**

- ❖ బాధపడి ప్రయోజనం లేదు. బాధని వీలైనంత తొందరగా తరమేసేయాలి.
- ❖ బాధ చిన్నదైనా, పెద్దదైనా, ఎక్కువ సేపు మనతో కలిసి ఉంటే మనల్ని కుంగదీసేదే అవుతుంది.
- ❖ మనం అనుకున్నది కాలేదని నిరాశ, నిస్పృహలకు గురైతే, మన పట్ల మనమే బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నట్లు. మన చేతిలో లేని విషయాల గురించి బాధపడి ప్రయోజనం లేదు.
- ❖ మన లక్ష్యం మారవచ్చు. కానీ మన ఉత్తేజం మారకూడదు. మన దిశ మారవచ్చు. కానీ మన ఆవేశం చల్లారకూడదు.

మనం ఇప్పటి వరకూ జీవితంలో అనుకున్నది సాధించాలి. సాధించి తీరాలి అని చెప్పుకున్నాం. ఒకవేళ మనమొకటి తలచి, దైవం ఒకటి తలిస్తే ఏమవుతుంది? అనుకున్నామని జరగవు అన్నీ. అనుకోలేదని ఆగవు కొన్ని. మరి అలాంటప్పుడు ఏమి చేయాలి? ఈ వ్యాసం చివరిది కాబట్టి, దీనిలో ఆ విషయం చర్చించదలుచుకున్నాను. మనం ప్రయత్నించినంత కాలం ప్రయత్నించి చూసి ఉండవచ్చు. ఒక్కోసారి మనం వరసగా విఫలమై, మనకి ఇంక గత్యంతరం లేని పరిస్థితులలో మన ఓటమిని



ఒప్పుకోవలసి రావచ్చు. అప్పుడు ఆ స్థితిని ఎలా ఎదుర్కోవాలి?

అన్నిటికన్నా ముందు మనం మదనపడటం మానేయాలి. అయ్యో! నేను సాధించ లేకపోయానే అనే బాధని వీలైనంత వెంటనే వదిలేయాలి. ఆ బాధని మనం మనతో పాటు ఎక్కువ సేపు ఉండనీయకూడదు. మన ముఖంలో బాధ అసలు కనపడనీయకూడదు. బాధ ఉండటం సహజమైన విషయమే. కానీ, అది ఎక్కువ సేపు మనలో ఉంటే మన మనసు మీద ప్రభావం చూపెట్టగలదు. బాధ పడితే మనం మన పోగొట్టుకున్న విజయాన్ని రాబట్టుకోలేము కదా! అందుకని బాధపడి ప్రయోజనం లేదు. బాధని వీలైంత తొందరగా తరిమేయాలి. బాధ మనని తన కబంధ హస్తాలలోకి తీసుకుని, బిగించి బంధించాలని చూస్తే గనుక దానిని గట్టిగా కసురుకోండి. గద్దించండి. ఓ గుద్దు గుద్దండి.

ఒక ఉమ్మడి కుటుంబంలో పిల్లలందరూ వారి తల్లిదండ్రుల మీద గుర్రుగా ఉన్నారు. అందులో ఒక పిల్లాడు రెండు రజుల నుండి వాళ్ల నాన్నగారితో మాట్లాడలేదు కూడా. కారణం సెలవుల్లో వారిని సినిమాకి తీసుకువెళ్లలేదు. పెద్దవాళ్ల మీద కోపంతో పిల్లలు చెప్పిన మాట వినడం లేదు. ఇది గమనించిన వారి తాతయ్య పిల్లల్ని అందరినీ తన దగ్గరకు పిలిచాడు. తాతయ్య చెప్పే కథలంటే చెవులు కోసుకునే పిల్లలందరూ చుట్టూ గుమిగూడారు. తనకు మంచినీళ్లు తీసుకురమ్మని తాతయ్య చెబితే, నేను వెళ్తానంటే నేను వెళ్తానంటూ పిల్లలు మంచినీళ్లు తీసుకురావడానికి పరిగెత్తారు. చివరకి తాతయ్య దగ్గరకు ఇద్దరు పిల్లలు రెండు గ్లాసులు తీసుకువచ్చారు. ఒకటి ఇన్నగ్లాసు రెండవది పెద్దది. నా గ్లాసే తీసుకోమంటూ ఇద్దరు పిల్లలు వేడుకుంటున్నారు అప్పుడు తాతయ్య ఇద్దరినీ

గ్లాసులని (పట్టుకునేప్పుడు) చేతులు చాచి పట్టుకోమన్నాడు. మిగతా పిల్లలందరికీ గ్లాసులు చూపిస్తూ ఇలా అడిగాడు. వీటి బరువు ఎంత ఉంటుంది. చిన్న గ్లాసు పావు కేజీ, పెద్ద గ్లాసు దాదాపు అర కేజీ అని అందరూ ఏకీభవించారు. ఇద్దరినీ గ్లాసులు పట్టుకునే ఉండమని చెప్పి, పిల్లలందరినీ ఇలా అడిగాడు. ఇలా గ్లాసులు వీళ్లిద్దరూ కొంతసేపు పట్టుకునే ఉంటే ఏమవుతుంది. ఇంతలో ఓ పిల్లాడు ఏమీ కాదు అని జవాబు ఇచ్చాడు. అప్పుడు తాతయ్య సరే ఒక గంటసేపు వీళ్లు గ్లాసులు ఇలాగే పట్టుకుంటే ఏమవుతుంది అని అడిగాడు. చేతులు నొప్పి పుడతాయి అని పిల్లలు జవాబు ఇచ్చారు. మళ్లీ తాతయ్య ఒక రోజు మొత్తం వీళ్లు గ్లాసులు పట్టుకునే ఉంటే ఏమవుతుంది అని అడిగాడు. అప్పుడు గ్లాసులు పట్టుకున్న పిల్లలు అమ్మో! అని ఒక్కసారిగా అరిచారు. ఏమవుతుంది అని తాతయ్య మళ్లీ అడిగాడు. చేతులు విపరీతంగా నొప్పి చేస్తాయి అని ఒకరు, చేతులు ఇంక పనికిరావని ఒకరు, వాళ్ల చేతులు పక్షవాతం వస్తుంది, హాస్పిటల్‌కి తీసుకెళ్లాలి అని ఒకరు జవాబులు ఇచ్చారు.

తాతయ్య అప్పుడు వీరు పట్టుకున్న గ్లాసులు బరువెక్కాయా? అని అడిగాడు. లేదు అని జవాబు వచ్చింది. వీరు పట్టుకున్న గ్లాసులు ఒకటి పావు కేజీ, రెండవది అర కేజీ. అప్పుడు తక్కువ బరువున్న గ్లాసు పట్టుకున్న వాళ్లకి నొప్పి తక్కువగా ఉండి, ఎక్కువ బరువున్న గ్లాసు పట్టుకున్న వాళ్లకి ఎక్కువ నొప్పి ఉంటుందా? అని తాతయ్య అడిగాడు. మళ్లీ లేదు అనే జవాబు వచ్చింది. వీరు పట్టుకున్న గ్లాసులు బరువు పెరగనప్పుడు మరి చేతులు ఎందుకు నొప్పి పెడుతున్నట్లని తాతయ్య పిల్లల్ని అడిగాడు. అప్పుడు అందులో పెద్ద పిల్లవాడు చేతులునొప్పి పుట్టేది గ్లాసుల బరువు వల్ల కాదు. అవి ఎక్కువ సేపు వీళ్లు పట్టుకుని ఉండటం వల్ల అని చెప్పాడు. తాతయ్యకి కావలసిన జవాబు దొరికింది.

మరి అలాంటప్పుడు ఏమి చేయాలి? అని తాతయ్య అడిగాడు. గ్లాసులు కింద పెట్టేయాలి అంటూ గ్లాసులు పట్టుకున్న పిల్లలు తమ చేతిలోని గ్లాసులను కింద పెట్టేశారు. అప్పుడు తాతయ్య పిల్లలతో ఇలా అన్నాడు. ఎలాగైతే గ్లాసులను ఎక్కువ సేపు మనం పట్టుకుంటే నొప్పి పుడుతుందో అలాగే మన కోపాల్ని, బాధల్ని ఎక్కువ సేపు అట్టిపెట్టుకుంటే అవి కూడా అలా నొప్పి కలిగిస్తాయి. వీలైనంత తొందరగా వాటిని వదిలించుకోవాలి. గ్లాసులు కింద పెట్టిన తరువాత ఈ ఇద్దరూ ఎలాగైతే సంతోషంగా ఉన్నారో, అలాగే కోపాన్ని, బాధని వదిలించుకున్న తరువాత మీరందరూ కూడా సంతోషంగా ఉండగలుగుతారు. మీ అమ్మా నాన్నలకు పనులు ఉండి మిమ్మల్ని సినిమాలకు తీసుకెళ్లలేదు. వారు తీసుకెళ్లలేదని మీరు బాధ పడుతున్నారు. కోపంగా ఉంటున్నారు. అందుకే ఇంట్లో మంచి వాతావరణం లేదు. మీరు కోపాన్ని వదిలేసి, అమ్మ వాళ్లకి క్షమాపణలు చెప్పి హాయిగా ఆడుకోండి అని చెప్పాడు. పిల్లలు తాతగారి మాటలు విన్నారు. కోపాన్ని, బాధని వదిలేశారు. ఆటల్లో మునిగిపోయారు.

మనం కూడా ఆ చిన్న పిల్లలు బాధని వదిలేసినట్లు మనకేమైనా బాధలు ఉంటే వెంటనే వదిలేద్దాం. మనతోటి మన బాధలు ఎంత ఎక్కువ సేపు కలిసి ఉంటే, మనల్ని అంత ఎక్కువ నొప్పికి గురిచేస్తాయి. చిన్న బాధలే అయినా ఎక్కువ సేపు మనతో ఉండకూడదు. బాధ చిన్నదయినా, పెద్దదయినా ఎక్కువ సేపు మనతో కలిసి ఉంటే మనల్ని




కుంగదీసేదే అవుతుంది. పావు కేజీ గ్లాస్ అయినా, అర కేజీ గ్లాస్ అయినా, ఎక్కువ సేపు పట్టుకుంటే నొప్పి తప్పదు కదా.

మీరు దేవుణ్ణి కానీ, లక్కుని గానీ నమ్ముతూ ఉండి, మీరు కనక అనుకున్నది సాధించలేకపోతే, ఈ రకంగా ఆలోచించండి. నాకు ఇది కరెక్టు కాదు అని దేవుడు తెలియజెప్పాలనుకున్నాడు. ఈసారి దీనిలో విఫలమయ్యాను. అంటే ఈ దారిలో ముందుకు వెళ్లవద్దు అని దేవుని ఆజ్ఞ అన్నమాట. వేరొక దారిలో ముందుకు వెళ్లాలన్న మాట. ఒకదారి మూసేస్తే ఇంక ఎన్నో దారులు తెరుచుకుంటాయని పాత సామెత ఉన్నట్లు, నేను నాకు పనికివచ్చే వేరే విషయాల మీద దృష్టి పెడతాను. అందులో నేను విసయం సాధిస్తాను అనుకోఆలి. ప్రపంచంలో విజేతలైన వాళ్లందరూ ఐఏఎస్ ఆఫీసర్‌లు అవాల్సిన పనిలేదు. వాళ్లందరూ ముందు గ్రూప్-1 ఆఫీసర్లు కాదు. వేరు వేరు రంగాలలో విజయం సాధించి, లోకానికి మనమేమిటో తెలియపరచవచ్చు. మనమేమిటో నిరూపించుకోవాలని కాంక్ష ఉండాలే కానీ, ఏ విషయమూ మనకి అడ్డురాలేదు. మట్టిలో మాణిక్యాల వలె మనం కూడా ప్రకాశించగలం.

అమితాబచ్చన్ స్థాపించిన ఏబీసీ సంస్థ (అమితా బచ్చన్ కార్పొరేషన్) దివాళా తీసింది. తను ఆర్థికపరంగా ఎంతో నష్టపోయాడు. తను విజయం సాధించాలనుకున్నాడు. మూతబడిన ఏబీసీ గురించి ఆలోచించకుండా కేబీసీ (కౌన్ బనేగా కరోర్‌పతి) అనే ప్రోగ్రాం చేశాడు. కోట్లు సంపాదించాడు. విజయం సాధించాలనుకుంటే ఒకటే మార్గం కాదు. అనేకం ఉన్నాయని నిరూపించాడు. 60 ఏళ్లకు అందరూ రిటైర్ అయి ఇంట్లో

కూర్చుంటారు. దానికి భిన్నంగా తను 60 ఏళ్లకు మళ్లీ బుల్లి తెర మీద కనిపించడం మొదలు పెట్టాడు. విజేతలయ్యే వారికి వయసుతో కాదు, గెలవాలనే మనసుతో సంబంధం అని చూపించాడు.

అమితాబచ్చన్ తను అనుకున్నది అవలేదు అని ఆత్మన్యూనతలో మునిగిపోయి ఉంటే వేరే మార్గాల వైపు దృష్టి పెట్టేవాడు కాదు కదా. వాల్ట్ డిస్నీ గురించి మీకు తెలిసే ఉంటుంది. అతను ముందు పత్రికలలో పనిచేద్దాం అని అనుకున్నాడు. తను కార్టూన్‌లు గీసి పత్రికల వారికి చూపిస్తే తనకి ఒరిజినల్ ఐడియాలు లేవని తరిమేశారు. తను గీసిన కార్టూన్‌లు పత్రికల వారు కాదంటే డిస్నీ దిగాలు పడిపోలేదు. నా బతుకింతేనా అనుకుంటూ ఏడుస్తూ కూర్చోలేదు. మిక్కీమౌస్ పాత్ర సృష్టించాడు. ఒక మూవీ కంపెనీ స్థాపించాడు. తను చివరికి 32 ఆస్కార్ అవార్డులు సాధించాడు.

హెన్రీ ఫోర్డ్ – ఫోర్డ్ కంపెనీ అధినేత. కార్లు, ఆటోమొబైళ్లు వేలల్లో ఒకేసారి తయారు చేయవచ్చు అంటూ పారిశ్రామిక విప్లవాన్ని ప్రతీ ఇంటింటికీ పరిచయం చేసిన మహా మేధావి. తను మొదట్లో వాచీల బిజినెస్ చేద్దామనుకుని ఘోరంగా విఫలమయ్యాడు.

బిల్‌గేట్స్ తను హార్వర్డ్‌లో చదువుకుంటున్నప్పుడు ఒక చిన్న బిజినెస్ ఐడియాని అందరూ వద్దని వారించారు. అప్పుడు ఆ బిజినెస్‌లో తను విజయం సాధించి ఉండి ఉంటే ఇప్పుడు మనకి మైక్రోసాఫ్ట్ అనే కంపెనీ గురించి తెలిసేది కాదేమో!

మనం కూడా మన ఎనర్జీని మించి విషయాల మీద పెట్టి అందులో (ఆ విషయాలలో) మేటి అని, మనకు మనమే సాటి అని అనిపించుకుందాం.

కొన్ని కొన్ని విషయాలు మన చేతిలో ఉండవు. అందుకు కొన్నిసార్లు మనం అనుకున్నది జరగకపోవచ్చు. మనం అనుకున్నది కాలేదని నిరాశ, నిస్పృహలకు గురైతే, మన పట్ల మనమే బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నట్లు. మన చేతిలో లేని విషయాల గురించి బాధపడి ప్రయోజనం లేదు. మనం చేయదగినది ఏమిటో తెలుసుకుని, మంచి నిర్ణయం తీసుకోవాలి. ఒలికిపోయిన పాల గురించి విలపించే కన్నా, ఇక ముందు చేయవలసిన దానిని గురించి ఆలోచించడం మిన్న.

మనం మనుషులం, మనకి ఆలోచించే శక్తి ఉంది. మనకు కనీసం ఛాయిస్‌లు (వికల్పాలు) ఉంటాయి. మనం వడ్ల గింజల వలె కాదు. వడ్ల గింజ తన గురించి తను నిర్ణయించుకోలేదు. తను మిల్లుకెల్లి బియ్యం అవుతుందో, రోట్లో పడి నూక అవుతుందో, ఏ పక్షికైనా పలహారమవుతుందో లేక వరి నారుకి ఉపయోగించబడి, వందలు వందలుగా వడ్ల గింజలు తయారు చేస్తుందో... తనకి ఛాయిస్ ఉండదు. తన మీద తనకి నియంత్రణ లేదు. కానీ మనం అలా కాదు. మనం ఏమి కావాలనుకుంటే అది అవగలం. మనకి అనువుగాని లక్ష్యం మనం పెట్టుకున్నామని మనకి తెలిసిన తరువాత, మనం ఇంకో మార్గంలో పయనించి వేరే లక్ష్యాలను ఛేదించగలం. నలుగురితో భేష్ అనిపించుకోగలం.

సముద్రాలలో, సరస్సులలో తెరచాపల పడవలను గమనించాం. ఎప్పుడైనా అన్నిటికీ ఒకటే నీరు, అన్నిటికీ ఒకటే గాని. కానీ, పడవలు వేరు వేరు దిక్కులకు ఎందుకు ప్రయాణిస్తాయి? ఎందుకంటే వాటికి కట్టిన తెరలు వాటికి దిశానిర్దేశం చేస్తాయి. మనం గాలిని శాసించలేము కానీ, తెరలను మనం అనుకున్న దిశలో తిప్పవచ్చు కదా. మన

జీవితం కూడా అంతే... మనం ఎవరి కడుపున పుడతామో, ఎక్కడ పుడతామో మనకి నియంత్రణ లేదు. కానీ, పుట్టిన తరువాత ఏమవగలమో మనం నిర్ణయించుకోగలం. ఒకవేళ ఆ నిర్ణయం మనని తృప్తిపరచలేకపోతే, వేరే దిక్కుకు తెరచాప మార్చినట్లు మన రూటుని మార్చుకుందాం. అంతేకానీ, తెరని పూర్తిగా కిందకి దించేసి ఏమి చేయకుండా నడి సముద్రంలో ఉండిపోకూడదు. సాధారణంగా మనకి ఒక చెడు అలవాటు ఉంటుంది. మనం ఏదైనా పరీక్ష పాస్ అవకపోతే, అప్పుడు దానికి కారణాలను గురించి తెగ ఆలోచించి మనల్ని మనం సమర్థించుకుంటూ సమయం వృథా చేసుకుంటాం. నేను చిన్నప్పుడు మంచి స్కూల్‌లో చదువుకోలేదు. అలాకాకుండా మంచి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదవి ఉంటే ఈ పాటికి ఈ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించే వాణ్ణి. నేను పరీక్ష ముందు డిసిప్లేన్‌గా వ్యవహరించలేదు. పొద్దున్నే లేచి చదవలేదు. లేకపోతేనా... అంటూ అంతా అయిపోయిన తరువాత ఆకులు పట్టుకుంటున్నాం. అప్పటికే చేతులు కాలిపోయాయి కాబట్టి ప్రయోజనం ఏమీ ఉండదు. అయిపోయిందేదో అయిపోయింది. ఇప్పుడు నేను నాకో లక్ష్యం పెట్టుకుని దానికోసం పోరాడతాను అని అనుకోవడం వివేకుల లక్షణం. ఇంగ్లీష్‌లో ఒక సామెత ఉంది. Better late than never. ఎప్పుడూ చేయలేక పోవడం కంటే లేటు అయినా పరవాలేదు. ఇప్పుడు మొదలు పెట్టాలని దాని అర్థం.

అంతకు ముందు నుండి మీరు డిసిప్లేన్‌గా లేకపోయినా ఫరవాలేదు. ఇప్పటి నుండి ఉండటానికి ప్రయత్నించండి. అంతకుముందు నుండి మీరు కష్టపడకపోవచ్చు. ఈ రోజు నుండి కష్టపడండి. అంతకుముందు నుండి మీరు బాగా చదువుతుండకపోవచ్చు, ఈ రోజు నుండి అద్భుతంగా చదవండి. అంతకుముందు ఎన్నో అవకాశాలు చేజారి పోయాయని కుంగి కృషిస్తూ కూర్చోకండి. ఇక ముందు రాబోయే అవకాశాలకు తయారుగా ఉండండి.

అయిపోయిందేదో అయిపోయింది. దానిని గురించి ఆలోచించి ఆత్మన్యూనతతో తెగ బాధపడిపోవడం వల్ల ప్రయోజనం ఏదీ ఉండదు. అందులో నుండి బయటకు వచ్చి మనం చేయగలిగిన పనుల గురించి ఆలోచించడం వల్ల జరిగిపోయిన నష్టాన్ని కొంతైనా పూడ్చుకోవచ్చు. మన లక్ష్యం మారవచ్చు. కానీ, మన ఉత్తేజం మారకూడదు. మన దిశ మారవచ్చు. కానీ మన ఆవేశం చల్లారకూడదు. సరిగ్గా చూడగలిగితే, విసయం సాధించవలసి ????